

'జాతికి జల సౌభాగ్యం కల్పించిన రోజే
నాకు అసలైన పండుగ రోజు'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 17
సంచిక: 63

శనివారం 25-5-2024



కన్నడ జానపదానికి కాన్స్ బహుమతి

-IIలో



పారిశ్రామికవేత్తలుగా యువకెరటాలు

-IIలో

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL

సాక్షి ఫ్యామిలీ
హైదరాబాద్
శనివారం ॥ 25-5-2024

న్యూస్‌మేకర్



'సన్‌ఫ్లవర్స్' చిత్ర బృందం

దక్షిణ భారత జానపద కథ కాన్స్ మొదటి బహుమతి గెలుచుకుంది. కోడి కూయకూడదని ఒక అవ్వ పుంజును దొంగిలిస్తే ఆ ఊళ్లో తెల్లారదు. తర్వాత ఏమవుతుందనేది 15 నిమిషాల షార్ట్‌ఫిల్మ్‌గా తీశాడు పూణె ఇన్‌స్టిట్యూట్ చిదానంద నాయక్. ప్రపంచవ్యాప్తంగా 2263 ఎంట్రీలు వస్తే చిదానంద తీసిన 'సన్‌ఫ్లవర్స్'కు మొదటి బహుమతి వచ్చింది. ఈ ఘనత సాధించిన చిదానంద పరిచయం.

కన్నడ జానపదానికి కాన్స్ బహుమతి

మారుమూల చిన్న పల్లెటూరు. ప్రతి ఉదయం కోడి కూయగానే తెల్లారుతుంది. ఆ రోజు కోడి కూయలేదు. తెల్లారలేదు. చీకటి. ఎక్కడ చూసినా చీకటి. సూర్యుడు ఎందుకు రావడం లేదు? కోడి కూయడం లేదు. కోడెందుకు కూయడం లేదు? ఊళ్లోని అవ్వ దానిని దొంగిలించి దాచేసింది. దేవుడా... పదండి కోడిని వెతకండి. ఊరంతా బయలుదేరింది. లాంతర్లు పట్టుకుని తలో దిక్కు. అంతేనా? దీనికంతటికీ కారణమైన అవ్వ కుటుంబాన్ని వెలేసింది. కోడి దొరక్కపోయినా అవ్వ కనపడకపోయినా ఆ ఊరిలో సూర్యుడు వచ్చేలా లేదు. తర్వాత ఏమైంది?

చిదానంద నాయక్ తీసిన 'సన్‌ఫ్లవర్స్ వర్ ద ఫస్ట్ వన్స్ టు నో' (పొద్దు తిరుగుడు పూలకే మొదట తెలుస్తుంది) షార్ట్‌ఫిల్మ్ చూడాలి. 15 నిమిషాల ఈ షార్ట్ ఫిల్మ్‌కు కాన్స్ ఫెస్టివల్‌లో 'లే సినే' విభాగంలో ఈ ప్రతిష్ఠాత్మక బహుమతి దక్కింది.

ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్ విద్యార్థుల కోసం...

ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్‌లలో చదివే విద్యార్థులను ప్రోత్సహించేందుకు కాన్స్ ఫెస్టివల్‌లో 'లే సినే' విభాగం ఉంటుంది. దీనికి ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్ విద్యార్థులు గంట నిడివి లోపు ఉన్న షార్ట్‌ఫిల్మ్స్‌ను ఎంట్రీగా పంపవచ్చు. జ్యూరీ వీటిని పరిశీలించి ఫస్ట్, సెకండ్, థర్డ్ బహుమతులు ఇస్తుంది. ఈసారి మొత్తం 555 ఫిల్మ్ స్కూల్స్ నుంచి 2263 ఎంట్రీలు వస్తే మొదటి ప్రైజ్ చిదానంద తీసిన 'సన్‌ఫ్లవర్స్'కు దక్కింది. దాదాపు పదమూడున్నర లక్షల ప్రైజ్‌మనీ ఇస్తారు. ఇది సామాన్యవిషయం కాదు. మన దక్షిణాది జానపదానికి దక్కిన గౌరవం కింద లెక్క.

దర్శకుడైన డాక్టర్

చిదానంద నాయక్‌ది కర్ణాటక. చిన్నప్పటి నుంచి అకిరా కురసావా సినిమాలు చూస్తూ పెరిగాడు. సినిమా దర్శకుడు కావాలని ఉన్నా మెడిసిన్ చదవాల్సి వచ్చింది. 'ఒక డాక్టర్‌గా అతి దగ్గరి నుంచి జననాన్ని, మరణాన్ని చూడటం నాకు మానవ జీవనసారాన్ని తెలిపింది. ఒక వైద్యుడిగా జీవించడమంటే క్షణంలో ఆనందం క్షణంలో దుఃఖాన్ని చూడటమే. మనుషుల మకిలి లేని నిజాయితీని ఆ సమయంలోనే చూస్తాం' అంటాడు చిదానంద. డాక్టరయ్యాక కూడా మనసు సినిమా రంగంలోనే ఉన్నట్టు అర్థమయ్యి పూణె ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్‌లో చేరాడు.

నాలుగు రోజుల్లో షూట్

'సన్‌ఫ్లవర్స్' షార్ట్‌ఫిల్మ్‌ను తన సంవత్సరాంత అభ్యాసంగా తీశాడు చిదానంద. 'మా ఇన్‌స్టిట్యూట్‌కు 50 కిలోమీటర్ల దూరం లోపల షార్ట్‌ఫిల్మ్ తీయాలని నియమం. ఆ దూరంలోనే ఒక లోపలి పల్లెలో షూట్ చేశాం. నాలుగు రోజుల్లోనే తీయమని చెప్పారు. కథంతా రాత్రే కాబట్టి నాలుగు రాత్రులు ఒళ్లు హూనం చేసుకుని పని చేశాం' అని తెలిపాడు. పూణె ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్ విద్యార్థులే- సూరజ్ (సినిమాటోగ్రఫీ), మనోజ్ (ఎడిటింగ్) సాంకేతిక శాఖలు నిర్వర్తించారు.

నీ కోడి కూయకపోతే...

'నీ కోడి కూయకపోతే తెల్లారదా?' అనేది లోకోక్తి. అంటే ఎదుటి వారంటే లెక్కలేకపోవడం, ఏదైనా లెక్క చేయకుండా ఉండటం ఈ మాటలో ఉంది. కాని ఈ జానపద కథ ప్రతి వ్యక్తి, ప్రతి అనుభవం, ప్రతి మేల్కొలుపు కూడా ముఖ్యమే అని చెబుతుంది. దేనినీ మర్చిపోకూడదని, నిర్లక్ష్యం చేయకూడదని సూచిస్తుంది. 'మా కర్నాటకలో ప్రతి చిన్నపిల్లవాడికి ఈ కథ తెలుసు. దానిని షార్ట్‌ఫిల్మ్‌గా తీయడం, ఈ ప్రతిష్ఠాత్మక బహుమతి రావడం సంతోషంగా ఉంది' అంటున్నాడు చిదానంద.

ప్రపంచవ్యాప్తంగా ప్రతిష్ఠాత్మకమైన కార్టియర్ ఫెలోషిప్‌ను ఈ యేడాది ముగ్గురు భారతీయ మహిళలు దక్కించుకున్నారు. ఆ ముగ్గురూ ఢిల్లీ వాసి అయిన అక్షితా సచిదేవా, బెంగళూరు వాసులైన మాన్సీ జైన్, ఇరా గుహ లు. మన దేశం నుంచి వీరు మాత్రమే ఎంపిక అవడంలోని ప్రత్యేకత సామాజికంగా ప్రభావవంతమైన పారిశ్రామికవేత్తలుగా వీరికున్న గుర్తింపు.

● పారిశ్రామికవేత్తలుగా

యువ కెరటాలు



ప్రపంచంలోని అత్యంత కీలకమైన సవాళ్లను పరిష్కరిస్తున్న వేలాది మంది మహిళా పారిశ్రామికవేత్తలను గుర్తించి, వారిలో 33 మందిని ఎంపిక చేసిన కార్టియర్ ఉమెన్స్ ఇనిషియేటివ్ మీట్ ఇటీవల చైనాలో జరిగింది. ఇందులో ముగ్గురు యువ భారతీయ మహిళా వ్యాపారవేత్తలు తమ వ్యాపారాల ద్వారా ప్రభావ వంతమైన గుర్తింపు పొందారు.

మాన్సీ జైన్

'డిజిటల్ పానీ' అనే సాఫ్ట్‌వేర్ ప్లాట్ ఫారమ్ వ్యవస్థాపకురాలు మాన్సీ జైన్. ఇది మురుగునీటి శుద్ధి కార్యకలాపాలను నిర్వహించడానికి వీలు కల్పిస్తుంది. ఫలితంగా కలుషితమైన నీటిని సమర్థవంతంగా శుద్ధి చేయవచ్చు. తిరిగి ఉపయోగించుకోవచ్చు. డిజిటల్ పానీ రోజుకు 90 మిలియన్ లీటర్ల నీటిని శుద్ధి చేయడంలో సహాయపడుతుంది. భారతదేశంలోని అగ్రశ్రేణి కంపెనీలలోని దాదాపు 50 యూనిట్లలోని నీటిలో అధిక నాణ్యత, అనుకూలమైన సౌకర్యాలుగా మార్చి తన శక్తిని నిరూపించింది.

అక్షితా సచిదేవా

ఏఐ ఆధారిత సాంకేతికత 'కిబో'ను ఉపయోగించి అంధత్వం ఉన్న వ్యక్తులకు సమగ్ర విద్య, ఉపాధిని ప్రోత్సహించడానికి ట్రెస్టిల్ ల్యాబ్‌లను స్థాపించింది బెంగళూరుకు చెందిన అక్షితా సచిదేవా. 60 భాషల్లో ప్రింట్, హ్యాండ్ రైటింగ్, డిజిటల్ కంటెంట్‌ను డిజిటైజ్ చేస్తుంది, అనువదిస్తుంది, ఆడియోలోకి మారుస్తుంది. జూలై 2019 నుండి కిబో 650 సంస్థలను కలుపుకొని 25 దేశాలలో 1.5 లక్షల మందికి పైగా వ్యక్తులు సాధికారత సాధించేలా చేసింది. కంటెంట్‌ని అందరికీ అందుబాటులోకి తీసుకురావడానికి అక్షిత చేసిన కృషికి అనేక జాతీయ, అంతర్జాతీయ అవార్డులు వరించాయి.

ఇరాగుహ

స్త్రీల పీరియడ్ సమస్యలను పరిష్కరించడానికి, ప్లాస్టిక్ శానిటరీ ప్యాడ్‌ల నుండి వ్యర్థ కాలుష్యాన్ని తగ్గించడానికి మెనుస్ట్రువల్ కప్‌ను రూపొందించి, పేటెంట్ రైట్స్ పొందింది ఇరాగుహ. సామాజిక కార్యక్రమాల ద్వారా గ్రామీణ కుటుంబాలలోని మహిళలు మెనుస్ట్రువల్ కప్‌ని ఉపయోగించడం ద్వారా మిలియన్ల డాలర్లను ఆదా చేసింది. అలాగే, లక్షల టన్నుల కంటే ఎక్కువ వ్యర్థాలను నివారించింది. వినూత్నమైన పీరియడ్ ట్రాకర్ యాప్‌ను అభివృద్ధి చేయడం ద్వారా కెనడా ప్రభుత్వం నుండి అవార్డును అందుకుంది.

సామాజిక వ్యాపారవేత్తలుగా ఎదుగుతున్న ఈ ముగ్గురు యువ పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించడానికి తమ మద్దతును ప్రకటించింది కార్టియర్ ఫెలోషిప్. కోట్లాది మంది వీక్షకుల ముందు అవార్డులు అందుకున్న వారిలో ఈ ముగ్గురు ప్రత్యేకంగా నిలిచారు. తమ వ్యాపారాల ద్వారా సమాజంలో తీసుకు వస్తున్న మార్పులను పంచుకుని, అందరికీ ఆదర్శంగా నిలిచారు.

బ్యూటిప్స్

ఎండ నుంచి... ఉపశమనం.. కాంతిమంతం

■ **పుచ్చకాయ.. ద్రాక్ష**



పుచ్చకాయ, ద్రాక్ష కలిపి మెత్తగా గ్రైండ్ చేయాలి. దీంట్లో నిమ్మరసం, కోడిగుడ్డు లోని తెల్లసొన కలిపి పేస్ట్ చేయాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి పట్టించి, ఆరిన తర్వాత చల్లని నీటితో కడిగేయాలి. వేసవిలో ఈ ఫ్రూట్ ప్యాక్‌ని తరచూ వేసుకోవడం వల్ల చర్మంలో జిడ్డు తగ్గి, కాంతిమంతం అవుతుంది.

■ **ఆరెంజ్ జ్యూస్**



టీ స్పూన్ తేనె, కొద్దిగా ఆరెంజ్ జ్యూస్, టేబుల్ స్పూన్ ఓట్స్, రోజ్ వాటర్ కలిపి పేస్ట్ చేయాలి. ఈ మిశ్రమాన్ని ఫ్రిజ్‌లో ఉంచి, చల్లబడ్డాక ముఖానికి అప్లై చేయాలి. 15 నిమిషాల తర్వాత చల్లని నీటితో శుభ్రపరుచుకుంటే ముఖ చర్మం సేదదీరుతుంది.

■ **కొబ్బరి పాలతో..**



ఎండలో నుంచి ఇంటికి వెళ్లినప్పుడు ఫ్రిజ్‌లో ఉంచిన కొబ్బరి పాలలో దూది ఉండను ముంచి, దాంతో ముఖం, చేతులపై అద్ది, పది నిమిషాలు సేదదీరాలి. తర్వాత స్నానం చేస్తే ఎండవల్ల కమిలిన చర్మానికి ఉపశమనం లభిస్తుంది. మృదువుగా, కాంతిమంతంగా తయారవుతుంది.

■ **సోంపుతో..**



రెండు టీ స్పూన్ల సోంపు గింజలను దంచి, అరకప్పు నీటిలో వేసి, మరిగించాలి. చల్లారాక ఈ నీటిని వడకట్టి, టీ స్పూన్ నిమ్మరసం వేసి కలపాలి. ఈ మిశ్రమం ఫ్రిజ్‌లో ఉంచాలి. ఎండ నుంచి ఇంటికి వచ్చినప్పుడు దూది ఉండను సోంపు నీటిలో ముంచి ముఖం, మెడ, చేతులు తుడుచుకోవాలి. తర్వాత చల్లని నీటితో శుభ్రపరుచుకోవాలి. ఈ నీళ్లు స్వేద రంధ్రాలలోని మలినాలను తొలగిస్తాయి. దురద, దద్దుర్లు, ట్యాన్ వంటి సమస్యలనూ తగ్గిస్తాయి. చర్మం కాంతిమంతంగా కనిపిస్తుంది.



విజయపథం

పేదింటి బంగారం

అరవై దేశాల విద్యార్థులు పాల్గొనే అంతర్జాతీయ పోటీ అది. గోవా దాటని ఉష తొలిసారిగా దుబాయ్‌కు వెళ్లడానికి రెడీ అవుతోంది. వెళ్లడానికి ముందు ఆర్థికంగా, ఆరోగ్యపరంగా రకరకాల అడ్డంకులు ఎదురయ్యాయి. 'సాధించాలని బలంగా అనుకుంటే కచ్చితంగా సాధిస్తాం' అనే మాటను తారకమంత్రంలా జపించిన పదిహేను సంవత్సరాల ఉష దుబాయ్‌లో జరిగిన 'కోడేవర్ 5.వో ఏఐ రోబో సిటీ చాలెంజ్'లో కప్పు గెలుచుకుంది.



తల్లిదండ్రులతో ఉష

కొన్ని రోజుల క్రితం...

పనాజీ(గోవా)లోని ప్రోగ్రెస్ హైస్కూల్‌లో రోబో సందడి నెలకొంది. ఒక్క మాటలో చెప్పాలంటే స్కూలు పిల్లలు తమ ప్రపంచం వదిలి రోబో ప్రపంచంలోకి వెళ్లారు. రోబోటిక్స్ పోటీ అయిన 'కోడేవర్ 5.వో ఏఐ రోబో సిటీ చాలెంజ్' తాలూకు సందడి అది. ఆ స్కూల్ స్టూడెంట్ ఉషను ఇంటర్నేషనల్ రౌండ్‌కు చేర్చడానికి టీచర్ మాయా కామత్ బాగా శ్రమించింది.

దుబాయ్‌లో జరగబోయే అంతర్జాతీయ పోటీని సవాలుగా తీసుకుంది మాయా కామత్. 'ఎన్నో దేశాలు పాల్గొనే ఈ పోటీలో మనం ఎక్కడ! అక్కడి దాకా వెళితే అదే పదివేలు' ఇలాంటి మాటలను ఆమె పట్టించుకోలేదు. ఎలాగైనా బంగారు కప్పు గెలుచుకోవాలనే పట్టుదలతో పనిచేసింది.

గోవాలో జరిగిన రీజనల్ రౌండ్ కోసం ముగ్గురు స్టూడెంట్స్‌ను ఎంపిక చేసింది మాయ. అందులో ఉషతో పాటు ఇద్దరు అబ్బాయిలు ఉన్నారు. అయితే మొదట్లో కనిపించిన ఉత్సాహం ఉషలో ఆ తరువాత కనిపించలేదు. ఆత్మవిశ్వాసం తగ్గింది. ఇలాంటి సమయంలోనే మాయ ఉషలో ధైర్యం నింపి ముందుకు నడిపించింది. ఆ ధైర్యమంత్రం ఫలించి గురుగ్రామ్‌లో జరిగిన నేషనల్ రౌండ్‌లో ఉష అద్భుత పనితీరు ప్రదర్శించింది. రోబోను బాగా హ్యాండిల్ చేసింది. ఆ తరువాత దుబాయ్‌లో జరగబోయే ఇంటర్నేషనల్ రౌండ్‌కు ఎంపికైంది.

నేషనల్ రౌండ్‌లో సాధించిన విజయం ఉషకు వెయ్యి ఏనుగుల బలాన్ని ఇచ్చింది. భయాలను ఎదుర్కొనేలా చేసింది. ఎట్టకేలకు మాయ కామత్ కలను ఉష సాకారం చేసింది. ప్రతిష్ఠాత్మకమైన ఈ అంతర్జాతీయ పోటీలో ఉష కప్పును గెలుచుకుంది. ఉష తల్లిదండ్రులు పెద్దగా చదువుకోలేదు. రోబో సిటీ చాలెంజ్ రూపంలో తన ప్రతిభను ప్రదర్శించే అరుదైన అవకాశం ఉషకు లభించింది. ఉష సాధించిన విజయం తల్లిదండ్రులను ఆనందంలో ముంచెత్తింది.

'సాధించాలని గట్టిగా అనుకున్నాను. సాధించాను' నవ్వుతూ అంటుంది ఉష.

ఛాంపియన్స్ చేంజ్‌మేకర్

'క్వార్కీ' అనే రోబోట్‌ను స్టూడెంట్స్‌తో కలిసి తయారు చేసింది మాయా కామత్. నిర్ణీత సమయంలో రకరకాల పనులు చేసేలా ఈ 'క్వార్కీ'ని రూపొందించారు. పోటీలో 'క్వార్కీ' అయిదు నిమిషాల్లో 11 టాస్క్‌లను పూర్తి చేయాల్సి ఉంటుంది. ఇందుకోసం ప్రతిరోజు రెండు గంటలు ప్రాక్టీస్ చేసేది ఉష. రంగులను సరిపోల్చడం, దిశలను అంచనా వేయడం, అడ్డంకులను అధిగమించడం, వస్తువులను వేరు చేయడం లాంటి 'క్వార్కీ' నైపుణ్యాలను ఉష అద్భుతంగా ఆపరేట్ చేసింది.


కోచ్ మాయా కామత్‌తో ఉష


'క్వార్కీ' రోబో

'నేను చెప్పే సలహాలను శ్రద్ధగా విని అందుకు అనుగుణంగా ఉష ప్రాక్టిస్ చేసేది. నేర్చుకోవాలనే తపన ఆమె విజయానికి కారణం. విజయం సాధిస్తామనే గట్టి నమ్మకం ఉన్నప్పటికీ మాకు ఎదురైన అతి పెద్ద సవాలు దుబాయ్ పర్యటనకు నిధులు సమకూర్చుకోవడం. విజయం సంగతి ఎలా ఉన్నా అసలు దుబాయ్‌కు వెళ్లగలమా అనే సందేహం వచ్చింది. ఈ పరిస్థితులలో ప్రోగ్రామింగ్‌లో విద్యార్థులకు శిక్షణ ఇచ్చే సయేష్ గాంధీ అనే టీచర్ క్రౌడ్‌ఫండింగ్‌కు సంబంధించి సలహా ఇచ్చారు. ఉష కుటుంబ నేపథ్యం, రోబోటిక్స్ పట్ల ఆమెకు ఉన్న ఆసక్తి, అంతర్జాతీయ పోటీలో పాల్గొనాలనే ఆమె కల, ఆర్థిక ఇబ్బందులు...మొదలైన వాటి గురించి వీడియో చేయాల్సిందిగా సలహా ఇచ్చారు. ఈ వీడియోకు మంచి స్పందన వచ్చింది' అంటుంది మాయా కామత్. ఉష విజయం ఒక సంతోషం అయితే ఆమె గురువు మాయా కామత్ 'చాంపియన్స్ చేంజ్ మేకర్' అవార్డ్ అందుకోవడం మరో సంతోషం.

హెల్త్ టిప్స్



మొక్కజొన్న కంకి ఒలిచేటప్పుడు వచ్చే సిల్క్ దారాల్లాంటి కార్న్ సిల్క్‌ను వృథాగా పడేస్తారు. కానీ అవి కిడ్నీ రాళ్లను బయటకు పంపడంలో సమర్థవంతంగా పని చేస్తాయి. వాటిని నీటిలో ఉడికించి చల్లారాక వడగట్టి తాగాలి. ఇలా చేయడం వల్ల కిడ్నీలో కొత్తగా రాళ్లు ఏర్పడవు. ఇది మూత్ర విసర్జన సాఫీగా జరిగేలా చూస్తుంది. కిడ్నీ స్టోన్స్ వల్ల వచ్చే నొప్పిని తగ్గించడంలో కార్న్ హెయిర్ ఉపయోగపడుతుంది.

నోటి పూత నివారణకు...

కొన్ని రకాల యాంటీ బయాటిక్స్ వాడటం, కొన్ని రకాల వ్యాధులతో బాధపడటం వల్ల నోటిలో పుళ్లు ఏర్పడుతుంటాయి. కొందరికి ఊరికినే కూడా అప్పుడప్పుడు నోటిపూత వస్తుంటుంది. ఇలాంటప్పుడు ఏమైనా తాగినా, తిన్నా చాలా బాధగా ఉంటుంది. మౌత్ అల్సర్స్ నుంచి ఉపశమనం పొందడానికి తేనె చక్కటి మార్గం. నోట్లో కణజాలాలు చిట్లిపోవడం వలన ఈ సమస్య ఏర్పడుతుంది కాబట్టి.. తేనెను పూయడం వలన కొత్త కణజాలాలు తిరిగి ఏర్పడడానికి ఇది దోహదం చేస్తుంది. తేనెలో పసుపు కలిపి పేస్ట్ లా చేసుకుని రాసినప్పుడు కూడా చక్కటి ఉపశమనం లభిస్తుంది.




● కొబ్బరి నీళ్లను తరచూ తాగడం, కొబ్బరి నూనెను పూయడం, అలానే ఎండు కొబ్బరిని తినడం వల్ల కూడా నోటిపూత తగ్గుతుంది. ఎందుకంటే కొబ్బరి శరీరంలో వేడిని తగ్గిస్తుంది. ఫలితం గా నోటిపూత త్వరగా మానిపోతుంది.



● పాలపదార్థాలైన నెయ్యి, మజ్జిగ వంటి పదార్థాలు కూడా నోటిపూత నుంచి ఉపశమనం కల్పిస్తాయి. ఎక్కడైతే నోటిపూత గాయాలున్నాయో అక్కడ నేయి రాయడం, రోజుకు రెండుమూడుసార్లు గ్లాసు మజ్జిగ తాగడం వల్ల ఎంతో ఉపశమనం గా ఉంటుంది.

● తులసి ఆకులు కూడా నోటిపూతకు మంచి ఔషధం. రోజుకు నాలుగైదు సార్లు తులసాకులు నమలడం వల్ల నోటిపూత తొందరగా తగ్గిపోతుంది.






● చిన్న ఐస్ ముక్కతో పుండు ఉన్న చోట మర్దనా చేయడం, లవంగం నమలడం కూడా నోటిపూతను తగ్గిస్తాయి.



సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 16 వెల: ₹ 5.50
సంపుటి: 17
సంచిక: 63
శనివారం 25-5-2024
SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL


'నా ప్రస్థానంలో ప్రతి మలుపూ జన జీవితంతో ముడిపడి ఉంది'



దేశాభివృద్ధి కోసమే మూడోసారి

బీజేపీని వరుసగా మూడోసారి గెలిపించాలని మోదీ కోరారు. - 6లో



సూపర్ సన్‌రైజర్స్

రెండో క్వాలిఫయర్‌లో రాజస్తాన్‌పై నెగ్గి ఐపీఎల్ ఫైనల్లోకి హైదరాబాద్ - 13లో



మల్లారెడ్డి ఆక్రమణల కూల్చివేత

బొమ్మరాశిపేటలో మాజీ మంత్రి మల్లారెడ్డికి చెందిన అక్రమ నిర్మాణాలను పంచాయతీరాజ్ శాఖ అధికారులు శుక్రవారం కూల్చివేశారు.

- వివరాలు 2లో



మండుతున్న 'కూరగాయలు'

కూరగాయల ధరలు మండిపోతున్నాయి. ఏ కూరగాయ చూసినా పావు కేజీ కనీసం రూ.15 నుంచి రూ.20 పలుకుతోంది.


- వివరాలు 3లో



నేడే ఆరో దశ పోలింగ్

6 రాష్ట్రాలు, 2 కేంద్రపాలిత ప్రాంతాల్లోని 58 లోక్‌సభ స్థానాలతో పాటు ఒడిశా అసెంబ్లీ సీట్లకు శనివారం పోలింగ్ జరగనుంది.

- వివరాలు 6లో



అలా ఆదేశాలివ్వలేం..

పోలింగ్ బూత్‌ల వారీగా ఓటింగ్ శాతాన్ని బహిర్గతం చేసేలా ఎన్నికల సంఘాన్ని ఆదేశించలేమని సుప్రీంకోర్టు తేల్చిచెప్పింది.

- వివరాలు 6లో

ఆవిర్భావ వేడుకలకు ఈసీ అనుమతి

సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో వేడుకలు

- పండుగను తలపించేలా ఏర్పాట్లు
- అధికారులతో సమీక్షలో సీఎస్ శాంతికుమారి



3లో


మేడిగడ్డ బ్యారేజీ దిగువన ఏర్పడిన గొయ్యి

మేడిగడ్డ ఎగువన 'జియో ట్యూబ్' కట్ట!

- నీటిని కన్నెపల్లి పంపుహౌస్‌కు మళ్లించి లిఫ్ట్ చేయాలని నిర్ణయం
- ఆ కట్ట తీరును బోర్డు ఆఫ్ చీఫ్ ఇంజనీర్లకు వివరించిన ప్రైవేటు సంస్థ

2లో

మేడిగడ్డ కింద అగాధం!

వెబ్ కాస్టింగ్ హైజాక్!

చంద్రబాబు చేతిలో ఆన్, ఆఫ్ బటన్లు

- కమాండ్ కంట్రోల్ సెంటర్లలో టీడీపీ కార్యకర్తలు.. ప్రైవేట్ ఏజెన్సీ ముసుగులో దారుణ అక్రమాలు
- ఈసీ చేతిలో భద్రంగా ఉండాల్సిన సమాచారం చినబాబు చేతికి
- ఎమ్మెల్యే పిన్నెల్లిపై తాజాగా మరో అక్రమ కేసు

5లో



అన్ని వైద్య కళాశాలల్లో ఈడబ్ల్యూఎస్ కోటా!

రాష్ట్ర ప్రభుత్వ సూత్రప్రాయ నిర్ణయం

ఎన్ఎంసీ ఆదేశాల మేరకు ఈ ఏడాది నుంచి అమలు

ప్రభుత్వ కాలేజీల్లోని అన్ని ఎంబీబీఎస్ సీట్లలో 10% కేటాయింపు

ప్రైవేట్ కాలేజీల్లోని సగం కన్వీనర్ కోటా సీట్లలో 10% ఈడబ్ల్యూఎస్‌కు

ఇప్పటివరకు 7 కాలేజీల్లోని 103 సీట్లు మాత్రమే వారికి..

తాజా ప్రతిపాదన అమలైతే ఈ కేటగిరీలో అదనంగా 350 సీట్లకు చాన్స్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ వైద్య కళాశాలల్లో ఆర్థికంగా బలహీనమైన వర్గాలకు (ఈడబ్ల్యూఎస్) రిజర్వేషన్ అమలు చేయాలని ప్రభుత్వం సూత్రప్రాయంగా నిర్ణయించింది. నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసీ) ఆదేశాల మేరకు ఈ ఏడాది నుంచే రిజర్వేషన్లు అమలు చేయనుంది. ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లోని అన్ని సీట్లలో 10 శాతం, ప్రైవేట్ మెడికల్ కాలేజీల్లోని (మైనారిటీ కాలేజీలు మినహా) సగం కన్వీనర్ కోటా సీట్లలో 10 శాతం ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్

మిగతా 2వ పేజీలో ▶



జూన్ 27 నుంచి ఇంజనీరింగ్ కౌన్సెలింగ్

అదే రోజు నుంచి ఫార్మసీ కౌన్సెలింగ్ కూడా..

తొలి దశ సీట్ల కేటాయింపు జూలై 12న 2లో

జూన్ 8 నుంచి ఈ సెట్ కౌన్సెలింగ్

నో ఓఆర్ఎస్



మార్కెట్‌లో దొరికేవన్నీ ఓఆర్ఎస్‌లు కాదు 7లో

క్లుప్తంగా...

ఏసీఏ అంబుడ్స్‌మన్‌గా జస్టిస్ ప్రవీణ్‌కుమార్

ఎథిక్స్ ఆఫీసర్‌గా కూడా నియామకం



సాక్షి, అమరావతి: ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ (ఏసీఏ) అంబుడ్స్‌మన్‌గా హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ చాగరి ప్రవీణ్ కుమార్ నియమితులయ్యారు. అదేవిధంగా ఏసీఏ ఎథిక్స్ ఆఫీసర్‌గా కూడా ఆయన వ్యవహరించనున్నారు. ఏడాది పాటు ఆయన ఈ రెండు పదవుల్లో కొనసాగుతారు. ఏసీఏలో తలెత్తే అంతర్గత వివాదాల పరిష్కారం, విరుద్ధ ప్రయోజనాల విషయంలో మార్గదర్శకత్వం వంటి వాటి విషయంలో స్వతంత్రంగా వ్యవహరిస్తారు. అంబుడ్స్‌మన్, ఎథిక్స్ ఆఫీసర్‌గా జస్టిస్ ప్రవీణ్ కుమార్ సేవలను ఉపయోగించుకోవాలని ఏసీఏ కార్యవర్గం ఇటీవల తీర్మానించింది. ఈ తీర్మానాన్ని ఆమోదించాలని ఏసీఏ జస్టిస్ ప్రవీణ్‌కుమార్‌ను కోరింది. అంబుడ్స్‌మన్, ఎథిక్స్ ఆఫీసర్‌గా సేవలందించేందుకు జస్టిస్ ప్రవీణ్ కుమార్ తన సుముఖతను తెలియచేశారు.

ఓయూలో ఐదు ఎంఏ కోర్సులు రద్దు?

ఉస్మానియా యూనివర్సిటీ (హైదరాబాద్): ఓయూ ఆర్ట్స్ కాలేజీలో మరో 5 ఎంఏ కోర్సులు రద్దు కానున్నాయి. పలు కోర్సులకు ప్రస్తుతం ఆదరణ కరువైంది. విదేశీ భాషలకు ఇఫ్లూ వర్సిటీ, ఇతర రాష్ట్రాల భాష కోర్సులు అదే ప్రాంతాల్లో అందుబాటులోకి రావడంతో ఓయూలో ప్రాధాన్యం తగ్గింది. దీంతో అధ్యాపకులు లేని కారణంగా ఎంఏ తమిళం, ఫ్రెంచ్, రష్యన్ కోర్సులను ఓయూ అధికారులు రద్దు చేసిన విషయం తెలిసిందే. గత కొన్నేళ్లుగా విద్యార్థుల ప్రవేశం లేని, అధ్యాపకుల కొరత ఉన్న మరో ఐదు కోర్సుల రద్దుకు రంగం సిద్ధం చేస్తున్నారు. ఈ ఏడాది ఎంఏ పర్షియన్, మరాఠీ, కన్నడ, అరబిక్, థియేటర్ ఆర్ట్స్ కోర్సుల్లో విద్యార్థులు చేరకుంటే రద్దు చేసే ఆలోచనలో అధికారులున్నారు.

ఇంజనీరింగ్ కాలేజీల్లో అక్రమ డొనేషన్లను అరికట్టాలి

రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య



కాచిగూడ (హైదరాబాద్): ప్రైవేట్ ఇంజనీరింగ్, ఫార్మసీ, ఎంబీఏ, ఎంసీఏ తదితర వృత్తివిద్యాకోర్సుల కాలేజీల్లో జరుగుతున్న అక్రమ డొనేషన్లను వెంటనే అరికట్టాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ తదితర బీసీ సంఘాల ప్రతినిధులతో కృష్ణయ్య శుక్రవారం రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ లింబాద్రిని కలిసి చర్చలు జరిపారు. అక్రమాలకు పాల్పడుతున్న కళాశాలల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని ఆయనకు వినతి పత్రం అందజేశారు. ఇంజనీరింగ్ కాలేజీల్లో మేనేజ్‌మెంట్ కోటా కింద ఒక్కొక్క కాలేజీ యాజమాన్యం కోర్సును బట్టి, కాలేజీ స్థాయిని బట్టి డొనేషన్ల కింద రూ.2 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు వసూలు చేస్తున్నారని, దీన్ని వెంటనే అరికట్టాలని డిమాండ్ చేశారు.

50 మంది నకిలీ వైద్యుల పట్టివేత!

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ వైద్య మండలి సభ్యులు ఐడీపీఎల్, చింతల్, షాపూర్‌నగర్ ప్రాంతాల్లో నిర్వహించిన తనిఖీల్లో 50 మంది నకిలీ వైద్యులను గుర్తించారు. ఎనిమిది మంది సభ్యులు వేర్వేరు బృందాలుగా ఏర్పడి తనిఖీలు చేశారు. నకిలీ వైద్యులు తమ ఆరోగ్య కేంద్రాల్లో రోగులను చేర్చుకుని పెద్ద సంఖ్యలో యాంటీబయాటిక్స్ ఇస్తున్నట్లు గుర్తించారు. తాము వైద్యులమని పేర్కొంటూ బోర్డులు పెట్టడమే కాకుండా, వాటికి అనుసంధానంగా మెడికల్ దుకాణాలు, డయాగ్నొస్టిక్ సెంటర్లను ఏర్పాటు చేశారని వైద్యాధికారులు కనుగొన్నారు. 50 మంది నకిలీ వైద్యులపై ఎఫ్ఐఆర్‌లు నమోదు కాగా, ఇద్దరిని జైలుకు పంపినట్లు అధికారులు వెల్లడించారు. తనిఖీల్లో వైద్యులు ప్రతిభా లక్ష్మి, కిరణ్ కుమార్, సన్నీ డేవిస్, ఇమ్రాన్ అలీ, విష్ణు, పాండు తదితరులు పాల్గొన్నారు.



దేవుడిచ్చినా! ఈ జనం అప్పటి వరకు మిమ్మల్ని కష్టపడనీయరేమో సార్!

మేడిగడ్డ కింద అగాధం!



మేడిగడ్డ బ్యారేజీలో కుంగిన 7వ బ్లాక్ పునాదుల కింద ఏర్పడిన అగాధాన్ని గ్రౌటింగ్ ద్వారా పూడ్చివేయడానికి బోర్ హోల్ వేస్తున్న దృశ్యం...

ఏడో బ్లాకులోని 20వ పియర్ ముందు బయటపడిన గొయ్యి

- దాని నుంచి దిగువకు వెళ్తున్న నీటి ఊటలు
- బ్యారేజీ పునాదుల కింద భారీగా ఇసుక కొట్టుకుపోయినట్టు గుర్తింపు
- ఎక్కడి నుంచి ఎక్కడి వరకు బొరియ ఏర్పడిందనే దానిపై అస్పష్టత
- జియోఫిజికల్ పరీక్షలు చేస్తే బయటపడే అవకాశం
- బ్యారేజీ వద్ద కొనసాగుతున్న అత్యవసర మరమ్మతులు
- దిగువన సీసీ బ్లాక్‌లకు రిపేర్లు.. ఇసుక మేటల తొలగింపు

సాక్షి, హైదరాబాద్/ కాళేశ్వరం: కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ (లక్ష్మీ) బ్యారేజీ దిగువన అగాధం బయటపడింది. కుంగిపోయిన ఏడో బ్లాకులోని 20వ పియర్ ముందు భాగంలో గురువారం పెద్ద గొయ్యి ఏర్పడింది. అది బొరియలా బ్యారేజీ కింది వరకు ఉన్నట్టు కనిపిస్తోంది. ఈ గొయ్యి నుంచి నీటి ఊట ఏర్పడి దిగువకు ప్రవహిస్తోంది. గతంలో వరదల సందర్భంగా బ్యారేజీ పునాదుల కింది నుంచి ఇసుక కొట్టుకుపోయి.. ఒక చివరి నుంచి మరో చివరి వరకు సొరంగంలా అగాధం ఏర్పడి ఉంటుందని అధికారులు ఇప్పటికే అంచనా వేశారు. దానికి సంబంధించి గ్రౌండ్ పెనట్రేటింగ్ రాడార్ (జీపీఆర్), ఎలక్ట్రో రెసిస్టివిటీ టోమోగ్రఫీ(ఈఆర్టీ) పరీక్షలు చేశారు. వాటి ఆధారంగా బ్యారేజీ కింద 12 వేల క్యూబిక్ మీటర్ల నుంచి 15 వేల క్యూబిక్ మీటర్ల పరిమాణంలో అగాధం ఉండి ఉంటుందనే భావనకు వచ్చారు. ప్రస్తుతం ఏర్పడిన గొయ్యి దానికి సంబంధించినదేనని చెప్తున్నారు.

అగాధంతోనే బ్యారేజీ కుంగిపోయి..

గతేడాది అక్టోబర్ 21న భారీ శబ్దంతో మేడిగడ్డ బ్యారేజీలోని 7వ బ్లాక్‌లోని 19, 20, 21 పియర్‌లు కుంగిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్డీఎస్ఏ) నిపుణుల కమిటీని ఏర్పాటు చేసింది. బ్యారేజీని పరిశీలించిన కమిటీ.. 2019 వరదల సమయంలోనే బ్యారేజీలో సమస్యలు తలెత్తాయని.. మరమ్మతులు నిర్వహించకపోవడంతో పరిస్థితి దిగజారిందని తమ మధ్యంతర నివేదికలో పేర్కొంది. 2019 జూన్‌లోనే సమస్య ఏర్పడినా, బ్యారేజీలో పూర్తి నీటి నిల్వను కొనసాగించారని.. ఈ క్రమంలో బ్యారేజీపై ఒత్తిడి పెరిగి పునాదుల కింద నుంచి ఇసుక కొట్టుకుపోయిందని తెలిపింది. బ్యారేజీకి సంబంధించి జియోఫిజికల్, జియోటెక్నికల్ పరీక్షలు చేయించాలని సూచించింది. పలు రకాల పరీక్షలు చేసిన నిపుణులు.. బ్యారేజీ కింద ఇసుక కొట్టుకుపోయి భారీ అగాధం ఏర్పడి ఉంటుందని అంచనా వేశారు. తాజాగా బ్యారేజీ దిగువన గొయ్యి ఏర్పడటం దీన్ని ధ్రువపరుస్తోందని అంటున్నారు. పూర్తిస్థాయిలో పరీక్షలు చేస్తే.. ఈ అగాధం ఏమేర ఉందనేదానిపై స్పష్టత వస్తుందని అధికారులు చెప్తున్నారు.

మొరాయించిన గేట్లు ఎత్తే క్రమంలో..

గత ఏడాది అక్టోబర్ 21న ఏడో బ్లాకు కుంగిన వెంటనే బ్యారేజీలోని 85 గేట్లకుగాను 77 గేట్లను ఎత్తి నీటిని వదిలేశారు. కుంగిన బ్లాకులోని 15వ నంబర్ నుంచి 22వ నంబర్ వరకు గేట్లు మొరాయించాయి. వాటిని అలాగే వదిలేశారు. వానాకాలం వస్తుండటంతో నీటి ప్రవాహం మొత్తంగా కిందికి వెళ్లేలా.. అన్ని గేట్లను ఎత్తి ఉంచాలని ఎన్డీఎస్ఏ నిపుణుల కమిటీ ఇటీవలి నివేదికలో పేర్కొంది. కుంగిన, పగుళ్లు ఏర్పడిన పియర్ల మధ్య ఉన్న గేట్లను కూడా జాగ్రత్తగా పైకి ఎత్తాలని సూచించింది. దీంతో ఈ నెల 15న 15వ గేటును ఎత్తారు. గురువారం 16వ నంబర్ గేటును ఎత్తడానికి ప్రయత్నించగా.. బ్యారేజీ కింది నుంచి భారీ శబ్దాలు, ప్రకంపనలు వచ్చాయి. దాంతో గేట్లు ఎత్తే ప్రయత్నాలను నిలిపేశారు.

వేగంగా అత్యవసర మరమ్మతులు

నిపుణుల కమిటీ చేసిన సూచనల మేరకు బ్యారేజీ వద్ద అత్యవసర మరమ్మతులు కొనసాగుతున్నాయి. బ్యారేజీ ఎగువన గేట్ల వద్ద పేరుకుపోయిన చెత్తా చెదారాన్ని తొలగిస్తున్నారు. బ్యారేజీ దిగువన సీసీ బ్లాక్‌లను క్రేన్ సాయంతో సరిదిద్దుతున్నారు. అక్కడ పేరుకుపోయిన ఇసుక మేటలను తొలగిస్తున్నారు. షీట్‌పైల్స్ కూడా బ్యారేజీ వద్దకు చేరుకున్నాయని, వాటిని అమర్చే చర్యలు చేపడతామని అధికారులు తెలిపారు. బ్యారేజీ దిగువన గొయ్యి ఏర్పడటం, మరమ్మతుల నేపథ్యంలో పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు. ఎవరూ అటువైపు రాకుండా ఆంక్షలు విధించారు.

పునాదులకు బోర్ డ్రిల్లింగ్..

మేడిగడ్డ బ్యారేజీ కింద అగాధం ఉన్నట్టు తేలడంతో.. బ్యారేజీ ర్యాఫ్ట్ (పునాది)కు బోర్ హోల్ డ్రిల్లింగ్ చేసే ప్రక్రియను శుక్రవారం ప్రారంభించారు. ఆ రంధ్రం ద్వారా గ్రౌటింగ్ (సిమెంట్, ఇసుక మిశ్రమం నింపడం) చేయనున్నారు. కుంగిన 7వ బ్లాక్‌లోని 21వ పియర్ ముందు కూడా డ్రిల్లింగ్ ప్రారంభించారు. దానిద్వారా జియోఫిజికల్, జియోటెక్నికల్ పరీక్షలను కొనసాగించనున్నారు.

ఎన్డీఎస్ఏ కమిటీ సిఫార్సుల అమలుపై నేడు భేటీ

కాళేశ్వరం బ్యారేజీల మరమ్మతులకు సంబంధించి ఎన్డీఎస్ఏ మధ్యంతర నివేదికలో చేసిన సిఫార్సుల అమలుకు చర్యలు మొదలయ్యాయి. దీనిపై ఈఎన్సీ (జనరల్) చైర్మన్‌గా నలుగురు అధికారులతో వేసిన కమిటీ తొలి సమావేశం శనివారం జలసౌధలో జరగనుంది. బ్యారేజీల రక్షణ కోసం తీసుకునే తాత్కాలిక చర్యలను ఈ కమిటీ సమన్వయం చేస్తుంది.

మళ్లీ సుర్రుమన్న 'సూరీడు'

- రాష్ట్రంలోని చాలా ప్రాంతాల్లో సాధారణంకంటే 2 డిగ్రీలు పెరిగిన ఉష్ణోగ్రతలు
- జగిత్యాల జిల్లా నేరెళ్లలో అత్యధికంగా 45.6 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు
- వచ్చే 3 రోజులపాటు మరింత పెరగనున్న ఎండలు



శుక్రవారం ప్రధాన కేంద్రాల్లో గరిష్ట ఉష్ణోగ్రతలు (డిగ్రీల సెల్సియస్‌లలో)

కేంద్రం	గరిష్టం
ఆదిలాబాద్	42.8
మహబూబ్‌నగర్	41.5
రామగుండం	41.4
నల్లగొండ	40.5
మెదక్	40.2
హైదరాబాద్	39.7
ఖమ్మం	39.4
నిజామాబాద్	39.3
భద్రాచలం	37.0
హనుమకొండ	36.8

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో కొన్ని రోజులుగా చల్లబడ్డ వాతావరణం కాస్తా మళ్లీ ఒక్కసారిగా వేడెక్కింది. రాష్ట్రంపై సూరీడు సుర్రుమంటూ విరుచుకుపడ్డాడు. తెలంగాణను నిప్పుల కుంపటిలా మార్చాడు. శుక్రవారం రాష్ట్రంలోని చాలా ప్రాంతాల్లో గరిష్ట ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 2 డిగ్రీల సెల్సియస్ మేర ఎక్కువగా నమోదైనట్లు వాతావరణ శాఖ వెల్లడించింది. జగిత్యాల జిల్లా నేరెళ్లలో అత్యధికంగా 45.6 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది. అలాగే మంచిర్యాల జిల్లా కొండాపూర్‌లో 44.9 డిగ్రీలు, మంచిర్యాల జిల్లా హాజీపూర్‌లో 44.5, పెద్దపల్లి జిల్లా కమాన్‌పూర్‌లో 44.4, ఆదిలాబాద్ జిల్లా అర్లిలో 44 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత రికార్డయింది. రానున్న మూడు రోజులు ఉష్ణోగ్రతలు తీవ్రస్థాయికి చేరతాయని వాతావరణ నిపుణులు అంచనా వేస్తున్నారు.

26న బంగ్లాదేశ్‌లో తీరం దాటనున్న తుపాను

పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో కొనసాగుతున్న అల్పపీడనం ఈశాన్య దిశగా కదిలి శుక్రవారం ఉదయం మధ్య బంగాళాఖాతం ప్రాంతంలో వాయుగుండంగా మారింది. ఇది బంగ్లాదేశ్‌లోని ఖేర్పురకు దక్షిణ నైరుతి దిశలో 750 కి.మీ దూరంలో కేంద్రీకృతమై ఉన్నట్లు వాతావరణ శాఖ వివరించింది. ఈ వాయుగుండం ఈశాన్య దిశలోనే కదులుతూ మరింత బలపడి శనివారం ఉదయానికి తూర్పుమధ్య బంగాళాఖాతంలో తుపానుగా మారనున్నట్లు తెలిపింది. క్రమంగా ఉత్తర దిక్కులో కదులుతూ మరింత బలపడి తీవ్ర తుపానుగా మారి ఈ నెల 26న అర్ధరాత్రికల్లా బంగ్లాదేశ్, పశ్చిమ బెంగాల్ తీరానికి సమీపంలోని సాగర్ ఐలాండ్ ఖేర్పుర మధ్య తీరం దాటే అవకాశం ఉన్నట్లు వివరించింది. దీని ప్రభావం ఉత్తర తెలంగాణ ప్రాంతంపై అతితక్కువగా ఉంటుందని, కొన్నిచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. మరోవైపు నైరుతి రుతుపవనాలు దక్షిణ బంగాళాఖాతం, అండమాన్ నికోబార్ దీవుల్లోని మిగిలిన ప్రాంతాలు, ఉత్తరమధ్య బంగాళాఖాతంలోని కొన్ని ప్రాంతాలకు విస్తరిస్తున్నాయని వాతావరణ శాఖ తెలిపింది.

మేడిగడ్డ ఎగువన 'జియో ట్యూబ్' కట్ట!

- నీటిని కన్నెపల్లి పంపుహౌజ్‌కు మళ్లించి లిఫ్ట్ చేయాలని నిర్ణయం
- ఆ కట్ట తీరును బోర్డు ఆఫ్ చీఫ్ ఇంజనీర్లకు వివరించిన ప్రైవేటు సంస్థ



జియో ట్యూబ్ కట్ట

సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టులో మేడిగడ్డ బ్యారేజీకి ఎగువన కన్నెపల్లి పంపుహౌస్ సమీపంలో జియో ట్యూబ్ టెక్నాలజీతో తాత్కాలిక కట్ట నిర్మించి గోదావరి వరదను మళ్లించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. 2.5 మీటర్ల ఎత్తుతో కట్టను నిర్మిస్తే ఈ వానాకాలంలో కన్నెపల్లి పంపుహౌస్ నుంచి నీళ్లను ఎత్తిపోసి.. రైతులకు అందించవచ్చని నీటి పారుదల శాఖ ప్రతిపాదించగా.. ప్రభుత్వం ఆమోదించింది. ఈ మేరకు కట్ట నిర్మాణానికి సంబంధించి బోర్డు ఆఫ్ చీఫ్ ఇంజనీర్స్ (బీఓసీఈ) సమావేశం శుక్రవారం జలసౌధలో జరిగింది. ఈ సందర్భంగా వీరేంద్ర టెక్స్‌టైల్స్ అనే సంస్థ జియోట్యూబ్ టెక్నాలజీతో కట్ట తీరును పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించింది. దేశంలో తొలిసారిగా 2010లో బ్రహ్మపుత్ర నది వరదల నుంచి రక్షణ కోసం 5 కిలోమీటర్ల పొడవున జియోట్యూబ్ టెక్నాలజీతో కరకట్టలను నిర్మించినట్టు వివరించింది. అసోంలోని కొప్పిలి, సెస్సా, సింగ్రి, రాప్తి, భో, ఘాగ్రా వంటి నదుల వరద నుంచి రక్షణ కోసం కూడా కట్టలను నిర్మించినట్టు తెలిపింది. ఈ జియోట్యూబ్ కట్టల మన్నిక వందేళ్లు ఉంటుందని పేర్కొంది. తాత్కాలిక కట్ట కోసం జియో ట్యూబ్‌లను తరలించడం, నింపడం చాలా తేలికని తెలిపింది. ట్యూబ్‌లు దెబ్బతిన్నా రిపేర్ చేయడానికి అవకాశం ఉంటుందని వివరించింది.

జూన్ 27 నుంచి ఇంజనీరింగ్ కౌన్సెలింగ్

అదే రోజు నుంచి ఫార్మసీ కౌన్సెలింగ్ కూడా..

- తొలి దశ సీట్ల కేటాయింపు జూలై 12న
- జూన్ 8 నుంచి ఈ సెట్ కౌన్సెలింగ్
- ప్రకటించిన ఉన్నత విద్యామండలి



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని ఇంజనీరింగ్, ఫార్మసీ కాలేజీల్లో ప్రవేశానికి వచ్చే నెల 27వ తేదీ నుంచి కౌన్సెలింగ్ ప్రక్రియ మొదలుకానుంది. ఇందుకు సంబంధించిన తేదీలను ఉన్నత విద్య మండలి శుక్రవారం విడుదల చేసింది. ఈ నెల 7 నుంచి 11వ తేదీ వరకూ ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ (టీఎస్ఈఏపీ సెట్) ఉమ్మడి ప్రవేశ పరీక్ష జరిగిన సంగతి తెలిసిందే. ఈ సెట్ ఫలితాలను ఈ నెల 18న విడుదల చేశారు. సెట్‌లో అర్హత సాధించిన వారికి కాలేజీల్లో కన్వీనర్ కోటా పరిధిలో ఉండే సీట్ల భర్తీకి కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. కౌన్సెలింగ్ తేదీలపై ఉన్నత విద్య మండలి చైర్మన్ ప్రొఫెసర్ ఆర్ లింబాద్రి, విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం పలువురు ఉన్నతాధికారులు సమావేశమయ్యారు. అనంతరం షెడ్యూల్‌ను విడుదల చేశారు.

12 నుంచి స్లైడింగ్...

ఒకే కాలేజీలో వివిధ బ్రాంచ్‌లు మారాలనుకునే వారు ఆగస్టు 12, 13 తేదీల్లో స్లైడింగ్‌కు దరఖాస్తు చేసుకోవాలి. ఆప్షన్లను 13వ తేదీ ఫ్రీజ్ చేస్తారు. 16న సీట్ల కేటాయింపు ఉంటుంది. 17వ తేదీలోగా విద్యార్థులు స్లైడింగ్‌లో కేటాయించిన బ్రాంచ్‌కు అంగీకరిస్తున్నట్టు రిపోర్టు చేయాలి.

జూన్ 8 నుంచి ఈ–సెట్ కౌన్సెలింగ్

డిప్లొమా కోర్సులు చేసిన విద్యార్థులు ఇంజనీరింగ్ ద్వితీయ సంవత్సరంలో చేరేందుకు నిర్వహించిన ఉమ్మడి ప్రవేశ పరీక్ష ఈ–సెట్‌లో ఉత్తీర్ణులైన వారికి జూన్ 8 నుంచి కౌన్సెలింగ్ చేపడుతున్నారు. దీనికి సంబంధించిన షెడ్యూల్‌ను కూడా ఉన్నత విద్యామండలి శుక్రవారం విడుదల చేసింది.

కౌన్సెలింగ్ తేదీలు ఇలా...

విషయం	తేదీలు
తొలి దశ..	
ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్, స్లాట్ బుకింగ్	27.6.24 – 05.7.24
ధ్రువపత్రాల పరిశీలన	29.6.24 – 6.7.24
ఆప్షన్ల ఎంపిక	30.6.24 – 8.7.24
ఆప్షన్ల ఫ్రీజింగ్	8.7.24
సీట్ల కేటాయింపు	12.7.24
సెల్ఫ్ రిపోర్టింగ్	12.7.24 – 16.7.24
రెండో దశ కౌన్సెలింగ్...	
ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్, స్లాట్ బుకింగ్	19.7.24
ధ్రువపత్రాల పరిశీలన	20.7.24
ఆప్షన్ల ఎంపిక	20.7.24 – 21.7.24
ఆప్షన్ల ఫ్రీజింగ్	21.7.24
సీట్ల కేటాయింపు	24.7.24
సెల్ఫ్ రిపోర్టింగ్	24.7.24 – 26.7.24
తుది దశ కౌన్సెలింగ్	
ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్, స్లాట్ బుకింగ్	30.7.24
ధ్రువపత్రాల పరిశీలన	31.7.24
ఆప్షన్ల ఎంపిక	31.7.24 – 2.8.24
ఆప్షన్ల ఫ్రీజింగ్	2.8.24
సీట్ల కేటాయింపు	5.8.24
సెల్ఫ్ రిపోర్టింగ్	5.8.24 – 7.8.24

ఈసెట్ కౌన్సెలింగ్ తేదీలు ఇలా..

తొలి దశ కౌన్సెలింగ్	
ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్, స్లాట్ బుకింగ్	8.6.24 – 11.6.24
ధ్రువపత్రాల పరిశీలన	10.6.24 – 12.6.24
ఆప్షన్ల ఎంపిక	10.6.24 – 14.6.24
ఆప్షన్ల ఫ్రీజింగ్	14.6.24
సీట్ల కేటాయింపు	18.6.24
సెల్ఫ్ రిపోర్టింగ్	18.6.24 – 21.6.24
ఫైనల్ ఫేజ్ కౌన్సెలింగ్	
ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్, స్లాట్ బుకింగ్	15.7.24 – 16.7.24
ధ్రువపత్రాల పరిశీలన	17.7.24
ఆప్షన్ల ఎంపిక	17.7.24 – 18.7.24
ఆప్షన్ల ఫ్రీజింగ్	18.7.24
సీట్ల కేటాయింపు	21.7.24
సెల్ఫ్ రిపోర్టింగ్	22.7.24 – 24.7.24
స్పాట్ అడ్మిషన్లలో సీట్ల వెల్లడి	24.7.24
స్పాట్ అడ్మిషన్ల ప్రక్రియ పూర్తికి చివరి తేదీ	30.7.24

అన్ని వైద్య కళాశాలల్లో ఈడబ్ల్యూఎస్ కోటా!

▶ మొదటి పేజీ తరువాయి

కోసం కేటాయించనున్నారు. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ నుంచి అందిన ప్రతిపాదనకు ప్రభుత్వం ఆమోదం తెలిపినట్లు అధికారులు చెబుతున్నారు.

ఇప్పటివరకు 7 కాలేజీల్లోనే..

రాష్ట్రంలో కేవలం 7 ప్రభుత్వ వైద్య కళాశాలలు.. హైదరాబాద్‌లోని గాంధీ, ఈఎస్ఐ మెడికల్ కాలేజీలు, మహబూబ్‌నగర్, నిజామాబాద్, సిద్దిపేట మెడికల్ కాలేజీలు, వరంగల్ కాకతీయ మెడికల్ కాలేజీ, ఆదిలాబాద్‌లోని రాజీవ్‌గాంధీ మెడికల్ కాలేజీల్లోనే ఎన్ఎంసీ అనుమతి మేరకు ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు అమలవుతున్నాయి. గతేడాది వరకు ఆయా కాలేజీల్లో 103 ఎంబీబీఎస్ సీట్లు ఈ కోటా కింద అగ్రవర్ణాల్లోని పేదలకు ఇచ్చారు. కాగా ఈ ఏడాది నుంచి అన్ని మెడికల్ కాలేజీల్లోని కన్వీనర్ కోటా సీట్లకు ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్‌ను అమలు చేస్తే మరో 350 వరకు ఎంబీబీఎస్ సీట్లు అగ్రవర్ణ పేదలకు దక్కే అవకాశం ఉందని వైద్య ఆరోగ్యశాఖ వర్గాలు అంచనా వేస్తున్నాయి. అయితే దీనిపై పూర్తిస్థాయిలో స్పష్టత రావాల్సి ఉంది. నీట్ ప్రవేశ పరీక్ష ఫలితాలు వెలువడిన తర్వాత, అడ్మిషన్ నోటిఫికేషన్ కంటే ముందే ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్‌కు సంబంధించిన ఉత్తర్వులు వెలువడతాయని వైద్యశాఖ వర్గాలు వెల్లడించాయి.

జనరల్ కోటా సీట్లకు గండి

రాష్ట్రంలో గతేడాది వరకు 56 మెడికల్ కాలేజీల్లో 8,490 ఎంబీబీఎస్ సీట్లు అందుబాటులో ఉన్నాయి. వాటిల్లో 27 ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో 3,790 ఎంబీబీఎస్ సీట్లున్నాయి. అలాగే 29 ప్రైవేట్ మెడికల్ కాలేజీల్లో 4,700 ఎంబీబీఎస్ సీట్లున్నాయి. ఇప్పటివరకు 10% ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ అమలుకుగాను అంతే మొత్తంలో సీట్లను ఆయా మెడికల్ కాలేజీలకు ఎన్ఎంసీ మంజూరు చేసింది. దీనివల్ల ఇతర రిజర్వేషన్ కేటగిరీ విద్యార్థులకు కానీ, జనరల్ కేటగిరీ కోటా సీట్లకు కానీ కోత పడేది కాదు. ఎన్ఎంసీ అదనపు సీట్లు మంజూరు చేయడం కుదరదని, ఉన్న సీట్లలోనే ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ అమలు చేయాలని ఆదేశించింది. అయితే బీసీ, ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లలో కోత ఉండదని అంటున్నారు. అంటే జనరల్ కేటగిరీ సీట్లకు కోత పెట్టి వాటిని ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్‌కు కేటాయిస్తారు. అలాగైనా తమకు నష్టం జరుగుతుందని ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులు అంటున్నారు. జనరల్ కేటగిరీలోనూ తమకు రావాల్సిన సీట్లకు గండి పడుతుందని, దీనివల్ల తమకు అన్యాయం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

రూ.8 లక్షల ఆదాయ పరిమితి

ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ వర్తించాలంటే ఆదాయం రూ.8 లక్షల లోపు ఉండాలి. ఈ మేరకు ఆదాయ ధ్రువీకరణ పత్రాలు ఇచ్చేలా రెవెన్యూ శాఖకు ఆదేశాలున్నాయి.


మల్లారెడ్డి అక్రమ నిర్మాణాల కూల్చివేత

- చెరువును ఆక్రమించి ప్రహరీ నిర్మించారనే ఆరోపణలు
- స్థానికుల ఫిర్యాదుతో అధికారుల చర్యలు

శామీర్‌పేట్ (హైదరాబాద్): మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి మరోమారు వార్తల్లో కెక్కారు. గత వారం రోజులుగా జరుగుతున్న సుచిత్ర భూ వివాదం చల్లారక ముందే శామీర్‌పేట మండలం బొమ్మరాశిపేట పెద్దచెరువు ఎఫ్‌టీఎల్‌ను మల్లారెడ్డి కబ్జా చేసి ప్రహరీ గోడ నిర్మించారంటూ గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. దీంతో సర్వే నంబర్లు 315, 407, 408 ల్లోని అక్రమ నిర్మాణాలను పంచాయతీరాజ్ శాఖ అధికారులు శుక్రవారం కూల్చివేశారు. వివరాలు ఇలా ఉన్నాయి..మంత్రిగా ఉన్నప్పుడు మల్లారెడ్డి మేడ్చల్ నియోజకవర్గంలోని పలు మండలాల్లో భూములను కొనుగోలు చేశారు. ఈ క్రమంలోనే శామీర్‌పేట మండలంలోని బొమ్మరాశిపేట గ్రామం సర్వే నంబరు 408లో కూడా 7 ఎకరాల భూమిని కొన్నారు. అయితే ఆ స్థలానికి ఆనుకుని ఉన్న బొమ్మరాశిపేట పెద్దచెరువు ఎఫ్‌టీఎల్ (ఫుల్ ట్యాంక్ లెవల్) పరిధిని ఆక్రమించి ప్రహరీ నిర్మించినట్లుగా ఆరోపణలు ఉన్నాయి. అప్పట్లో మంత్రిగా ఉండటంతో ఫిర్యాదు చేసినా అధికారులు చర్యలు చేపట్టలేదని గ్రామస్తులు అంటున్నారు. ఈ నెల 6వ తేదీ అర్ధరాత్రి ఎఫ్‌టీఎల్‌లో లారీల సాయంతో మట్టిని నింపే ప్రయత్నం చేశారంటూ గ్రామస్తులు ఇరిగేషన్ శాఖ అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. దీంతో ఇరిగేషన్ అధికారులు విచారణ జరిపి మండల రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఎఫ్‌టీఎల్ కబ్జాకు గురైందంటూ ఇరిగేషన్ శాఖ నుంచి జిల్లా కలెక్టర్‌కు నివేదిక అందింది. ఈ నేపథ్యంలో విచారణ అనంతరం జిల్లా కలెక్టర్ ఆదేశాలతో పంచాయతీరాజ్ శాఖ అధికారులు ఆక్రమిత భూమిలోని నిర్మాణాలను కూల్చివేశారు. డీఎల్‌పీఓ సాంబిరెడ్డి, ఎంపీఓ సునీత, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

జీడిమెట్ల భూవివాదంలో మల్లారెడ్డికి చుక్కెదురు

ఉపశమన ఆదేశాలు ఇచ్చేందుకు హైకోర్టు నిరాకరణ



సాక్షి, హైదరాబాద్: రంగారెడ్డి జిల్లా కుత్బుల్లాపూర్ మండలం జీడిమెట్లలోని రెండున్నర ఎకరాల స్థలవివాదంపై మాజీ మంత్రి మల్లారెడ్డి కోరిన ఉపశమన ఆదేశాలు ఇచ్చేందుకు హైకోర్టు నిరాకరించింది. జీడిమెట్లలోని వివాదాస్పద భూమికి సంబంధించి సివిల్ కోర్టుల్లో అనేక వ్యాజ్యాలు పెండింగ్‌లో ఉన్నందున, పూర్తి వివరాలతో కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయాలని అధికారులను ఆదేశిస్తూ, విచారణ వాయిదా వేసింది. జీడిమెట్లలోని సర్వేనంబర్లు 82, 83లోని రెండున్నర ఎకరాల స్థల వివాదంలో మల్లారెడ్డిపై పేట్‌బషీర్‌బాగ్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. మల్లారెడ్డితోపాటు ఆయన అల్లుడు మర్రి రాజశేఖరరెడ్డిపై కూడా పోలీసులు కేసు నమోదు చేశారు. అయితే తమ అధీనంలో ఉన్న భూమిలో కలగజేసుకోకుండా పేట్‌బషీర్‌బాగ్ పోలీసులకు, కుత్బుల్లాపూర్ తహసీల్దార్‌కు ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ మల్లారెడ్డి, రాజశేఖర్‌రెడ్డితోపాటు మల్లారెడ్డి కుమారుడు మహేందర్‌రెడ్డి పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ అనిల్‌కుమార్ జూకంటి ధర్మాసనం విచారణ చేపట్టింది. 2011లో పిటిషనర్లు ఆ భూమిని కొనుగోలు చేశారని వారి తరఫు న్యాయవాది పేర్కొన్నారు. వారికి ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా కుత్బుల్లాపూర్ తహసీల్దార్ మే 18న ఈ భూమిని సర్వే చేయడానికి పోలీసులతో సహా వచ్చారన్నారు. ఆ రెండున్నర ఎకరాలు పిటిషనర్లకు చెందదని పేర్కొంటూ శ్రీనివాసరెడ్డి అనే వ్యాపారి కొందరితో కలసి షెడ్‌లను కూలగొట్టారని చెప్పారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. వివాదాస్పద భూమికి సంబంధించిన రికార్డులను కోర్టు ముందు ఉంచాలని ప్రతివాదులను ఆదేశించారు. విచారణను వారం పాటు వాయిదా వేశారు.

ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డిపై కేసు

తన భూమిని కబ్జా చేశాడని బాధితుడి ఫిర్యాదు



చేవెళ్ల: ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డిపై చేవెళ్ల పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. వివరాలు ఇలా ఉన్నాయి.. చేవెళ్ల మండలంలోని ఈర్లపల్లి, శంకర్‌పల్లి మండలంలోని టంగటూరు గ్రామాల పరిధి సర్వే నంబర్లు 32,35,36,38లతోపాటు మరికొన్ని నంబర్లలో ఉన్న భూమిలో సామ దామోదర్‌రెడ్డి ఫంక్షన్ హాల్, గుడి నిర్మించాడు. ఇందులోనే చైతన్య రిసార్ట్ పేరుతో అభివృద్ధి చేసిన కొంతభూమిని గతంలో జీవన్‌రెడ్డికి విక్రయించాడు. అప్పట్లో ఇద్దరి మధ్య జరిగిన లావాదేవీలలో జీవన్‌రెడ్డి తనను మోసం చేశాడని, తాను విక్రయించని ఫంక్షన్ హాల్, గుడిని కూడా ఆక్రమించి అందులోకి రాకుండా చేశాడని జీవన్‌రెడ్డిపై ఫిర్యాదు చేశాడు. తాను ఫంక్షన్‌హాల్ వద్దకు వెళితే అక్కడ ఉన్నవారితో బెదిరింపులకు గురిచేయడంతోపాటు దాడికి యత్నిస్తున్నాడని పేర్కొన్నాడు. తాను ఫిర్యాదు చేసిన సమయంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఉండటంతో పోలీసులు పట్టించుకోలేదని ఆరోపించాడు. గత బుధవారం ఫంక్షన్‌హాల్ వద్దకు వెళ్లిన తనను జీవన్‌రెడ్డికి సంబంధించిన ప్రైవేటు వ్యక్తులు బెదిరించారని చేవెళ్ల పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు జీవన్‌రెడ్డి, అతని కుటుంబ సభ్యులపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని సీఐ లక్ష్మారెడ్డి తెలిపారు.

ఎమ్మెల్సీ కవిత బెయిల్ పిటిషన్లపై | విచారణ వాయిదా

27న విచారిస్తామన్న ఢిల్లీ హైకోర్టు



సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీ లిక్కర్ పాలసీ స్కామ్‌లో బెయిల్ కోరుతూ బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత దాఖలు చేసిన పిటిషన్లపై ఢిల్లీ హైకోర్టు విచారణ సోమవారానికి వాయిదా వేసింది. ఈడీ, సీబీఐ కేసుల్లో వేర్వేరుగా కల్వకుంట్ల కవిత దాఖలు చేసిన పిటిషన్లను శుక్రవారం జస్టిస్ స్వర్ణకాంతశర్మ విచారించారు. కవిత తరఫు సీనియర్ న్యాయవాది విక్రమ్‌చౌదరి వాదనలు వినిపిస్తూ కవితను అరెస్టు చేసే క్రమంలో పలు ఉల్లంఘనలు జరిగాయని తెలిపారు. ఈ కేసులో నిందితుల్లో కవిత ఒక్కరే మహిళ అని, చట్టాలు అనుసరించి బెయిల్ మంజూరు చేయాలని కోరారు. కేసు నమోదు చేసిన తొలినాళ్లలో కవిత పేరు లేదని అప్రూవర్లుగా మారిన వారి స్టేట్‌మెంట్ల ఆధారంగా ఆమెను అరెస్టు చేశారన్నారు. అభిషేక్ బోయినపల్లి, విజయ్‌నాయర్‌లకు బెయిలు వచ్చిన విషయాన్ని విక్రమ్‌చౌదరి కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. ఈడీ కేసులో కౌంటర్ దాఖలు చేసినట్టు న్యాయవాది జొహెబ్ హొస్సేన్ తెలిపారు. తమ కౌంటర్ ఈ నెల 27లోగా దాఖలు చేస్తామని సీబీఐ తరఫు న్యాయవాది పేర్కొనగా, ఆదివారం రాత్రి పది గంటలలోపు దాఖలు చేయాలని న్యాయమూర్తి తెలిపారు. వీలైనంత వరకూ శనివారమే దాఖలు చేయడానికి యత్నిస్తామని సీబీఐ తరఫు న్యాయవాది కోర్టుకు తెలిపారు, అనంతరం, సోమవారం కవిత తరఫు వాదనలు పూర్తి చేయాలని, మంగళవారం దర్యాప్తు సంస్థల వాదనలు వింటామని జస్టిస్ స్వర్ణకాంతశర్మ విచారణ వాయిదా వేశారు.

నర్సింగ్ ఆఫీసర్లకు త్వరలో జీతాలు

• డీఎంఈ వాణి వెల్లడి

సాక్షి ఎఫెక్ట్

సాక్షి, హైదరాబాద్: కొత్తగా నియమితులైన నర్సింగ్ ఆఫీసర్లకు మూడు నెలల జీతాలు త్వరలో అందజేస్తామని డీఎంఈ వాణి తెలిపారు. 'కొలువు సరే.. జీతాలేవీ'శీర్షికతో శుక్రవారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనంపై ఆమె స్పందించారు. సంబంధిత ట్రెజరీలలో నర్సింగ్ ఆఫీసర్లకు సంబంధించి అన్ని ఎంప్లాయ్ ఐడీలను రూపొందించామని వెల్లడించారు. చాలామంది పాన్ నంబర్లను పొందారని, కొందరివి ప్రక్రియలో ఉన్నాయన్నారు. వాటిని త్వరలో పూర్తి చేస్తామన్నారు. ఐడీ, పాన్ నంబర్లు పొందిన వారికి ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్ నెలల్లో చాలావరకు జీతాల బిల్లులు ట్రెజరీ కార్యాలయాలలో సమర్పించినట్టు తెలిపారు. వారికి త్వరలో జీతాలు చెల్లిస్తామని పేర్కొన్నారు. నర్సింగ్ ఆఫీసర్ల వేతనాలను ప్రాధాన్యతా క్రమంలో సత్వరమే విడుదల చేసేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని స్పష్టం చేశారు.

పాలమూరులో భారీ వర్షం

• తడిసిన 23 వేల బస్తాల ధాన్యం



మహబూబ్‌నగర్‌లో విరిగిపడిన భారీ చెట్టు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: ఉమ్మడి పాలమూరు జిల్లావ్యాప్తంగా శుక్రవారం సాయంత్రం ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. మహబూబ్‌నగర్ జిల్లాలోని నవాబ్‌పేట మార్కెట్ యార్డులో తూకాలు చేస్తున్న సమయంలో అకాల వర్షం కురవడంతో ధాన్యం మొత్తం తడిసిపోయింది. సుమారు 23 వేలకు పైగా బస్తాల ధాన్యం మార్కెట్‌లో ఉండటంతో వాన దెబ్బకు వాటిని రక్షించడం ఎవరి తరం కాలేదు. అలాగే జిల్లాకేంద్రంలోని క్లాక్‌టవర్, పాత బస్టాండు, మోనప్పగుట్ట, కలెక్టర్ బంగ్లా, తెలంగాణ చౌరస్తా, స్టేషన్ రోడ్డు తదితర ప్రాంతాల్లో చెట్లు పక్కనున్న విద్యుత్ తీగలపై పడి నేలకొరిగాయి. వీరన్నపేటలోని వీరభద్రకాలనీలో ఓ ఇంటి పైకప్పు రేకులు లేచిపోయాయి. పలుచోట్ల విద్యుత్ స్తంభాలు విరిగిపోవడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగి ప్రజలు ఇబ్బందులు పడ్డారు.

మండుతున్న కూరగాయల ధరలు..

రాష్ట్రంలో తగ్గిన సాగు విస్తీర్ణం.. పెరిగిన రవాణా ఖర్చులు

హైదరాబాదీలకు ఇతర రాష్ట్రాల కూరగాయలే ఆధారం



సాక్షి, హైదరాబాద్: కూరగాయల ధరలు మండిపోతున్నాయి. రైతు బజార్లు, వారపు సంత, కూరగాయల మార్కెట్.. ఎక్కడ చూసినా ధరల మోతే. ఏ కూరగాయ చూసినా పావు కేజీ రూ.15 నుంచి రూ.20 పలుకుతోంది. సాగు నీరు అందుబాటులో ఉన్న రోజుల్లో కిలో కూరగాయలు రూ.20 నుంచి రూ.40 వరకు లభించేవి. ప్రస్తుతం హోల్‌సేల్ మార్కెట్‌లో రూ.20 నుంచి రూ.25 వరకు ధర పలుకుతుండగా వారాంతపు సంతల్లో కిలో రూ.60–80 పలుకుతున్నాయి.

గ్రేటర్‌కు కష్టాలు..

గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో సుమారు 1.5 కోట్ల మంది ప్రజలు నివసిస్తున్నారు. స్థానిక ప్రజల అవసరాలకు ఏడాదికి సుమారు 40 లక్షల మెట్రిక్ టన్నుల కూరగాయలు అవసరం ఉంటాయని అంచనా. నగర పరిసర ప్రాంతాలైన వికారాబాద్, సంగారెడ్డి, రంగారెడ్డి, మేడ్చల్, మెదక్ ఇతర జిల్లాల నుంచి ఇక్కడికి కూరగాయలు వస్తున్నాయి. స్థానికంగా సుమారు 19 లక్షల మెట్రిక్ టన్నుల నుంచి 25 మెట్రిక్ టన్నులు వరకు కూరగాయలు అందుబాటులో ఉంటున్నాయని అంచనా వేస్తున్నారు. ఆపై అవసరాలకు ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్.. తదితర రాష్ట్రాలపై ఆధారపడాల్సి వస్తోంది. ప్రస్తుతం రాష్ట్రంలో సాగు నీటి ఎద్దడి తీవ్రంగా ఉంది. దీంతో సాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గింది. ఫలితంగా ఇతర రాష్ట్రాల కూరగాయలే దిక్కవుతున్నాయి. కూరగాయల దిగుమతికి రవాణా చార్జీలు, లోడింగ్, అన్‌లోడింగ్, మార్కెట్ ఫీజులు, ఇతర ఖర్చులు కలిపి తడిపి మోపెడు అవుతున్నాయని వ్యాపారులు చెబుతున్నారు. ఫలితంగా నెల రోజుల క్రితం టమోటా కిలో రూ.15 ఉంటే ప్రస్తుతం రూ.40కి చేరింది. గతంలో పచ్చిమిర్చి కిలో రూ.60 ఉండగా ఇప్పుడు రూ.120కి పెరిగింది.

ప్రస్తుతం కూరగాయల ధరలు ఇలా.. కిలో ధర (రూ.లో)

టమాటా	40
ఉల్లి	38
మునగకాడలు	40
క్యారెట్	50
వంగ	45
బెండ	52
పచ్చిమిర్చి	120

పావు కిలో రూ. 20కి అమ్ముతున్నారు..

వారపు సంతలో కూరగాయలు ఏవి అడిగినా పావుకిలో రూ.15 నుంచి రూ.20 చెబుతున్నారు. నెల క్రితం వరకు కిలో టమాటా రూ.15 ఉండేది ప్రస్తుతం కిలో రూ.40కి అమ్ముతున్నారు. పచ్చిమిర్చి పావు కిలో రూ.20కి దొరికేది. ప్రస్తుతం రూ.40కి అమ్ముతున్నారు. ఇలా అన్ని ధరలు పెరగడంతో తక్కువ కూరగాయలు కొనుగోలు చేస్తున్నాం.

– అనిత, ఎల్.బి.నగర్.

ధర ఉన్నా ఫలితం లేదు..

ఎకరన్నరలో కూరగాయలు సాగు చేస్తున్నా. వేసవి ఎండలకు బోర్లలో నీరు అడుగంటింది. సమయానికి నీటి తడులు అందక దిగుబడి తగ్గింది. మార్కెట్‌లో కూరగాయలకు మంచి ధర ఉన్నా దిగుబడులు లేకపోవడంతో ఫలితం లేకపోయింది. చేతి నిండా పంట ఉన్నపుడు ధర ఉండదు.

– రైతు, చించల్‌పేట్, నవాబుపేట్ మండలం

రొటేషన్ అయితే చాలు..



ఆంధ్రప్రదేశ్ నుంచి కూరగాయలు తెస్తున్నాం. రవాణా చార్జీలు, హమాలీ, సిబ్బంది వేతనాలు, ఇతర ఖర్చులు అన్నీ కలిపి తక్కువ లాభంతో అమ్ముతున్నాం. ఒక్కోసారి వదిలించుకోవాల్సిన పరిస్థితులు ఎదురవుతాయి. పెట్టిన పెట్టుబడి డబ్బులు రొటేషన్ అయితే చాలు అనిపించిన రోజులు ఉంటాయి. మా దగ్గర కిలో రూ.20కి కొనుగోలు చేసి వారపు సంతలో కిలో రూ.40 వరకు అమ్ముతున్నారు.

– జంగారెడ్డి, హోల్‌సేల్ వ్యాపారి, దిల్‌సుఖ్‌నగర్

ఈసీ అనుమతి వచ్చింది.. విస్తృత ఏర్పాట్లు చేయండి



రాష్ట్ర ఆవిర్భావ వేడుకలపై సీఎస్ శాంతికుమారి ఆదేశం

సాక్షి, హైదరాబాద్: జూన్ 2న రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాలను నిర్వహించేందుకు ఎన్నికల సంఘం అనుమతిచ్చిన నేపథ్యంలో విస్తృత ఏర్పాట్లు చేయాలని సీఎస్ శాంతికుమారి అధికారులను ఆదేశించారు. సికింద్రాబాద్‌లోని పరేడ్‌గ్రౌండ్‌లో నిర్వహించనున్న ఈ వేడుకల కోసం చేపట్టాల్సిన చర్యలపై శుక్రవారం ఆమె సచివాలయంలో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఇందులో డీజీపీ రవి గుప్తాతో పాటు రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అధర్‌సిన్హా, సీనియర్ ఐఏఎస్ అధికారులు బి.వెంకటేశం, జితేందర్, క్రిస్టినా జోంగ్తు, వాటర్‌బోర్డు ఎండీ సుదర్శన్‌రెడ్డి, టీజీపీడీసీఎల్ ఎండీ ముషారఫ్, సీడీఎంఏ దివ్య, సమాచార పౌరసంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్ ఎం.హనుమంతరావు తదితర అధికారులు పాల్గొన్నారు. శాంతికుమారి మాట్లాడుతూ ఆవిర్భావ వేడుకల సందర్భంగా వీవీఐపీలు ప్రయాణించే మార్గాల్లో తగిన బందోబస్తు ఏర్పాట్లు చేయాలని, ట్రాఫిక్‌కు ఎలాంటి అంతరాయం కలగకుండా రూట్‌మ్యాప్‌ను సిద్ధం చేసి పార్కింగ్ స్థలాలను కేటాయించాలని పోలీసు శాఖకు సూచించారు. ప్రజలకు ఎండ తగలకుండా బారికేడింగ్‌తో పాటు నీడ కోసం షామియానాలను ఏర్పాటు చేసే బాధ్యతలను ఆర్అండ్‌బీ శాఖకు అప్పగించారు. సభా ప్రాంగణ ప్రాంతాల్లో పారిశుధ్య పనుల నిర్వహణతో పాటు తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేయాలని, రోడ్డుకు ఇరువైపులా రంగురంగుల జెండాలను అలంకరించాలని జీహెచ్ఎంసీ అధికారులను ఆదేశించారు. పండుగ వాతావరణాన్ని తలపించేలా కళాకారులతో ప్రదర్శనలు ఏర్పాటు చేయాలని సాంస్కృతిక శాఖను, నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయాలని విద్యుత్ శాఖ అధికారులను సీఎస్ ఆదేశించారు. సీఎం రేవంత్ గన్‌పార్క్‌ను సందర్శించి తెలంగాణ అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పించి పరేడ్‌గ్రౌండ్‌కు చేరుకుంటారని, ఇందుకు ఏర్పాట్లు చేయాలన్నారు.

టీపీసీసీ లీగల్ సెల్ కన్వీనర్‌గా రత్నారెడ్డి



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) లీగల్ సెల్ కన్వీనర్‌గా యేరువ రత్నారెడ్డి నియమితులయ్యారు. ఈమేరకు టీపీసీసీ లీగల్ సెల్ చైర్మన్ పొన్నం అశోక్‌గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. సికింద్రాబాద్‌కు చెందిన రత్నారెడ్డి న్యాయవాది. తనకు అవకాశం కల్పించిన సీఎం రేవంత్‌రెడ్డి, పొన్నం అశోక్‌గౌడ్, మంత్రి పొన్నం ప్రభాకర్‌కు రత్నారెడ్డి ధన్యవాదాలు తెలిపారు.

ఎరువులు, విత్తనాల సరఫరాలో సమస్య రావొద్దు

• అధికారులకు మంత్రి తుమ్మల ఆదేశాలు
• విత్తన కంపెనీల గతేడాది బకాయిలను తీరుస్తామని వెల్లడి



సాక్షి, హైదరాబాద్: ఎరువులు, విత్తనాల సరఫరాలో ఎక్కడా కూడా రైతులకు ఆటంకం రాకుండా చూడాలని, ఎప్పటికప్పుడు దీనిపై సమాచారం సేకరించాలని అధికారులకు వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. వానాకాలంలో ఇప్పటికే 6.26 లక్షల టన్నుల యూరియా, 0.76 లక్షల టన్నుల డీఏపీ, 3.84 లక్షల టన్నుల కాంప్లెక్స్, 0.29 లక్షల టన్నుల ఎంవోపీ ఎరువులను అందుబాటులో ఉంచామని వివరించారు. అలాగే రాష్ట్రవ్యాప్తంగా 50,942 క్వింటాళ్ల జీలుగ, 11,616 క్వింటాళ్ల జనుము, 236 క్వింటాళ్ల పిల్లి పెసర విత్తనాలు అందుబాటులో తెచ్చామన్నారు. మరో 30, 400 క్వింటాళ్ల విత్తనాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. శుక్రవారం తెలంగాణ సచివాలయంలో రైతులకు సబ్సిడీపై సరఫరా చేస్తున్న పచ్చిరొట్ట ఎరువుల విత్తనాల పంపిణీ, మార్కెట్లలో అందుబాటులో ఉంచిన పత్తి ప్యాకెట్లు, అమ్మకాలు, సన్నరకాల లభ్యతపై అధికారులతో మంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత వారం రోజులుగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ఒకేసారి పచ్చిరొట్ట విత్తనాలకు డిమాండ్ ఏర్పడిందని, అయినా సకాలంలో అందేలా చూడాలని అధికారులకు సూచించారు. ఆయా కంపెనీల గతేడాది బకాయిల విడుదలకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

నేడు వ్యవసాయ వర్సిటీలో విత్తనమేళా

13.32 లక్షల క్వింటాళ్ల సన్న రకాలు అందుబాటులో ఉన్నాయని మంత్రి తుమ్మల స్పష్టం చేశారు. దీనిపై శనివారం రాజేంద్రనగర్ వ్యవసాయ వర్సిటీ ఆధ్వర్యంలో విత్తన మేళాను నిర్వహిస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో సన్నసాగును ప్రోత్సహించడం తమ ప్రభుత్వ ఉద్దేశమని, దానికనుగుణంగా తొలివిడతగా వీటికి రూ. 500 బోనస్ ప్రకటించామని, అధికారులు దీనిపై రైతుల్లో అవగాహన కల్పించాలని ఆదేశించారు.

త్వరలో రైతు సంఘాలతో సమావేశం

త్వరలోనే రాష్ట్రస్థాయిలో వివిధ రైతు సంఘాల ప్రతినిధులతో సమావేశం నిర్వహిస్తామని మంత్రి తుమ్మల తెలిపారు. సచివాలయంలో శుక్రవారం తుమ్మలతో అఖిల భారత కిసాన్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు, కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు అన్వేష్‌రెడ్డి మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. వానాకాలం రైతు భరోసా, పంటల బీమా విధివిధానాలపై మంత్రితో చర్చించారు.

సవాళ్లను ఎదుర్కొనేలా శిక్షణ సామర్థ్యం పెంచాలి

• సీడీఎస్ జనరల్ అనిల్‌చౌహాన్

సాక్షి, హైదరాబాద్: యుద్ధక్షేత్రంలో అన్ని సవాళ్లను ఎదుర్కొనేలా శిక్షణ సామర్థ్యాన్ని పెంపొందించాలని చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ (సీడీఎస్) జనరల్ అనిల్‌చౌహాన్ సూచించారు. తన పర్యటనలో భాగంగా శుక్రవారం ఆయన దుండిగల్ ఎయిర్ ఫోర్స్ అకాడమీ కేంద్ర కార్యాలయాన్ని సందర్శించారు. ఆయనకు ఎయిర్ కమాండింగ్ ఇన్ చీఫ్ ట్రైనింగ్ కమాండ్, ఎయిర్‌మార్షల్ నగేశ్‌కపూర్ స్వాగతం పలికారు. తన సందర్శనలో భాగంగా సీడీఎస్ అకాడమీలో ఇస్తున్న శిక్షణ, ఇతర అంశాలపై స్థానిక సిబ్బందితో మాట్లాడారు. శిక్షణ కమాండ్ కార్యనిర్వాహకులను ఉద్దేశించి సీడీఎస్ మాట్లాడుతూ భారత వాయుసేన అధికారులు ఇతర అధికారులతో యుద్ధక్షేత్రంలో కలసి పనిచేసేలా శిక్షణ ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా శిక్షణ సిబ్బంది సాధించిన పురోగతిని అభినందించారు.

బంధానికీ, విముక్తికీ కారణం మనస్సు. ఇంద్రియ-వస్తువులతో అనుబంధించబడిన మనస్సు బంధానికి దారి తీస్తుంది. ఇంద్రియ-వస్తువుల నుండి విడిపోయినప్పుడు అది ముక్తికి మార్గం వెతుక్కుంటుంది.

– ముండకోపనిషత్తు

సాక్షి

శనివారం, 25 మే 2024

కిర్గిజిస్తాన్ భద్రమేనా!

ఉపాధి కోసమో, విద్యార్జన కోసమో మనదికాని చోటుకు పిల్లలను పంపినప్పుడు కన్నవాళ్ల హృదయం వారి కోసం నిత్యం ఆరాటపడుతుంది. సక్రమంగా ఉన్నారా, తిన్నారా అన్న ఆలోచనలే అనుక్షణమూ వారిని వేధిస్తుంటాయి. ప్రపంచం మునపట్లా లేదు గనుక ఇటువంటి భయాందోళనలు ఇప్పుడు మరింత పెరిగాయి. దేశంలో ఉన్నత విద్యారంగం, మరీ ముఖ్యంగా వైద్య విద్య బాగా విస్తరిస్తే అందరికీ అందుబాటులోకొస్తే మన విద్యార్థులు దూరతీరాలకు వలస వెళ్లాల్సిన అవసరం ఉండదు. అలా లేకపోబట్టే విద్యార్థులు అనుకోకుండా జరిగే పరిణామాల్లో చిక్కుకుని అవస్థలు పడాల్సివస్తోంది. రెండున్నరేళ్లక్రితం ఉన్నట్టుండి ఉక్రెయిన్‌పై రష్యా దురాక్రమణ యుద్ధానికి తెగబడినప్పుడు అక్కడి మన వైద్య విద్యార్థులు ప్రాణాపాయంలో చిక్కుకోవటం, ఇబ్బందులు పడటం చూశాం. మన దేశంతోపాటు అన్ని దేశాలూ తమ తమ విద్యార్థులను సురక్షితంగా వెనక్కు తీసుకెళ్లగలిగాయి. సరిగ్గా వారం క్రితం కిర్గిజిస్తాన్‌లోనూ విద్యార్థులకు సమస్య ఎదురైంది. ఈనెల 13న పాకిస్తాన్, ఈజిప్టు విద్యార్థులతో ఏర్పడిన తగవు ఆసరా చేసుకుని వందలాదిమంది స్థానికులు విద్యార్థుల హాస్టళ్లపై విరుచుకుపడి ధ్వంసం చేశారు. అనేకమంది విద్యార్థులను గాయపరిచారు. విద్యార్థినులను సైతం వేధించటం, దౌర్జన్యం చేయటంతో ఎప్పుడేమవుతుందో తెలియక విద్యార్థులంతా ఏడెనిమిది గంటలపాటు చీకటి గదుల్లో ప్రాణభయంతో బిక్కుబిక్కుమంటూ గడిపారు. పోలీసులు రంగంలోకి దిగినా దుండగులను అదుపు చేయలేకపోయారు. ఆ తర్వాత అరెస్టులు జరిగాయి. అది వేరే సంగతి. హాస్టళ్లకూ, విదేశీ విద్యార్థులుండే అపార్ట్‌మెంట్లకూ రక్షణ కల్పిస్తున్నారు. కానీ ఘటన జరిగి వారం కావస్తున్నా ఎక్కడా భయాందోళనలు చల్లారలేదు. దాంతో స్వస్థలాలకు పోవటమే ఉత్తమమని శుక్రవారం కూడా వందలాదిమంది పాకిస్తానీ విద్యార్థులు ఇంటి బాట పట్టారు. వారి ప్రభుత్వం ప్రత్యేక విమానాలు ఏర్పాటు చేసినట్టు ప్రకటించింది. మన విదేశాంగశాఖ మాత్రం తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, అవసరమైతే బిష్కెక్‌లోని మన రాయబార కార్యాలయాన్ని సంప్రదించాలని కోరింది.

వేరే దేశాలకు పోయినప్పుడు అక్కడి భాష, సంస్కృతీ సంప్రదాయాలు, పద్ధతులపై అవగాహన పెంచుకుని వాటిని గౌరవించటం అలవాటు చేసుకోవాలి. తమ దేశానికి చెందినవారితోనే సన్నిహితంగా మెలగటం, స్థానికులను చిన్నచూపు చూసే స్వభావం అనవసరమైన అపార్థాలకు దారితీస్తుంది. తమ సంస్కృతే ఘనమైనదని, ఇతరులు అల్పులన్న భావన స్వదేశంలో ఎంతోకొంత చెల్లుబాటవుతుంది. వేరేచోట మాత్రం సమస్యలు తెస్తుంది. దీన్ని గుర్తించబట్టే విశ్వవిద్యాలయాలు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి. స్థానికులతో కలిసిమెలిసివుండేలా విద్యార్థులను ప్రోత్సహిస్తున్నాయి. కిర్గిజిస్తాన్‌లో మూడేళ్లక్రితం కూడా గొడవలు జరిగాయి. అప్పుడూ ఇప్పుడూ కూడా పాకిస్తాన్ విద్యార్థులే గొడవలకు కారకులయ్యారు. రౌడీయిజం, స్థానిక సంప్రదాయాలను కించపరచటం, చట్టవిరుద్ధ కార్యకలాపాల్లో పాల్గొనటం వంటివి సమస్యలు తెచ్చిపెడుతున్నాయన్నది స్థానికుల ఆరోపణ. సాధారణంగా ఒకరిద్దరి ప్రవర్తన వల్ల గొడవ జరిగితే అది వారికే పరిమితమవుతుంది. ఎవరో ఒకరి జోక్యంతో అంతా సద్దుమణుగుతుంది. కానీ సామాజిక మాధ్యమాల హవా పెరగటం, ఆ గొడవ తాలూకు వీడియో క్షణాల్లో అందరికీ చేరటం భావోద్వేగాలను రెచ్చగొడుతోంది. ఉద్రిక్తతలు రేపుతోంది. దీనికితోడు విదేశీ విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు తమకు లేకపోవటం, వారి జీవన ప్రమాణాలు మెరుగ్గా కనబడటం ఆర్థికంగా అంతంతమాత్రంగా బతుకీడ్చే స్థానికులకు సహజంగానే ఆగ్రహం కలిగిస్తుంది. తమను ద్వితీయశ్రేణి పౌరులుగా పరిగణిస్తూ విదేశీ విద్యార్థులను అందలం ఎక్కించటం అసంతృప్తికి దారితీస్తుంది. పుండు మీద కారం జల్లినట్టు వారిని కించపరచటం లాంటి చేష్టలకు పాల్పడితే ఇక చెప్పేదేముంది? ఇలాంటి సమయాల్లో కారకులెవరన్న విచక్షణ ఉండదు. విదేశీయులందరినీ ఒకే గాటనకడతారు. కనుక ఎవరికి వారు పద్ధతిగా ఉంటే సరిపోదు. తోటి విద్యార్థులపై ఓ కన్నేసివుంచాలి. సమస్య తలెత్తవచ్చన్న సందేహం కలిగితే ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలి. నిజానికి మధ్య ఆసియా దేశమైన కిర్గిజిస్తాన్ వేరే దేశాలతో పోలిస్తే ఎంతో ప్రశాంతమైనది. అద్భుతమైన ప్రకృతి దృశ్యాలతో ఆహ్లాదకరంగా ఉంటుంది. స్థానికులు ప్రధానంగా సంచార జీవనానికి అలవాటుపడినవారు. విదేశీ అతిథులను ఆదరించటం, గౌరవించటంలో వారు ఎవరికీ తీసిపోరు.

కిర్గిజిస్తాన్ విద్యాలయాల్లో మన విద్యార్థులు 15,000 మంది ఉంటారని అంచనా. పాకిస్తాన్ నుంచి వచ్చినవారి సంఖ్య 11,000. వీరుగాక ఇంకా బంగ్లాదేశ్, కొన్ని అరబ్, ఆఫ్రికన్ దేశాల నుంచి కూడా చదువుకోవటానికి వస్తారు. తమ దేశాల్లో వైద్య విద్య ఖరీదైన వ్యవహారంగా మారడమే ఇందుకు కారణం. పూర్వపు సోవియెట్ యూనియన్‌లో భాగం కావటం వల్ల పాశ్చాత్య దేశాలతో పోలిస్తే కిర్గిజిస్తాన్ వైద్య విద్య ఎంతో ప్రామాణికమైనది. అంతర్జాతీయంగా అనేక దేశాలతో పాటు ప్రపంచ ఆరోగ్య సంస్థ గుర్తింపు కూడా దానికివుంది. వేరే దేశాల్లో చదవాలని, ప్రపంచాన్ని అర్థం చేసుకోవాలని తహతహలాడే పిల్లలు దూరాభారాలు లెక్కచేయక విదేశాలకు వెళ్తారు. కానీ ఇక్కడ చదువుకోవాలనుకునేవారికి మన వైద్యవిద్య అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవటం ప్రభుత్వాల బాధ్యత. ఆంధ్రప్రదేశ్, తెలంగాణలు ఈ విషయంలో ప్రత్యేకశ్రద్ధ పెట్టాయి. వేరే రాష్ట్రాలు కూడా ఆ పని చేయాలి. కేంద్ర ప్రభుత్వం అందుకు సహాయసహకారాలు అందించాలి.

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు
వైశాఖ మాసం, **తిథి:** బ.విదియ సా.6.39 వరకు, తదుపరి తదియ
నక్షత్రం: జ్యేష్ఠ ఉ.10.35 వరకు, తదుపరి మూల, **వర్జ్యం:** సా.6.39 నుండి 8.09 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.5.30 నుండి 7.07 వరకు
అమృతఘడియలు: తె.4.33 నుండి 5.24 వరకు
(తెల్లవారితే ఆదివారం).

సూర్యోదయం : 5.30
సూర్యాస్తమయం: 6.23
రాహుకాలం : ఉ.9.00 నుండి 10.30 వరకు
యమగండం : ప.1.30 నుండి 3.00 వరకు

ఆ మూలసూత్రాలను అందుకుంటేనే...

అభిప్రాయం



డా॥ కత్తి పద్మారావు


భారతదేశం పునర్నిర్మాణంలో ప్రతి సందర్భంలోను డా॥ బి.ఆర్.అంబేడ్కర్ సూత్రాలే నిజమైన ప్రత్యామ్నాయాన్ని అందించగలుగుతున్నాయి. అంబేడ్కర్ నిర్మించిన రాజ్యాంగ సౌధాన్ని ఆయన సూత్రాలతోనే పునర్నిర్మించాలి అనే నూతన భావన మన నాయకులకు ఉంటే అంబేడ్కర్ కుల నిర్మూలన భావాన్ని, సామ్యవాద భావాల్ని తప్పక ఆచరించవలసిన చారిత్రక సందర్భం ఇది. నిజానికి దేశాన్ని రక్షించాల్సిన వారు దేశంలో నేడు మత వైరుధ్యాలు పెంచడం ఆశ్చర్యం కలిగిస్తోంది. అశోకుడు, అక్బరు వంటి మహా చక్రవర్తులే మత సామరస్యం కోసం ప్రయత్నం చేస్తే, ఇప్పటి నాయకులు మతాధిపత్యం కోసం ప్రచారం చేసి మత సామరస్యాన్ని దెబ్బతీస్తున్నారని సామాజిక శాస్త్రవేత్తలు, రాజకీయ విశ్లేషకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఈ నెల 13న జరిగిన రెండు తెలుగు రాష్ట్రాల ఎన్నికల్లో మహిళలు పోటెత్తి ఓటెయ్యడం ఒక సామాజిక, సాంస్కృతిక పరిణామం. మహిళకు రాజకీయ అస్తిత్వం పెరిగింది అనడానికి ఇది ఒక నిదర్శనం. మహిళలు ఎక్కడ చైతన్యవంతం అవుతారో అక్కడ సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక, రాజకీయ పరిణామాలు త్వరితం అవుతాయని అంబేడ్కర్ చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లో 81.86 శాతం ఓట్లు పోయ్యాయి. నడి ఎండలో కూడ ప్రజలు నిలబడి తమ ఓటు హక్కును ఉపయోగించుకున్నారు. మరోప్రక్క కుల, మతం, మద్యం, డబ్బు ప్రభావం కూడా బలంగానే ఎన్నికల మీద ఉంది. ఎన్నికల సంగ్రామంలో ఈసారి సోషల్ మీడియా కీలకపాత్ర పోషించింది. ఒక రకంగా సామాజిక వేదికలపై పెద్ద యుద్ధమే నడిచింది. పార్టీలు, అభ్యర్థుల వారీగా ఏర్పడ్డ గ్రూపుల్లో ఓటింగ్ సందర్భంగా రాతలతో కత్తులు దూశారు. ఫేక్ ఫోటోలు, ఫేక్ ఆడియోలతో పాటు ఫేక్ వార్తలను క్షేత్రస్థాయిలో వైరల్ చేశారు. సోషల్ మీడియాను ఫాలో అయ్యేవారు అయోమయానికి గురయ్యే పరిస్థితులు ఏర్పడ్డాయి.

తెలుగు రాష్ట్రాల పరిస్థితులు ఇలా వుంటే మొత్తం భారతదేశం వ్యాప్తంగా పెను వృక్షాలు కూలుతున్న చప్పుళ్లు వినబడుతున్నాయి. కొన్ని అధికార పీఠాలు బీటలు వారుతున్నాయి. మే 15న భువనేశ్వర్‌లోని భువనగిరిలో ఇండియా కూటమి నాయకుడు రాహుల్‌గాంధీ ఒక బహిరంగ సభలో మాట్లాడుతూ, ఈ ఎన్నికల్లో భాజపా నెగ్గితే ప్రభుత్వరంగ సంస్థలన్నీ ప్రైవేటుపరం అవుతాయని, దేశాన్ని 22 మంది బిలియనీర్లు పాలిస్తారని, రాజ్యాంగ పుస్తకాన్ని భాజపా చించి అవతల పారేస్తుందని అన్నారు. బడుగు వర్గాలకు ప్రయోజనాలు లభించటానికి కారణమే రాజ్యాంగం అని తమ చేతిలోని రాజ్యాంగ ప్రతిని చూపిస్తూ చెప్పారు. 22 మంది బిలియనీర్లు తీసుకున్న రూ. 16 లక్షల కోట్ల రుణాలను కేంద్ర సర్కారు మాఫీ చేసిందని, ఉపాధి హామీ పథకం కింద కూలీలకు 24 ఏళ్ల పాటు వేతనాలు చెల్లించేందుకు అయ్యే మొత్తంతో ఇది సమానమని వివరించారు.

''రైతుల, విద్యార్థుల రుణాలను మాఫీ చేయలేదు. చిరు వ్యాపారులకు రుణాలే ఇవ్వలేదు. జీయస్టీ మొత్తమంతా ఇద్దరు ముగ్గురు వ్యక్తులకు వెళ్లిపోతోంది. మేం వచ్చాక కులగణనతో విప్లవాత్మక ప్రజాస్వామ్యాన్ని, ప్రజాపాలనను తీసుకువస్తాం. దేశంలో దేశంలో 50 శాతం మంది ఓబీసీలు, 15 శాతం దళితులు, 8 శాతం గిరిజనులు, 15 శాతం మైనార్టీలు, 5 శాతం ఆర్థికంగా వెనుకబడిన వర్గాలవారున్నారు. ఈ 90 శాతం మందికిపైగా ప్రజలు మోదీ పాలనలో వంచితులయ్యారు. ఎన్ని రకాల అబద్ధాలను భాజపా చెప్పినా జూన్ 4 తర్వాత ప్రధాని పదవిలో మోదీ ఉండరు'' అని రాహుల్ ఉద్ఘాటించారు.

మోదీ ప్రభుత్వంలో రాజ్యం కంటే కూడా కార్పొరేట్ శక్తులు బలపడ్డాయి. విశ్వవిద్యాలయాలు అన్నింటిలో మతోన్మాద భావాలను ప్రచారం చేస్తూ శాస్త్ర జ్ఞానాన్ని వక్రీకరిస్తున్నాయి. అందుకే శ్రీనగర్‌లో



మే 15న మాట్లాడుతూ నేషనల్ కాన్ఫరెన్స్ (ఎన్సీ)అధ్యక్షుడు ఫరూఖ్ అబ్దుల్లా ఇలా విమర్శించారు. భవిష్యత్తులో తాను పదవిలో లేకపోయినా దేశం మనుగడ సాగిస్తుందన్న విషయాన్ని ప్రధాని గుర్తుంచుకోవాలని పేర్కొన్నారు. దక్షిణ కాశ్మీర్ అనంత్‌నాగ్‌లోని షాంగుస్ ప్రాంతంలో ర్యాలీ నిర్వహించిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. ''మనం కలిసి జీవించాలి. దేశాన్ని రక్షించాలి. పదవి ఎల్లకాలం ఉండదు. కానీ దేశం శాశ్వతం. ఆయన (మోదీ) ఏ దేశాన్ని తయారు చేయాలని ప్రయత్నిస్తున్నారో అది వినాశకరమైనది'' అన్నారు.

నిజానికి దేశాన్ని రక్షించాల్సిన ప్రధానమంత్రి దేశంలో మత వైరుధ్యాలు పెంచడం ఆశ్చర్యకరం. అశోకుడు, అక్బరు వంటి మహా చక్రవర్తులే మతసామరస్యం కోసం ప్రయత్నం చేస్తే, మోదీ ప్రభుత్వం మతాధిపత్యం కోసం ప్రచారం చేసి మత సామరస్యాన్ని దెబ్బతీసిందని సామాజిక శాస్త్రవేత్తలు, రాజకీయ విశ్లేషకులందరూ భావిస్తున్నారు. మోదీ ఆవేశపూరితమైన ప్రసంగాల్లో 400 సీట్లు వస్తున్నాయని చెప్పుకుంటున్నా 150 నుంచి 200కే పరిమితం అవుతారని కమ్యూనిస్టు నాయకులు చెబుతున్నారు. బీజేపీకి బలమైన ఉత్తరాది రాష్ట్రాల్లోనే ఈ ఎన్నికల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమౌతోంది. ఉత్తరప్రదేశ్, రాజస్తాన్, బిహార్, మధ్యప్రదేశ్, హర్యానా, ఢిల్లీ తదితర రాష్ట్రాల్లోనే బీజేపీకి ఎదురు గాలి వీస్తున్నది. పైకి డాంబికంగా 370–400 సీట్లు వస్తాయని గొప్పలు చెప్పుకుంటున్నా ఏ సర్వేలోనూ ఆఖరికి బీజేపీని బలపరిచే విశ్లేషకులు సైతం 250కి మించి రావని చెప్పాల్సిన పరిస్థితి. బీజేపీ ప్రభుత్వం ఈ దశాబ్దంలో ఏ సోషల్ మీడియాలోనైతే దళిత బహుజన మైనార్టీ స్త్రీల మీద, రాజ్యాంగం మీద, మానవ హక్కుల మీద, విద్యార్థుల ప్రతిభ మీద, దళితుల జీవన సంస్కృతి మీద, ముస్లింలు జీవించే హక్కు మీద దాడి చేసిందో అదే సామాజిక మాధ్యమాన్ని ఉపయుక్తం చేసుకొని ఈ సామాజిక శ్రేణుల అన్నింటిలో వున్న మేధావర్గం ఎదురుదాడి ప్రారంభించింది.

నిజానికి మోదీ ద్వంద్వ భావజాల ఘర్షణలో ఇరుక్కుపోయారా అనిపిస్తుంది. ఏ ప్రజలైతే ఏ బడుగువర్గాలైతే అధిక ఓట్ల శక్తిగా ఉన్నాయో, ఆ వర్గాల జీవన వ్యవస్థలను ధ్వంసం చేస్తూ చేస్తూ, కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాస్తూ ఈ వర్గాలను మతం పేరుతో ఓట్లు అడుగుతున్న సందర్భంగా, తమ కాళ్ల కింద పునాదులు తొలగిపోతున్న స్థితిలో కేవలం మతోన్మాద నినాదం ఫలిస్తుందా? అనేది ఇప్పుడు మోదీ ముందు నిలబడిన పెద్ద ప్రశ్నలా కనిపిస్తోంది.

ఉత్తర ప్రదేశ్ కేంద్రంగా మొత్తం భారతదేశం గురించి మనం ఆలోచించినప్పుడు అన్ని మతాల్లో బానిసలుగా బతుకుతున్న వారికి సమాన గౌరవ జీవన వ్యవస్థ లేకపోవటం కనిపిస్తోంది. మతోన్మాద నినాదం గౌరవం ఇవ్వదు. ఆచరణ గౌరవం ఇస్తుంది. భారతదేశంలో కుల గణన చేయిస్తామని కాంగ్రెస్ పేర్కొన్నాక ఓబీసీలు ఆలోచనలో పడినట్లే ఉంది. తమకు రిజర్వేషన్ హక్కు వస్తుందని, రిజర్వేషన్ వల్ల విద్య, ఉద్యోగ హక్కులు విస్తృతం అవుతాయని ఓబీసీలు భావించడం ద్వారా భారతదేశంలో అతి పెద్ద సామాజిక తరగతి 'ఇండియా' కూటమి వైపు మొగ్గుతుందనక తప్పదు.

'ఇండియా' కూటమికి నూతన దశ వస్తున్న ఈ తరుణంలో అంబేడ్కర్ నిర్మించిన రాజ్యాంగ సౌధాన్ని ఆయన సూత్రాలతోనే పునర్నిర్మించాలి అనే నూతన భావన ఆ కూటమికి ఉంటే అంబేడ్కర్ కుల నిర్మూలన భావాన్ని, సామ్యవాద భావాల్ని తప్పక ఆచరించవలసిన చారిత్రక సందర్భం ఇది. ఆ పరిణతి మాత్రం 'ఇండియా' కూటమికి వచ్చినట్టు లేదు. అంబేడ్కర్ పరిశ్రమలను జాతీయం చేయండి, భూములను జాతీయం చేయండి అనే ప్రధాన సూత్రాన్ని ముందుకు తెచ్చారు. ఆ యా రాష్ట్రాల ఆధిపత్య కులాల పార్టీ నుంచి వస్తున్న 'ఇండియా' కూటమి ఇంకా సామాజిక, సామ్యవాద భావాలను పరిపుష్టం చేయవలసిన అవసరం ఉంది. విశ్వవిద్యాలయాల్లో చారిత్రక, సాంస్కృతిక శాస్త్ర జ్ఞాన పునరుజ్జీవనానికి కూడా వీరు హామీ ఇవ్వాల్సిన అవసరం ఉంది. మండల కమిషన్ రిపోర్ట్సును, సచార్ కమిటీ రిపోర్ట్సును, రిపబ్లికన్ పార్టీలోని మూల సూత్రాలను 'ఇండియా' కూటమి తీసుకోగలిగితే నిజమైన ప్రత్యామ్నాయంగా నిలబడుతుంది.

భారతదేశం పునర్నిర్మాణంలో ప్రతి సందర్భంలోను డా॥ బి.ఆర్.అంబేడ్కర్ సూత్రాలే నిజమైన ప్రత్యామ్నాయాన్ని అందించగలుగుతున్నాయి. ఈసారైనా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలోని కూటమి ఒక దళిత ప్రధానమంత్రిని ప్రకటించగలిగిన విశాలతను సంతరించుకోవలసిన అవసరం ఉంది. అంతేకాకుండా భారతదేశంలోని రాజకీయ నాయకుల వ్యక్తిత్వ నిర్మాణంలో నైతికత, అవినీతి రహిత, రుజువర్తన జీవన విధానం, మానవతా స్పృహ, సామాజిక విప్లవ భావన, ఆర్థిక స్వావలంబనా దృష్టి అనుసరణీయం అవ్వవలసి ఉంది. రాజకీయ నీతిశాస్త్ర అధ్యయనం ఈనాటి చారిత్రక కర్తవ్యం. అంబేడ్కర్ రాజకీయ జీవన మార్గమే దేశానికి దిక్సూచి.

వ్యాసకర్త దళితోద్యమ నాయకుడు

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

సాంత్వన



బుద్ధ భగవానుని సత్యం, అహింస, శాంతి సందేశం... మొత్తం దేశ సంక్షేమానికి అమూల్యమైన వారసత్వం. బుద్ధ పూర్ణిమ సందర్భంగా బుద్ధ విహార్‌లో ఉన్న బుద్ధ భగవానుని ఆలయాన్ని దర్శించుకున్నాను.

– కన్హయ్య కుమార్, ఈశాన్య ఢిల్లీ కాంగ్రెస్ అభ్యర్థి

జడ్జిమెంట్ డే



మోదీ ప్రభుత్వం పెట్టుబడిదారీ మిత్రుల రూ.16 లక్షల కోట్ల బ్యాంకు రుణాలను మాఫీ చేసింది. కానీ రైతుల వ్యవసాయ రుణంలో ఒక్క రూపాయి కూడా మాఫీ చేయలేదు! అదే 2008లో డాక్టర్ మన్మోహన్ సింగ్ నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వం రూ. 72,000 కోట్ల వ్యవసాయ రుణాలను మాఫీ చేసింది. జూన్ 4 ఎప్పుడా అని ఇప్పుడు ఇండియా ఎదురు చూస్తోంది.

– నరేంద్ర రాజ్‌గోపాలక్, సోషలిస్ట్

నేను చూపిస్తాగా!



కరణ్ థాపర్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ప్రశాంత్ కిశోర్ మాట్లాడుతూ, "ఏదీ... హిమాచల్ ప్రదేశ్‌లో కాంగ్రెస్ ఘోరంగా ఓడిపోతుందని నేను ఎప్పుడన్నానో చూపించండి. అదే నిజమైతే నేను ఈ సర్వేలన్నీ మానేసుకుంటా..." అని అన్నారు. అందుకు సాక్ష్యం ఇదిగో... (కాంగ్రెస్ ఓడిపోతుందని ప్రశాంత్ కిశోర్ పెట్టిన ఒక ట్వీట్‌ను రుజువుగా జత చేస్తూ)

– మొహమ్మద్ జుబైర్, ఫ్యాక్ట్ చెకర్

నాన్‌స్టాప్ వివాదాలు



కేజ్రీవాల్ విడుదల అవటం 'ఆప్'కి కలిసొచ్చింది కానీ, ఒకదాని వెంట ఒకటిగా ఆ పార్టీ వివాదాలలో చిక్కుకుంటోంది. బీజేపీ కారణంగా కొన్ని, దర్యాప్తు సంస్థల వల్ల మరికొన్ని అయితే.. స్వాతీ మలీవాల్ ఉదంతం 'ఆప్' స్వయంకృతాపరాధమే!

– నిధీ రజ్దాన్, కాలమిస్ట్

మితిమీరిన భాషాజ్ఞానం



దక్షిణాసియా సదస్సులలో... ముఖ్యంగా, పశ్చిమాన ఇంగ్లిష్ మాట్లాడే విశ్వవిద్యాలయాలలో చదువుకున్న సంపన్న గోధుమ రంగు చర్మం కలిగిన స్త్రీ, పురుషులు పాల్గొన్న సదస్సులలో నేను చాలా అసౌకర్యంగా కదులుతుంటాను. భాషా సమానత్వ పోరాటానికి తరుణమిది. (యూనివర్సిటీ ఆఫ్ కొలంబియా ప్రొఫెసర్ గాయత్రీ స్పివాక్ జేఎన్‌యూ సదస్సులో పాల్గొన్న ఒకరి ఇంగ్లిష్ ఉచ్చారణను సరిచేయడంపై స్పందిస్తూ...)

– అన్వేషితా దత్తా, సీనియర్ రిసెర్చర్, నార్వే

రాత భారం



భారత్‌కు 'పేపర్ వర్క్ తగ్గింపు చట్టం' అవసరం. అనవసరంగా ఫారాలను పూర్తి చేయించిన అధికారులను బాధ్యులను చేయాలి. అప్పుడు గానీ కొత్తగా కంపెనీలు పెట్టాలనుకొనే వారి భయాలు పోవు.

– సంక్రాంత్ సాను, ఆంట్రప్రెన్యూర్

ఈ పెద్దాళ్ళున్నారే..!



కొన్నిసార్లు పెద్దవాళ్లు కూడా ఇంట్లోని దురుసైన పిల్లవాడిని తిట్టేందుకు సంశయిస్తారు. తిట్టవలసి వస్తే అతడితో పాటు, అల్లరి చేయకుండా బుద్ధిగా ఉండే పిల్లవాడిని కూడా వంతగా తిడతారు. దాంతో దురుసుగా ఉండే పిల్లవాడికి కోపం తెప్పించినట్లవదు. కానీ అది న్యాయమేనా? జీజేపీ విషయంలో ఎన్నికల సంఘం పెద్దరికం కూడా సరిగ్గా ఇలానే ఉంది.

– సుప్రియా శ్రీనతే, కాంగ్రెస్ సోషల్ మీడియా హెడ్

ఇన్ బాక్స్

చరిత్రాత్మకం!

మే 25వ తేదీకి భారత దేశ చరిత్రలో ఒక చారిత్రక ప్రాముఖ్యం ఉన్నది. ఈ రోజే నక్సల్బరీ ఉద్యమం ప్రారంభమైంది. 1920లో ప్రారంభమైన భారత కమ్యూనిస్టు ఉద్యమానికి 1967 మే 25న జరిగిన నక్సల్బరీ తిరుగుబాటు ఒక చరిత్రాత్మక మలుపు. అంతర్జాతీయ, జాతీయ సమస్యలకు సంబంధించి 1964 లో భారత కమ్యూనిస్ట్ పార్టీ (సీపీఐ) నుండి భారత కమ్యూనిస్ట్ పార్టీ–మార్క్సిస్ట్ (సీపీఐఎం) ఏర్పడింది. సీపీఐ(ఎం) నాయకత్వం కొనసాగించిన 'రివిజనిస్ట్ పంథా'కు వ్యతిరేకంగా పశ్చిమ బెంగాల్లో కామ్రేడ్ చారు మజుందార్, కాను సన్యాల్, కోఖన్ మజుందార్ వంటివారి నేతృత్వంలో కమ్యూనిస్ట్ విప్లవకారులూ, ఇతర నాయకులూ సాగించిన సైద్ధాంతిక పోరాటాన్ని 'నక్సలిజం' అన్నారు.

1967లో పశ్చిమ బెంగాల్ యునైటెడ్ ఫ్రంట్ సంకీర్ణ ప్రభుత్వానికి బెంగాల్ కాంగ్రెస్‌తో పాటు, సోషలిస్ట్ యూనిటీ సెంటర్ ఆఫ్ ఇండియా (ఎస్‌యూసీఐ) వంటి ఇతర పార్టీలతో పాటు సీపీఐ (ఎం) ప్రధాన భాగస్వామిగా ఉంది. ఆ మిశ్రమ ప్రభుత్వంలో జ్యోతిబసు ఉప ముఖ్యమంత్రిగా ఉండి ల్యాండ్ రెవెన్యూ వంటి ముఖ్యమైన శాఖలు నిర్వహించారు. 'దున్నే వానిదే భూమి' అనే సూత్రం ఆధారంగా భూసంస్కరణలు అమలు చేయడంలో సీపీఐ (ఎం) తన నిబద్ధతను పూర్తిగా విడనాడడం వలన నక్సల్బరీ పోరాటం జరిగింది. నక్సల్బరీ రైతాంగం ప్రభుత్వ యంత్రాంగాన్ని ప్రతిఘటిస్తూ 1967 మే 23న జోతేదార్ల (భూస్వాముల) నుండి భూమిని బలవంతంగా స్వాధీనం చేసుకోవడం ప్రారంభించారు. మే 25న డార్జిలింగ్ జిల్లాలోని సిలిగురి సబ్ డివిజన్ లోని 'నక్సల్బరీ' బ్లాక్‌లో పోలీసు కాల్పులు జరిగాయి. కొందరు మరణించారు.

భారతదేశ మంతటా ఈ తరహా మిలిటెంట్ రైతాంగ పోరాటాల ఆవిర్భావానికి ఈ సంఘటన ప్రేరణగా నిలిచింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో జరిగిన శ్రీకాకుళ పోరాటం, గోదావరి లోయ ప్రతిఘటన పోరాటం, కొండమొదలు గిరిజన రైతాంగ పోరాటం, ఇంద్రవెల్లి పోరాటం వంటివన్నీ నక్సల్బరీ సంఘటన స్ఫూర్తితో జరిగినవే.

ఈ నేపథ్యంలోనే విప్లవ కమ్యూనిస్టుల సంస్థాగత కార్యక్రమాలతో, ఆల్ ఇండియా కోఆర్డినేషన్ కమిటీ ఆఫ్ కమ్యూనిస్ట్ రివల్యూషనరీస్ 1969 ఏప్రిల్ 22న కలకత్తాలో జరిగిన సమావేశంలో సీపీఐ (ఎమ్ఎల్) ఏర్పాటయింది. అయితే అనేక కారణాల వల్ల సీపీఐ (ఎమ్ఎల్) 1970 నుండి అనేక సమూహాలుగా, వివిధ గ్రూపులుగా విడిపోవడం ప్రారంభమైంది. నేడు నక్సల్బరీ తిరుగుబాటు 57వ వార్షికోత్సవం జరుపుకొంటున్న తరుణంలో, కమ్యూనిస్టులు అందరూ సూత్రబద్ధమైన ఐక్యత గురించి ఆలోచించాలి.

– మన్నవ హరిప్రసాద్, పొలిట్ బ్యూరో సభ్యుడు సీపీఐ (ఎమ్ఎల్) రెడ్ స్టార్

'సంక్షేమ' ఓటు బ్యాంకు పునాదులపై...

అభిప్రాయం



బి.ఎస్. రాములు

తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక అనేక నూతన ప్రణాళికలతో రాష్ట్రం అభివృద్ధి కోసం కృషి జరిగిన మాట వాస్తవం. కొన్ని అదివరకే ఉన్న స్కీమ్‌లను కొత్త పేర్లతో ప్రాచుర్యంలోకి తెచ్చి నిజంగా కొత్తవే అనే భ్రమను కూడా కలిగించిన స్కీములూ ఉన్నాయి. ఒక దశలో విద్యావంతులు, కళాకారులు, మేధావులు, జర్నలిస్టులు, చరిత్రకారులు, విశ్లేషకులు 'దేశానికి దిక్సూచి తెలంగాణ' అని వర్ణించడం జరిగింది. 'కేసీఆర్ విజన్, కేసీఆర్ ఇజం' అనే సిద్ధాంతం కూడా ప్రాచుర్యంలోకి వచ్చింది. నిజానికి ఈ నమూనా మౌలిక స్వభావం అంబేడ్కర్, రామ్మనోహర్ లోహియా, మాజీ ప్రధాని చరణ్‌సింగ్ వంటి మహనీయులు సిద్ధాంత పరంగా ప్రయోగాత్మకంగా ఆచరించి నిగ్గు దేల్చినదే. రూపాయికి కిలో బియ్యం వంటి పథకాలు లోహియా వాదుల వల్లనే దేశవ్యాప్తంగా ప్రచారం పొందాయి. ఇప్పటికీ ఆచరణలో కొనసాగుతోంది. ఉప్పుతో సహా తొమ్మిదింటిని రేషన్ షాపుల్లో ఇవ్వాలనే ప్రతిపాదనలు ఆచరణలోకి రాలేదు. ఒక వ్యక్తికి లేదా కుటుంబానికి సరిపడా బియ్యం లేదా గోదుమలు, పప్పులు, నూనెలు, పసుపు, మిరపపొడి, చింతపండు, చెక్కెర, గ్యాస్ సిలిండర్, సబ్బులు ఇవ్వాలని 1977 జనతా పార్టీ కేంద్ర పాలన కాలం నుంచి చర్చల్లో కొనసాగుతూ వచ్చింది. వంద రూపాయలకే ఇవన్నీ సమకూర్చాలనుకున్నారు. అది ఇప్పటికైనా అమలైతే ఆహార భద్రత, చేకూరుతుంది.



చాలాకాలంగా కొత్త రేషన్ కార్డులు ఇవ్వలేదు. దానివల్ల కొత్తగా ఎదిగి వచ్చిన 10 శాతం యువతరానికి సబ్సిడీలు, ఆరోగ్యశ్రీ కార్డులు వర్తించకుండా పోయాయి. అయితే వృద్ధులకు, మహిళలకు, బీడీ కార్మికులకు, ఒంటరి మహిళలకు, దివ్యాంగులకు, బోదకాలు ఉన్నవారికి, దీర్ఘకాలిక రోగాలతో బాధపడేవారికి ఆసరా పథకాలతో నెలకు రూ. 2,000 లకు పైగా ఇవ్వడం వల్ల ప్రజల జీవితంలో వెలుగులు ప్రసరించాయి. ఇలా ఇంటికి ఒక్కరి చొప్పున 42 లక్షల మంది లబ్ధి పొందుతున్నారు. ఒక ఇంటిలో కనీసం 3 ఓట్లుంటాయి. అలా కోటి 25 లక్షల ఓట్లు టీఆర్ఎస్‌కు కృతజ్ఞతలతో రిజర్వ్ అయిపోయాయి. అలాగే కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ స్కీమ్‌లతో ఒక పెళ్ళితో 50 ఓట్లు టీఆర్ఎస్‌కు కృతజ్ఞతతో రిజర్వయిపోయాయి. అలా 50 లక్షల ఓట్ల బ్యాంకు స్థిరపడింది. వెయ్యికి పైగా గురుకుల పాఠశాలల్లో ఐదున్నర లక్షలమంది విద్యార్థులు చదువుకుంటున్నారు. వీరంతా గొప్ప సామాజిక సోషలిస్టు సమాజ నిర్మాణంలో భాగంగా ఎదుగుతూ వస్తున్నారు. వీరి కుటుంబాల నుండి మరో 30 లక్షల ఓటు బ్యాంకు స్థిరపడింది. రైతుబంధుతో 70 లక్షల ఓటు బ్యాంకుగా రూపొందింది. కులవృత్తులకు చేయూతతో 20 లక్షల మందితో బ్యాంకు పెరిగింది. రెండుసార్లు ఈ ఓటు బ్యాంకుతో మెజారిటీ ప్రజలు టీఆర్ఎస్‌కే ఓటు వేశారు. మూడవసారి 2023 డిసెంబర్ ఎన్నికల్లో వచ్చిన ఓట్లూ ఈ ఓటు బ్యాంకు ద్వారా వచ్చినవేనని టీఆర్ఎస్ మరిచిపోరాదు.

ఈ ఓటు బ్యాంకును తమవైపు తిప్పుకునేందుకు కర్నాటకలో, తెలంగాణలో కాంగ్రెస్ చేసిన మేధా మథనం ఇంతా అంతా కాదు. అలా ఐదు గ్యారంటీలు, ఆరు గ్యారంటీలు వంటి కొత్త నినాదాలు, కొత్త కార్యక్రమాలు ముందుకు వచ్చాయి. గెలిచారు. గెలిచిన తర్వాత పై ఓటు బ్యాంకు లబ్ధిదారులకు మరింత లబ్ధి చేకూరుతుంది కనుక అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీకి ఆ ఓట్లు బదిలీ అవుతాయి. అలా వారి పార్లమెంట్ సీట్లు పెరగనున్నాయి. గత పదేళ్ళలో టీఆర్ఎస్ ప్రభుత్వం బీసీ, ఎస్సీ, ఎస్టీల అభివృద్ధి ప్రణాళికలను అస్తవ్యస్తంగా మార్చింది. బీసీ కార్పొరేషన్, ఎస్సీ, కార్పొరేషన్, ఆ యా కులవృత్తి కార్పొరేషన్లను పడుకోబెట్టింది. కొత్త పేర్లతో ముందుకు వచ్చింది. జనాభా దామాషా ప్రకారం బీసీలకు మొత్తం బడ్జెట్‌లో సగాన్ని కేటాయించి రకరకాల స్కీములను అమలు చేయడం అవసరం. మహిళలకు ఉచిత బస్సు ఎంత గొప్ప మలుపు తెచ్చిందో... అలా బీసీల పథకాలు వారి జీవితాల్లో అంత గొప్ప మలుపు తీసుకురావడం అవసరం.

వ్యాసకర్త సామాజిక అంశాల రచయిత

అపకారికి ఉపకారం

అపకారికి ఉపకారం చేసేవాళ్లు నిజంగా గొప్పవాళ్ళు. దీనికి మనిషిలో ఎంతో సహనం, శాంతం ఉండాలి. పాండవులు జూదంలో ఓడి అరణ్య వాసం చేస్తున్నప్పుడు దుర్యోధనాదులు తమ సంపదనూ, ఆనందాన్నీ చూపి వారిని బాధించాలనీ, అసూయాగ్రస్తులను చేయాలనీ అనుకుంటారు. తమ పరివారం, రాణులతో సహా ద్వైతవనంలో వాసం చేస్తున్న పాండవుల సమీప ప్రాంతాలకు వెళతారు. అక్కడొక దివ్య భవనం కట్టించటానికి దుర్యోధనుడు పని వారిని నియోగించి పని ప్రారంభిస్తాడు. అతడు, భవనం కట్టిస్తున్న ఆ స్థలం చిత్రసేనుడనే గంధర్వ రాజుది. తమ అనుమతి లేకుండా భవనం నిర్మిస్తున్నారని తెలిసి చిత్రసేనుడు సైన్యంతో వచ్చి దుర్యోధనుని బంధించి గంధర్వలోకానికి తీసుకు వెళుతుంటాడు.



జ్యోతిర్మయం

చిత్రసేనుడు అర్జునుని మిత్రుడు. ధర్మరాజు తమ తమ్ముడైన దుర్యోధనుడు బందీ కావటం చూసి బాధపడి, అర్జునునితో దుర్యోధనుని విడిపించి తీసుకురమ్మంటాడు. చిత్రసేనునితో మాట్లాడమంటాడు. అర్జునుడు, భీముడు 'మనల్ని పరాభవించాలని వచ్చి అతడే అవమానాల పాలయ్యాడు. మంచి పనైంది. అతనికి సాయం చేయకూడదు' అంటారు. అప్పుడు ధర్మరాజు, 'దుర్యోధనుడు మన సోదరుడు. అతనికి అవమానం జరిగితే చూస్తూ ఊరుకోకూడదు. అర్జునా! నీవు వెళ్లకపోతే నేనే వెళ్లి చిత్రసేనునితో మాట్లాడతా'నని బయలుదేరుతాడు. దీంతో ధర్మరాజు మాటకు అర్జునుడు విలు విస్తూ... వెళ్లి దుర్యోధనుని విడిపిస్తాడు. చిన్నతనం నుండి తమతో వైరం పూని, ఎన్నో అపకారాలు చేసినా, కపట జూదంతో వనాలకు పంపినా, ధర్మరాజు అవేం మనసులో పెట్టుకోకుండా దుర్యోధనునికి మేలే చేశాడు. ఈ గుణాన్ని అలవరచుకుంటే మనిషి నిజంగా మనీషి అవుతాడు.

– డా॥ చెంగల్వ రామలక్ష్మి

వెబ్ కాస్టింగ్ హైజాక్!

చంద్రబాబు చేతిలో ఆన్, ఆఫ్ బటన్లు • కమాండ్ కంట్రోల్ సెంటర్లలో టీడీపీ కార్యకర్తలు

ప్రైవేట్ ఏజెన్సీ ముసుగులో దారుణ అక్రమాలు

- ఈసీ చేతిలో భద్రంగా ఉండాల్సిన సమాచారం చినబాబు చేతికి
- విదేశాల నుంచి వీడియోలు పోస్ట్ చేసిన లోకేశ్..



వెబ్ కాస్టింగ్‌పై 'పచ్చ ముఠా' పెత్తనం

సాక్షి, అమరావతి: ఎన్నికల నిర్వహణలో అత్యంత కీలకమైన వెబ్ కాస్టింగ్ ప్రక్రియ మొత్తాన్ని టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు ముఠా హైజాక్ చేసినట్లు తేటతెల్లం కావడం నివ్వెరపరుస్తోంది. ప్రజాస్వామ్య విలువలను పరిరక్షించాల్సిన ఎన్నికల కమిషన్ (ఈసీ) పూర్తి 'పచ్చ'పాతంతో పావుగా మారినట్లు వెల్లడవుతోంది. ఈసీ చేతిలో అత్యంత భద్రంగా ఉండాల్సిన వెబ్ కాస్టింగ్ సమాచారం, వీడియోలు టీడీపీ నేతలకు చేరిపోవడం దీన్ని నిర్ధారిస్తోంది. విదేశాల్లో గడుపుతున్న నారా లోకేశ్ పోలింగ్ బూత్ వీడియోలను ఎడిట్ చేసి విడుదల చేయడం ఏమిటి? ఏ అధికారి ద్వారా అవి లోకేశ్‌కు చేరిపోయాయి? అనే ప్రశ్నలకు ఈసీ సూటిగా జవాబు చెప్పకుండా దాటవేత వైఖరి అనుసరించడం పలు అనుమానాలకు దారితీస్తోంది. వాటిని తాము విడుదల చేయలేదని, దర్యాప్తు సమయంలో అవి బయటకు వెళ్లిపోయి ఉండవచ్చంటూ అత్యంత బాధ్యతారాహిత్యంగా వ్యాఖ్యానించడం ప్రజాస్వామ్య వాదులను నిర్ఘాంతపరుస్తోంది. గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠితోపాటు పోలింగ్ రోజు పల్నాడు కలెక్టర్‌గా ఉన్న ఎల్.శివశంకర్, ఎస్పీ గరికపాటి బిందు మాధవ్ నుంచి క్షేత్రస్థాయిలో డీఎస్పీలు, సీఐలు, ఎస్సైల వరకూ అందరూ టీడీపీ అక్రమాలకు అండగా నిలిచినా ఈసీ ప్రేక్షక పాత్ర వహించింది. ఇదే అదునుగా పచ్చ ముఠాలు ఎన్నికల వేళ భయానక వాతావరణాన్ని సృష్టించాయి. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు, మహిళలు వైఎస్సార్ సీపీకి అండగా నిలవటాన్ని చూసి సహించలేక ఓటర్లు పోలింగ్ బూత్‌ల వద్దకు రాకుండా భయభ్రాంతులకు గురి చేశాయి. ఇంత చేసినా గెలవలేమనే నిస్పృహతో అలజడులు సృష్టిస్తూ ఓట్ల లెక్కింపు రోజు మరోసారి విధ్వంసాలకు తెగబడేలా పథకాన్ని రూపొందించాయి. పోలింగ్ రోజు, అనంతరం చోటు చేసుకున్న పరిణామాలన్నీ వ్యవస్థలు చంద్రబాబు సేవలో తరిస్తున్నాయనే వాదనకు బలం చేకూరుస్తున్నాయి. ఎన్నికల నిర్వహణను అపహాస్యం చేస్తూ ప్రజాస్వామిక వ్యవస్థకు అప్రతిష్ఠ వాటిల్లేలా వ్యవహరిస్తున్న ఈసీ వివాదాస్పద వైఖరిపై సర్వత్రా విభ్రాంతి వ్యక్తమవుతోంది.

ప్రశాంతంగా పోలింగ్ నిర్వహణకు అత్యంత కీలకమైన వెబ్ కాస్టింగ్ ప్రక్రియను చంద్రబాబు ముఠా హైజాక్ చేయడం విస్మయం కలిగిస్తోంది. వెబ్ కాస్టింగ్‌పై ఈసీకి నియంత్రణ లేదా? ఉద్దేశపూర్వకంగానే టీడీపీ వర్గీయులైన ప్రైవేట్ వ్యక్తులకు అందుబాటులోకి తెచ్చిందా? అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. రాష్ట్రంలోని 46,389 ఎన్నికల కేంద్రాలకుగానూ 31,380 కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ ద్వారా పోలింగ్ ప్రక్రియను రికార్డ్ చేశారు. అత్యంత సమస్యాత్మక 14 నియోజకవర్గాల్లోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో లోపల, బయట వెబ్ కాస్టింగ్ ద్వారా రికార్డ్ జరిగింది. ఇలాంటి వెబ్‌కాస్టింగ్ వ్యవస్థను చంద్రబాబు ముఠా తమ గుప్పిట్లోకి తీసుకుంది. మాచర్ల నియోజకవర్గం రెంటచింతల మండలం పాల్వాయి గేటు పోలింగ్ కేంద్రంలో వెబ్ కాస్టింగ్ వీడియో రికార్డింగ్ అంటూ నారా లోకేశ్ తన ఎక్స్ (ట్విట్టర్) ఖాతాలో పోస్టు చేయడం అందుకు నిదర్శనం. తాము ఆ వీడియోను విడుదల చేయలేదని ఈసీ చెబుతోంది. అలాంటప్పుడు ఎలా లీక్ అయింది? వెబ్ కాస్టింగ్ సమాచారం బయటకు పొక్కడం ఈసీ నిబద్ధతను ప్రశ్నార్థకంగా మారుస్తోంది. నిబంధనల ప్రకారం వెబ్ కాస్టింగ్ పూర్తిగా ఈసీ నియంత్రణలో ఉంటుంది. వెబ్ కాస్టింగ్ ద్వారా రికార్డ్ అయ్యే వీడియోలపై జిల్లా ఎన్నికల అధికారి అయిన కలెక్టర్‌కు సంపూర్ణ నియంత్రణ ఉంటుంది. వెబ్‌కాస్టింగ్ రికార్డింగ్ కోసం ప్రైవేట్ ఏజెన్సీలను వినియోగించారు. పోలింగ్ తరువాత వెబ్ కాస్టింగ్ హార్డ్ కాపీని ప్రైవేట్ ఏజెన్సీ కలెక్టర్‌కు అందచేస్తుంది. ప్రైవేట్ ఏజెన్సీ ఉద్యోగుల ముసుగులో టీడీపీ వర్గీయులు కమాండ్ కంట్రోల్ సెంటర్‌లోకి చొరబడ్డారు.

పల్నాడులో పచ్చ ముఠాలు

పల్నాడు జిల్లా పాల్వాయి గేటు పోలింగ్ కేంద్రంలో మొత్తం 23 గంటల రికార్డింగ్‌లో ఎడిట్ చేసిన రెండు నిమిషాల వీడియో క్లిప్ మాత్రమే విడుదల కావడం వెనుక పచ్చ కుట్ర ఉన్నట్లు స్పష్టమవుతోంది. పోలింగ్‌కు ముందు చంద్రబాబు ఒత్తిడితో ఈసీ నియమించిన గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి, పల్నాడు ఎస్పీ గరికపాటి బిందు మాధవ్‌తోపాటు పల్నాడు కలెక్టర్‌గా ఉన్న ఎల్.శివశంకర్ ఈ పన్నాగంలో పాత్రధారులుగా మారారని వెల్లడవుతోంది. పల్నాడు జిల్లా కమాండ్ కంట్రోల్ నుంచే వెబ్ కాస్టింగ్ రికార్డింగ్‌ను పెన్ డ్రైవ్‌లో కాపీ చేసి లీక్ చేసినట్లు నిపుణులు చెబుతున్నారు. ఏడు పోలింగ్ కేంద్రాల్లో టీడీపీ రౌడీమూకలు ఈవీఎంలను ధ్వంసం చేస్తే అవి ఒక్కటి కూడా బయటకు రాలేదు. ఎమ్మెల్యే పిన్నెల్లి ఉన్నట్లు చెబుతున్న వీడియో మాత్రమే లీక్ కావడం వెనుక చంద్రబాబు కనుసన్నల్లో వ్యవహరించే అధికారులు కీలక పాత్ర పోషించినట్లు తెలుస్తోంది.

'స్వామి'భక్తి... 7 ఈవీఎంలు ధ్వంసం

రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గిన ఈసీ పల్నాడులో క్షేత్రస్థాయిలో పట్టు, అవగాహన ఉన్న పోలీసు అధికారులను ఎన్నికల ముందు ఆకస్మికంగా బదిలీ చేసింది. గుంటూరు రేంజ్ ఐజీ పాలరాజు, పల్నాడు ఎస్పీ రవిశంకర్‌రెడ్డిని పోలింగ్‌కు ముందు చంద్రబాబు, పురందేశ్వరి ఒత్తిడితో బదిలీ చేయడం గమనార్హం. అంతేకాకుండా చంద్రబాబు సూచనల మేరకు పురందేశ్వరి సమర్పించిన జాబితా ప్రకారం గుంటూరు రేంజ్ ఐజీగా సర్వశ్రేష్ఠ త్రిపాఠి, ఎస్పీగా గరికపాటి బిందుమాధవ్‌ను నియమించారు. అత్యంత వివాదాస్పదుడైన నారాయణస్వామిని కారంపూడి సీఐగా నియమించారు. టీడీపీ రౌడీమూకలు వైఎస్సార్‌సీపీ నేతలపై దాడులు చేస్తున్నా, పోలింగ్ కేంద్రాల్లో అక్రమాలకు పాల్పడుతున్నా పోలీసు యంత్రాంగం చర్యలు తీసుకోకుండా నారాయణ స్వామి ప్రేక్షక పాత్ర పోషించారు. అదే సమయంలో వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలపై మాత్రం దాడులతో విరుచుకుపడ్డారు. సీఐ నారాయణ స్వామి పరిధిలోని ఏడు పోలింగ్ కేంద్రాల్లో ఈవీఎంలను టీడీపీ గూండాలు ధ్వంసం చేయడం గమనార్హం. పోలింగ్ సందర్భంగా హింసాత్మక సంఘటనలకు బాధ్యులుగా పేర్కొంటూ కొందరు పోలీసు అధికారులను ఈసీ బదిలీ చేయగా సీఐ నారాయణస్వామి పరిధిలో ఏడు ఈవీఎంలు ధ్వంసమైనా ఆయనపై చర్యలు తీసుకోకుండా ఐజీ త్రిపాఠి అండగా నిలిచారు. కౌంటింగ్ రోజు టీడీపీ దౌర్జన్యాలకు కొమ్ము కాసేందుకే ఆయన్ను కొనసాగిస్తున్నట్లు స్పష్టమవుతోంది.

పిన్నెల్లిపై కుట్రపూరిత కేసు..

ఐజీ త్రిపాఠి ఆదేశాలతో సీఐ నారాయణ స్వామి పూర్తిగా చంద్రబాబు సేవలో తరిస్తున్నారు. మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డిపై కుట్రపూరితంగా గురువారం రాత్రి కేసు నమోదు చేయడమే అందుకు తార్కాణం. పిన్నెల్లిపై జూన్ 6 వరకు ఎలాంటి చర్యలు తీసుకోవద్దని హైకోర్టు ఆదేశించగా అప్పటికప్పుడు మరో తప్పుడు కేసు నమోదు చేయడం నారాయణ స్వామి బరితెగింపునకు నిదర్శనంగా నిలుస్తోంది. పది రోజుల క్రితం ఘర్షణకు సంబంధించి నమోదైన కేసులో పిన్నెల్లి సోదరులను తాజాగా నిందితులుగా చేర్చడం గమనార్హం.

పవన్, బాలయ్య ప్రత్యేకమా?

పోలింగ్‌కు ఉన్నతాధికారులను బదిలీ చేసిన ఈసీ.. టీడీపీ, జనసేన అగ్రనేతలు యథేచ్ఛగా వ్యవహరించినా చోద్యం చూసింది. నిబంధనల ప్రకారం ఓటర్లు, పోలింగ్ సిబ్బంది, ఏజెంట్లను మాత్రమే పోలింగ్ బూత్‌లోకి అనుమతిస్తారు. ఓటు హక్కులేని వారు పోలింగ్ బూత్‌లోకి వెళ్లకూడదు. ఈ నిబంధన జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ సతీమణికి వర్తించదని ఈసీ భావించినట్టుంది. మంగళగిరి నియోజకవర్గంలోని పోలింగ్ బూత్ నెంబరు 197లో పవన్ కల్యాణ్ ఓటు హక్కు వినియోగించుకున్నారు. అయితే ఓటు హక్కులేని తన భార్య అన్నా లెజినోవాతో సహా ఆయన పోలింగ్ కేంద్రంలోకి వెళ్లారు. దర్జాగా ఫొటోలు, వీడియోలకు ఫోజులు ఇచ్చారు. దీనిపై ఈసీ కనీసం స్పందించలేదు. పోలింగ్ కేంద్రాల వద్ద పార్టీ జెండాలు, కండువాలు, కరపత్రాలు ప్రదర్శించకూడదు. హిందూపురంలో టీడీపీ అభ్యర్థి నందమూరి బాలకృష్ణ మాత్రం మెడలో పార్టీ కండువా ధరించి వెళ్లి మరీ ఓటు వేశారు. ఆ ఫొటోలు, వీడియోలు మీడియాలో వచ్చినా ఈసీ నోరు మెదపలేదు.

మత ప్రాతిపదికన ముస్లింలకు రిజర్వేషన్లు ఇవ్వలేదు

రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ




సాక్షి, హైదరాబాద్: తెలుగు రాష్ట్రాల్లో కల్పించిన ముస్లింల రిజర్వేషన్లు మత ప్రాతిపదికన ఇచ్చినవి కావని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ చెప్పారు. ముస్లింలకు మత ప్రాతిపదికన రిజర్వేషన్లు అమలవుతున్నాయని ప్రధాని మోదీ, కేంద్ర మంత్రి అమిత్‌షాలు అబద్ధాలు వల్లె వేస్తున్నారని, రాష్ట్రంలో సాంఘికంగా, ఆర్థికంగా వెనుకబాటుకు గురైన కొందరు ముస్లింలకు మాత్రమే రిజర్వేషన్లు అమలవుతున్న విషయాన్ని అందరూ గుర్తించాలని కోరారు. ఇలాంటి వ్యాఖ్యలను ఇంకా కొనసాగిస్తే ప్రధాని మోదీపై పరువునష్టం దావా వేస్తానని చెప్పారు. శుక్రవారం ఆయన గాంధీభవన్‌లో విలేకరులతో మోదీ వ్యాఖ్యలు దేశంలోని హిందూ, ముస్లింల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టడమేనని అన్నారు. ముస్లింలకు రిజర్వేషన్ల కల్పన వెనుక అనేక అధ్యయనాలు, నివేదికలు ఉన్నాయని, వాటి ఆధారంగానే రిజర్వేషన్లు అమలయ్యాయని చెప్పారు. ఇందుకు సంబంధించిన అన్ని వివరాలతో కూడిన డాక్యుమెంట్లు, నివేదికలు, కోర్టు తీర్పుల వివరాలను ఉటంకిస్తూ ప్రధాని మోదీకి లేఖ రాశానని, ఆ లేఖ చదివిన తర్వాతయినా ఆయన తన వైఖరి మార్చుకోవాలని షబ్బీర్‌అలీ పేర్కొన్నారు.

పీకేవన్నీ తప్పుడు అంచనాలే

గతేడాది జరిగిన ఐదు ఎన్నికల్లో ప్రశాంత్ కిశోర్ చెప్పినదానికి వ్యతిరేకంగా ఫలితం

- ప్రఖ్యాత జర్నలిస్టు కరణ్‌థాపర్ ఇంటర్వ్యూలో అడ్డంగా దొరికిపోయిన పీకే



సాక్షి, అమరావతి: ఎన్నికల ఫలితాలపై ప్రశాంత్ కిశోర్(పీకే) అంచనా తప్పుతోంది. దానిని కప్పిపుచ్చుకునేందుకు 'ది వైర్' వెబ్‌సైట్, చానల్ కోసం ప్రఖ్యాత జర్నలిస్టు కరణ్‌థాపర్ చేసిన ఇంటర్వ్యూలో ఆయన చేసిన ప్రయత్నాలన్నీ బెడిసికొట్టాయి. హిమాచల్‌ప్రదేశ్ అసెంబ్లీకి 2022 నవంబర్‌లో జరిగిన ఎన్నికల్లో బీజేపీ గెలుస్తుందని.. తెలంగాణ అసెంబ్లీకి 2023 నవంబర్‌లో జరిగిన ఎన్నికల్లో బీఆర్‌ఎస్ గెలుస్తుందని అప్పట్లో పీకే జోస్యం చెప్పారు. అయి తే హిమాచల్‌ప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీ గెలిచి అధికారంలోకి వచ్చింది. ఇదే అంశాన్ని కరణ్‌థాపర్ ఎత్తిచూపుతూ.. సార్వత్రిక ఎన్నికల్లో 300కు పైగా లోక్‌సభ స్థానాలను బీజేపీ కైవసం చేసుకుంటుందని ఏ ప్రాతిపదికన చెబుతున్నారని నిలదీశారు. దీనిపై పీకే స్పందిస్తూ తాను హిమాచల్‌ప్రదేశ్‌లో కాంగ్రెస్, తెలంగాణలో బీఆర్‌ఎస్ గెలుస్తుందని చెప్పలేదని బుకాయించారు. కానీ అప్పట్లో పీకే చెప్పిన జోస్యంపై జాతీయ మీడియా సంస్థలు ప్రచురించిన వార్తల క్లిప్పింగ్‌లను కరణ్‌థాపర్ చూపడంతో ఆయన తెల్లబోయారు. పత్రికల్లో వచ్చే వార్తలకు విశ్వసనీయత ఉండదంటూ తప్పించుకునేందుకు యత్నించగా... ఇదే అంశంపై అప్పట్లో పీకే స్వయంగా చేసిన ట్వీట్లను ఎత్తిచూపారు. దీంతో అడ్డంగా దొరికిపోయిన పీకే ఉక్రోషంతో ఊగిపోయారు. మీరు జర్నలిస్టే కాదంటూ కరణ్‌థాపర్‌పై విరుచుకుపడ్డారు.

బిహార్‌లో రాజకీయాలు కలసి రాకే...

పశ్చిమ బంగా ఎన్నికల తర్వాత ఇక ఎన్నికల వ్యూహకర్తగా పని చేయబోనంటూ ప్రతిజ్ఞ చేసిన పీకే ఐప్యాక్ నుంచి తప్పుకున్నారు. బిహార్‌లో రాజకీయ అరంగేట్రం చేశారు. తొలుత బిహార్ సీఎం నితీష్‌కుమార్ పంచన చేరి జేడీ(యూ) కీలక నేతగా చలామణి అయ్యారు. కొన్నాళ్లకు ఆయనతో విభేదించి సొంత పార్టీ స్థాపించి బిహార్‌లో పాదయాత్ర చేశారు. దానివల్ల ఏమాత్రం ప్రయోజనం లేకపోవడంతో రాజకీయంగా ఇక మనుగడ సాగించలేమని తెలిసి డబ్బుల కోసం ఎవరు ప్యాకేజీ ఇస్తే వారికి అనుకూలంగా జోస్యం చెప్పడం అలవాటు చేసుకున్నారు. ఈ క్రమంలోనే చంద్రబాబు పంచన చేరి ఆ పార్టీకి అనుకూలంగా జోస్యం చెబుతూ వస్తున్నారు.

ఏపీలోనూ ఆయన అంచనాలు తారుమారే

గతేడాది చివర్లో తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, మిజోరాం శాసనసభల ఎన్నికల్లోనూ పీకే జోస్యాలు చెప్పారు. తెలంగాణలో బీఆర్‌ఎస్ గెలుస్తుందని ఆయన చెబితే కాంగ్రెస్ గెలిచింది. మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్‌లలో కాంగ్రెస్ గెలుస్తుందని చెబితే ఆ మూడు రాష్ట్రాల్లోనూ బీజేపీ అధికార పీఠం అధిష్ఠించింది. ఈ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్‌లోనూ పీకే జోస్యం తప్పడం ఖాయమని, గత ఎన్నికల్లో టీడీపీ తరఫున వకాల్తా పుచ్చుకున్న లగడపాటి మాదిరిగానే ప్రశాంత్ కిశోర్ కూడా ఫలితాలు వెలువడ్డాక మాయం కావడం తథ్యమని రాజకీయ పరిశీలకులు విశ్లేషిస్తున్నారు.

బాబు పలుకులే చెబుతూ..

ప్రశాంత్ కిశోర్ ప్రస్తుతం ఏ పార్టీకీ ఎన్నికల వ్యూహకర్తగా పనిచేయడం లేదన్న మాటల్లో ఎంతమాత్రం నిజం లేదని పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ ఏప్రిల్ 12న ఓ చానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో కుండబద్దలు కొట్టారు. ఇప్పుడు ఆయన ఆంధ్రప్రదేశ్‌లో టీడీపీ–బీజేపీ కూటమికి ఎన్నికల వ్యూహకర్తగా పనిచేస్తున్నారనీ, అందుకే ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబుకు, పశ్చిమ బెంగాల్‌లో బీజేపీకి అనుకూలంగా జోస్యం చెబుతున్నారని ఆమె స్పష్టం చేశారు. దీనిని బట్టి చంద్రబాబు విసిరిన ప్యాకేజీ తీసుకుని టీడీపీకి ఎన్నికల వ్యూహకర్తగా పీకే పనిచేస్తున్నట్లు స్పష్టమవుతోంది. అందుకే ఆయన బాబే గెలుస్తారంటూ అవకాశం వచ్చినప్పుడల్లా చెబుతున్నట్టు తేటతెల్లమైంది. స్కిల్ స్కామ్‌లో చంద్రబాబు అరెస్టుతో భయపడిన నారా లోకేష్ ఢిల్లీలో తలదాచుకున్న సమయంలో పీకేను కలిశారు. తమకు ఎన్నికల వ్యూహకర్తగా పని చేయాలని వేడుకున్నారు. ఈ క్రమంలో చంద్రబాబు బెయిల్‌పై విడుదలయ్యాక పీకేను ఢిల్లీ నుంచి హైదరాబాద్‌కు, అక్కడి నుంచి విజయవాడకు సీఎం రమేష్ స్పెషల్ ఫ్లైట్‌లో తీసుకొచ్చారు. ఉండవల్లిలో చంద్రబాబుతో సమావేశం ఏర్పాటు చేశారు.

ఆరుగురు మైనింగ్ అధికారులపై వేటు

- సొంత శాఖలకు తిప్పి పంపుతూ ఉత్తర్వులు జారీ
- వారిలో ముగ్గురు జీఎంలు, మరో ఇద్దరు ప్రాజెక్టు ఆఫీసర్లు
- వారం క్రితం మైనింగ్ కార్యదర్శి ఎక్కా ఆకస్మిక బదిలీ
- గవర్నర్ మాజీ కార్యదర్శి సురేంద్ర మోహన్‌కు బాధ్యతలు
- మైనింగ్ శాఖపై సీఎం రేవంత్ సమీక్ష నేపథ్యంలో చర్యలు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ గనులు, భూగర్భ శాఖ పరిధిలోని తెలంగాణ ఖనిజాభివృద్ధి సంస్థ (టీజీఎండీసీ)లో డిప్యుటేషన్‌పై పనిచేస్తున్న ఆరుగురు అధికారులను తిరిగి సొంత శాఖలకు బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. దీర్ఘకాలంగా ఒకేచోట పనిచేయడం, అవినీతి ఆరోపణలు రావడంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. పంచాయతీరాజ్ శాఖలో డిప్యూటీ సీఈఓలు అయిన దేవేందర్‌రెడ్డి, ప్రశాంతి, ఆడిట్ విభాగం అధికారి పాండురంగారావు ఇన్నాళ్లూ టీజీఎండీసీలో జనరల్ మేనేజర్ హోదాలో పనిచేశారు. అలాగే మైన్స్ అండ్ జియాలజీ విభాగానికి చెందిన దశరథం నాయక్, శ్రీనివాస్, రెవెన్యూ విభాగానికి చెందిన తోట శ్రీధర్ టీజీఎండీసీలో ప్రాజెక్టు అధికారులుగా వ్యవహరించారు.

మళ్లీ 2015కు ముందున్న పరిస్థితి..

2015లో టీఎస్‌ఎండీసీ (ప్రస్తుతం టీజీఎండీసీ)లో నూతన ఇసుక విధానం అమల్లోకి వచ్చింది మొదలు అనేక మంది ఇతర శాఖలకు చెందిన అధికారులు డిప్యుటేషన్‌పై పనిచేశారు. ప్రధానంగా సహకార శాఖ నుంచి టీఎస్‌ఎండీసీలో డిప్యుటేషన్‌పై పనిచేసిన కొందరు అధికారులపై కూడా గతంలో అవినీతి ఆరోపణలు వచ్చాయి. దీంతో గత ప్రభుత్వం ఆరోపణలు వచ్చిన అధికారులను బదిలీ చేసి వారి స్థానంలో ఇతర శాఖల నుంచి డిప్యుటేషన్‌పై కొందరు అధికారులకు టీఎస్‌ఎండీసీలో పోస్టింగులు ఇచ్చింది. ప్రస్తుత బదిలీలతో 2015కు ముందున్న పరిస్థితి టీజీఎండీసీలో నెలకొంటుందని అధికారులు చెబుతున్నారు. ఇకపై పూర్తి పనిభారం టీజీఎండీసీ అధికారులపైనే పడుతుందని భావిస్తున్నారు.

గనుల శాఖ కార్యదర్శి జీఏడీకి రిపోర్ట్..

రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ఈ ఏడాది జనవరి 3న గనులు, భూగర్భ వనరుల విభాగం ముఖ్య కార్యదర్శిగా 1995 బ్యాచ్ ఐఏఎస్ అధికారి బెనహర్ మహేశ్ దత్ ఎక్కా నియమితులయ్యారు. కానీ ఐదు నెలలు తిరగక ముందే ఈ నెల 17న ఆయనపై ప్రభుత్వం బదిలీ వేటు వేసింది. ఆయన్ను సాధారణ పరిపాలన విభాగంలో (జీఏడీ)లో రిపోర్టు చేయాల్సిందిగా ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన స్థానంలో గతంలో గవర్నర్ కార్యదర్శిగా పనిచేసిన సురేంద్ర మోహన్‌కు పోస్టింగ్ ఇచ్చింది. రాష్ట్ర ఖజానాకు ఆదాయం సమకూర్చే శాఖలపై సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష నిర్వహించిన మర్నాడే ఎక్కా బదిలీ కావడం చర్చనీయాంశమైంది. అక్రమ మైనింగ్, ఇసుక అక్రమ రవాణాను నియంత్రించడంలో అధికారుల వైఫల్యంపై ఈ సమీక్షలో సీఎం ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం.



ప్రాంతీయ సవాల్!

హరియాణాలో ఆసక్తికర పోరు ● 10 లోక్‌సభ స్థానాలకూ నేడే పోలింగ్

ఫైనాన్షియల్, కార్పొరేట్ హబ్‌గా దేశ ఆర్థిక ముఖచిత్రంలో కీలకమైన హరియాణాలో సార్వత్రిక ఎన్నికల సంగ్రామానికి రంగం సిద్ధమైంది. ఇక్కడి మొత్తం 10 లోక్‌సభ స్థానాలకూ ఆరో విడతలో భాగంగా శనివారం పోలింగ్ జరగనుంది. గత ఎన్నికల్లో క్లీన్‌స్వీప్ చేసిన బీజేపీకి వాటిని నిలబెట్టుకోవడం సవాలుగా మారింది. కాంగ్రెస్, ఆప్‌లతో కూడిన ఇండియా కూటమి నుంచి గట్టి పోటీ ఎదుర్కొంటోంది. కాంగ్రెస్ 9 చోట్ల, ఆప్ ఒక్క స్థానంలో బరిలో ఉన్నాయి. ప్రాంతీయ పార్టీలు కూడా గట్టిగా సవాలు విసురుతున్నాయి. హరియాణాలోని కీలక స్థానాలపై ఫోకస్...

- సాక్షి, నేషనల్ డెస్క్



కురుక్షేత్ర.. నువ్వా నేనా!

మోదీ వేవ్‌లో 2014లో ఇక్కడ తొలిసారి కాషాయ జెండా ఎగిరింది. 2019లో రాష్ట్ర బీజేపీ చీఫ్ నాయబ్ సింగ్ సైనీ భారీ మెజారిటీతో నెగ్గారు. ఆయన సీఎం కావడంతో ఈసారి పారిశ్రామికవేత్త నవీన్ జిందాల్‌కు బీజేపీ టికెటిచ్చింది. ఆప్ అభ్యర్థి సుశీల్ కుమార్ గుప్తాకు విద్యా, వ్యాపారవేత్తగా మంచి పేరుంది. ఐఎన్ఎల్డీ ప్రధాన కార్యదర్శి అభయ్ సింగ్ చౌతాలా తొలిసారి లోక్‌సభ బరిలో దిగారు. రైతు ఆందోళనల సెగ బీజేపీకి గట్టిగా తగులుతోంది. జననాయక్ జనతా పార్టీ (జేజేపీ) ఎన్డీఏ కూటమి వీడి సొంతంగా పోటీ చేస్తుండటం కూడా కమలనాథులకు ప్రతికూలాంశమే. ఆ పార్టీ నుంచి పలరామ్ సైనీ బరిలో ఉన్నారు. బీజేపీకి ఎదురుగాలి వీస్తోందని పరిశీలకులు చెబుతున్నారు.

హిసార్... ప్రాంతీయ పార్టీల అడ్డా

రాష్ట్రంలో చక్రం తిప్పుతున్న ప్రాంతీయ పార్టీల మధ్య చేతులు మారుతూ వస్తున్న కీలక నియోజకవర్గమిది. అయితే మాజీ సీఎం, కాంగ్రెస్ దిగ్గజం భజన్‌లాల్ పెట్టిన హరియాణా జనహిత్ కాంగ్రెస్‌ను ఆయన కుమారుడు కుల్‌దీప్ తిరిగి కాంగ్రెస్‌లోనే విలీనం చేశారు. దేవీలాల్ ముని మనవడు దుష్యంత్ చౌతాలా ఐఎన్ఎల్డీ తరఫున తొలిసారి 26 ఏళ్లకే ఎంపీ అయ్యారు! ఆ పార్టీతో విభేదాలతో జేజేపీ ఏర్పాటు చేసి గత ఎన్నికల్లో పోటీ చేసి బీజేపీ చేతిలో ఓటమి చవిచూశారు. ఈసారి జేజేపీ నుంచి దుష్యంత్ తల్లి నైనా సింగ్ చౌతాలా పోటీ చేస్తున్నారు. బీజేపీ నుంచి దుష్యంత్ కుటుంబానికే చెందిన దేవీలాల్ తనయుడు రంజిత్ సింగ్ చౌతాలా బరిలో దిగడంతో పోటీ ఆసక్తికరంగా మారింది. కాంగ్రెస్ నుంచి జై ప్రకాశ్, ఐఎన్ఎల్డీ నుంచి సునైనా చౌతాలా పోటీ చేస్తున్నారు.

ఫరీదాబాద్.. బీజేపీ హ్యాట్రిక్ గురి

ఈ పారిశ్రామిక హబ్‌లో గత రెండు ఎన్నికల్లో బీజేపీ ఘనవిజయం సాధించింది. సిట్టింగ్ ఎంపీ కృష్ణ పాల్ గుజ్జర్ హ్యాట్రిక్‌పై గురిపెట్టారు. కాంగ్రెస్ నుంచి మహేంద్ర ప్రతాప్ సింగ్, జేజేపీ నుంచి నళిన్ హుడా పోటీ పడుతున్నారు. ఈ లోక్‌సభ స్థానం పరిధిలోని 9 అసెంబ్లీ సెగ్మెంట్లలో 7 బీజేపీ గుప్పిట్లోనే ఉండటం ఆ పార్టీకి కలిసొచ్చే అంశం.

అంబాలా... దళితులే కీలకం

ఒకప్పటి ఈ కాంగ్రెస్ కంచుకోటలోనూ కమలనాథులు పాగా వేశారు. 2014, 2019ల్లో బీజేపీ నుంచి గెలిచిన రతన్ లాల్ కటారియా మరణించడంతో ఈసారి ఆయన భార్య బాంటో బరిలో ఉన్నారు. కాంగ్రెస్ నుంచి ములానా సిట్టింగ్ ఎమ్మెల్యే వరుణ్ చౌదరి బరిలో ఉన్నారు. ఇక్కడ 25 శాతం దళితులు, 20 శాతం వెనుకబడిన వర్గాలున్నాయి. పంజాబీ, సిక్కు, రాజ్‌పుత్, జాట్, బ్రాహ్మణ ఓటర్లూ కీలకమే. దళితుల్లో రవిదాసీయాలు 5 లక్షల మేర ఉంటారు.

రోహ్‌తక్... కాంగ్రెస్ జైత్రయాత్రకు బ్రేక్

మాజీ ఉప ప్రధాని చౌదరి దేవీలాల్, హర్యానా మాజీ సీఎం భూపీందర్ సింగ్ హుడా వంటి దిగ్గజాలు ప్రాతినిధ్యం వహించిన ఈ స్థానం పూర్తిగా కాంగ్రెస్ అడ్డా. ఆ పార్టీ జైత్రయాత్రకు 2019లో బీజేపీ బ్రేక్ వేసింది. ఆ పార్టీ నుంచి సిట్టింగ్ ఎంపీ అరవింద్ కుమార్ శర్మ, కాంగ్రెస్ నుంచి దీపీందర్ సింగ్ హుడా మళ్లీ తలపడుతున్నారు. ఈ జాట్ ప్రాబల్య స్థానంలో 70 శాతం ఓటర్లు గ్రామీణులే. 20 శాతం మేర ఎస్సీలుంటారు. దీని పరిధిలోని 9 అసెంబ్లీ స్థానాల్లో ఏకంగా 8 కాంగ్రెస్ చేతిలో ఉండటం ఆ పార్టీకి కలిసొచ్చే అంశం.

సిర్సా... కాంగ్రెస్ వర్సెస్ మాజీ

బీజేపీ సిట్టింగ్ ఎంపీ సునీతా దుగ్గల్‌ను కాదని అశోక్ తన్వర్‌కు టికెటిచ్చింది. 2019లో కాంగ్రెస్ తరఫున పోటీ చేసి ఓడిన ఆయన ఇటీవలే బీజేపీలోకి జంప్ చేయడం విశేషం! కాంగ్రెస్ నుంచి పీసీసీ చీఫ్ కుమారి సెల్జా బరిలో ఉన్నారు. ఆమె 1991లో తొలిసారి ఇక్కడి నుంచే ఎంపీగా గెలిచారు. జేజేపీ, ఐఎన్ఎల్డీలకు కూడా ఇక్కడ గట్టి ఓటు బ్యాంకు ఉండటంతో పోటీ ఉత్కంఠ రేపుతోంది.

మేధా పాట్కర్ దోషే: ఢిల్లీ కోర్టు

న్యూఢిల్లీ: నర్మదా బచావో ఆందోళన్ నేత, పర్యావరణ నాయకురాలు మేధా పాట్కర్‌పై నమోదైన 23 ఏళ్లనాటి కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా లక్ష్యంగా గతంలో చేసిన వ్యాఖ్యలు పరువు నష్టం కలుగజేసేవిగా ఉన్నాయంటూ ఆమెను దోషిగా తేల్చింది. నేషనల్ కౌన్సిల్ ఆఫ్ సివిల్ లిబర్టీస్ అనే సంస్థకు అధ్యక్షుడిగా ఉన్న సక్సేనాకు ఆ సమయంలో చోటుచేసుకున్న కొన్ని హవాలా లావాదేవీలతో సంబంధాలున్నాయంటూ తీవ్ర ఆరోపణలతో కూడిన ప్రకటనను పాట్కర్ విడుదల చేశారు. ఇవి తన ప్రతిష్టకు భంగకరంగా ఉన్నాయంటూ సక్సేనా 2000వ సంవత్సరంలో పోలీసులకు ఫిర్యాదు చేశారు. విచారణ సమయంలో మేధా పాట్కర్ ఆరోపణలకు రుజువులను చూపించలేకపోయారని తాజాగా కోర్టు పేర్కొంది. 'వ్యక్తిగత ఆస్తుల్లో ప్రతిష్ట ఒకటి. ఇది సమాజంలో వ్యక్తిగత, వృత్తిపరమైన సంబంధాలను ప్రభావితం చేస్తుంది'అని మెట్రో పాలిటన్ మేజిస్ట్రేట్ రాఘవ్ శర్మ పేర్కొన్నారు. మేధా పాట్కర్ దోషేనని స్పష్టం చేశారు. శిక్ష ఖరారుపై ఈ నెల 30వ తేదీన వాదనలు జరగనున్నాయి.

నేడే ఆరో దశ పోలింగ్

6 రాష్ట్రాలు, 2 యూటీల పరిధిలో ఎన్నికలు ● అదృష్టాన్ని పరీక్షించుకుంటున్న ప్రముఖులు

సాక్షి, న్యూఢిల్లీ: లోక్‌సభ ఎన్నికల్లో ఆరో విడతకు రంగం సిద్ధమైంది. 6 రాష్ట్రాలు, 2 కేంద్ర పాలిత ప్రాంతాల పరిధిలో 58 లోక్‌సభ స్థానాలకు శనివారం పోలింగ్ జరగనుంది. హరియాణాలో మొత్తం 10, ఢిల్లీలోని 7 లోక్‌సభ స్థానాలతో పాటు పశ్చిమబెంగాల్‌లోని గిరిజన ప్రాబల్య జంగల్‌మహల్ ప్రాంతంలోని పలు లోక్‌సభ స్థానాలు వీటిలో ఉన్నాయి. ఒడిశాలో 6 లోక్‌సభ స్థానాలతో పాటు వాటి పరిధిలోని 42 అసెంబ్లీ సీట్లలో కూడా పోలింగ్ జరగనుంది. దీంతో 486 లోక్‌సభ స్థానాల్లో పోలింగ్ పూర్తవనుంది. మిగతా 57 స్థానాలకు జూన్ 1న చివరి విడతతో పోలింగ్ ప్రక్రియ ముగుస్తుంది. జూన్ 4న ఫలితాలు వెల్లడవుతాయి. మండే ఎండల నేపథ్యంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని యంత్రాంగాన్ని ఈసీ ఆదేశించింది.

బరిలో కీలక నేతలు

కేంద్ర మంత్రులు ధర్మేంద్ర ప్రధాన్, రావు ఇందర్‌జీత్ సింగ్, కృష్ణపాల్ గుర్జర్‌తో పాటు మేనకా గాంధీ, సంబిత పాత్ర, మనోహర్‌లాల్ ఖట్టర్ (బీజేపీ), రాజ్‌బబ్బర్, కన్హయ్య కుమార్, దీపీందర్‌సింగ్ హుడా (కాంగ్రెస్), మెహబూబా ముఫ్తీ (పీడీపీ) తదితర ప్రముఖులు ఆరో విడతలో తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. హరియాణాలోని కర్నాల్ అసెంబ్లీ స్థానం నుంచి సీఎం నాయబ్‌సింగ్ సైనీ పోటీ చేస్తున్నారు. కురుక్షేత్ర సిట్టింగ్ ఎంపీ అయిన ఆయన ఇటీవలే సీఎంగా పగ్గాలు చేపట్టడం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆర్నెల్ల లోపు అసెంబ్లీకి ఎన్నికవ్వాల్సి ఉంది. మరోవైపు హరియాణా, ఢిల్లీల్లో 2019లో క్లీన్‌స్వీప్ చేసిన బీజేపీకి ఈసారి మాత్రం కాంగ్రెస్–ఆప్ నుంచి గట్టి సవాలు ఎదురవుతోంది.



శుక్రవారం భువనేశ్వర్ పంపిణీ కేంద్రం వద్ద ఎన్నికల సామగ్రితో పోలింగ్ అధికారులు

పోలింగ్ జరిగే స్థానాలు 58

జనరల్	49
ఎస్టీ	07
ఎస్సీ	02
పోలింగ్ కేంద్రాలు	1.14 లక్షలు
పోలింగ్ అధికారులు	11.4 లక్షలు
మొత్తం ఓటర్లు	11.13 కోట్లు
పురుషులు	5.84 కోట్లు
మహిళలు	5.29 కోట్లు

రాష్ట్రం	సీట్లు
ఉత్తరప్రదేశ్	14
హరియాణా	10
పశ్చిమబెంగాల్	08
బిహార్	8
ఢిల్లీ	7
ఒడిశా	6
జార్ఖండ్	4
కశ్మీర్	1

అసెంబ్లీ ఎన్నికలు ఒడిశా **42** స్థానాలు

'బూత్‌లవారీగా ఓటింగ్ శాతం'పై ఆదేశాలివ్వలేం: సుప్రీం

న్యూఢిల్లీ: లోక్‌సభ ఎన్నికల్లో పోలింగ్ బూత్‌లా వారీగా ఓటింగ్ శాతాన్ని ఎన్నికల సంఘం వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసేలా ఎన్నికల సంఘాన్ని ఆదేశించాలన్న విజ్ఞప్తిని సుప్రీంకోర్టు ధర్మాసనం తిరస్కరించింది. ప్రస్తుత సార్వత్రిక ఎన్నికల్లో ఐదు దశల పోలింగ్ పూర్తయ్యిందని, మరో రెండు దశల పోలింగ్ జరగాల్సి ఉందని, ఇలాంటి సమయంలో పోలింగ్ బూత్‌లవారీగా ఓటింగ్ శాతాన్ని బహిర్గతం చేసేలా ఎన్నికల సంఘాన్ని ఆదేశించలేమని తేల్చిచెప్పింది. పోలింగ్ బూత్‌ల వారీగా ఓటింగ్ శాతం వివరాలను ఈసీ వెబ్‌సైట్‌లో ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కోరుతూ అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫామ్స్(ఏడీఆర్) దాఖలు చేసిన ఇంటర్‌లాక్యుటరీ అప్లికేషన్(ఐఏ)పై జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ సతీశ్‌చంద్ర శర్మతో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం శుక్రవారం విచారణ చేపట్టింది. ఇలాంటి వివరాలను వెబ్‌సైట్‌లో పొందుపర్చాలంటే ఎన్నికల సంఘం వనరులు సమకూర్చుకోవాల్సి ఉంటుందని, ఇప్పుడు ఎన్నికల మధ్యలో అది సాధ్యం కాదని పేర్కొంది. క్షేత్రస్థాయి పరిస్థితులను కూడా అర్థం చేసుకోవాలని, ఎన్నికల ప్రక్రియ కొనసాగుతున్న ఈ సమయంలో ఎన్నికల సంఘంపై అదనపు భారం మోపడం సరైంది కాదని ఉద్ఘాటించింది. ఏడీఆర్ దాఖలు చేసిన పిటిషన్‌ను సార్వత్రికలు ఎన్నికలు పూర్తయిన తర్వాత రెగ్యులర్ బెంచ్ విచారిస్తుందని వెల్లడించింది. ఇదే అంశంపై 2019 నుంచి పెండింగ్‌లో ఉన్న ప్రధాన రిట్ పిటిషన్‌తో కలిపి తాజా పిటిషన్‌ను విచారించనున్నట్లు స్పష్టం చేసింది.

'అగ్నిపథ్'ను బలవంతంగా రుద్దుతున్నారు

బీజేపీపై రాహుల్ ఫైర్

న్యూఢిల్లీ: దేశానికి సేవ చేయాలని కలలు కంటున్న యువతను ప్రధాని మోదీ అగ్నిపథ్ పథకాన్ని బలవంతంగా అమలు చేసి మోసం చేశారని కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ ఆరోపించారు. ఇండియా కూటమి ప్రభుత్వం వారికి న్యాయం చేస్తుందని ప్రకటించారు. యువత కలలను భగ్నం కానీయమన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయన 'ఎక్స్'లో ఒక వీడియో విడుదల చేశారు. దేశాన్ని సేవ చేయాలని భావిస్తున్న ఎందరో యువత అగ్నిపథ్ కారణంగా ఆర్మీలో చేరడంపై విముఖతతో ఉన్నారన్నారు. ఇందుకు సంబంధించి, ఇటీవల ఓ టెంపో వాహనంపై పలువురు యువకులతో మాట్లాడిన వీడియోను రాహుల్ జత చేశారు. సాయుధ బలగాల్లో చేరేందుకు సిద్ధమవుతున్న తమ స్నేహితుల్లో కొందరు అగ్నిపథ్ అమలు కారణంగా ఆత్మహత్యలకు కూడా పాల్పడినట్లు ఆ యువకులు తెలిపారన్నారు. తాము అధికారంలోకి వస్తే అగ్నిపథ్‌ను రద్దు చేస్తామని హామీ ఇచ్చారు.

దేశాభివృద్ధి కోసమే మూడోసారి

గెలుపు నా కోసం, నా కుటుంబం కోసం కాదు: ప్రధాని మోదీ

సిమ్లా: బీజేపీని వరుసగా మూడోసారి గెలిపించాలని, దేశ అభివృద్ధి కోసమే తప్ప ఈ గెలుపు తన కోసం, తన కుటుంబం కోసం కాదని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పేర్కొన్నారు. దేశ అభివృద్ధి కోసం అన్ని గ్రామాల్లో దేవాలయాలకు వెళ్లి, దేవుళ్లను ప్రార్థించి ఆశీస్సులు పొందాలని కోరారు. కాంగ్రెస్ పార్టీకి అధికారం అప్పగిస్తే ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల రిజర్వేషన్లు బలవంతంగా లాక్కొని ఓటు బ్యాంక్‌కు కట్టబెడతారని ఆందోళన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే అయోధ్య రామమందిరానికి తాళం పడుతుందని అన్నారు. శుక్రవారం హిమాచల్ ప్రదేశ్‌లోని నాహన్, మండీ, పంజాబ్‌లోని గురుదాస్‌పూర్, జలంధర్‌లో సార్వత్రిక ఎన్నికల ప్రచార సభల్లో ప్రధాని మోదీ ప్రసంగించారు. అయోధ్యలో రామాలయ నిర్మాణాన్ని కాంగ్రెస్ వ్యతిరేకించిందని ఆరోపించారు. మందిర నిర్మాణానికి తాము పూనుకుంటే తేదీ చెప్పండి అంటూ ఎగతాళి చేశారని అన్నారు. తేదీ ప్రకటించడమే కాకుండా ఆలయ నిర్మాణం పూర్తిచేసి ప్రాణప్రతిష్ట సైతం జరిపించామని గుర్తుచేశారు. ఓటు బ్యాంక్‌ను బుజ్జగించడానికి కాంగ్రెస్ పార్టీ ఈ కార్యక్రమాన్ని బహిష్కరించిందని మండిపడ్డారు. హిమాచల్ ప్రదేశ్‌లో 2.50 లక్షల జనాభా ఉన్న హట్టీ సామాజికవర్గానికి ఎస్టీ హోదా కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఓడిపోయే కాంగ్రెస్‌కు ఓటు వేసి ఓటు వృథా చేసుకోవద్దని ప్రజలకు సూచించారు.



ఎలక్షన్ బీట్

అబద్ధాల వ్యాప్తికి దేవుడు దూతను పంపుతాడా?

ప్రధాని మోదీ వ్యాఖ్యలపై మమత ఎద్దేవా

కోల్‌కతా: దేవుడు తనను పంపాడని ప్రధాని నరేంద్ర మోదీ చేసిన వ్యాఖ్యలపై పశ్చిమబెంగాల్ సీఎం మమతా బెనర్జీ తీవ్రంగా ధ్వజమెత్తారు. మథురాపూర్‌లో శుక్రవారం ఎన్నికల సభలో మాట్లాడుతూ 'ఓటమి తప్పదనే భయంతో.. ఆ ఫోబియాలో బీజేపీ నాయకులు అర్థంపర్థం లేని మాటలు మాట్లాడుతున్నారని అన్నారు. 'ఇప్పుడాయన తనను తాను దేవుడి బిడ్డగా, మనలాగా ఆయనకు తల్లిదండ్రులు లేరని, భగవంతుడు ఆయన్ను పంపాడని చెప్పుకుంటున్నారు. అల్లర్లను ప్రేరేపించడానికి, ప్రకటనల ద్వారా అబద్ధాలు వ్యాప్తి చేయడానికి, జాతీయ పౌర పట్టిక (ఎన్ఆర్‌సీ) ద్వారా జనాన్ని జైళ్లో వేయడానికి దేవుడు ఎవరినైనా పంపుతాడా అని నేనడుగుతున్నాను. పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ) ద్వారా హింసను ప్రోత్సహించడానికి, ఉపాధి హామీ పథకానికి నిధులు ఆపడానికి, పేదలకు ఇళ్ల నిర్మాణాన్ని అడ్డుకోవడానికి దేవుడు తన దూతను పంపుతాడా?' అని మమత వ్యంగ్యంగా అన్నారు. పేదల ఖాతాల్లో రూ. 15 లక్షల చొప్పున జమచేస్తాననే హామీపై భగవంతుడు వెనక్కి తగ్గుతాడా అని ఎద్దేవా చేశారు. ప్రధాని మోదీ ఒక జాతీయ ఛానల్‌కు ఇంటర్వ్యూ ఇస్తూ.. మా అమ్మ బతికున్నంతవరకు నేను సాధారణంగా అందరిలాగే జన్మించానని అనుకునేవాడిని. ఆమె మరణించాక నా అనుభవాలను పరికించి చూసుకుంటే.. నన్ను దేవుడు పంపాడని నేను నిశ్చితాభిప్రాయానికి వచ్చాను' అని పేర్కొన్నారు. ప్రధాని పేరెత్తకుండానే మమత ఆయన వ్యాఖ్యలపై ధ్వజమెత్తారు.

నేత లేదు, నీతి లేదు..!

ఇండియా కూటమి నేతలపై అమిత్ షా ధ్వజం

ఆరా(బిహార్)/జాంతాడా/దియోగఢ్(జార్ఖండ్): ప్రతిపక్ష ఇండియా కూటమి నేతలపై కేంద్ర హోం మంత్రి అమిత్ షా తీవ్రంగా మండిపడ్డారు. ఆ కూటమికి నేత లేదు, నీతి లేదు, విధానం లేదని వ్యాఖ్యానించారు. రాహుల్‌ను ప్రధానిగా చేయడం కాంగ్రెస్ అగ్ర నేత సోనియా గాంధీ లక్ష్యం కాగా, స్టాలిన్, లాలు, ఉద్ధవ్ ఠాక్రేలకు తమ కుమారులను సీఎం పదవుల్లో కూర్చోబెట్టడమే లక్ష్యమని ఆరోపించారు. దేశ ప్రధానిగా అర్హత ఉన్న ఏకైక నేత మోదీ మాత్రమేనని అన్నారు.శుక్రవారం అమిత్ షా జార్ఖండ్‌లోని జాంతాడా, దియోగఢ్‌తోపాటు బిహార్‌లోని ఆరా పట్టణంలో జరిగిన ఎన్నికల ప్రచార ర్యాలీల్లో మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల రిజర్వేషన్లు లాగేసుకుని వాటి ప్రయోజనాలను ముస్లింలకు కల్పించాలని కాంగ్రెస్, ఆర్జేడీలు ప్రయత్నిస్తున్నాయని అమిత్ షా ఆరోపించారు. వెనుకబడిన కులాల వారికి రిజర్వేషన్లను లాలు ప్రసాద్, కాంగ్రెస్ పార్టీ, మమతా బెనర్జీ వ్యతిరేకిస్తున్నారన్నారు. కానీ, వీరి ప్రయత్నాలను ప్రధాని మోదీ సారథ్యంలో ఎన్డీఏ అడ్డుకుంటుందని స్పష్టం చేశారు. పశ్చిమబెంగాల్‌లో 2010 నుంచి జారీ చేస్తున్న ఓబీసీ సర్టిఫికెట్లు చెల్లవంటూ బుధవారం కలకత్తా హైకోర్టు వెలువరించిన తీర్పును మంత్రి అమిత్ షా ప్రస్తావిస్తూ.. ప్రతిపక్ష పార్టీల బండారం బయటపడిందని ఎద్దేవా చేశారు. ఈ లోక్‌సభ ఎన్నికల్లో ఇప్పటి వరకు పూర్తయిన ఐదు విడతల్లో బీజేపీ 310 సీట్లు గెలుచుకోవడం ఖాయమన్నారు. ప్రధాని మోదీ నాయకత్వంలో అభివృద్ధి చెందిన దేశంగా మారాలంటే బీజేపీని 400పైగా సీట్లలో గెలిపించాల్సిన అవసరం ఉందని చెప్పారు.

బ్రిటిష్ తరహాలోనే మోదీ ప్రభుత్వం: ఖర్గే

దేవ్‌గఢ్: బ్రిటిష్‌వారి తరహాలోనే మోదీ ప్రభుత్వం గత పదేళ్లలో దేశంలోని అడవులు, నీరు, భూమిని దోచుకుందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ఆరోపించారు. యూపీఏ ప్రభుత్వాలు నీరు, భూమి, అటవీ పరిరక్షణకు చట్టాలు చేశాయని, మోదీ ప్రభుత్వం నిబంధనలను మార్చి ఆ చట్టాన్ని నిర్వీర్యం చేసిందని మండిపడ్డారు. బ్రిటీష్ వారిని ఎదుర్కొన్న కాంగ్రెస్.. మోదీ పరివారానికి భయపడదని స్పష్టం చేశారు. జార్ఖండ్‌లోని గొడ్డా నియోజకవర్గ అభ్యర్థి ప్రదీప్ యాదవ్ ప్రచారంలో భాగంగా శుక్రవారం దేవ్‌గఢ్‌లో జరిగిన ఎన్నికల ర్యాలీలో ఆయన పాల్గొని, ప్రసంగించారు. బీజేపీ దేశాన్ని మతప్రాతిపదికన విడదీయాలని చూస్తే.. కాంగ్రెస్ మాత్రం హిందూముస్లింలను ఏకం చేస్తోందని తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే గిరిజనులకు ప్రత్యేక మతపరమైన కోడ్ సర్నాను అమలు చేస్తామని, ఖాళీగా ఉన్న 30 లక్షల ప్రభుత్వ పోస్టులను భర్తీ చేస్తామని స్పష్టం చేశారు.

ఈవీఎం లాగ్‌లు రెండు మూడేళ్లు భద్రపర్చాలి

ఈసీని ఆదేశించండి ● సుప్రీంకోర్టుకు కపిల్ సిబల్ వినతి

న్యూఢిల్లీ: ఎన్నికల్లో ఉపయోగించిన ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల(ఈవీఎం) లాగ్‌లను కనీసం రెండు మూడేళ్లపాటు భద్రపర్చేలా ఎన్నికల సంఘాన్ని ఆదేశించాలని రాజ్యసభ సభ్యుడు, సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ శుక్రవారం కోరారు. ప్రతి ఎలక్ట్రానిక్ యంత్రానికి ఆపరేటింగ్ సిస్టమ్ ఉన్నట్లునే ఈవీఎంలకు లాగ్‌లు ఉంటాయని, ఓటింగ్‌కు సంబంధించిన డేటా అందులో ఉంటుందని తెలిపారు. సాధారణంగా ఎన్నికల సంఘం ఇలాంటి డేటాను కేవలం 30 రోజులపాటే భద్రపరుస్తుందని అన్నారు. కనీసం రెండు మూడేళ్లు భద్రపర్చాల్సిన అవసరం ఉందని సూచించారు.

4 తర్వాత 3 రోజుల్లో 'ప్రధాని' ఖరారు

ఎన్నికల్లో మా కూటమిదే విజయం: జైరామ్ రమేశ్

చండీగఢ్: ఈ ఎన్నికల్లో విపక్ష 'ఇండియా' కూటమి గెలిస్తే ఐదు సంవత్సరాల్లో ఐదుగురు ప్రధానమంత్రులు వస్తారంటూ ప్రధాని నరేంద్ర మోదీ చేస్తున్న విమర్శలను కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్ తిప్పికొట్టారు. ఆయన శుక్రవారం చండీగఢ్‌లో మీడియాతో మాట్లాడుతూ జూన్ 4న సార్వత్రిక ఎన్నికల ఫలితాలు వెలువడిన అనంతరం కేవలం మూడు రోజుల్లోగా తమ కూటమి ప్రధానమంత్రి అభ్యర్థిని ఖరారు చేస్తామని చెప్పారు. ఈ ఎన్నికల్లో ఇండియా కూటమి స్పష్టమైన, నిర్ణయాత్మక విజయం సాధించబోతోందని ధీమా వ్యక్తం చేశారు. వచ్చే ఐదేళ్లపాటు ఒకే ఒక్క ప్రధానమంత్రి ఉంటారని తేల్చిచెప్పారు.

కబళించిన కొండచరియలు.. 100 మందికి పైగా సజీవ సమాధి

పపువా న్యూగినియాలో విషాదం

మెల్‌బోర్న్: దక్షిణ పసిఫిక్ ద్వీప దేశం పపువా న్యూగినియాలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. మారుమూల పర్వత ప్రాంతంలో కొండచరియలు ఏకంగా ఒక గ్రామాన్నే కబళించాయి. ఈ ఘటనలో 100 మందికిపైగా చనిపోయి ఉంటారని భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి. శుక్రవారం ఉదయం 3 గంటల సమయంలో ఎంగా ప్రావిన్స్‌లోని సుదూర గ్రామం కవోకల మ్‌ను ఆనుకుని ఉన్న కొండలోని ఒక భాగం విరిగిపడి గ్రామాన్ని, పోర్గెరా పట్టణంతో కలిపే ఏకైక రహదారిని పూర్తిగా కప్పేసింది. దీంతో, ఆ గ్రామానికి బయటి ప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయి. పర్వతమయమైన ఆ ప్రాంతానికి చేరుకోవాలంటే హెలికాప్టర్ ద్వారానే సాధ్యమని అధికా రులు అంటున్నారు. పెద్దపెద్ద చెట్లు, భారీ బండరాళ్లు పడటంతో గ్రామంలోని నివాసా లు, ఇతర భవనాలు పూర్తిగా నేలమట్ట మయ్యాయి. ఆ ప్రాంతాన్ని మట్టి, రాళ్లు పూర్తిగా కప్పేసినట్లున్న దృశ్యాలు సోషల్ మీడియాలో ప్రత్యక్షమయ్యాయి. సహాయ చర్యలు ప్రారంభించినట్లు ప్రధాని జేమ్స్ మరాపె తెలిపారు. కవోకలమ్ గ్రామంలో సహాయ పునరావాస చర్యలకు అన్ని విధాలుగా సాయం అందజేస్తామని పొరుగు మిత్ర దేశం ఆస్ట్రేలియా తెలిపింది.

వలపు వల విసిరి.. చర్మం వలిచి.. ముక్కలుగా నరికి

బంగ్లాదేశ్ ఎంపీ అన్వరుల్ అజీమ్ అనర్‌ను దారుణంగా చంపిన నిందితులు

కోల్‌కతా: బంగ్లాదేశ్ అవామీ లీగ్ ఎంపీ అన్వరుల్ అజీమ్ అనర్ హత్య వ్యవహారంలో విస్తుపోయే నిజాలు వెలుగులోకి వస్తున్నాయి. ఆయనపై వలపు వల(హనీ ట్రాప్) విసిరి కోల్‌కతాకు రప్పించి, దారుణంగా హత్య చేసి, చర్మం వలిచి ముక్కలు ముక్కలుగా నరికినట్లు తేలింది. వలపు వల విసిరిన యువతిని బంగ్లాదేశ్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆమెను శిలాంతి రెహమాన్‌గా గుర్తించారు. బంగ్లాదేశ్ జాతీయురాలైన శిలాంతి ప్రధాన నిందితుడు, అమెరికా పౌరుడైన అఖ్తరుజమాన్ షహీన్‌కు ప్రియురాలు అని బంగ్లాదేశ్ పోలీసులు తెలిపారు. కోల్‌కతాలోని న్యూటౌన్ ప్రాంతంలో అక్తరుజమాన్ అద్దె ఇంట్లో ఎంపీ అన్వరుల్ అజీమ్ అనర్ హత్యకు గురైన సంగతి తెలిసిందే. ఆ సమయంలో శిలాంతి రెహమాన్ కోల్‌తాలోనే ఉన్నట్లు వెల్లడయ్యింది. మరో నిందితుడు అమానుల్లా అమన్‌తో కలిసి ఈ నెల 15న బంగ్లాదేశ్‌కు తిరిగి వెళ్లిపోయింది. తన మిత్రుడు అన్వరుల్ అజీమ్ అనర్‌ను బంగ్లాదేశ్ నుంచి కోల్‌కతాకు రప్పించడానికి ప్రధాన నిందితుడు అఖ్తరుజమాన్ తన ప్రియురాలు శిలాంతిని ప్రయోగించినట్లు పోలీసులు తేల్చారు. అన్వరుల్ అజీమ్ అనర్, అఖ్తరుజమాన్ మధ్య ఆర్థికపరమైన వివాదాలు ఉన్నట్లు తెలుస్తోంది. అందుకే ఈ హత్య జరిగినట్లు భావిస్తున్నారు.



శిలాంతి — ఎంపీ అన్వరుల్(ఫైల్)

అక్రమంగా దేశంలోకి చొరబడి హత్యాకాండ

ఎంపీ అన్వరుల్ అజీమ్ అనర్‌ను చంపడానికి నిందితులు పక్కా పథకం వేశారు. జంతువులను వధించడంలో అనుభవం ఉన్న మాంసం వ్యాపారి జిహాద్ హవల్దార్‌ను బంగ్లాదేశ్ నుంచి ఇండియాకు రప్పించారు. బంగ్లాదేశ్ నుంచి అక్రమంగా ఇండియాలోకి చొరబడ్డాడు. కొంతకాలం ముంబైలో తలదాచుకున్నాడు. పథకం ప్రకారం హత్యకు రెండు నెలల ముందు కోల్‌కతాకు చేరుకున్నాడు. అఖ్తరుజమాన్ అద్దె ఇంట్లో అన్వరుల్ అజీమ్‌ను ఇతర నిందితులతో కలిసి హత్య చేశాడు.

గిరికీలు కొట్టిన హెలికాప్టర్

కేదార్‌నాథ్: ఉత్తరాఖండ్‌లోని కేదార్‌నాథ్‌లో శుక్రవారం ఉదయం పెనుప్రమాదం తప్పింది. హెలికాప్టర్ హైడ్రాలిక్ వ్యవస్థ విఫలం కావడంతో అత్యవసర ల్యాండయ్యింది. క్రెస్టెల్ ఏవియేషన్‌కు చెందిన ఈ హెలికాప్టర్ సిర్సి నుంచి ఆరుగురు భక్తులతో కేదార్‌నాథ్‌కు చేరుకుంది. ల్యాండింగ్ సమయంలో సాంకేతిక లోపంతో హెలికాప్టర్ వేగంగా గిరికీలు కొట్టింది. హెలిప్యాడ్ వద్ద ఉన్న వాళ్లంతా భయంతో కేకలు వేస్తూ పరుగులు తీశారు. పైలట్ కల్పేశ్ చాకచక్యంగా వ్యవహరించి, హెలిప్యాడ్ పక్కనే 100 మీటర్ల దూరంలోని ప్రాంతంలో సురక్షితంగా ల్యాండ్ చేశారు. అందరూ సురక్షితంగా కిందికి దిగారు.

రఫాలో సైనిక చర్య ఆపండి

- ఇజ్రాయెల్‌కు ఐరాస కోర్టు ఆదేశం
- బేఖాతరు చేసే అవకాశం

ది హేగ్: దక్షిణ గాజాలోని రఫా నగరంలో సైనిక చర్యను తక్షణం ఆపాలని ఇజ్రాయెల్‌ను ఐక్యరాజ్యసమితికి చెందిన ఇంటర్నేషనల్ కోర్ట్ ఆఫ్ జస్టిస్ శుక్రవారం ఆదేశించింది. అయితే ఇజ్రాయెల్ ఈ ఆదేశాలకు కట్టుబడి ఉండకపోవచ్చు. పాలస్తీనియన్లపై దాడుల విషయంలో అంతర్జాతీయంగా మద్దతు కోల్పోతున్న ఇజ్రాయెల్‌పై కోర్టు ఆదేశాలు మరింత ఒత్తిడిని పెంచుతాయి. గాజాపై ఇజ్రాయెల్ దాడుల నేపథ్యంలో 10 లక్షల పైచిలుకు పాలస్తీనియన్లు రఫాకు వలస వచ్చారు. వీరిలో చాలామంది టెంట్లలో నివసిస్తున్నారు. రఫాపై ఇజ్రాయెల్ దృష్టి సారించడంతో మిత్రదేశం అమెరికాతో సహా పలుదేశాలు వారించాయి. ఈ వారమే మూడు యూరోప్ దేశాలు తాము పాలస్తీనాను స్వతంత్రదేశంగా గుర్తిస్తున్నట్లు ప్రకటించాయి. హమాస్‌కు మిగిలిన చివరి సురక్షిత స్థావరంగా రఫా ఉందని, దానిపై దాడి చేస్తేనే వారిని తుడిచిపెట్టగలమని ఇజ్రాయెల్ అంటోంది. ఇంటర్నేషనల్ కోర్ట్ ఆఫ్ జస్టిస్ (ఐసీజే) అధ్యక్షుడు నవాఫ్ సలామ్ తీర్పు వెలువరిస్తూ 'రఫాలో సైనిక చర్యపై తాము వెలిబుచ్చిన భయాలు నిజమయ్యాయని పేర్కొన్నారు. ఇజ్రాయెల్ తక్షణం రఫాలో సైనిక చర్య నిలిపివేయకుంటే భారీగా ప్రాణనష్టం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. రెండు వారాల కిందట రఫాను ఖాళీ చేసి వెళ్లిపోవాలని ఇజ్రాయెల్ హెచ్చరికలు జారీచేసింది. సైన్యాన్ని రఫా దిశగా నడిపించి కీలకమైన సరిహద్దు మార్గాన్ని తమ ఆధీనంలోకి తీసుకొంది. మానవతాసాయం అందడానికి రఫా క్రాసింగ్ అత్యంత కీలకం. అందుకే రఫా క్రాసింగ్‌ను తెరిచి ఉంచాలని ఐసీజే శుక్రవారం ఇజ్రాయెల్‌ను ఆదేశించింది. ఇంటర్నేషనల్ కోర్ట్ ఆఫ్ జస్టిస్ ఆదేశాలు అంతర్జాతీయంగా ఇజ్రాయెల్‌కు ఎదురుదెబ్బే అయినా .. రఫాపై దాడులు చేయకుండా ఇజ్రాయెల్‌ను నిలువరించలేవు. ఎందుకంటే ఐసీజే వద్ద తమ ఆదేశాలను అమలుచేయడానికి అవసరమైన పోలీసు, సైనిక బలగాలేమీ లేవు.

ఈవీ రయ్ రయ్..

గ్రేటర్ పరిధిలో ఎలక్ట్రిక్ వెహికిల్స్ రయ్‌మంటూ పరుగులు తీస్తున్నాయి. వీటి సంఖ్య నానాటికీ పెరిగిపోతోంది. ఇంధనం అవసరం లేకుండా.. ఒక్కసారి చార్జింగ్ చేస్తే సుమారు 60 కిలోమీటర్ల దూరం ప్రయాణించే వెసులుబాటు ఉండడంతో ఎలక్ట్రిక్ బైక్‌ల వినియోగానికి సిటీజనులు ఆసక్తి కనబరుస్తున్నారు. ప్రధానంగా సగటు వేతన జీవులు ఎలక్ట్రిక్ బైక్‌లను ఎక్కువ సంఖ్యలో కొనుగోలు చేస్తున్నట్లు అంచనా. ప్రస్తుతం గ్రేటర్‌లో సుమారు 1.20 లక్షలకు పైగా ఈ–బైక్‌లున్నట్లు సమాచారం. మూడేళ్లుగా వీటి దూకుడు పెరిగినట్లు రవాణా అధికారులు చెబుతున్నారు. ఎలక్ట్రిక్ బైక్‌లకు ఇటీవల భారీగా డిమాండ్ పెరిగిన దృష్ట్యా.. కొనుగోలుదారులు కనీసం రెండు నుంచి మూడు నెలల ముందే వాహనాలను బుక్ చేసుకోవాల్సి వస్తోంది.



- వివరాలు 8లో

కిషన్ లీలలెన్నో..!

ఆది నుంచీ అతడి వైఖరి వివాదాస్పదమే

- కీచక పర్వంలో తనకు తానే సాటి
- గతంలో ఆర్టీసీలో కండక్టర్‌గా ఉద్యోగం.. అక్కడ డబ్బులు కాజేయడంతో తొలగింపు
- తాజాగా పారిశుద్ధ్య కార్మికురాలితో అసభ్య ప్రవర్తన
- వీడియో వైరల్ చేయొద్దని కాళ్లావేళ్లా పడి.. డబ్బులు పంచిన వైనం
- అడ్డంగా దొరికిన శానిటరీ ఫీల్డ్ అసిస్టెంట్



కుత్బుల్లాపూర్: పారిశుద్ధ్య విభాగం మహిళా కార్మికుల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తూ అడ్డంగా దొరికిన శానిటరీ ఫీల్డ్ అసిస్టెంట్ కిషన్ వ్యవహార శైలి ఆది నుంచీ వివాదాస్పదంగానే ఉంది. గతంలో ఆర్టీసీలో కాంట్రాక్ట్ ఉద్యోగిగా కండక్టర్ విధులు నిర్వర్తిస్తూ డబ్బులు కాజేయడంతో సర్వీసు నుంచి ఇతడిని తొలగించినట్లు తెలిసింది. రాజు కాలనీలో నివాసముండే కిషన్ కూకట్‌పల్లి ఫీల్డ్ అసిస్టెంట్‌గా పని చేస్తూ అక్కడి నుంచి అయిదేళ్ల క్రితం గాజులరామారం సర్కిల్‌కు బదిలీపై వచ్చి సూరారం కాలనీలో ఉంటున్నాడు. కాగా.. మహిళా కార్మికులతో కిషన్ రాసలీలలు బయటపడడంతో జీహెచ్‌ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రాస్ అతడిని సస్పెండ్ చేయాలని ఆదేశాలు జారీ చేశారు. కిషన్‌తో పాటు రాసలీలల వీడియోను వైరల్ చేసిన పారిశుద్ధ్య కార్మికుడు ప్రణయ్‌ని సైతం సస్పెండ్ చేయాలని కూకట్‌పల్లి జడ్‌సీ అభిలాష అభినవ్‌కు ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే.

మూడు నెలల కిందటే వెలుగులోకి వచ్చినా..

మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించడంతో పాటు వాటిని సెల్‌ఫోన్‌లో బంధించి మహిళలను లోబరుచుకునేవాడు. తనకు అనుకూలంగా ఉండే మహిళలతో ఒకలా.. లేనివారితో మరోలా వ్యవహరిస్తూ వచ్చేవాడని.. మొత్తం మూడు యూనిట్ల బాధ్యతలు నిర్వహిస్తూ 21 మంది పారిశుద్ధ్య కార్మికుల హాజరు వేసే విషయంలో సైతం చేతివాటం ప్రదర్శించేవాడని ఆరోపణలున్నాయి. ఆయా అంశాలు మూడు నెలల క్రితమే షాపూర్‌నగర్ యూనిట్‌లో వెలుగులోకి వచ్చినా అధికారులు మాత్రం చర్యలు తీసుకోకుండా సూరారం ప్రాంతానికి బదిలీ చేసి చేతులు దులుపుకోవడం ఇప్పుడు వివాదాస్పదంగా మారింది.

ఇంటర్నల్ కంప్లైంట్ కమిటీ ఎదుట విచారణ..

- గ్రేటర్ పరిధిలో మహిళలపై జరుగుతున్న దాడులను దృష్టిలో పెట్టుకుని ఇంటర్నల్ కంప్లైంట్ కమిటీ (ఐసీసీ) గతంలో ఏర్పాటు అయ్యింది. గురువారం వెలుగు చూసిన శానిటరీ ఫీల్డ్ అసిస్టెంట్ కిషన్ వ్యవహార శైలిపై ఐసీసీ కమిటీ ముందు అదే రోజు రాత్రి 11 గంటల వరకు విచారణ చేశారు. ఉప కమిషనర్ మల్లారెడ్డి, వైద్య ఆరోగ్య అధికారి చంద్రశేఖర్ రెడ్డితో పాటు కిషన్ సైతం హాజరయ్యారు. గతంలో బయోమెట్రిక్ మిషన్ ఎక్కడో పోగా.. పారిశుద్ధ్య కార్మికులు పోగొట్టారని వారి నుంచి డబ్బులు వసూలు చేసినట్లు కమిటీ ముందు స్పష్టం చేశారు.
- తన రాసలీలల వీడియో వైరల్ కావడంతో ఉన్నతాధికారులకు విషయం చెప్పిన కిషన్.. అది వైరల్ చేసే క్రమంలో మొత్తం 14 మందికి డబ్బులు ఇచ్చినట్లు తేలింది. వీడియో పలు గ్రూపుల వారీగా చక్కర్లు కొట్టడంతో వాటిని ఇతరులకు పంపకుండా 14 మందికి రూ. వేయి మొదలుకొని రూ.10 వేల వరకు ముట్ట చెప్పినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. మరికొంత మంది బెదిరింపులు చేయడంతో కిషన్.. ఈ నెల 17న ఉప కమిషనర్ మల్లారెడ్డి, వైద్య ఆరోగ్య అధికారి చంద్రశేఖర్‌రెడ్డికి విషయాన్ని చెప్పుకోవడంతో అతడిని విధుల నుంచి తప్పించారు.

వీడియోల లీక్‌పై ఆరా..

గురువారం పలు సామాజిక మాధ్యమాల్లో కిషన్ వీడియోలు చక్కర్లు కొట్టడంతో అధికారులు అవాక్కయ్యారు. ఇవి ఎలా లీక్ అయ్యాయి అనే విషయంపై ఆరా తీస్తున్నారు. ఫార్వర్డ్ చేస్తున్న వారిపై సైతం కేసులు నమోదు చేసే దిశగా అడుగులు వేస్తున్నట్లు తెలిసింది.

కాళ్లు మొక్కి.. కవర్ చేసి..

శానిటరీ ఫీల్డ్ అసిస్టెంట్ కిషన్ తాను తీసుకున్న గోతిలో తానే పడడంతో.. వీడియో వైరల్ చేసిన ప్రతి ఒక్కరి కాళ్లు మొక్కుతూ కవర్ చేస్తూ వచ్చాడు.. కొంతమంది బెదిరించి డబ్బులు వసూలు చేయగా.. మరి కొంతమంది వదిలేశారు.. ఇలా మూడు నెలల పాటు ముప్పతిప్పలు పెట్టిన పలువురు కార్మికులు, తోటి శానిటరీ ఫీల్డ్ అసిస్టెంట్లు ఎట్టకేలకు వీడియోను బయటకు పంపడంతో విషయం వెలుగులోకి వచ్చింది. శుభకార్యానికి వెళ్లి సాయి అనే కార్మికునికి ఫోన్ ఇవ్వడం.. ప్రణయ్ అనే మరో కార్మికుడు ఈ వీడియోలను పలువురికి వైరల్ చేయడం.. ఆ తర్వాత మొత్తం వ్యవహారం వెలుగులోకి వచ్చింది. కిషన్ కామలీలలు బయటపడడంతో ఆయనపై ఉన్నతాధికారులు వేటు వేయడం చకచకా జరిగిపోయాయి.



24 రోజులు.. కూలిన చెట్లు 625

ఫిర్యాదులు అందని చెట్లు మరో 500కు పైనే

- ఎక్కడ.. ఎప్పుడు.. ఏ వృక్షం కూలునో
- భయాందోళనలో భాగ్యనగర ప్రజలు

సాక్షి, సిటీబ్యూరో: నగరంలో ఇటీవల కురుస్తున్న వర్షాలు, వీస్తున్న గాలులతో భారీ వృక్షాలు నేల కూలుతున్నాయి. ఏ క్షణం ఏ చెట్టు, కొమ్మ విరిగి మీద పడుతుందో తెలియక ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇటీవలే సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఆస్పత్రి ఆవరణలో చెట్టు కూలిన దుర్ఘటనలో భర్త మరణించగా.. భార్య గాయాలపాలైంది. దీంతో ఎప్పుడు.. ఎక్కడ.. ఏ చెట్టు కూలుతుందోనని నగర ప్రజలను భయం వెంటాడుతోంది. ఈ నెలలో కూలినన్ని చెట్లు ఇటీవలి కాలంలో కూలలేదు. జీహెచ్‌ఎంసీ ఈవీడీఎం విభాగానికి అందిన ఫిర్యాదుల మేరకే గడిచిన 24 రోజుల్లో 625 చెట్లు నేల కూలాయి. ఇక ఫిర్యాదులు అందని చెట్లు మరో 500కు పైగానే ఉంటాయనే అంచనాలున్నాయి. గత ఏడాది సెప్టెంబర్‌లో హైదర్‌గూడలో నిలిచి ఉన్న ఆటోపై చెట్టు కూలిపడటంతో ఆటో డ్రైవర్ మరణించిన విషయం తెలిసిందే.

వెంటాడుతున్న గతం..

2016, 2017 సంవత్సరాల్లోనూ వర్షాలతో పాటు పెనుగాలులకు భారీ సంఖ్యలో చెట్లు నేలకూలి రాకపోకలు స్తంభించిపోయిన ఘటనల్ని నగర ప్రజలు గుర్తు చేసుకుంటున్నారు. అప్పట్లోనూ మే నెలలోనే భారీ సంఖ్యలో చెట్లు కూలాయి. 2016లో ఒక్కరోజే 300కు పైగా చెట్లు కూలాయి. అలా మే నెలలో దాదాపు 1600 చెట్లు నేలకూలగా వాటిలో 80 శాతం గుల్‌మొహర్‌వే కావడాన్ని అప్పట్లో అధికారులు గుర్తించారు. రోడ్ల వెంబడి, ఫుట్‌పాత్‌లపై గుల్‌మొహర్ మొక్కలను అధికంగా నాటారు. అవి తక్కువ వ్యవధిలోనే ఎక్కువ ఎత్తు పెరగడంతో పాటు నీడనిస్తాయని నాటారు. కానీ గాలివానలకు నేలకూలడంతో ఆలోచనలో పడి ఆ తర్వాత గుల్‌మొహర్‌ల సంఖ్యను భారీగా తగ్గించి ఇతరత్రా మొక్కలు నాటారు.

ఫుట్‌పాత్‌లపై చెట్ల వేర్లు ఎక్కువ లోతుకు వెళ్లకుండా ఉండటం, చుట్టుపక్కల సైతం కాంక్రీటు నిర్మాణాలు తదితరమైనవి కూడా అందుకు కారణాలుగా గుర్తించారు. 2017లోనూ మే నెలలోనే 291 చెట్లు ఒక్క రోజే నేల కూలాయి. వాటిలోనూ గుల్‌మొహర్‌వే ఎక్కువగా ఉన్నాయి. అప్పుడు 130– 150 కిలోమీటర్ల వేగంతో గాలి వీచడంతో రావి, వేప, కానుగ వంటి చెట్లు కూడా నేల కూలాయి. కూకటివేళ్లతో సహా కుప్పకూలిన చెట్ల వల్ల పలు ద్విచక్రవాహనాలు ధ్వంసమయ్యాయి. ఇప్పుడు కూడా చెట్లు అధిక సంఖ్యలో కూలుతుండటం ప్రజల్లో ఆందోళన కలిగిస్తోంది. అప్పట్లో చెట్ల సమస్యల పరిష్కారానికే ప్రత్యేకంగా ఎమర్జెన్సీ కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేయడంతో పాటు చెట్ల వద్ద ప్రజలు నిల్చోరాదని, రోడ్డు పక్క చెట్ల కింద నుంచి వెళ్లరాదని కూడా హెచ్చరించారు. ద్విచక్రవాహనదారులు సైతం చెట్లున్న ప్రాంతాల్లో వాటి పక్కనుంచి ప్రయాణించకుండా జాగ్రత్తలు పడ్డారు. ఈనెలలో మళ్లీ ఎక్కువ చెట్లు కూలుతుండటం ఆందోళనలకు తావిస్తోంది.

ఈ నెలలో ఇప్పటి వరకు కూలిన చెట్లు ఇలా..

జోన్	ఫిర్యాదులు
ఎల్బీనగర్	83
చార్మినార్	74
ఖైరతాబాద్	155
శేరిలింగంపల్లి	117
కూకట్‌పల్లి	94
సికింద్రాబాద్	102
మొత్తం	625

నీరు నిలిచిన ప్రాంతాలు

వీటితోపాటు వర్షాల వల్ల నీరు నిలిచిన ప్రాంతాలపై 158 ఫిర్యాదులందాయి. అవి ఎల్బీనగర్‌లో 20, చార్మినార్‌లో 30, ఖైరతాబాద్‌లో 29, శేరిలింగంపల్లిలో 17, కూకట్‌పల్లిలో 44, సికింద్రాబాద్‌లో 18 ఉన్నాయి.

అయిదేళ్లలోపు చిన్నారులపై తీవ్ర ప్రభావం

పసివాళ్ల పట్ల ప్రాణాంతకమవుతున్న పరిస్థితి

- డబ్ల్యూహెచ్‌ఓ సూచించిన ఓఆర్‌ఎస్‌లనే వాడాలి
- డీహైడ్రేషన్‌లో జాగ్రత్తలు తీసుకోవాలంటున్న వైద్యులు

సాక్షి స్పెషల్ స్టోరీ



ఇది ఓఆర్‌ఎస్ కాదని ముద్రించిన దృశ్యం



మండే ఎండలకు తాళలేక.. మందుల దుకాణానికి వెళ్లి ఓఆర్‌ఎస్ (ఓరల్ రీహైడ్రేషన్ సాల్ట్స్) తీసుకుని తాగుతున్నారా? అయితే.. తస్మాత్ జాగ్రత్త. అక్కడ లభించేవన్నీ అసలైన ఓఆర్‌ఎస్‌లు కావు. నిజమైన ఓఆర్‌ఎస్‌లా మభ్యపెట్టి అమ్ముకుంటున్న ఇతర పానీయాలు మాత్రమే. ఓఆర్‌ఎస్ పేరుతో ప్రపంచ ఆరోగ్య సంస్థ నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్న ఈ పద్ధతి చిన్నారుల మరణాలకు దారి తీస్తోందని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఓఆర్‌ఎస్‌ల వాడకంపై అవగాహన కల్పించడానికి నగరంలో హీల్ ఫౌండేషన్ ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ సందర్భంగా దేశవ్యాప్తంగా అయిదేళ్లలోపు చిన్నారుల్లో 13 శాతం మరణాలు కేవలం డీహైడ్రేషన్ వల్లే సంభవిస్తున్నాయని, అతిసారంతో బాధపడుతున్న పిల్లల్లో 60.6% మంది ప్రాణాలను రక్షించే ఓఆర్‌ఎస్‌ను తీసుకోలేకపోతున్నారని హీల్ ఫౌండేషన్ వెల్లడించింది. మార్కెట్‌లో లభించే ఉత్పత్తుల పేరులో ఓఆర్‌ఎస్ ఉండే విధంగా మార్చుకుని.. దాని కిందే చిన్న అక్షరాలతో 'ఇది ఓఆర్‌ఎస్ కాదు' అంటూనే ప్రజల అనారోగ్యానికి కారణమవుతున్నారు. – సాక్షి, సిటీబ్యూరో

ఓఆర్‌ఎస్ ప్యాకెట్లపైనున్న లేబుల్ చదవకుండా ఇదే అసలైన ఓఆర్‌ఎస్ అని కొనడం అలవాటుగా మారింది. సాధారణంగా మండుతున్న ఎండలకు లేదా వైరస్ కారణంగా సంక్రమించే డయేరియా (నీళ్ల విరేచనాలు, వాంతులు) ప్రభావంతో డీహైడ్రేషన్ బారిన పడతారు. దీంతో శరీరంలోని నీరు, లవణాలు తగ్గిపోయి నీరసమైపోతారు. ఇలాంటి తరుణంలో ప్రపంచ ఆరోగ్య సంస్థ నిబంధనల ప్రకారం ప్రతి లీటరుకు 13.5గ్రా చక్కెర (గ్లూకోస్) స్థాయిలు, 2.6గ్రా సోడియం, 1.5 గ్రా పొటాషియం ఉండేలా నిర్ధారించిన ఓఆర్‌ఎస్‌లను తీసుకోవాలి. కానీ.. మార్కెట్లో లభించే వాటిలో 20 గ్రాములకుపైగా షుగర్ కలుపుతున్నారు. అధిక స్థాయిలో శరీరంలోకి చేరిన చక్కెర స్థాయిలు డీహైడ్రేషన్‌ను మరింత పెంచి చిన్నారుల మరణాలకు కారణంగా మారుతోందని పలువురు వైద్యులు సూచిస్తున్నారు.



నో ఆర్‌ఎస్..

మార్కెట్‌లో లభించేవన్నీ ఓఆర్‌ఎస్‌లు కావు

ఎనర్జీ డ్రింకులు కావు..



ఓఆర్‌ఎస్ ఒక ఔషధం (డ్రగ్). ఇది గ్లూకోజ్–సోడియం–పొటాషియం సమతుల్యతను కాపాడుతుంది. శరీరానికి అవసరమైన ఎలక్ట్రోలైట్లను అందిస్తుంది. డయేరియా ఇతర కారణాలతో డీహైడ్రేషన్‌కు గురైన చిన్నారుల బరువును బట్టి (సుమారు ఒక కిలో బరువుకు 10 మి.లీ) ఓఆర్‌ఎస్ అందించాలి. డీహైడ్రేషన్ ఉన్నప్పుడు మార్కెట్‌లో లభించే ఇతర పానియాలు తాగడం వల్ల అందులోని అధిక చక్కెర రక్తంలోకి చేరి 'రీ'హైడ్రేషన్‌ను అడ్డుకుంటుంది. దీనివల్ల గుండె పనితీరుపై ప్రభావం చూపడం, ఫిట్స్ రావడం, రక్తంలో గడ్డలు కట్టడం, మెదడుపై ప్రభావం చూపడంతో పాటు ప్రాణహానికి దారితీస్తుంది. అంతేకాకుండా షుగర్ పేషెంట్లకు తీవ్ర అనారోగ్య సమస్యలకు కారణమవుతుంది. మార్కెట్‌లో లభించే వాటిని ఎనర్జీ డ్రింక్‌లా భావించి తాగడం కూడా అనారోగ్యకారకమే.

– డాక్టర్ ఎం.సురేంద్రనాథ్, ఐఏపీ తెలంగాణ మాజీ ప్రెసిడెంట్



ఓఆర్‌ఎస్ అనేది ఒక డ్రగ్. దీనిని డ్రగ్ కంట్రోలర్ విభాగం అనుమతిస్తుంది. ఓఆర్‌ఎస్‌లని భావించి ప్రజలు కొంటున్న పానీయాలు ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా అనుమతితో మార్కెట్‌లోకి వస్తాయి. అవగాహన లోపంతో వీటినే ఓఆర్‌ఎస్‌లని భావించి డీహైడ్రేషన్ నివారణకు వినియోగిస్తుంటాం. ఇది చాలా ప్రమాదకరం.

'నాట్ యాన్ ఓఆర్‌ఎస్' సూచిక గమనించి కొనండి..

మార్కెట్‌లో ఓఆర్‌ఎస్‌గా విక్రయిస్తున్న ఉత్పత్తులపై సీడీఎస్‌ఓకు ఫిర్యాదు చేయగా 2022లో ప్రత్యేక ఆర్డర్‌ను జారీ చేశారు. ఇందులో భాగంగా సదరు సంస్థలకు ఇది ఓఆర్‌ఎస్ కాదు అని ఉత్పత్తులపై సూచించాలని పేర్కొంది. దీనిపై ప్రజల్లో అవగాహన లేకపోవడంతో ఇప్పటికీ ఈ జూస్‌లనే ఓఆర్‌ఎస్‌లుగా తీసుకుంటున్నారు. ఇలాంటి ఉత్పత్తులను ఎనర్జీ డ్రింక్స్ అంటూ ప్రముఖ సినీతారలు ప్రచారం చేయడం దురదృష్టకరం. ప్రోలైట్ ఓఆర్‌ఎస్, డాక్టర్ మొరేపెన్ ఓఆర్‌ఎస్, ఓఆర్‌ఎస్ వాలైట్ వంటి కొన్ని ఉత్పత్తులు మాత్రమే ప్రపంచ ఆరోగ్య సంస్థ నిబంధనలను పాటిస్తున్నాయి.

– డాక్టర్ శివరంజని సంతోష్, చీఫ్ కన్సల్టెంట్ పీడియాట్రిషియన్, మాగ్నా సెంటర్

ఇంటి వైద్యం మేలు..



డీహైడ్రేషన్‌కు కారణమయ్యే డయేరియాకు ఎలాంటి మందు లేదు. కేవలం నివారణ మాత్రమే. సాధారణంగా ఓఆర్‌ఎస్ చిన్న చిన్న ప్యాకెట్ల రూపంలో 2 రూపాయలకు లభిస్తాయి. ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో ఉచితంగా అందుబాటులో ఉంటాయి. ఈ ఓఆర్‌ఎస్‌ను సుమారుగా 50 మి.లీ పరిమాణంలో రోజుకు 4, 5 సార్లు మాత్రమే చిన్నారులకు అందించాలి. మజ్జిగ లేదా వెజ్ సూప్, గంజిలో కాసింత ఉప్పు (సోడియం) కలిపి రోజులో కొద్ది కొద్దిగా తాగినా కూడా డీహైడ్రేషన్ నుంచి ఉపశమనం లభిస్తుంది. డీహైడ్రేషన్ లేని సమయంలో కూడా ఆరోగ్యం కోసం కొందరు ఓఆర్‌ఎస్‌ను తీసుకుంటారు. ఈ విధానం కూడా అనర్థమే. శరీరంలో ఎలక్ట్రోలైట్లు, సోడియం, పొటాషియం వంటి లవణాలను కోల్పోనప్పుడు అధిక గ్లూకోజ్ ఉన్నటువంటి ఈ పానీయాలు సేవించడం లవణాల సమతుల్యతను దెబ్బ తీస్తుంది.

– డాక్టర్ ఎం.కరుణ, సీనియర్ కన్సల్టెంట్ పీడియాట్రిషియన్, అపోలో

కిడ్నీ రాకెట్స్ కేరాఫ్ సిటీ!

అంతర్జాతీయ ముఠాలకు ఇక్కడి వారితో లింకులు

గతంలోనూ వెలుగులోకి అనేక కేసులు

- తాజాగా కేరళ రాకెట్‌లో వాంటెడ్‌గా..
- వీరిలో ఓ ఆస్పత్రిలో పని చేస్తున్న వైద్యుడు సైతం
- వలస కూలీలకు ఎర వేసి మూత్రపిండాలు స్వాహా



సాక్షి, సిటీబ్యూరో: మెడికల్, ఫార్మా రంగాలకు హబ్‌గా మారిన హైదరాబాద్ మహా నగరం కిడ్నీ అక్రమ మార్పిడి రాకెట్లకూ అడ్డాగా మారుతోంది. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో వెలుగులోకి వస్తున్న కేసుల్లో నగరం ప్రస్తావన ఉంటోంది. కొన్నింటిలో ఇక్కడి వైద్యులు, దళారులే కీలకంగా మారుతున్నారు. ఈ ముఠాల చేతిలో నిరుపేదలు, వరుస కూలీలే సమిధలు అవుతున్నారు. గడిచిన కొన్నేళ్లల్లో ఇలాంటి అనేక కేసులు వెలుగులోకి రాగా.. తాజాగా ఇరాన్‌తో ముడిపడి ఉన్న కేరళ కిడ్నీ రాకెట్‌లో హైదరాబాద్‌కు చెందిన ఓ డాక్టర్, ఇద్దరు దళారులు కీలకంగా మారారు. వీరి కోసం గాలిస్తూ కేరళ పోలీసులు నగరంలో మకాం వేశారు. ఈ కిడ్నీ రాకెట్స్‌తో అత్యధికం శ్రీలంకతో ముడిపడి ఉండగా.. నిందితుల్లో వైద్యులు కూడా ఉండటం గమనార్హం.

2015లో చిక్కిన 'కొలంబో' ముఠా..

హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు 2015 ఫిబ్రవరిలో ఓ కిడ్నీ రాకెట్‌ను ఛేదించి, అక్రమ వ్యాపారం చేస్తున్న షిర్డీకి చెందిన డాక్టర్‌తో పాటు నగరానికి చెందిన ముగ్గురు ఏజెంట్లను అరెస్టు చేశారు. ఈ ముఠా దేశం నలుమూలల నుంచి దాతలను, గ్రహీతలను ఎంపిక చేసుకుంది. వీరితో ఒప్పందాలు కుదుర్చుకుని నకిలీ పత్రాలతో టెహ్రాన్, శ్రీలంక రాజధాని కొలంబోలోని ఆసుపత్రులకు తీసుకువెళ్లింది. అక్కడ మార్పిడి సర్జరీలు చేయించిది. ఒక్కో గ్రహీత నుంచి రూ.30 లక్షలు వసూలు చేస్తూ.. విక్రయించిన వారికి మాత్రం నామమాత్రంగా చెల్లించింది. భోపాల్ యూనివర్సిటీలో ఎంబీబీఎస్, ఎండీ చేసిన డాక్టర్ హిర్దేష్ సక్సేనా సూత్రధారిగా ఉన్న ఈ ముఠాలో నగరానికి చెందిన రాఘవేంద్ర, అశోక్, సంజయ్ పాత్రధారులుగా ఉన్నారు.

2019లో మూడు దేశాలతో ముడి..

సోషల్‌మీడియా వేదికగా టర్కీ, ఈజిప్ట్, శ్రీలంక కేంద్రంగా సాగుతున్న కిడ్నీ రాకెట్ గుట్టును రాచకొండ స్పెషల్ ఆపరేషన్ టీమ్ (ఎస్‌ఓటీ) పోలీసులు 2019లో రట్టు చేశారు. సందీప్ అనే వ్యక్తి 'కిడ్నీ నీడెడ్ ఇన్ ఇండియా' పేరుతో ఫేస్‌బుక్‌లో పోస్టు చేశాడు. ఇది చూసి ఆకర్షితుడైన నగరానికి చెందిన ఓ వ్యక్తి వాట్సాప్ ద్వారా సందీప్‌ను సంప్రదించాడు. తమ రోగికి కిడ్నీ ఇస్తే రూ.20 లక్షలు చెల్లిస్తానంటూ సందీప్ ఎర వేశాడు. దీనికి బాధితుడు అంగీకరించడంతో నోయిడా పిలిపించిన నిందితులు వైద్య పరీక్షలు చేయించారు. ఆపై నకిలీ డాక్యుమెంట్లతో టర్కీ తీసుకువెళ్లి... అవసరమైన వ్యక్తికి కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్ చేశారు. చివరకు డబ్బులు చెల్లిస్తానని చెప్పి మొత్తం ఇవ్వకుండా వేధించిన ముఠా.. అతడి పాస్‌పోర్టు సైతం అధీనంలోకి తీసుకుంది. ఎట్టకేలకు విషయం వెలుగులోకి రావడంతో ఎస్‌ఓటీ పోలీసులు సందీప్ సహా ముగ్గురిని అరెస్టు చేశారు.

శ్రీలంక కేంద్రంగా శ్రీనివాస్ వ్యవహారం..

శ్రీలంక కేంద్రంగా అక్రమ కిడ్నీ మార్పిడి వ్యవహారం నడిపిన పవన్ శ్రీనివాస్‌ను 2020 జూలైలో బంజారాహిల్స్ పోలీసులు అరెస్టు చేశారు. గుంటూరుకు చెందిన ఇతగాడు షేర్లతో నష్టపోయి, 2013లో ఆన్‌లైన్‌లో పరిచయమైన కిడ్నీ రాకెట్‌కు తన కిడ్నీ అమ్ముకున్నాడు. ఆపై తేలిగ్గా డబ్బు సంపాదించడం కోసం అదే దందా ప్రారంభించాడు. దాదాపు ఏడుగురిని నగరం నుంచి తీసుకువెళ్లి అక్రమ కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్లు చేయించాడు. 2016లో శ్రీలంక పోలీసులకు చిక్కిన ఇతగాడు 15 నెలలు అక్కడి జైల్లో గడిపి వచ్చాడు. ఆపై పంథా మార్చిన ఇతగాడు మోసాలకు తెరలేపాడు. కిడ్నీ అవసరమైన వారికి ఇంటర్నెట్ ద్వారా వల వేసేవాడు. ఆకర్షితులైన వారితో టర్కీ తీసుకువెళ్లి మెరుగైన వైద్యం చేయిస్తానని, కిడ్నీ డోనర్స్‌ను ఏర్పాటు చేస్తానని నమ్మబలికేవాడు. బంజారాహిల్స్‌కు చెందిన ఓ పేషెంట్ భార్య నుంచి రూ.24 లక్షలు తీసుకుని మోసం చేశాడు. దీంతో విషయం పోలీసుల వరకు రావడంతో కిడ్నీ రాకెట్ గుట్టు వీడింది.



కథ మొదలయ్యేది డయాలసిస్ సెంటర్ల నుంచే...

దేశంలో అవయవాల ట్రాన్స్‌ప్లాంటేషన్ ఒకప్పుడు తేలిగ్గా జరిగేది. దీన్ని ఆసరాగా చేసుకున్న కొందరు భారీ స్కామ్‌లకు పాల్పడ్డారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం నిబంధనల్ని కఠినతరం చేసింది. కేవలం జీవన్‌దాన్ వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్‌కు చేరుకున్న వారికి, ప్రాధాన్యత క్రమంలో ఆయా అవయవాలు లభిస్తుంటాయి. ఇందులో వేచి ఉండాల్సిన కాలం ఎక్కువ కావడంతో పలువురు కిడ్నీ అవసరమైన వాళ్లు అడ్డదారులు వెతుక్కుంటున్నారు. దీన్ని క్యాష్ చేసుకోవడానికి అంతర్జాతీయ, జాతీయ ముఠాలు డయాలసిస్ సెంటర్ల నుంచి దందా ప్రారంభిస్తున్నారు. వైద్యుల్ని సైతం తమతో కలుపుకుని ముందుకు వెళ్తున్నారు. నిరుపేదలతో పాటు వలస కూలీలకు డబ్బు ఎర వేసి అవయవదానానికి ఒప్పిస్తున్నారు. ఈ మార్పిడి శస్త్ర చికిత్సలు సైతం ఇక్కడ కష్టసాధ్యం కావడంతో నకిలీ పత్రాలతో విదేశాలకు తీసుకువెళ్లి పని పూర్తి చేస్తున్నారు. ఉదంతాలు జరిగాక కేసులు, అరెస్టులు తప్ప ఈ దందా నిరోధానికి పోలీసులు, ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు కనిపించట్లేదనే విమర్శ ఉంది.

కిరాతకుడు

బాచుపల్లిలో భార్యను పాశవికంగా హత్య చేసిన భర్త



నిందితుడు భరద్వాజ్

- మృతదేహాన్ని ముక్కలు చేసేందుకు విఫల యత్నం
- కత్తితో తానూ పొడుచుకుని ఆత్మహత్యా ప్రయత్నం
- 20 రోజుల తర్వాత వెలుగు చూసిన ఘటన
- మీడియాకు వెల్లడించని పోలీసులు, స్థానికులు
- ఘటనపై తలెత్తుతున్న పలు అనుమానాలు

- వివరాలు 8లో



హత్యకు గురైన మధులత

గ్రేటర్‌లో ఎలక్ట్రిక్ వాహనాల సంఖ్య సుమారుగా..

బైక్‌లు : 1,07,200
కార్లు : 9,750
ఆటోలు : 1,550
ఈ-రిక్షాలు : 75
గూడ్స్ క్యారేజ్‌లు : 1,500



ఈవీ రయ్ రయ్..

గ్రేటర్‌లో 1.20 లక్షలకు పైగా ఎలక్ట్రిక్ వాహనాలు



బ్యాటరీల భరోసాతో భారీగా పెరిగిన అమ్మకాలు

లక్షకు పైగా బైక్‌లే...

క్రమంగా పెరుగుతున్న కార్లు, ఆటోలు

పెట్రోలు బంకుల్లో బారులు తీరవలసిన అవసరం లేదు. ఇంధనం కోసం ప్రతి రోజు రూ.వందల్లో వెచ్చించవలసిన పనిలేదు. రాత్రిపూట ఓ ఐదారు గంటలు చార్జింగ్ చేస్తే చాలు పగలంతా హాయిగా మీ వాహనాలపై పరుగులు తీయొచ్చు. అందుకే సిటీజనులు ఇప్పుడు ఈవీ(ఎలక్ట్రిక్ వెహికల్స్) వైపు చూస్తున్నారు. దీంతో కొంతకాలంగా నగరంలో ఈ వాహనాల వినియోగం పెరుగుతోంది. ఇంధనభారాన్ని దృష్టిలో ఉంచుకొని చాలామంది ఎలక్ట్రిక్ వాహనాలను కొనుగోలు చేస్తున్నారు. ఒకసారి చార్జింగ్ చేస్తే కనీసం 60 నుంచి వంద కిలోమీటర్ల వరకు ఎలాంటి ఇబ్బంది లేకుండా సాఫీగా ప్రయాణం చేసే సదుపాయం ఉన్న వాహనాలు కూడా ఇప్పుడు అందుబాటులోకి వచ్చాయి. దీంతో విద్యుత్ ఆధారిత వాహనాలపై ఆసక్తి చూపుతున్నారు.

– సాక్షి, సిటీబ్యూరో

గ్రేటర్ పరిధిలో ప్రత్యేకంగా సగటు వేతన జీవులు ఎలక్ట్రిక్ బైక్‌లను ఎక్కువగా కొనుగోలు చేస్తున్నారు. దీంతో గత రెండేళ్లుగా ఈ వాహనాల సంఖ్య గణనీయంగా పెరిగింది. ప్రస్తుతం గ్రేటర్‌లో సుమారు లక్షా 20 వేలకు పైగా ఎలక్ట్రిక్ వాహనాలు ఉన్నాయి. వాటిలో లక్షకు పైగా ద్విచక్ర వాహనాలే ఉన్నట్లు అంచనా. ఈ కేటగిరీకి చెందిన వాహనాల అమ్మకాలు రోజు రోజుకు పెరుగుతున్నాయి. నగరంలో సుమారు ఐదారేళ్ల క్రితమే ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం మొదలైంది. కానీ ఈ మూడేళ్లుగా బ్యాటరీ బండ్ల దూకుడు పెరిగినట్లు రవాణా అధికారులు చెబుతున్నారు.

బ్యాటరీల భరోసా పెరిగింది...

గతంలో కంటే ఇప్పుడు నాణ్యమైన బ్యాటరీలు వినియోగంలోకి వచ్చాయి. దీంతో వాహనదారులకు ఎలక్ట్రిక్ వాహనాలపైన భరోసా పెరిగింది. నాలుగేళ్ల క్రితం నాసిరకం బ్యాటరీల కారణంగా తరచుగా ప్రమాదాలు జరగడంతో చాలామంది వెనుకడుగు వేశారు. కానీ కొన్ని ఆటోమొబైల్ సంస్థలు నాణ్యమైన బ్యాటరీలతో మార్కెట్‌లోకి వచ్చాయి. ఐదేళ్ల వారెంటీలతో వాహనాలను విక్రయిస్తున్నాయి. 'మొదట్లో నాణ్యత లేని బ్యాటరీలు త్వరగా వేడెక్కేవి. కానీ రెండేళ్లుగా ఆటోమోటివ్ ఇండియన్ స్టాండర్డ్స్ (ఏఐఎస్) ధృవీకరించిన ప్రమాణాల మేరకు బ్యాటరీలు వస్తున్నాయి. నాణ్యత బాగా పెరిగింది. బ్యాటరీ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (బీఎంఎస్) బాగుంది.' అని ఓ ఆటోమొబైల్ డీలర్ చెప్పారు. దీంతో ధర కాస్త ఎక్కువే అయినా నమ్మకమైన బ్రాండ్‌లకు చెందిన వాహనాలనే వినియోగదారులు కొనుగోలు చేస్తున్నారు. ఎలక్ట్రిక్ వాహనాలను ప్రోత్సహించే చర్యల్లో భాగంగా ప్రభుత్వం కార్లతో పాటు 2 లక్షల బైక్‌లకు జీవితకాల పన్ను నుంచి మినహాయింపునిచ్చింది. హైదరాబాద్‌తో పాటు, తెలంగాణ అంతటా ప్రస్తుతం 1.6 లక్షలకు పైగా ద్విచక్రవాహనాలు రోడ్డెక్కాయి. మరో 90 వేలకు పైగా వాహనాలకు పన్ను మినహాయింపు అవకాశం ఉంది. ఎలక్ట్రిక్ కార్లకు కూడా జీవితకాల పన్ను నుంచి మినహాయింపునిచ్చారు. దశలవారీగా 8 వేలకు పైగా వాహనాలకు ఈ అవకాశం లభించింది.

వెయిట్ ప్లీజ్...

ఎలక్ట్రిక్ బైక్‌లకు ఇటీవల భారీగా డిమాండ్ పెరిగిన దృష్ట్యా..కొనుగోలుదారులు కనీసం రెండు, మూడు నెలల ముందే వాహనాలను బుక్ చేసుకోవలసి వస్తోంది. కొన్ని బ్రాండ్‌లకు చెందిన వాహనాల కోసం ఆన్‌లైన్‌లో నమోదు చేసుకొని కనీసం 3 నెలల పాటు ఎదురుచూడవలసి వస్తుందని కుషాయిగూడకు చెందిన రాఘవ తెలిపారు. పెట్రోల్ వాహనాల కంటే ధర కొద్దిగా ఎక్కువే అయినా ఇంధన భారాన్ని దృష్టిలో ఉంచుకొని ఎలక్ట్రిక్ బైక్ కొనుగోలు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ధరలు తగ్గాలి



ఎలక్ట్రిక్ వాహనాల ధరలు ఇంకా తగ్గాలి. ప్రభుత్వం జీవితకాల పన్ను నుంచి మినహాయింపునిస్తున్నప్పటికీ ధరలు కొంచెం భారంగానే ఉన్నాయి. అన్ని వర్గాలకు చెందిన వాళ్లు కొనుగోలు చేసేవిధంగా ఉంటే వినియోగం బాగా పెరుగుతుంది.
– రాఘవాచారి, కుషాయిగూడ

చార్జింగ్ కేంద్రాలు అవసరం



ప్రస్తుతం బైక్‌ల వరకు ఇంట్లోనే చార్జింగ్ చేసుకోవచ్చు. కానీ ఎక్కువ దూరం ప్రయాణించవలసినప్పుడు సిటీలో చార్జింగ్ సదుపాయం లేకపోతే చాలా కష్టం. ఇప్పుడు చాలా తక్కువగా ఉన్నాయి. ప్రతి పెట్రోల్ బంకులో ఒక చార్జింగ్ కేంద్రం ఉండేవిధంగా ఏర్పాటు చేయాలి. – షర్మిల, హబ్సిగూడ

చాలా బాగుంది



ధర కొంచెం ఎక్కువే అయినా పెట్రోల్ భారం మాత్రం తప్పింది కదా. ప్రతి నెలా కనీసం రూ.4500 వరకు పెట్రోల్ కోసం ఖర్చు చేయవలసి వచ్చింది. ఇప్పుడు ఆ ఇబ్బంది లేదు. కాబట్టి ఎలక్ట్రికల్ వెహికల్ బాగుంది.
– కరుణాకర్, ఈసీఐఎల్

నేటి నుంచి తెలంగాణ ఎడ్యుకేషన్ ఫెయిర్



సాక్షి, సిటీబ్యూరో: తెలంగాణ విద్యా సమితి ఆధ్వర్యంలో శనివారం నుంచి 2 రోజుల పాటు ఉప్పల్ శిల్పారామం వేదికగా తెలంగాణ ఎడ్యుకేషన్ ఫెయిర్ నిర్వహిస్తున్నట్లు సమితి అధ్యక్షుడు పెండెం తారక్ గౌడ్ మీడియాకు తెలిపారు. ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి ఈ కార్యక్రమంలో పాల్గొంటారని చెప్పారు. ఇందులో విద్యార్థులను ప్రోత్సహించడానికి ఐఏఎస్ అధికారి శరత్ నాయక్, తెలంగాణ పబ్లిక్ ప్రాసిక్యూటర్ పల్లె నాగేశ్వరావు కూడా పాల్గొంటారన్నారు. వివిధ రాష్ట్రాలకు చెందిన యూనివర్సిటీలు, కెరీర్ గైడెన్స్ నిపుణులు పాల్గొంటారని తెలిపారు. కెరీర్ గైడెన్స్ నిపుణులు అశోక్, సంస్థ ఉపాధ్యక్షుడు రమేష్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

జూన్ 3 నుంచి టెన్త్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు

సాక్షి, సిటీ బ్యూరో: పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు జూన్ 3 నుంచి 13 వరకు నిర్వహించనున్నట్లు హైదరాబాద్ జిల్లా విద్యాశాఖాధికారి రోహిణి ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్షలు ఉంటాయని, మొత్తం 35 కేంద్రాల్లో 12,186 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారని తెలిపారు. విద్యార్థులు సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేసుకోవాలని సూచించారు.

ఎంఎంటీఎస్ సర్వీసులు రద్దు

సాక్షి, సిటీబ్యూరో: సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ పునరభివృద్ధి పనులు, ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణం దృష్ట్యా ఈ నెల 25, 26 తేదీల్లో వివిధ మార్గాల్లో నడిచే పలు ఎంఎంటీఎస్ సర్వీసులను రద్దు చేయనున్నట్లు దక్షిణమధ్య రైల్వే సీపీఆర్వో సీహెచ్ రాకేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ఫలక్‌నుమా-సికింద్రాబాద్, సికింద్రాబాద్-మేడ్చల్, సికింద్రాబాద్-ఫలక్‌నుమా, మేడ్చల్-లింగంపల్లి, మేడ్చల్-సికింద్రాబాద్, లింగంపల్లి-మేడ్చల్, మేడ్చల్-హైదరాబాద్, మేడ్చల్-సికింద్రాబాద్, సిద్దిపేట్-సికింద్రాబాద్ (డెమూ) తదితర మార్గాల్లో రాకపోకలు సాగించే 26 సర్వీసులు రద్దు కానున్నాయి.

ఫేక్ వార్తలు వ్యాప్తి చేయొద్దు: నటుడు శ్రీకాంత్

బంజారాహిల్స్: నిజమైన వార్తలు రాస్తే చాలా మంచిదని, కానీ తప్పుడు వార్తలు రాస్తే అలాంటి వెబ్‌సైట్లు, చానళ్లపై ఫిర్యాదు చేస్తానని, వారు న్యాయపరంగా చిక్కులు ఎదుర్కోవాల్సి వస్తుందని సినీ నటుడు శ్రీకాంత్ అన్నారు. రేవ్ పార్టీ ఘటన నేపథ్యంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ... తాను రేవ్ పార్టీలో ఉన్నట్లు వచ్చిన వీడియోలో ఉన్నది తాను కాదని చెప్పినా కూడా కొంత మంది ఇంకా వాటిని తానే అన్నట్లుగా ప్రసారం చేస్తున్నారని, అది మంచి పద్ధతి కాదని అన్నారు. తాను పోలీసులకు, కోర్టుల్లోనే ఫిర్యాదు చేయాల్సి వస్తుందని అన్నారు. తనది రేవ్ పార్టీలకు వెళ్లే నేచర్ కాదని ఆయన అన్నారు. శుక్రవారం ఫిలింనగర్ కల్చరల్ సెంటర్‌లో జరిగిన ఓ ప్రైవేట్ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో హీరోయిన్ హెబ్బా పటేల్, ప్రముఖ నిర్మాత ఏఎం రత్నం, నటులు బాలాదిత్య, శ్రవణ్, మధు, తదితరులు పాల్గొన్నారు.

బండ్లగూడ జాగీరు మేయర్ ఏకగ్రీవ ఎన్నిక

బండ్లగూడ: గండిపేట మండలం బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ రెండో మేయర్‌గా మద్దెల లతాప్రేమ్‌గౌడ్ శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రాజేంద్రనగర్ ఆర్డీవో వెంకట్‌రెడ్డి ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. మొత్తం 21 మంది కార్పొరేటర్లకుగాను డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్‌రెడ్డి సహా 17 మంది మున్సిపల్ కార్యాలయంలో జరిగిన మేయర్ ఎన్నిక సమావేశానికి హాజరయ్యారు. కార్పొరేటర్లు అందరూ లతాప్రేమ్‌గౌడ్‌కు మద్దతు తెలపడంతో ఆమె మేయర్ పీఠాన్ని దక్కించుకున్నారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ బి.శరత్‌చంద్ర అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆమె మేయర్‌గా బాధ్యతలు స్వీకరించారు. కాగా, జనవరి 12న అప్పటి బీఆర్‌ఎస్ మేయర్ మహేందర్ గౌడ్‌పై కార్పొరేటర్లు జిల్లా కలెక్టర్‌కు అవిశ్వాస నోటీసు ఇవ్వగా ఆయన హైకోర్టుకు వెళ్లి స్టే తెచ్చుకున్నారు. అనంతరం 17 మంది కార్పొరేటర్లు మార్చి 21న అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టి మహేందర్‌గౌడ్‌ను తొలగించారు. బీఆర్‌ఎస్ నుంచి కార్పొరేటర్‌గా ఎన్నికైన లతాప్రేమ్‌గౌడ్ కాంగ్రెస్‌లో చేరి తాజాగా మేయర్ పీఠాన్ని దక్కించుకోవడం గమనార్హం.

వెంకటరమణ మృతి పట్ల కేటీఆర్ దిగ్భ్రాంతి

సాక్షి, సిటీ బ్యూరో: మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ సూపరింటెండింగ్ ఇంజినీర్ వెంకటరమణ మృతిపై మాజీ మంత్రి కేటీఆర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. అంకితాభావంతో పనిచేసే వ్యక్తి మరణ వార్త తనను కలచివేసిందన్నారు. దుర్గం చెరువుతో సహా జీహెచ్‌ఎంసీ వెస్ట్‌జోన్‌లో జరిగిన ఎస్‌ఆర్‌డీపీ పనుల్లో ఆయన కీలకంగా వ్యవహరించారన్నారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలుపుతూ ఎక్స్ (ట్విట్టర్) వేదికగా కేటీఆర్ పోస్ట్ చేశారు.

'మాట్రిమోనియల్' మోసగాడి అరెస్టు



నిందితుడు అశోక్‌రెడ్డి

రాయదుర్గం: పెళ్లి సంబంధాలు కుదుర్చుతామని నకిలీ మాట్రిమోనియల్ సైట్ల ద్వారా మోసాలకు పాల్పడున్న నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఈమేకు శుక్రవారం సైబరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు మీడియాకు వివరాలు వెల్లడించారు. మారం అశోక్‌రెడ్డి అనే వ్యక్తి నకిలీ వెబ్‌సైట్లు, స్నాప్ చాట్ ద్వారా మహిళలను ఆకర్షిస్తూ మోసగిస్తున్నాడు. ఇటీవల ఓ మహిళకు పెళ్లి సంబంధం పేరిట మాయమాటలు చెప్పి రూ.14 లక్షలు కొట్టేశాడు. దీనిపై ఫిర్యాదు మేరకు విచారణ జరిపి నిందితుడిని అరెస్టు చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు.

ఇద్దరు పిల్లలతో సహా తల్లి అదృశ్యం



పిల్లలతో స్వాతి (ఫైల్)

మలక్‌పేట: ఇద్దరు పిల్లలతో సహా తల్లి అదృశ్యమైన సంఘటన మలక్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్ఐ జయంత్ తెలిపిన వివరాల ప్రకారం..ప్రైవేట్ ఉద్యోగి ఎం.వెంకటేష్ భార్య స్వాతి (28), కుమారులు అభిజ్ఞాన్ (4), వశిజ్ఞాన్(3)తో కలిసి మూసారంబాగ్ ఫ్రెండ్స్ కాలనీలో నివాసం ఉంటున్నారు. ఈ నెల 21 తేదీన ఉదయం 6.30 గంటలకు స్వాతి ఇద్దరు పిల్లలను తీసుకుని ఇంటి నుంచి బయటికి వెళ్లింది. తిరిగి రాకపోవడంతో భర్త ఆమె సెల్‌కు ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. చుట్టుపక్కల, బంధువులు, స్నేహితుల వద్ద వెదికినా ఆచూకీ దొరకలేదు. దీంతో మలక్‌పేట పోలీసులకు ఫిర్యాదు చేశాడు. గతంలో ఇలా రెండు, మూడు సార్లు స్వాతి బయటికి వెళ్లి తిరిగి వచ్చిందని ఆయన ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

కిరాతకుడు

- బాచుపల్లిలో భార్యను పాశవికంగా హత్య చేసిన భర్త
- ఘటనపై పలు అనుమానాలు



మధులత, భరద్వాజ్(ఫైల్)

నిజాంపేట్: కుటుంబ కలహాలు ఓ మహిళ ప్రాణాలు తీశాయి. కర్కోటకుడైన ఓ భర్త.. భార్యను అతిదారుణంగా హత్య చేసి..మృతదేహాన్ని ముక్కలుగా నరికేందుకు యత్నించాడు. బాచుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన ఈ సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. దీనిపై శుక్రవారం మృతురాలి కుటుంబ సభ్యులు, పోలీసులు తెల్పిన వివరాలు ఇలా ఉన్నాయి. ప్రకాశం జిల్లా కొనకనమెట్ల మండలం గోట్లగట్టు గ్రామానికి చెందిన మధులత(29)కు ప్రకాశం జిల్లా దర్శికి చెందిన నాగేంద్ర భరద్వాజ్‌కు 2020లో వివాహం జరిగింది. వీరిద్దరు సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు కావడంతో బాచుపల్లి పరిధిలోని సాయి అనురాగ్ కాలనీలోని ఎంఎస్ఆర్ ప్లాజా బి బ్లాక్‌లో నివాసం ఉంటున్నారు. పెళ్లయిన కొద్దిరోజుల తర్వాత దంపతుల మధ్య విభేదాలు ఏర్పడి తరచు గొడవ పడేవారు. డబ్బుల విషయంలో గొడవలు జరిగాయని, భరద్వాజ్ తరుచుగా మధులతను అనుమానించేవాడని బంధువులు ఆరోపించారు. ఈ నేపథ్యంలో మధులత పుట్టింటికి వెళ్లిపోయింది. ఆ సమయంలో గర్భవతిగా ఉన్న మధులత మగ బిడ్డకు జన్మనిచ్చింది. ఇక నాటి నుంచి భరద్వాజ్ భార్య వద్దకు వెళ్లలేదు. ఈదశలో బంధువులు జోక్యం చేసుకుని ఈ ఏడాది ఫిబ్రవరి 22న ఇద్దరికి రాజీ కుదుర్చి మధులతను భరద్వాజ్‌తో కాపురానికి పంపించారు.

విచక్షణ కోల్పోయి..

రాజీ కుదుర్చినా వారిద్దరి మధ్య గొడవలు సద్దుమణగలేదు. ఈ నేపథ్యంలో ఏపీలో ఈ నెల 13న ఎన్నికలు ఉండటంతో తాను పుట్టింటికి వెళ్తానని మధులత చెప్పగా..ఈ నెల 4న ఇద్దరి మధ్య గొడవ ప్రారంభం అయ్యింది. విచక్షణ కోల్పోయిన భరద్వాజ్ భార్య మధులత తలను నేలకేసి కొట్టి కత్తితో విచక్షణా రహితంగా పొడిచి హత్య చేశాడు. అనంతరం ముక్కలుగా నరికి మాయం చేయాలనుకుని మోకాలి కింద భాగాలను కోసే ప్రయత్నం చేశాడు. వీలుకాక ఈ ప్రయత్నాన్ని విరమించుకుని ప్రమాదంగా చిత్రీకరించే యత్నం చేశాడు. ఇందులో భాగంగా ఇంట్లోని వంట గ్యాస్‌ను లీక్ చేసి భార్య మృతదేహాన్ని ఇంట్లోనే పెట్టి తాళం వేసి కుమారుడితో పరారయ్యాడు. గ్యాస్ వాసన రావడంతో అపార్ట్‌మెంట్ వాసు లు పోలీసులకు సమాచారం ఇవ్వగా..పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి తలుపులు బద్ధలు కొట్టి గ్యాస్‌ను నిలిపివేశారు. అనంతరం మధుల త మృతదేహాన్ని చూసి ఖంగుతిన్నారు.

హత్య చేసి స్నేహితుడి ఇంటికి....

భార్యను హత్య చేసిన భరద్వాజ్ చందానగర్‌లోని స్నేహితుడు శ్రీనివాస్ ఇంటికి వెళ్లాడు. తాను భార్యను హత్య చేశానని, తన కుమారుడిని జాగ్రత్తగా చూసుకోవాలని చెప్పి భార్యను పొడిచిన కత్తితోనే తాను సైతం పొడుచుకున్నాడు. దీంతో భయాందోళనకు గురైన శ్రీనివాస్ 100కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వగా పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. భరద్వాజ్‌కు ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స చేయించి అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

పసికందు ముందే..

కుమారుడు శ్రీజై (17 నెలలు) ఇంట్లో ఆడుకుంటుండగా..బాలుని ముందే భరద్వాజ్ భార్యతో గొడవ పడి హత్య చేశాడు. మే 4న రాత్రి సుమారు 9 గంటల సమయంలో ఈ హత్య చేసినట్లు పోలీసులు పేర్కొంటున్నారు.

పోలీసుల వివరణ

మధులత హత్య కేసు విషయమై బాచుపల్లి ఎస్‌హెచ్ఓ ఉపేందర్‌ను వివరణ కోరగా ఈ నెల 4న తమకు సుమారు రాత్రి 12 గంటల సమయంలో సమాచారం వచ్చిందని తెలిపారు. వెంటనే సంఘటన స్థలానికి చేరుకొని భరద్వాజ్‌ను అదుపులోకి తీసుకొని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. అదే రాత్రి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీకి తరలించడం జరిగిందన్నారు. ఎన్నికల విధుల్లో ఉన్న కారణంగా మీడియాకు కేసు వివరాలు వెల్లడించలేదన్నారు.

అన్నీ అనుమానాలే..

మధులత హత్యపై పలు అనుమానాలు వ్యక్తమయ్యాయి. ఈ నెల 4న హత్య జరగగా పోలీసులు ఈ విషయాన్ని గోప్యంగా ఉంచారు. మీడియాకు తెలుపలేదు. అలాగే అపార్ట్‌మెంట్ వద్ద ఇంత గొడవ జరిగినా విషయం బయటకు పొక్కలేదు. హత్యకు గురైన మధులత కుటుంబ సభ్యులు సైతం హత్య జరిగిన 20 రోజుల తర్వాత ఈ విషయాన్ని శుక్రవారం మీడియాకు వెల్లడించడం కూడా ఆశ్చర్యానికి గురిచేస్తోంది.

మెటీరియల్ సరఫరా చేస్తానని..

రూ.12.89లక్షల కుచ్చుటోపీ

మహారాష్ట్రలో నిందితుడిని పట్టుకున్న పోలీసులు

పరారీలో మరో నలుగురు నిందితులు

కుత్బుల్లాపూర్: పరిశ్రమ నిర్వాహకుడి నుంచి నగదు తీసుకుని మెటీరియల్ సరఫరా చేయకుండా మోసం చేసిన వ్యక్తికి మేడ్చల్ కోర్టు రిమాండ్ విధించింది. పేట్‌బషీరాబాద్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దూలపల్లిలో ఓ వ్యక్తి జేపీ కెమ్ కార్పొరేషన్ పేరుతో పరిశ్రమ నిర్వహిస్తున్నాడు. ఈ నేపథ్యంలో గుజరాత్ బారూచ్‌కు చెందిన పటేల్ భావిన్‌భాయ్(42), భరత్, కుందన్, జయేష్, హిరన్‌లు జేపీ కెమ్ కార్పొరేషన్ యజమానిని కలిసి తాము మెటీరియల్ అందజేస్తామని నమ్మబలికారు. దీంతో అతడు బావిన్‌భాయ్ యాక్సిస్ బ్యాంక్ అకౌంట్‌కు మే 8వ తేదీన రూ.12,89,956 నగదును ట్రాన్స్‌ఫార్మర్ చేశారు.

- అయితే భావిన్‌భాయ్ మెటీరియల్‌ను సరఫరా చేయకుండా తప్పించుకునే ధోరణిలో వ్యవహరించడంతో బాధితుడు తాను మోసపోయానని గ్రహించి పేట్‌బషీరాబాద్ పోలీసులను ఆశ్రయించాడు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు మహారాష్ట్రలోని థానే నగరం కాష్మిరా పోలీస్‌స్టేషన్ లిమిట్స్‌లో ఈనెల 22న భావిన్‌భాయ్‌ను అదుపులోకి తీసుకున్నారు. అతడి వద్ద నుంచి రూ.8లక్షల నగదును రికవరీ చేశారు. కాగా మిగిలిన నలుగురు పరారీలో ఉన్నారు. ప్రధాన నిందితుడిగా ఉన్న భావిన్‌భాయ్‌ను మేడ్చల్ కోర్టులో ప్రవేశించగా రిమాండ్‌కు తరలిస్తూ కోర్టు తీర్పు ఇచ్చింది.

మత్తులో ఉన్నందునే..

- విమానం తలుపు తెరిచేందుకు ప్రయాణికుడి యత్నం ఘటన..
- స్నేహితుల వివరణ

శంషాబాద్: ప్రయాణంలో ఉన్న విమానం డోరు తెరిచే ప్రయత్నం చేసి కలకలం రేపిన ఓ ప్రయాణికుడి ఘటనలో పలు వివరాలు వెల్లడయ్యాయి. స్నేహితులతో ఉజ్జయిని వెళ్లిన ఓ ప్రయాణికుడు ఈ నెల 21 ఇండోర్ నుంచి హైదరాబాద్ వస్తున్న విమానంలో కొందరు ప్రయాణికులతో గొడవ పడడంతో అతడిని ముందు సీటులో కూర్చోబెట్టారు. ఆ తర్వాత కొద్దిసేపటికి అతడు గాల్లో ప్రయాణిస్తున్న విమానం డోరు తెరిచేందుకు యత్నించడంతో అందులోని ఉద్యోగులు నివారించారు. ఈ విషయమై ఆర్‌జీఐఏ పీఎస్‌లో కేసు నమోదు అయినప్పటికి వివిధ మెడికల్ రిపోర్టుల ఆధారంగా అతడు స్టేషన్ బెయిల్ పొందాడు. అసలు సదరు ప్రయాణికుడు అలా ప్రవర్తించడానికి గల కారణం ఏంటని స్నేహితులను ప్రశ్నించిన పోలీసులకు అతడు బంగు (మూలికలతో చేసిన మత్తుపదార్థం) సేవించడమే కారణమని తెలిపారు. బంగు మత్తులో ఉన్నందునే సదరు ప్రయాణికుడు అలా ప్రవర్తించినట్లు తెలిపారు.

జనావాసాల మధ్య మద్యం తాగుతూ హల్‌చల్

యువతి, యువకుడిపై కేసు నమోదు



అలెక్స్ బోడి చెర్ల

నాగోలు: జనావాసాల మధ్య..ఉదయం 6 గంటలకే మద్యం తాగుతూ ఓ యువతి, యువకుడు హల్‌చల్ చేశారు. నాగోలు పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం జరిగిన ఘటనపై పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..ఉప్పల్ పీర్జాదిగూడకు చెందిన అలెక్స్ బోడిచెర్ల (25) ఓ యువతితో కలిసి ఫతుల్లాగూడ 100 ఫీట్ రోడ్డుకు కారులో వచ్చారు. కారు ఆపి బీర్లు, సిగరెట్లు తాగుతూ హల్‌చల్ చేశారు. ఇదే సమయంలో ఆ రహదారిపై మార్నింగ్ వాక్‌కు వచ్చిన వాకర్స్ కలుగజేసుకుని వారిని హెచ్చరించారు. ఇలా బహిరంగంగా మద్యం తాగుతూ గొడవలు చేయొద్దని, ఇక్కడి నుంచి వెళ్లిపోవాలని చెప్పారు. దీంతో యువతీయువకులు ఇద్దరు వారితో వాగ్వాదానికి దిగి గొడవ పెట్టుకున్నారు. వాకర్స్‌లో ఒకరు ఫోన్ ద్వారా పోలీసులకు సమాచారాన్ని ఇవ్వడానికి ప్రయత్నిస్తుండగా యువతి అతని వద్ద నుండి ఫోను లాక్కోవడానికి ప్రయత్నించింది. ఈ ఘటనను కొందరు వాకర్స్ వీడియోలు తీయగా వైరల్ అయ్యాయి. ఈ మేరకు పోలీసులు రోడ్డుపై మద్యం సేవించిన అలెక్స్‌పై పబ్లిక్ న్యూసెన్స్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. యువతి కోసం గాలిస్తున్నారు. కాగా వీరిద్దరు సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు అని తెలిసింది.

వామ్మో.. హోటళ్లలో ఫుడ్డా!



బంజారాహిల్స్: ఆర్భాటంగా... తళుకు బెళుకుల ఇంటీరియర్‌తో ఆకట్టుకునే ఫర్నీచర్‌తో బంజారాహిల్స్, జూబ్లీహిల్స్ ప్రాంతాల్లో ఏర్పాటవుతున్న హోటళ్లు, రెస్టారెంట్లు, పబ్‌లలో నాణ్యతా లోపాలు, అపరిశుభ్రత, గడువుతీరిన ఆహార పదార్థాలు వెలుగు చూస్తుండటంతో ఆహార ప్రియులు షాక్ అవుతున్నారు. గడిచిన నాలుగు వారాల నుంచి ఫుడ్ సేఫ్టీ టాస్క్‌ఫోర్స్ టీమ్ సభ్యులు బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, ఫిలింనగర్, అమీర్‌పేట, పంజగుట్ట, సోమాజిగూడ, లక్డీకాపూల్, ఖైరతాబాద్ ప్రాంతాల్లోని హోటళ్లు, రెస్టారెంట్లు, పబ్‌లలో విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నాయి. ఈ తనిఖీల్లో ముఖ్యంగా కిచెన్‌లలో పరిశుభ్రత పూర్తిగా లోపించడంతో అధికారులు పేర్కొంటున్నారు.

- 'హిల్స్' హోటళ్లలో పరిశుభ్రతకు తిలోదకాలు
- గడువుతీరిన ఆహార పదార్థాలు
- బూజుపట్టిన సరుకులు
- కిచెన్‌లో ఎలుకలు, బొద్దింకల స్వైర విహారం
- పాడైన చికెన్, మటన్ గుర్తింపు
- నోటీసులు జారీ చేస్తున్న అధికారులు
- కొన్ని హోటళ్లలో ఆహార పదార్థాల సీజ్

- జూబ్లీహిల్స్‌లోని 16 పబ్‌లలో అధికారులు తనిఖీలు చేయగా దాదాపు అన్నింట్లోనూ నిల్వ చేసిన ఆహార పదార్థాలు గడువుతీరిన తరువాత కూడా వంటల్లో వినియోగిస్తున్నట్లు నిర్ధారించారు.
- ఇక హోటళ్లలోని కిచెన్‌లలో అపరిశుభ్రత, దుర్గంధం, దుర్వాసనలు, ఈగలు, దోమలు, ఎలుకలు, పందికొక్కులు, బొద్దింకలు స్వైరవిహారం చేయడమే కాకుండా వంటలకు వినియోగిస్తున్న సామగ్రిపై వాలుతున్నట్లు కూడా గుర్తించారు.
- వెజిటేరియన్, నాన్ వెజిటేరియన్ పదార్థాలను ఒకే ఫ్రిడ్జ్‌లో ఒకే రాక్‌లో పెడుతుండడాన్ని కూడా అధికారులు గుర్తించారు. చాలా హోటళ్లలో కొన్ని ఆహార పదార్థాలు బూజు పట్టి కనిపించినట్లు అధికారులు తెలిపారు. దాదాపు హోటళ్లు, రెస్టారెంట్లలోని కిచెన్‌లన్నీ బూజు పట్టిన కూరగాయలతో కనిపించాయి.
- చాలా ఫిర్యాదుల అనంతరం ఇటీవల కాలంలో ఫుడ్‌సేఫ్టీ అధికారులు ఆయా హోటళ్లపై తనిఖీలు చేస్తూ నాణ్యతపై ఆరా తీస్తుండగా చాలా హోటళ్లలో ఆహార పదార్థాలపై క్రిమికీటకాలు వాలుతున్నట్లుగా నిర్ధారణ అయ్యింది. చెత్తా చెదారం, వ్యర్థాలు వేసే డస్‌బిన్లపై మూతలు కూడా ఏర్పాటుచేయడం లేదని, దీంతో ఈగలు, దోమలు, బొద్దింకలు స్వైర విహారం చేస్తున్నట్లుగా అధికారులు తెలిపారు.
- ఇందులో కొన్ని జాతీయ స్థాయిలో పేరెన్నికగన్న చైన్ హోటళ్లు ఉన్నాయని, అలాగే అంతర్జాతీయ స్థాయి చైన్ హోటళ్లు కూడా ఈ దుర్గంధం లోపించిన జాబితాలో ఉన్నట్లు తెలిపారు.
- జీహెచ్ఎంసీ గత పదేళ్లుగా హోటళ్లలో నాణ్యతా ప్రమాణాలపై ఎలాంటి తనిఖీలు చేయకపోగా హోటళ్ల యాజమాన్యాలు ఇచ్చింది పుచ్చుకుంటూ అందినకాడికి దండుకుని అటువైపు తొంగి చూడలేదు.



జూబ్లీహిల్స్ హోటళ్లలో ఆహార పదార్థాలను తనిఖీ చేస్తున్న ఫుడ్‌సేఫ్టీ టాస్క్‌ఫోర్స్ టీమ్

- జీహెచ్ఎంసీ ఖైరతాబాద్ సర్కిల్–17, జూబ్లీహిల్స్ సర్కిల్–18 పరిధి కిందికి వచ్చే బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, ఫిలింనగర్, వెంకటేశ్వరకాలనీ, సోమాజిగూడ, ఖైరతాబాద్, అమీర్‌పేట, లక్డీకాపూల్ ప్రాంతాల్లో సుమారు 35కి పైగా పబ్‌లు, 98 రెస్టారెంట్లు, 179 హోటళ్లు ఉన్నాయి. ఈ సర్కిళ్ల పరిధిలోని ఫుడ్ సూపర్‌వైజర్లు ఏనాడూ తనిఖీలు చేయకపోగా పరిశుభ్రతను పట్టించుకోలేదు. దీంతో కొత్తగా ఫుడ్‌సేఫ్టీ కమిషనర్‌ను ఏర్పాటుచేసి టాస్క్‌ఫోర్స్ బృందాన్ని నియమించడంతో ఈ హోటళ్లు, పబ్‌లలో అక్రమాలు వెలుగు చూస్తున్నాయి.
- కేఎఫ్‌సీ లాంటి ఇంటర్నేషనల్ చైన్ హోటళ్లలో కూడా ఈ అధికారులు దాడులు చేసి ఆహార పదార్థాల నాణ్యతపై నోటీసులు జారీ చేశారు.

ఉల్లంఘించిన హోటళ్ల జాబితా..

క్రీమ్ స్టోన్, నేచురల్స్ ఐస్‌క్రీమ్, కరాచి బేకరీ, కేఎఫ్‌సీ, రోస్ట్రీ కాఫీ హౌస్, రాయలసీమ రుచులు, షాగౌస్, కామత్ హోటల్, 36 డౌన్ టౌన్ పబ్, మకావ్ కిచెన్ అండ్ బార్ పబ్, ఎయిర్ లైవ్, టాకో బెల్, ఆహా దక్షిణ్, కిజిలింగ్ జో, ఖాన్‌సాబ్, హోటల్ సుఖ్‌సాగర్, జంబో కింగ్ బర్గర్స్, రత్నదీప్ రిటైల్ స్టోర్, సోమాజిగూడ కృతుంగ రెస్టారెంట్, సోమాజిగూడ రెస్ట్ ఓ బార్.

ద్వారకా హోటల్‌పై కేసు నమోదు

ఖైరతాబాద్: లక్డీకాపూల్‌లోని హోటల్ ద్వారకాలో భోజనం చేసేందుకు వచ్చిన దంపతులకు పాడైన ఆహారాన్ని సరఫరా చేశారని శుక్రవారం ఖైరతాబాద్ పోలీస్ స్టేషన్‌లో బాధితురాలు ఫిర్యాదు చేసింది. దీంతో ద్వారకా హోటల్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచార మేరకు... మల్కాజిగిరిలో నివాసముండే కె.శ్రవంతి, భర్త శ్రీధర్‌లు లక్డీకాపూల్‌లోని హోటల్ ద్వారకాలో భోజనం చేసేందుకు వచ్చారు. సాంబార్ పాడైపోయినట్లు గుర్తించి హోటల్ సిబ్బందికి ఫిర్యాదు చేశారు. వారు స్పందించకపోవడంతో క్యారెట్ హల్వా, దాల్ హల్వా పార్సిల్ తీసుకొని ఇంటికి వెళ్లి తినేందుకు ప్రయత్నించినప్పుడు క్యారెట్ హల్వా చెడిపోయి ఘాటైన వాసన రావడంతో వెంటనే హోటల్ వద్దకు వచ్చి మేనేజర్‌కు ఫిర్యాదు చేసింది. అప్పటికే వాంతులు అవుతుండటంతో పాడైన ఆహారాన్ని సరఫరా చేసినందుకు మెడికల్ ఖర్చులు భరించాలని వారిని కోరింది. హోటల్ యాజమాన్యం వారి పట్ల అసభ్యంగా ప్రవర్తించడంతో ఖైరతాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. స్రవంతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, ఫుడ్ సేఫ్టీ అధికారులకు సమాచారమిచ్చారు. ఫుడ్ శాంపిల్స్‌ను ల్యాబ్‌కు పంపించినట్లు ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్ తెలిపారు.

రాజ్‌భవన్ హైస్కూల్ విద్యార్థుల ప్రతిభను చాటుతూ ఫ్లెక్సీలు



రాజ్‌భవన్ హైస్కూల్ ముందు పది విద్యార్థుల ఘనతను చాటుతూ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

బంజారాహిల్స్: పదో తరగతి 2024 ఫలితాల్లో సోమాజిగూడ రాజ్‌భవన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఖైరతాబాద్ మండల పరిధిలోనే మొదటి స్థానంలో నిలిచారని 21 మంది విద్యార్థులు వేర్వేరు సబ్జెక్టుల్లో 10 జీపీఏ సాధించారంటూ పాఠశాల ఉపాధ్యాయులు ఏర్పాటుచేసిన ఫ్లెక్సీ తల్లిదండ్రులను పెద్ద ఎత్తున ఆకర్షిస్తున్నది. ఇక్కడ 126 మంది విద్యార్థులు పది పరీక్ష రాయగా ఇందులో 123 మంది విద్యార్థులు పాసై 95 శాతం ఫలితాలతో పాఠశాల పేరును నగరవ్యాప్తంగా చాటిచెప్పారు. గత ఏడాది కూడా ఈ పాఠశాల విద్యార్థులు ఖైరతాబాద్ మండల పరిధిలో పది ఫలితాల్లో మొదటిస్థానంలో నిలిచారు. అంతేకాకుండా 11 మంది విద్యార్థులు 9కి పైగా జీపీఏ సాధించి రికార్డు సృష్టించారు. విద్యార్థుల ప్రతిభను, ఘనతను చాటిచెబుతూ ఉపాధ్యాయులు పాఠశాల బయట ఏర్పాటుచేసిన ఫ్లెక్సీ విశేషంగా ఆకట్టుకుంటుంది. తమ విద్యార్థులు పది ఫలితాల్లో సాధించిన విజయాలను చాటిచెబుతూ దీనిని ఏర్పాటుచేశారు. 95 శాతం ఫలితాలు రావడం పట్ల ఇక్కడ ఉపాధ్యాయులు ఆనందం వ్యక్తంచేయడమే కాకుండా హైదరాబాద్ జిల్లా పరిధిలోనే మిగతా పాఠశాలలతో పోలిస్తే అత్యుత్తమ ఫలితాలతో రికార్డు సృష్టించిన విషయాన్ని తెలియజేస్తున్నారు.

జూన్ 10 నుంచి ఆమరణ దీక్ష

పంజగుట్ట: విద్యార్థులు, నిరుద్యోగులు, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి జూన్ 10వ తేదీ నుంచి ఆమరణ నిరాహార దీక్ష చేయనున్నట్లు వరంగల్, నల్లగొండ, ఖమ్మం పట్టభద్రుల ఎన్నికల ఇండిపెండెంట్ అభ్యర్థి పాలకూరి అశోక్ కుమార్ తెలిపారు. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఉస్మానియా యూనివర్సిటీ నిరుద్యోగ జేఏసీ, వివిధ విద్యార్థి, నిరుద్యోగ సంఘాలు ఆయనకు మద్దతుగా నిలిచాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... విద్యార్థులు, నిరుద్యోగులకు వ్యతిరేకంగా ఉన్న గత ప్రభుత్వాన్ని దించి కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకువచ్చినా ఒరగబెట్టింది ఏమీలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాను గెలవగానే ఇటు నిరుద్యోగులకు, ఉద్యోగులకు, విద్యార్థులకు బాసటగా నిలుస్తానని పేర్కొన్నారు.

'లేబుల్ లవ్' ఎగ్జిబిషన్ ప్రారంభం



బంజారాహిల్స్‌లోని తాజ్‌కృష్ణ హోటల్‌లో లేబుల్ లవ్ 6 లైఫ్‌స్టైల్ ఎగ్జిబిషన్ శుక్రవారం ప్రారంభమైంది. ఎగ్జిబిషన్‌ను శశినాథ ప్రారంభించారు. ఈ ఎగ్జిబిషన్ ఈ నెల 26వ తేదీ వరకు అందుబాటులో ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

విశ్వకర్మల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసిన 'కార్పొరేట్'

పంజగుట్ట: జ్యువెలరీ రంగంలోకి కార్పొరేట్ శక్తులు ప్రవేశించిన విశ్వకర్మల ఆత్మగౌరవం దెబ్బతీశాయని బీఆర్ఎస్ హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి దాసోజు శ్రవణ్ ఆవేదన వ్యక్తం చేశారు. నిజాం, కాకతీయ, రాచకొండ మూడు మన ప్రాంత సాంస్కృతిక చరిత్రను ప్రతిబింబించేలా నికారా అనే పేరుతో డైమండ్ జ్యువెలరీ షోరూం ప్రారంభించడం అభినందనీయమని అన్నారు. శుక్రవారం పంజగుట్ట గలేరియా మాల్‌లో షోరూంను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... డైమండ్ జ్యువెలరీ అంటే కేవలం డబ్బున్నవారికే పరిమితమన్న అపోహను నికారా జ్యువెలరీ నిర్వాహకుడు శ్రీనివాసాచారి తొలగించారని పేర్కొన్నారు.



నికారా డైమండ్ జ్యువెలరీ ప్రారంభిస్తున్న దాసోజు శ్రవణ్ కుమార్

దాచుకున్న డబ్బు ఇస్తే.. బిచాణా ఎత్తివేశాడంటూ ఫిర్యాదు

బంజారాహిల్స్: అవసరాల కోసం వాడుకోవడానికి డబ్బులు దాచుకుంటుండగా సదరు సంస్థ ప్రజలను మోసం చేయడమే కాకుండా బిచాణా ఎత్తేసిందని, వారిపై చర్యలు తీసుకోవాల్సిందిగా బాధితుడు బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వివరాలివీ... యూసుఫ్‌గూడ సమీపంలోని వెంకటగిరిలో నివసించే బంగి రవికుమార్ జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తూ తనకు వచ్చే డబ్బులను భద్రపరచుకుందామని ఇందిరానగర్ సెయింట్ మేరీ స్కూల్ సమీపంలో ఉన్న కనకలక్ష్మీ సేవింగ్స్‌లో జమ చేస్తూ వచ్చాడు. ప్రతినెలా జీ పే ద్వారా డబ్బు పంపించేవాడు. అయితే గత జనవరిలో కనకలక్ష్మీ సేవింగ్స్ ఆఫీసు మూసివేశారని స్నేహితుల ద్వారా తెలిసింది. వాస్తవం తెలుసుకునేందుకు రవికుమార్ సదరు కార్యాలయానికి వెళ్లి చూడగా అక్కడి నుంచి బిచాణా ఎత్తేసినట్లు తేలింది. దీంతో కనకలక్ష్మీ సేవింగ్స్ ఎండీ కొండా రవికి ఫోన్ చేయగా డబ్బులు ఇచ్చేది లేదు.. ఏమి చేసుకుంటావో చేసుకో అంటూ బెదిరించాడు. తనతో పాటు ప్రజలను సేవింగ్స్ పేరుతో నిండా ముంచిన కొండా రవిపై చర్యలు తీసుకోవాల్సిందిగా బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు చీటింగ్ కేసుతో పాటు మనీసర్క్యులేషన్ స్కీమ్ యాక్ట్, ప్రైజ్ చిట్స్ యాక్ట్ కింద కేసు నమోదు చేసి బంజారాహిల్స్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

వెజ్ రెస్టారెంట్‌ల నిర్వహణపై అవగాహనా ఒప్పందం

పంజగుట్ట: శాకాహారం, శాకాహారి పద్ధతులను ధ్రువీకరించే సింగపూర్‌కు చెందిన సాత్విక్ హోల్డింగ్స్ సంస్థ భారతదేశానికి చెందిన ఆఫ్టోగ్ ఫుడ్జ్ రెండు సంస్థలు శనివారం అవగాహనా ఒప్పందం కుదుర్చుకున్నాయి. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సాత్విక్ సర్టిఫికేషన్ వ్యవస్థాపకులు అభిషేక్ బిస్వాస్, ఆఫ్టోగ్ ఫుడ్జ్ సీఈఓ దీపక్ గోయలు ఈ అవగాహనా ఒప్పంద పత్రాలు మార్చుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... శాకాహార రెస్టారెంట్ ఎలా ఉండాలి, ఎలా సర్వ్ చెయ్యాలి, కిచెన్ ఎలా ఉండాలి, కుక్కింగ్ పద్ధతులు, ఫ్రిజ్ ఎంత డిగ్రీల చల్లదనంతో ఉండాలి, ఎంత స్టోరేజీ చేయాలి అనే అంశాలను అన్ని పరిగణలోకి తీసుకుని సాత్విక్ సర్టిఫికెట్ ఇస్తామని పేర్కొన్నారు. ఢిల్లీ నుంచి వెళ్లే అన్ని ట్రైన్‌లలో శాకాహార భోజనానికి సాత్విక్ సర్టిఫికెట్ ఉంటుందన్నారు. సాత్విక్ ఇండోనేషియా, మలేషియా, సింగపూర్‌లలో కొనసాగుతుందని ఇప్పుడు ఇండియాలోనూ మొదట జోద్‌పూర్‌లో ప్రారంభమయ్యిందన్నారు. 2025 నాటికి ప్రపంచంలో 20 దేశాల్లో విస్తరించనున్నట్లు తెలిపారు. ఇకపై ఇండియాలో సాత్విక్ సర్టిఫికెట్ పొందాలంటే ఆఫ్టోగ్ ఫుడ్జ్ సంస్థను సంప్రదించాలని సంస్థ నిర్వాహకుడు దీపక్ గోయల్ తెలిపారు. సమావేశంలో ఆఫ్టోగ్ ఫుడ్జ్ డైరెక్టర్ రిధి వత్సాని, సాత్విక్ సర్టిఫికేషన్ సింగపూర్ హుయిజోంగ్ యాంగ్ పాల్గొన్నారు.



ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న సంస్థల ప్రతినిధులు

భార్య కనిపించడం లేదని భర్త ఫిర్యాదు

వెంగళరావునగర్: తన భార్య కనిపించడం లేదంటూ ఒక వ్యక్తి మధురానగర్ పీఏస్‌లో ఫిర్యాదు చేశాడు. వివరాలివీ... జవహర్‌నగర్‌లో నివసించే వెంకటేష్ డ్రైవర్‌గా పనిచేస్తుంటాడు. ఈ నెల 19న తాను బయటకు వెళ్లగానే నల్లచెరువు ప్రాంతానికి చెందిన అంజి అనే యువకుడు జవహర్‌నగర్ వచ్చి తన భార్యను వెంట తీసుకెళ్లాడు. యాస్మిన్ వెళుతూ ఫోన్, ట్యాబ్, రూ. 25 వేలు తీసుకెళ్లింది. దాంతో తన ఐదేళ్ల కుమార్తె తల్లికోసం విలపిస్తుంది. వారు మోహిదీపట్నంలో ఉన్నట్లుగా మరదలు తెలియజేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నాడు.

భర్త కనిపించడం లేదంటూ భార్య ఫిర్యాదు...

డ్యూటీకి వెళ్లి వస్తానని చెప్పి వెళ్లిన భర్త తిరిగి ఇంటికి రాలేదని మహిళ మధురానగర్ పీఏస్‌లో ఫిర్యాదు చేసింది. వివరాలివీ... విజయనగరం ప్రాంతానికి చెందిన మామిడిలక్ష్మి, శంకర్ దంపతులు. రెండేళ్లుగా రహమత్‌నగర్‌లో ఉంటున్నారు. శంకర్ శ్రీనగర్‌కాలనీలోని కర్రీ పాయింట్‌లో కుక్‌గా పనిచేస్తాడు. ఈ నెల 23న శంకర్ పనికి వెళ్లాడు. కొంత సేపటికి శంకర్‌తో పాటు విధులు నిర్వహించే మనోజ్ అనే వ్యక్తి ఇంటికి వచ్చి తన భర్త విధులకు రాలేదని చెప్పాడు. సాయంత్రం 7.40 గంటల ప్రాంతంలో శంకర్‌కు వరుసకు సోదరుడైన సత్యనారాయణకు తన భర్త ఫోన్ నుంచి రూ. 10 వేలు ఫోన్‌పే ద్వారా వచ్చాయి. అయితే అతని ఫోన్ మాత్రం స్విచాఫ్ చేసి ఉంది. దాంతో తన భర్త ఆచూకీ తెలియజేయాలంటూ లక్ష్మి మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది.

కారులో ఉంచిన బంగారు ఆభరణాల చోరీ

బంజారాహిల్స్: హోటల్‌కు వచ్చిన దంపతుల కారులో నుంచి బంగారు ఆభరణాలు చోరీకి గురైన ఘటన బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాలివీ... బంజారాహిల్స్ రోడ్డు నెంబర్–12లోని ఎమ్మెల్యేకాలనీలో నివసించే జైద్ అహ్మద్ తన భార్యతో కలిసి గురువారం రాత్రి బంజారాహిల్స్ రోడ్డు నెంబర్–12లోని సెవన్‌సిస్టర్స్ హోటల్‌కు భోజనానికి వచ్చాడు. తన కారును వ్యాలెట్ పార్కింగ్‌కు అప్పగించాడు. రాత్రి 11.15 గంటల సమయంలో భోజనం ముగించుకుని కారులో ఇంటికి వెళ్తూ పర్సులో చూడగా అందులో ఉండాల్సిన బ్రాస్‌లెట్స్, బంగారు ఉంగరాలు కనిపించలేదు. వ్యాలెట్ పార్కింగ్ సిబ్బందిపై అనుమానం వ్యక్తంచేస్తూ ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు. బంజారాహిల్స్ క్రైమ్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

శుభాకాంక్షలు



శుభాకాంక్షలు తెలుపుతున్న ఎర్రగడ్డ కాంగ్రెస్ నేతలు

శ్రీనగర్‌కాలనీ: ఎంఎల్‌సీ, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్‌గౌడ్ బొమ్మ పుట్టినరోజు వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎర్రగడ్డ కాంగ్రెస్ నేతలు ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. గ్రేటర్ కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ రవిగౌడ్, నేతలు మోసిన్, కృష్ణకుమార్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

శ్రీనగర్‌కాలనీ: ఎర్రగడ్డ రైతుబజార్‌లో వివిధ కూరగాయల ధరలు ఈ విధంగా ఉన్నాయి. టమాట కిలో రూ. 27, నల్లవంకాయ 23, పొడుగు వంకాయ 23, బెండకాయ 45, పచ్చిమిర్చి 55, బజ్జీమిర్చి 45, క్యాప్సికమ్ 55, పచ్చకాకర 35, పందిరి బీర 35, క్యాబేజీ 15, క్యారెట్ 40, దొండ 28, గుండుబీన్స్ 135, గింజ బీక్కుడు 70, గోకరకాయ 40, కీర 18, దోసకాయ 23, రూట్ రూట్ 19, ఉల్లిగడ్డ 23, ఆలుగడ్డ 32, చామగడ్డ 45, మొరంగడ్డ 40, కందగడ్డ 55, సొరకాయ 11, పొట్లకాయ 18, అరటికాయ 9, మునగకాయ 3–4, ముల్లంగి రూ. 4–5 ప్రకారం ధర పలుకుతున్నాయి. ఈ ధరలు శనివారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

నర్సరీ నుంచే పర్యావరణంపై పాఠాలు బోధించాలి

కాచిగూడ: వచ్చే విద్యా సంవత్సరం నుంచి నర్సరీ నుంచి విద్యార్థులకు ‘పర్యావరణ పాఠాలకు’ శ్రీకారం చుట్టాలని ఎన్విరాన్‌మెంట్ ప్రొటెక్షన్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ అధ్యక్షుడు ఎస్.సి.హెచ్.రంగయ్య, జాతీయ సలహాదారుడు డాక్టర్ కోమటిరెడ్డి గోపాల్ రెడ్డి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సామాజిక బాధ్యతలను విస్మరించి వ్యాపార కేంద్రంగా నేటి విద్యా వ్యవస్థ మారిపోయిందన్నారు. ప్రకృతి, పర్యావరణ పరిరక్షణ అటకెక్కిందని, దీంతో వాతావరణ సమస్యలు పెరిగిపోతూ మానవ మనుగడకే ప్రశ్నార్థకంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత

వెంకటేశ్వరకాలనీ: బంజారాహిల్స్ రోడ్డు నెంబర్–1/5లోని వెంగళరావుపార్కు వెనుక పంజగుట్ట హిందూ శ్మశానవాటికను ఆనుకుని ధోబీఘాట్ బస్తీలో హనుమాన్ వ్యాయామశాల నిర్మాణం కోసం కేటాయించిన స్థలంలో అక్రమ నిర్మాణాలను శుక్రవారం ఖైరతాబాద్ మండల రెవెన్యూ, జీహెచ్ఎంసీ అధికారులు నేలమట్టం చేశారు. ఇక్కడ హనుమాన్ వ్యాయామశాల నిర్మాణం కోసం స్థానిక యువకుల ఆకాంక్ష మేరకు గతంలో ఎమ్మెల్యేగా పనిచేసిన చింతల రామచంద్రారెడ్డి 85 గజాల ప్రభుత్వ స్థలాన్ని కేటాయించారు. నిర్మాణం కోసం వర్క్ ఆర్డర్ కూడా ఇప్పించారు. నిధులు కూడా కేటాయించారు. అయితే ఈ స్థలాన్ని కొంతమంది కబ్జాదారులు ఆక్రమించి ఇళ్లు నిర్మించారు. దీంతో స్థానిక యువకులు కొంతకాలంగా ఈ స్థలం కోసం ఉద్యమించారు. ఈ నేపథ్యంలోనే సంబంధిత అధికారులు నిర్మాణాలను నేలమట్టం చేసి వ్యాయామశాల కోసం కేటాయించిన స్థలం అంటూ హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు.



విద్యుదాఘాతంతో చిన్నారికి తీవ్ర గాయాలు

- సెలవుల్లో అమ్మమ్మ, తాతయ్య ఇంటికి వచ్చిన చిన్నారి
- మేడమీద ఆడుకుంటూ హైటెన్షన్ వైర్లను తాకిన మిల్కి



గాయపడ్డ మిల్కి

రహమత్‌నగర్: వేసవి సెలవుల్లో సరదాగా గడుపుదామని అమ్మమ్మ, తాతయ్య ఇంటికి వచ్చిన ఓ చిన్నారి విద్యుదాఘాతానికి గురై తీవ్రంగా గాయపడింది. ఈ సంఘటన రహమత్‌నగర్ డివిజన్ ఎస్ఎస్‌బీనగర్‌లో శుక్రవారం చోటు చేసుకుంది. వివరాలివీ... ఎస్ఎస్‌బీనగర్ ప్రధాన రహదారి పక్కన హైటెన్షన్ తీగల కింద రమేష్ అనే వ్యక్తి కుటుంబం నివాసం ఉంటుంది. మేడపై ఉన్న విద్యుత్ హైటెన్షన్ తీగల కింద ఓ గదిలో జీహెచ్ఎంసీ పనిచేసే యాకయ్య దంపతులు కిరాయికి ఉంటారు. ఈ క్రమంలో మహబూబాబాద్ జిల్లా కేసముద్రంలో నివాసముండే శ్రీనివాస్ అనితల కుమార్తె లక్కీ వేసవి సెలవులకని ఇటీవల ఎస్ఎస్‌బీనగర్‌లోని తాతయ్య యాకయ్య ఇంటికి వచ్చారు. శుక్రవారం సాయంత్రం మేడ ఉన్న గది ముందు యాకయ్య టేప్‌తో మనవరాలు మిల్కి(8) ఆడుకుంటుండగా పైన తక్కువ ఎత్తులో ఉన్న హైటెన్షన్ తీగలు తగిలాయి. దీంతో మిల్కి విద్యుదాఘాతానికి గురైంది. ఈ ప్రమాదంలో మిల్కి తీవ్రంగా గాయపడింది. స్థానికులు గాయపడ్డ చిన్నారిని హుటాహుటిన స్థానికంగా ఉన్న ఆస్పత్రికి తరలించారు. మిల్కి ప్రస్తుతం మూడో తరగతి చదువుతోంది. మిల్కి పరిస్థితి విషమంగా ఉందని సమాచారం.

చంపుతానని మాజీ ప్రియురాలికి బెదిరింపు

వెంగళరావునగర్: మాజీ ప్రియురాలిని ఒక యువకుడు చంపుతానని బెదిరిస్తున్న సంఘటన మధురానగర్ పీఏస్ పరిధిలో జరిగింది. పోలీసుల సమాచారం మేరకు... రహమత్‌నగర్‌లోని ఎంఎంసీసీ స్కూల్ వద్ద 20 ఏళ్ల ఓ యువతి నివసిస్తుంది. సినిమాల్లో డైరెక్టర్ కావాలని ప్రయత్నిస్తుంది. ఆమె ఉంటున్న బిల్డింగ్‌లోనే ఉంటున్న సిద్ధార్థ అనే యువకుడు ఆమెకు పరిచయం అయ్యాడు. తాను ప్రేమిస్తున్నాని మాయమాటలు చెప్పగా ఇరువురూ ఆరు నెలలు ప్రేమించుకున్నారు. వారి విషయం ఇరువురి తల్లిదండ్రులకు తెలిసి మందలించడంతో విడివిడిగా ఉంటున్నారు. అయితే ఆ యువతి కాలేజీకి వెళ్లి వచ్చే సమయంలో సిద్ధార్థ తనను ప్రేమించాలని, లేకపోతే చంపుతానని బెదిరిస్తున్నాడు. దాంతో ఆమె మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పార్కు స్థలంలో ఆక్రమణల తొలగింపు

సాక్షి ఎఫెక్ట్..

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ రోడ్డు నెంబర్–45లోని గీతా ఆర్ట్స్ ఎదురుగా రోడ్డుకు అవతల వైపు జీహెచ్ఎంసీ పార్కు స్థలంలో డబ్బాను ఏర్పాటు చేస్తూ ఆక్రమిస్తున్నారని ‘సాక్షి’ దినపత్రికలో ప్రచురితమైన కథనానికి జీహెచ్ఎంసీ సర్కిల్–18 అధికారులు స్పందించారు. పార్కు స్థలంలో డబ్బాలు ఏర్పాటు చేసిన మాట వాస్తవమేనని, ఇది అక్రమంగా ఏర్పాటు చేశారని, నిబంధనలకు విరుద్ధమని జీహెచ్ఎంసీ అధికారులు స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో జేసీబీల సాయంతో వాటిని అక్కడి నుంచి తొలగించారు.



ఆక్రమణలను తొలగిస్తున్న జీహెచ్ఎంసీ సిబ్బంది

ప్రేమ్‌నగర్ నాలాలో డీసిల్టింగ్ పనులు షురూ



ప్రేమ్‌నగర్ నాలాలో డీసిల్టింగ్ చేస్తున్న సిబ్బంది

బంజారాహిల్స్: వానాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో జీహెచ్ఎంసీ ఇంజినీర్లు నాలాల్లో డీసిల్టింగ్ పనులు చేపట్టారు. కాంట్రాక్టర్లు పెద్ద సంఖ్యలో సమ్మెలో ఉన్నా... ఇంజినీర్లు ఉన్న అరకొర సిబ్బందితోనే కొన్ని ప్రాంతాల్లోని నాలాలలో డీసిల్టింగ్ పనులను చేపట్టారు. బంజారాహిల్స్ డివిజన్ పరిధిలోని ప్రేమ్‌నగర్ నాలాలో పెద్ద ఎత్తున బురద పేరుకుపోగా మురుగు, వరద ఇళ్లలోకి ముంచెత్తుతున్న నేపథ్యంలో ముందస్తుగా ఇక్కడ బురద తొలగింపు ప్రక్రియ మొదలైంది. రెండు రోజులుగా జీహెచ్ఎంసీ ఇంజినీర్లు పర్యవేక్షిస్తుండగా డీసిల్టింగ్ పనులను ముమ్మరం చేశారు. నాలాలో పేరుకుపోయిన వ్యర్థాలు, బురద, చెత్తా చెదారం తొలగిస్తున్నారు.

గోపన్‌పల్లిలో ఇళ్ల స్థలాల పంపిణీలో న్యాయం చేయండి

తెలంగాణ ప్రభుత్వ పెన్షనర్ల సంఘం విజ్ఞప్తి

హిమాయత్‌నగర్: శేరిలింగంపల్లి మండలం గోపన్‌పల్లిలో ఉద్యోగులకు కేటాయించిన ఇళ్ల స్థలాల పంపిణీ విషయంలో న్యాయం చేయాలని తెలంగాణ ప్రభుత్వ పెన్షనర్ల సంఘం విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కనకం కొమరెల్లి, కార్యనిర్వహక కార్యదర్శి జి.సూర్యకళ తదితరుల నేతృత్వంలోని ప్రతినిధి బృందం శుక్రవారం రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంక, అదనపు కలెక్టర్ భూపాల్‌రెడ్డిలను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఇటీవల రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని కలిసి ఇళ్ల స్థలాల కేటాయింపు విషయమై విన్నవించగా సమగ్ర వివరాల కోసం రంగారెడ్డి జిల్లా అధికారులను ఆదేశించారని గుర్తు చేశారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యోగులు, పెన్షనర్లకు ఇళ్ల స్థలాలు ఇవ్వగా, ఇళ్లను నిర్మించుకోలేదనే నెపంతో గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఇళ్ల స్థలాలు లాక్కుని తీవ్ర ద్రోహానికి పాల్పడిందని దుయ్యబట్టారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి న్యాయం చేయాలని కోరతామని వారు తెలిపారు. సంఘం ప్రతినిధులు రామనాథం చెట్టి, అబ్దుల్ సాదిక్, కమలాకర్ రావు, ఎం.స్వర్ణకుమారి, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

భార్యను కాపురానికి పంపలేదని మామపై అల్లుడి హత్యాయత్నం

వెంగళరావునగర్: భార్యను కాపురానికి పంపడం లేదని ఓ వ్యక్తి తన మామపై హత్యాయత్నం చేసిన సంఘటన మధురానగర్ పీఏస్ పరిధిలో జరిగింది. పోలీసుల సమాచారం మేరకు... యాదగిరినగర్‌లో నివసించే మాధవికి, పాలకొల్లు ప్రాంతానికి చెందిన సుబ్రమణ్యంతో ఈ ఏడాది మార్చినెలలో వివాహమైంది. సుబ్రమణ్యంకు గతంలో వివాహమైంది. భార్యాభర్తల మధ్య గొడవలు రావడంతో ఆమె తన కుమారుడిని తీసుకుని భర్త సుబ్రమణ్యంను వదిలి వెళ్లిపోయింది. మాధవికి కూడా గతంలో వివాహమైంది. భర్త గుండెపోటుతో మృతిచెందగా ఇద్దరు మగ పిల్లలతో తల్లిదండ్రుల వద్దనే ఉంటుంది. సుబ్రమణ్యం మద్యానికి బానిసయ్యాడు. ఇదిలా ఉండగా మాధవి, సుబ్రమణ్యంలు రెండో వివాహం చేసుకుని పాలకొల్లులో ఉంటున్నారు. పిల్లలు మాత్రం మాధవి తల్లిదండ్రుల వద్ద ఉండటం వల్ల ఆమె వారి వద్దకు వచ్చిపోతుండేది. వేసవి సెలవు కావడంతో మాధవి పిల్లల వద్దకు వచ్చి ఇక్కడే ఉండి సేల్స్‌గర్ల్‌గా పనిచేస్తుంది. శుక్రవారం ఆమె విధులకు వెళ్లగానే సుబ్రమణ్యం మద్యం సేవించి తన మామగారింటికి వచ్చి భార్యను తనతో పంపాలని గొడవకు దిగాడు. కొద్దిరోజుల వరకు తమ కుమార్తెను పంపడం కుదరదని, పిల్లలకు సెలవులు అయిపోయిన తర్వాత పంపుతామని మాధవి తల్లిదండ్రులు సుబ్బలక్ష్మి, రామారావులు చెప్పారు. దాంతో రెచ్చిపోయిన సుబ్రమణ్యం బ్లేడ్ తీసుకుని రామారావుపై దాడి చేసి గొంతుకోశాడు. తీవ్రంగా గాయపడిన రామారావును ఆసుపత్రికి తరలించారు. తన తండ్రిపై భర్త హత్యాయత్నం చేశాడని మాధవి పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా ఎమ్మెల్సీ మహేష్‌కుమార్‌గౌడ్ పుట్టినరోజు



ఎమ్మెల్సీకి శుభాకాంక్షలు చెబుతున్న రామన్‌గౌడ్

హిమాయత్‌నగర్: ఎమ్మెల్సీ బి.మహేష్ కుమార్ గౌడ్ పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు జి.రామన్ గౌడ్ శుక్రవారం ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. నాయకులు రామారావు గౌడ్, సత్యం గౌడ్, జైస్వాల్, సాయి, జగదీష్, అభిషేక్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా...

27న స్పెషల్ క్యాజువల్ లీవ్

సీఈవో వికాస్‌రాజ్ ఉత్తర్వులు

సాక్షి, హైదరాబాద్/నల్లగొండ: నల్లగొండ-ఖమ్మం-వరంగల్ ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి పోలింగ్ జరిగే ఈనెల 27వ తేదీని ప్రత్యేక సాధారణ సెలవు (స్పెషల్ క్యాజువల్ లీవ్) రోజుగా పరిగణించాలని ఎన్నికల సంఘం నిర్ణయించింది. ఈ మేరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల్లోని బోనఫైడ్ ఓటర్లు సీసీఎల్‌ను వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ వరంగల్, హనుమకొండ, మహబూబాబాద్, భూపాలపల్లి, జనగామ, ములుగు, సిద్దిపేట, ఖమ్మం, కొత్తగూడెం, నల్లగొండ, సూర్యాపేట, భువనగిరి జిల్లాల కలెక్టర్లకు రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి వికాస్‌రాజ్ లేఖ రాశారు. ఆ రోజున ఓటును వినియోగించుకునే ప్రైవేటు సంస్థల ఉద్యోగులకు సెలవు అధికారికంగా ఇవ్వలేకపోయినప్పటికీ, విధులకు ఆలస్యంగా వచ్చేందుకు అనుమతి ఇవ్వటం, పని వేళల్లో వెసులుబాటు కల్పించడం వంటి ఏర్పాట్ల ద్వారా ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు అవకాశం కల్పించాలని స్పష్టంచేశారు. ఈ మేరకు అన్ని ప్రైవేటు సంస్థల యాజమాన్యాలకు తెలియజేయాలని ఆయా జిల్లాల కలెక్టర్లకు రాసిన లేఖలో సీఈవో వికాస్‌రాజ్ పేర్కొన్నారు. 27న ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ ఉంటుందని, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల రిటర్నింగ్ అధికారి హరిచందన తెలిపారు.

మా మద్దతు మల్లన్నకే

సీపీఎస్ ఉద్యోగులు,
మాల ప్రజా సంఘాల జేఏసీ నేతలు

సాక్షి, పంజగుట్ట (హైదరాబాద్)/ హైదరాబాద్: నల్లగొండ, వరంగల్, ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్నకే మద్దతు తెలుపుతున్నామని తెలంగాణ రాష్ట్ర కాంట్రిబ్యూటరీ పింఛను పథక ఉద్యోగుల యూనియన్ (టీఎస్‌సీపీఎస్ ఈయూ) ప్రకటించింది. పాతపింఛను విధానాన్ని పునరుద్ధరిస్తామని ఆయన హామీ ఇచ్చినందుకే మద్దతిస్తున్నట్లు వెల్లడించింది. ఈ మేరకు శుక్రవారం జరిగిన యూనియన్ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో తీర్మానం చేసినట్లు రాష్ట్ర అధ్యక్షుడు గంగాపురం స్థితప్రజ్ఞ చెప్పారు.

మాల ప్రజా సంఘాల జేఏసీ కూడా...

ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్నకు మాల ప్రజా సంఘాల జేఏసీ మద్దతు ప్రకటించింది. ఈ మేరకు జేఏసీ చైర్మన్ జి.చెన్నయ్య మాల మహానాడు జాతీయ కార్యాలయంలో సమావేశంలో మాట్లాడుతూ.. బహుజన వర్గాల బిడ్డ, పేదల సంక్షేమం కోసమే పాటుపడే మల్లన్నకు దళిత, బహుజన పట్టభద్రులంతా మద్దతివ్వాలని కోరారు.

'హిట్లర్ కేబినెట్‌లో గోబెల్స్.. మోదీ కేబినెట్‌లో కిషన్‌రెడ్డి'




సాక్షి, హైదరాబాద్: హిట్లర్ కేబినెట్‌లో గోబెల్స్ అనే మంత్రి పని చేసినట్లుగానే ప్రధాని నరేంద్ర మోదీ కేబినెట్‌లో కిషన్‌రెడ్డి అనే మంత్రి పనిచేస్తున్నారని టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు, మాజీ ఎంపీ మల్లురవి ఎద్దేవా చేశారు. గాంధీభవన్‌లో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మోదీ చెప్పే అబద్ధాలను కిషన్‌రెడ్డి వల్లె వేస్తుంటారన్నారు. బీజేపీ నేతలు సోది చెబుతుంటారని, అదే సోది చెప్పే స్థాయికి కిషన్‌రెడ్డి కూడా వెళ్లిపోయారని వ్యాఖ్యానించారు. ఇంకోసారి రేవంత్‌రెడ్డి గురించి బీజేపీ నేతలు అనుచిత వ్యాఖ్యలు చేస్తే వారి పార్టీ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ హవా కొనసాగుతోందని, రాహుల్‌గాంధీని ప్రధానిని చేయాలని దేశ ప్రజలు ఇప్పటికే నిర్ణయించుకున్నారని మల్లురవి వ్యాఖ్యానించారు.

స్వతంత్ర అభ్యర్థికి బీఎస్పీ మద్దతు

సాక్షి, హైదరాబాద్: వరంగల్, నల్లగొండ, ఖమ్మం పట్టభద్రుల శాసనమండలి నియోజకవర్గ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థి అశోక్‌కుమార్‌గౌడ్‌ను బలపరుస్తున్నట్లు.. బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు మంద ప్రభాకర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మూడు ఉమ్మడి జిల్లాల్లోని బీఎస్పీ నాయకులు, జిల్లా ఇన్‌చార్జిలు, జిల్లా అధ్యక్షులు, అసెంబ్లీ నాయకులతో సమావేశం ఏర్పాటు చేసి నిర్ణయం తీసుకున్నట్లు వివరించారు. సమావేశంలో తీసుకున్న నిర్ణయాన్ని బీఎస్పీ జాతీయ అధ్యక్షురాలు మాయావతి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. ఆమె అనుమతితో అశోక్‌కుమార్‌గౌడ్‌కు అధికారికంగా మద్దతిస్తున్నట్లు ప్రకటించారు.

'ప్రజల్లో విషబీజాలు నాటేందుకు బీజేపీ యత్నం'



సాక్షి, హైదరాబాద్: ప్రజల్లో విషబీజాలు నాటేందుకు బీజేపీ, బీఆర్‌ఎస్ నేతలు ప్రయత్నిస్తున్నారని, ట్యాక్స్‌ల గురించి బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డికే బాగా అవగాహన ఉందని భువనగిరి ఎంపీ కాంగ్రెస్ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి ధ్వజమెత్తారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్‌ఎస్, బీజేపీ పార్టీ నేతలు చేస్తున్న అసత్య ఆరోపణలను ఖండిస్తూ శుక్రవారం మీడియాతో కిరణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడారు. అసత్య ఆరోపణలు చేయడం వలన మిమ్మల్ని ప్రజలు నమ్మే పరిస్థితి కూడా లేదని అన్నారు. ఢిల్లీలో లాబీయింగ్ చేసి బీజేఎల్పీ హోదా తెచ్చుకున్న ఘనత మహేశ్వర్‌రెడ్డిదని ఎద్దేవా చేశారు. మంత్రి ఉత్తమ్‌ని యూ ట్యాక్స్ పేరుతో విమర్శించడం సరికాదని, బీజేపీ వాళ్ల సంతోషం కోసం ఏది పడితే అది మాట్లాడకూడదని హితవు పలికారు.

గ్యారంటీలను మరిచిన కాంగ్రెస్

పట్టభద్రులు విజ్ఞతతో ఆలోచించి ఓటేయాలి: కేటీఆర్

- బీఆర్‌ఎస్ పాలనలో 400 సంక్షేమ కార్యక్రమాలు చేపట్టాం..
- కాంగ్రెస్ మాత్రం 420 హామీలతో మోసం చేస్తోంది
- రుణమాఫీ చేయలేదు.. బోనస్‌పై మాట తప్పారు



చౌటుప్పల్ మండలం దామెరలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ బీఆర్‌ఎస్ అభ్యర్థికి మొదటి ప్రాధాన్య ఓటు వేయాలని చూపుతున్న కేటీఆర్

చౌటుప్పల్, నకిరేకల్: ప్రజలకు సీఎం రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ నేతలు ఆరు గ్యారంటీ స్కీంలు అంటూ అరచేతిలో వైకుంఠం చూపి అధికారంలో వచ్చారని.. ఆరు నెలలైనా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం తప్ప మిగతా హామీలేవీ అమలు కాలేదని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ మండిపడ్డారు. శుక్రవారం భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం దామెరలో, నల్లగొండ జిల్లా నకిరేకల్‌లో నిర్వహించిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నిక సన్నాహక సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు. కాంగ్రెస్ వాళ్ల మాయమాటలు నమ్మితే గోస పడుతామని తాము ముందే చెప్పామని.. ఇప్పుడు అదే జరిగిందని చెప్పారు. డిసెంబర్ 9న రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని రేవంత్‌రెడ్డి చెప్పారని.. ఇప్పటివరకు చేయకపోగా దేవుళ్ల మీద ఒట్లు పెడుతూ మరోసారి రైతులను మోసం చేసే పనిలో ఉన్నారని ఆరోపించారు. ధాన్యం బోనస్ విషయంలో కూడా రేవంత్‌రెడ్డి మాట తప్పారని.. సన్న వడ్లకు మాత్రమే ఇస్తామంటున్నారని విమర్శించారు.

అబద్ధాలు ప్రచారం చేస్తున్నారు..

కాంగ్రెస్ గ్యారంటీల విషయంలో రాహుల్‌గాంధీ, ప్రియాంకా గాంధీ కూడా అబద్ధాలు ఆడుతున్నారని కేటీఆర్ విమర్శించారు. నోటిఫికేషన్లు ఇవ్వకుండా జాబ్‌లు ఇచ్చామని ప్రచారం చేసుకుంటున్నారని మండిపడ్డారు. ఇచ్చిన 30వేల ఉద్యోగాలు కేసీఆర్ ప్రభుత్వ హయాంలో నోటిఫికేషన్లు ఇచ్చినవేనని చెప్పారు. బీఆర్‌ఎస్ పాలనలో 400కుపైగా సంక్షేమ కార్యక్రమాలు చేపడితే.. కాంగ్రెస్ పార్టీ మాత్రం 420 హామీలు ఇచ్చి మోసం చేసిందని విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డి పక్కా 420 వ్యక్తి అని వ్యాఖ్యానించారు. రేవంత్ తీరుతో రాష్ట్రానికి పెట్టుబడులు రాకుండా పోయే ప్రమాదం ఉందని ఆరోపించారు. గత ఆరు నెలల్లో రాష్ట్రంలో 1.5 లక్షల వివాహాలు జరిగాయని.. ఆ జంటలకు లక్ష రూపాయలతోపాటు 1.5 లక్షల తులాల బంగారాన్ని రేవంత్‌రెడ్డి బాకీ ఉన్నారన్నారు.

గోల్డ్ మెడలిస్టు కావాలా.. బ్లాక్ మెయిలిస్టా..

బీఆర్‌ఎస్ తరఫున పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి గోల్డ్ మెడలిస్టు అని.. కాంగ్రెస్ నుంచి పోటీచేస్తున్న వ్యక్తి పెద్ద బ్లాక్ మెయిలిస్టని కేటీఆర్ ఆరోపించారు. ఎవరు కావాలో పట్టభద్రులు విజ్ఞతతో ఆలోచన చేయాలన్నారు. ప్రభుత్వాన్ని ప్రశ్నించే గొంతు ఉండాలంటే బీఆర్‌ఎస్ అభ్యర్థి రాకేశ్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. ఈ సమావేశాల్లో మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి, మాజీ ఎంపీ లింగయ్య యాదవ్, మాజీ ఎమ్మెల్యేలు చిరుమర్తి లింగయ్య, కిషోర్, అంజయ్య యాదవ్, మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

తప్పుడు వార్తల రేవంత్‌ను జైల్లో పెట్టాలి: 'ఎక్స్'లో కేటీఆర్

సాక్షి, హైదరాబాద్: అసత్య వార్తలను ప్రచారం చేయడం అలవాటుగా మార్చుకున్న సీఎం రేవంత్‌రెడ్డిని జైల్లో ఎందుకు పెట్టకూడదని కేటీఆర్ ప్రశ్నించారు. ఈ మేరకు 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. ''మా బంధువుకు రూ.10 వేల కోట్ల కోవిడ్ డ్రగ్ కాంట్రాక్టు దక్కిందంటూ రేవంత్ గతంలో సిగ్గులేకుండా ఓ అబద్ధాన్ని తయారు చేశారు. ఇదే హాస్యగాడు సెక్రటేరియట్ కింద నుంచి నిజాం నగలను తవ్వుకెళ్లామనే అసత్య వాదనను సృష్టించారు. కేంద్ర హోంమంత్రి ఫేక్ వీడియోను కూడా సర్క్యులేట్ చేశారు. సీఎం హోదాలో ఉంటూ ఉస్మానియా యూనివర్సిటీ నకిలీ సర్క్యులర్‌ను పోస్ట్ చేశారు. తప్పుడు వార్తల రేవంత్‌ను జైల్లో పెట్టాలి..''అని కేటీఆర్ విమర్శించారు.

కాంగ్రెస్ గుడిలో లింగాన్నీ మింగుతోంది

- పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి ప్రేమేందర్‌రెడ్డిని గెలిపించాలి: బండి సంజయ్



కోదాడ రూరల్: బీఆర్‌ఎస్ నాయకులు గుడిని మింగితే.. కాంగ్రెస్ నాయకులు గుడిలోని లింగాన్ని కూడా మింగుతున్నారని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ దుయ్యబట్టారు. ఆ రెండు పార్టీలకు పట్టభద్రులు బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. వంద రోజుల్లో ఆరు గ్యారంటీలు అమలు చేస్తామనే హామీతో గద్దెనెక్కి రైతులు, మహిళలు, విద్యార్థులు, పేదలు సహా ప్రజలందరినీ మోసం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. వరంగల్-ఖమ్మం-నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక ప్రచారంలో భాగంగా శుక్రవారం ఆయన సూర్యాపేట జిల్లా కోదాడలో పట్టభద్రులు, మేధావులతో ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడారు. మైనారిటీలకు 10 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు కాంగ్రెస్ డిక్లరేషన్ చేస్తామంటోందని, దీన్ని పట్టభద్రులంతా గమనించాలని కోరారు.

గళం ఎత్తేది బీజేపీనే..: నిరుద్యోగులు, ఉద్యోగుల సమస్యలపై శాసన మండలిలో గళమెత్తాలంటే బీజేపీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డిని గెలిపించాలని బండి సంజయ్ పట్టభద్రులకు పిలుపునిచ్చారు. రాష్ట్రంలో బీజేపీకి అనుకూల వాతావరణం ఉందని, అసెంబ్లీలో 8 మంది ఎమ్మెల్యేలు ఉన్నారని, వారికి మరో ఇద్దరు ఎమ్మెల్సీలు తోడైతే ప్రజాసమస్యలపై అధికార పార్టీకి చెమటలు పట్టిస్తారన్నారు. ఈ ఎన్నికల్లో ఓటమి పాలైతే రాష్ట్రంలో భవిష్యత్ ఉండదని, పరువు పోతుందనే భయంతో బీఆర్‌ఎస్ ఓటుకు రూ. 2 వేలు ఇచ్చేందుకు సిద్ధమైందని బండి ఆరోపించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు బొబ్బా భాగ్యారెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంకినేని వెంకటేశ్వరరావు, గంగిడి మనోహర్‌రెడ్డి, ఎంపీ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


నర్సింగ్ విద్యార్థిని మృతిపై ఆందోళన



భద్రాచలం ఎమ్మెల్యే వెంకట్రావుతో వాదనకు దిగిన దళిత సంఘాల నాయకులు

భద్రాచలం అర్బన్: నర్సింగ్ విద్యార్థిని మృతిపై అనుమానం వ్యక్తం చేస్తూ ఆందోళనకు దిగడంతో ఉద్రిక్త పరిస్థితులు చోటుచేసుకున్నాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలంలోని ఓ ప్రైవేట్ నర్సింగ్ కళాశాలలో పడిగిపల్లి కారుణ్య(18) మొదటి సంవత్సరం చదువుతోంది. కారుణ్య గురువారం ఉదయం హాస్టల్ మొదటి అంతస్తుకు వెళ్లగా, అక్కడి నుంచి కింద పడడంతో తీవ్రగాయాలయ్యాయి. ఆమెను ఏరియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. అయితే శుక్రవారం ఉదయం ఆమె కుటుంబీకులు బంధువులు పెద్దసంఖ్యలో కళాశాలకు చేరుకొని ఆందోళన చేపట్టారు. ఈక్రమంలో అక్కడకు వచ్చిన కళాశాల కార్యదర్శి డాక్టర్ కాంతారావుపై దాడిచేశారు. అంతలోనే దళిత సంఘాల నేతలు భారీ సంఖ్యలో చేరుకొని కారుణ్య మృతికి కారణాలు వెల్లడించాలని ఆందోళనకు దిగారు. ఈలోగా భద్రాచలం ఎమ్మెల్యే వెంకట్రావు అక్కడకు చేరుకొని కళాశాల యాజమాన్యం, విద్యార్థి బంధువులతో చర్చించారు. న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చి లోపలకు వెళ్లగా, ఏదైనా బయటే మాట్లాడాలని దళిత సంఘాల నేతలు డిమాండ్ చేశారు. మధ్యవర్తులు కొందరు కారుణ్య కుటుంబీకులు, కళాశాల యాజమాన్యంతో ఓ ఫంక్షన్ హాల్‌లో చర్చించారు. కుటుంబీకులు రూ.కోటి పరిహారం డిమాండ్ చేయగా, రూ.25 లక్షలు ఇచ్చేలా ఒప్పందం కుదిరినట్టు తెలిసింది. ఇదిలా ఉండగా కారుణ్యకు ఫిట్స్ వచ్చి పడిపోయిందని, గుర్తుతెలియని వ్యక్తి దాడి చేశాడని, ఆమెను కళాశాల నిర్వాహకుడి కుమారుడు వేధిస్తూ తన మాట వినకపోవడంతో దాడి చేశాడనే భిన్న వాదనలు వినిపిస్తున్నాయి. అయితే కారుణ్య మృతికి గల అసలు కారణాలు మాత్రం తెలియరాలేదు. కారుణ్య తల్లి భర్తకు దూరంగా తన తల్లి, సోదరుడి కలిసి ఉంటోంది. ఘటనపై పూర్తిస్థాయిలో విచారణ జరిపించాలని కారుణ్య తండ్రి భద్రాచలం పోలీసులకు ఫిర్యాదు చేయడం గమనార్హం.

అదే జరిగితే కిషన్‌రెడ్డిని సన్మానిస్తా: జగ్గారెడ్డి



సాక్షి, హైదరాబాద్: లోక్‌సభ ఎన్నికల ఫలితాల తర్వాత బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీలోకి వస్తున్నారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను స్వాగతిస్తున్నానని..నిజంగా అదే జరిగితే ఆయన్ను సన్మానిస్తానని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ టి.జగ్గారెడ్డి చెప్పారు. కిషన్‌రెడ్డి వ్యాఖ్యలు కాంగ్రెస్ నేతలకు సంతోషం కలిగించాయని, అంతమంది ఎమ్మెల్యేలు తమ పార్టీలోకి వస్తున్నారంటే 5 నెలల తమపాలన బాగుందని సర్టిఫికెట్ ఇవ్వడమే కదా అన్నారు. శుక్రవారం గాంధీభవన్‌లో టీపీసీసీ అధికార ప్రతినిధులు కోట్ల శ్రీనివాస్, లింగంయాదవ్ తదితరులతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. కిషన్‌రెడ్డిది చాలా గొప్పమనసు అని, నాడు వాజ్‌పేయి నిండుసభలో ఇందిరను అపరకాళి అని మెచ్చుకున్నట్టే, మీడియా సాక్షిగా కిషన్‌రెడ్డి కాంగ్రెస్ పాలన బాగుందని మెచ్చుకున్నాడని చెప్పారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం సేఫ్‌గా ఉంటుందని, రేవంత్‌రెడ్డి ఐదేళ్లు సీఎంగా ఉంటారని చెప్పారు. అయితే, బీజేపీకి చెందిన ఐదుగురు ఎమ్మెల్యేలు కూడా కాంగ్రెస్‌లోకి వచ్చే అవకాశముందని, కానీ ఆ విషయాన్ని మాత్రం కిషన్‌రెడ్డి చెప్పలేదని ఎద్దేవా చేశారు.

బీసీ రిజర్వేషన్ల సాధనకు 'మిలియన్ మార్చ్' : బూర

సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ ఇచ్చిన బీసీ రిజర్వేషన్ల పెంపు హామీ అమలు చేసేందుకు అవసరమైతే మిలియన్ మార్చ్ తరహాలో అసెంబ్లీని ముట్టడిస్తామని బీజేపీ నేత బూర నర్సయ్యగౌడ్ హెచ్చరించారు. బీసీ రిజర్వేషన్లు తేల్చకుండా స్థానిక ఎన్నికల నిర్వహణకు సీఎం రేవంత్‌రెడ్డి చేస్తున్న ప్రయత్నాలను బీజేపీ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో బూర నర్సయ్య మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి చెందిన ప్రతి నాయకుడి డీఎన్‌ఏలో బీసీ వ్యతిరేకతే ఉందని పేర్కొన్నారు. బీజేపీ 400 సీట్లు గెలిస్తే రాజ్యాంగం మార్పు, రిజర్వేషన్లు రద్దు చేస్తారని కాంగ్రెస్ దుష్ప్రచారం చేస్తోందని మండిపడ్డారు.

హైదరాబాద్‌పై బీజేపీ, కాంగ్రెస్ కుట్ర

- యూటీ లేదా ఉమ్మడి రాజధాని చేసేందుకు యత్నాలు
- బోనస్ ఇవ్వమని అడిగితే రైతులు మొరుగుతున్నట్లా?
- జూలైలో రైతులతో కలిసి అసెంబ్లీని ముట్టడిస్తాం
- పట్టభద్రుల ఎన్నికల సమావేశంలోమాజీ మంత్రి హరీశ్



సత్తుపల్లిలో మాట్లాడుతున్న హరీశ్‌రావు, పక్కన అభ్యర్థి రాకేశ్‌రెడ్డి

సాక్షి ప్రతినిధి, ఖమ్మం: 'కాంగ్రెస్, బీజేపీలది రాజకీయం.. కానీ కేసీఆర్‌ది తెలంగాణతో పేగుబంధం. పోరాటాలు చేసి, చావు నోట్లో తలపెట్టి తెలంగాణ తెచ్చిండు. ఇవ్వాళ బీజేపీ కొత్త కుట్ర చేస్తోంది. హైదరాబాద్‌ను కేంద్రపాలిత ప్రాంతం చేస్తరట.. హైదరాబాద్ లేని తెలంగాణ ఉంటదా.. తల లేని మొండెం అయిపోతాం మనం. బీజేపీ, కాంగ్రెస్ వాళ్లు కలిసి హైదరాబాద్‌ను యూటీ చేయాలని లేదా మరో పదేళ్లు ఉమ్మడి రాజధానిగా చేయాలని కుట్రలకు తెరతీస్తున్నారు. తెలంగాణ కోసం పుట్టిన బీఆర్‌ఎస్‌ను కాపాడుకునే బాధ్యత మీపై ఉంది. ఎమ్మెల్సీ ఎన్నికను ఆషామాషీగా తీసుకోకుండా బీఆర్‌ఎస్ అభ్యర్థి రాకేశ్‌రెడ్డిని గెలిపించండి'అని మాజీ మంత్రి హరీశ్‌రావు పిలుపునిచ్చారు. ఖమ్మం జిల్లా సత్తుపల్లి, బోనకల్‌లో శుక్రవారం నిర్వహించిన పట్టభద్రుల సమావేశాల్లో ఆయన మాట్లాడారు. తెలంగాణ వచ్చి పదేళ్లు అవుతుండగా, ఇప్పటి వరకు ఉమ్మడి రాజధానిగా ఉన్న హైదరాబాద్‌ను మరో పదేళ్లు కొనసాగించే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు.

రైతులను ఆ మంత్రి కుక్కలతో పోలుస్తారా?

సత్తుపల్లిలో సమావేశం అనంతరం తల్లాడ మండలం నూతనకల్‌లో క్రాప్ హాలిడే ప్రకటించిన రైతులతో హరీశ్‌రావు మాట్లాడారు. వర్షాలు పడినా జీలుగు విత్తనాలు ఇవ్వడం లేదని, కల్యాణలక్ష్మి చెక్కులు రాలేదని రైతులు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. సన్న ధాన్యంతోపాటు దొడ్డు ధాన్యానికి కూడా బోనస్ ఇప్పించాలని కోరారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ 'వడ్లకు బోనస్ ఇవ్వమంటే ఇవన్నీ వ్యవసాయం తెలియని వారి మాటలని.. రైతులు మొరుగుతున్నారని వ్యవసాయశాఖ మంత్రి అనడం ఏమిటని ప్రశ్నించారు. రైతులను వ్యవసాయ శాఖ మంత్రి కుక్కలతో పోలుస్తారా అని ఆగ్రహం వ్యక్తం చేశారు.

పట్టభద్రులు ఓటు వృథా చేసుకోవద్దు

జూలైలో పూర్తిస్థాయి బడ్జెట్ సమావేశాలు జరగనున్న నేపథ్యంలో ఆలోగా రైతుల సమస్యలు పరిష్కరించకపోతే రైతులతో కలిసి అసెంబ్లీని ముట్టడిస్తామని హరీశ్‌రావు హెచ్చరించారు. ఈ సందర్భంగా విత్తనాలు అందడం లేదని రైతులు ఆయన దృష్టికి తీసుకురావడంతో మండల వ్యవసాయ శాఖాధికారులతో మాట్లాడారు. నాగర్‌కర్నూల్ బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ పట్టభద్రులు తమ ఓటును వృథా చేసుకోవద్దని కోరారు. సమావేశంలో ఖమ్మం బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి నామా నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, ఎమ్మెల్సీ అభ్యర్థి రాకేశ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పెద్దిరెడ్డి సుదర్శన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టిమ్స్ ఆసుపత్రులపై కాంగ్రెస్‌ది రాజకీయం: హరీశ్

సాక్షి, హైదరాబాద్: బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుని నిర్మాణ పనులు ప్రారంభించిన టిమ్స్ ఆసుపత్రులపై రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి విషం చిమ్మడం బాధాకరమని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. ఐదు నెలలుగా నిర్మాణ పనుల పర్యవేక్షణను గాలికి వదిలిన మంత్రి కోమటిరెడ్డి.. గత ప్రభుత్వంపై అనవసర ఆరోపణలు చేస్తున్నారని సోషల్ మీడియా వేదిక 'ఎక్స్'లో హరీశ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆసుపత్రులపై కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయాలు చేస్తోందన్నారు.

దేశ ప్రజలు మార్పు కోరుకుంటున్నారు

- ఇండియా కూటమితోనే సర్వతోముఖాభివృద్ధి
- పంజాబ్ లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో డిప్యూటీ సీఎం భట్టి



ఫరీద్‌కోట్ నేతలతో భట్టి విక్రమార్క

సాక్షి, హైదరాబాద్: దేశ ప్రజలు రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలనే గట్టి పట్టుదలతో ఉన్నారని, అందుకే కేంద్రంలో మార్పును కోరుకుంటున్నారని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. విద్వేష రాజకీయాలతో దేశం విసిగిపోయిందని పేర్కొన్నారు. పంజాబ్ రాష్ట్రంలోని ఫరీద్‌కోట్ లోక్‌సభ నియోజకవర్గంలో ఆయన వరుసగా మూడో రోజు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. శుక్రవారం ఆయన పలు సమావేశాల్లో ప్రసంగిస్తూ ఇండియా కూటమి అధికారంలోకి వస్తేనే దేశంలో సర్వతోముఖాభివృద్ధి జరుగుతుందని చెప్పారు. మోదీ ప్రభుత్వం గత పదేళ్లలో అనుసరించిన విధానాల కారణంగా దేశం నుంచి ప్రైవేటు పరిశ్రమలు తరలిపోయాయని, కరెన్సీ నోట్ల రద్దు, జీఎస్టీ, ఆకస్మిక లాక్‌డౌన్‌ల కారణంగా ఆర్థిక అభివృద్ధి దెబ్బతిందని విమర్శించారు. తానే దేశ మంతటినీ నడిపించాలనే నియంతృత్వ పోకడలతో మోదీ పాలిస్తున్నారని ఆరోపించారు. ప్రజలు విజ్ఞతతో ఆలోచించి ఓటేయాలని ఆయన కోరారు.

శ్రీధర్‌రెడ్డి హత్యపై సమగ్ర విచారణ



- జ్యుడీషియల్ విచారణ జరిపినా అభ్యంతరం లేదు
- మరోసారి తప్పుడు ఆరోపణలు చేస్తే పరువు నష్టం కేసు వేస్తా
- మంత్రి జూపల్లి కృష్ణారావు వ్యాఖ్యలు

సాక్షి, హైదరాబాద్: వనపర్తికి చెందిన శ్రీధర్‌రెడ్డి అనే వ్యక్తి హత్య కేసుకు సంబంధించి పూర్తి స్థాయి విచారణ జరిపిస్తామని మంత్రి జూపల్లి కృష్ణారావు స్పష్టం చేశారు. ఈ ఘటన లో వాస్తవాలు తెలియకుండా బీఆర్‌ఎస్ నేతలు కేటీఆర్, ప్రవీణ్‌కుమార్ తనపై ఆరోపణలు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని చెప్పారు. శుక్రవారం గాంధీభవన్‌లో మాజీ ఎంపీ మల్లురవి, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేనారెడ్డి, నేతలు కేతూరి వెంకటేశ్, సామా రామ్మోహన్‌రెడ్డి, లింగంయాదవ్‌తో కలిసి జూపల్లి మీడియాతో మాట్లాడారు. శ్రీధర్‌రెడ్డికి రాజకీయాలతో సంబంధం లేదని, ఆయన మాజీ ఎమ్మెల్యేకు బంధువు మాత్రమేనని తెలిపారు. ఆయన కుటుంబంలో ఆస్తి తగాదాలున్నాయని, మాజీ ఎమ్మెల్యేతో ఆర్థిక సంబంధాలున్నాయని చెప్పారు. గతంలో జరిగిన ఓ హత్య విషయంలోనూ ఇలానే ఆరోపణలు చేశారని, ఇప్పుడు కూడా తనపై బురదజల్లే ప్రయత్నాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

అందుకే బీఆర్‌ఎస్‌ను ప్రజలు బర్తరఫ్ చేశారు

తనను మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని కేటీఆర్ మాట్లాడుతున్నారని, తనతో పాటు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని బర్తరఫ్ చేసినందుకే ప్రజలు బీఆర్‌ఎస్‌నే బర్తరఫ్ చేశారన్న విషయాన్ని గుర్తుంచుకోవాలని జూపల్లి అన్నారు. శ్రీధర్‌రెడ్డి హత్య ఘటనపై జ్యుడీషియల్ విచారణ చేపట్టినా తనకు అభ్యంతరం లేదని చెప్పిన జూపల్లి తనపై ఆరోపణలు చేయడం కాదని లక్ష్మీపల్లి చౌరస్తాకు కేటీఆర్, ప్రవీణ్‌కుమార్‌లు వస్తే తానూ వస్తానని, అక్కడి ప్రజలు ఏం చెబితే అది చేద్దామని సవాల్ చేశారు. తనపై మరోసారి ఇలాంటి తప్పుడు ఆరోపణలు చేస్తే పరువు నష్టం కేసు వేస్తానని హెచ్చరించారు. మాజీ ఎంపీ మల్లురవి మాట్లాడుతూ జూపల్లికి నేర చరిత్ర లేదని అన్నారు.

సీఎం వ్యాఖ్యల వివరాలు
తెలుసుకుని చెప్పండి

బీజేపీ పిటిషన్‌పై పీపీకి హైకోర్టు ఆదేశం • గురువారం అర్ధరాత్రి 1గంట వరకు విచారణ

సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసినట్టుగా చెబుతున్న అనుచిత వ్యాఖ్యలకు సంబంధించిన వివరాలు తెలుసుకుని చెప్పాలని పీపీని హైకోర్టు ఆదేశించింది. తదుపరి విచారణను వచ్చే నెల 4కు వాయిదా వేసింది. 'లోక్‌సభ ఎన్నికల ప్రచారం సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి బీజేపీని ఉద్దేశించి.. రిజర్వేషన్లు తొలగిస్తారని, రాజ్యాంగం రద్దు చేస్తారంటూ తీవ్ర అనుచిత, తప్పుడు వ్యాఖ్యలు చేశారు. దీనిపై విచారణ జరపాలని కోరుతూ మే 10న స్పెషల్ జేఎఫ్‌సీఎం కోర్టులో ప్రైవేట్ పిటిషన్ దాఖలు చేశాం. దీన్ని రెండుసార్లు వాయిదా వేసిన జడ్జి 22న విచారణ చేపట్టారు. వివరాలు సమర్పించేందుకు మధ్యాహ్నానికి వాయిదా కోరగా, అందుకు నిరాకరించిన జడ్జి జూలైకు వాయిదా వేశారు. కేసు మెరిట్స్‌లోకి కూడా వెళ్లకుండా వాయిదా వేయడం చట్టవిరుద్ధం..'అని పేర్కొంటూ బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. బీజేపీ పిటిషన్‌ను వెంటనే అనుమతించేలా మేజిస్ట్రేట్ కోర్టును ఆదేశించాలని కోరారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి గురువారం అర్ధరాత్రి విచారణ చేపట్టారు.

దీర్ఘకాల వాయిదా చట్ట విరుద్ధం

పిటిషనర్ తరఫున న్యాయవాది హంస దేవినేని వాదనలు వినిపిస్తూ.. 'క్రిమినల్ ఫిర్యాదును పరిగణనలోకి తీసుకోకుండా మేజిస్ట్రేట్ కోర్టు దీర్ఘకాలం వాయిదా వేయడం చట్టవిరుద్ధం. లోక్‌సభ ఎన్నికలు ఇంకా కొనసాగుతున్నాయి. రేవంత్‌రెడ్డి అభ్యంతరకరమైన ప్రసంగాలు ఇప్పుడు ఎలక్ట్రానిక్, ప్రింట్, సోషల్ మీడియాలో ప్రసారం అవుతున్నాయి. అందువల్ల క్రిమినల్ ఫిర్యాదు వెంటనే పరిగణనలోకి తీసుకునేలా మేజిస్ట్రేట్ కోర్టుకు ఆదేశాలు జారీ చేయాలి..'అని కోరారు. ప్రభుత్వం తరఫున పీపీ పల్లె నాగేశ్వర్‌రావు వాదనలు వినిపిస్తూ.. 'ఈ పిటిషన్‌కు సంబంధించి వెకేషన్ బెంచ్ అత్యవసరంగా, అదీ లంచ్‌మోషన్ రూపంలో వాదనలు వినాల్సిన అవసరం లేదు. ఎలాంటి ఆదేశాలు జారీ చేయొద్దు. దీనిపై వివరాలు తెలుసుకుని చెప్పేందుకు సమయం కావాలి..'అని విజ్ఞప్తి చేశారు. ఈ నేపథ్యంలో న్యాయమూర్తి విచారణను వాయిదా వేశారు.

అర్ధరాత్రి వరకు విచారణలు

బీజేపీ దాఖలు చేసిన పిటిషన్‌పై న్యాయమూర్తి జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి గురువారం రాత్రి ఒంటి గంట ప్రాంతంలో ఆదేశాలు వెలువరించారు. వెకేషన్ బెంచ్‌లకు అత్యవసర కేసులు మాత్రమే వస్తాయి. గురువారం లిస్ట్‌లోకి ఈ కేసులు, పలు లంచ్‌మోషన్ పిటిషన్లు కూడా వచ్చాయి. దీంతో జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డితో పాటు జస్టిస్ అనిల్‌కుమార్ జూకంటి, జస్టిస్ లక్ష్మీనారాయణ అలిశెట్టి బెంచ్‌లు గురువారం రాత్రి వరకు విచారణ చేపట్టాయి. అనంతరం ఆయా పిటిషన్లపై ఆదేశాలు జారీ చేశారు. ఇలా అర్ధరాత్రి దాటిన తర్వాత కూడా కేసుల విచారణ కొనసాగడం అత్యంత అరుదు. వ్యాజ్యాల సత్వర పరిష్కారానికి న్యాయమూర్తులు అవిశ్రాంతంగా పని చేస్తుంటారని, సెలవు రోజుల్లోనూ అర్ధరాత్రి వరకు ఆయా కేసుల తీర్పులకు సంబంధించి కసరత్తు జరుగుతూనే ఉంటుందని సుప్రీంకోర్టు పేర్కొన్న మరుసటి రోజే రాష్ట్ర హైకోర్టు వెకేషన్ బెంచ్‌లు అర్ధరాత్రి దాటిన తర్వాత కూడా విచారణలు నిర్వహించడం గమనార్హం.

ఆమనగల్లు వద్ద ఘోర ప్రమాదం



రాంనుంతల గేటు సమీపంలో ఆర్టీసీ బస్సు, కారు ఢీకొన్న దృశ్యం



మృతులు మణిదీప్, నిఖిల్, శివకృష్ణ

ఎదురెదురుగా ఢీకొన్న కారు, ఆర్టీసీ బస్సు

- కారులో ప్రయాణిస్తున్న ముగ్గురు వ్యక్తులు అక్కడికక్కడే దుర్మరణం

ఆమనగల్లు: ఆర్టీసీ బస్సు, కారు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ముగ్గురు వ్యక్తులు మృతిచెందారు. రంగారెడ్డి జిల్లా ఆమనగల్లు మండలం రాంనుంతల గేటు సమీపంలో శుక్రవారం ఉదయం ఈ ఘటన జరిగింది. హైదరాబాద్- శ్రీశైలం జాతీయ రహదారిపై జరిగిన ఈ ప్రమాదంలో కారులో ఇరుక్కుపోయిన మృతదేహాలను జేసీబీల సాయంతో వెలికితీశారు. ఆమనగల్లు సీఐ ప్రమోద్‌కుమార్ కథనం ప్రకారం.. హైదరాబాద్‌లోని హస్తినాపురం ద్వారాకానగర్‌కు చెందిన మెడికల్ షాపు యజమాని బండారు శివకృష్ణ వరప్రసాద్‌గౌడ్ (28), బైరమల్‌గూడకు చెందిన ప్రైవేటు ఉద్యోగి బొర్ర మణిదీప్‌గౌడ్(25), బాలాపూర్‌లో నివాసం ఉంటున్న నల్లగొండ జిల్లా నాంపల్లి మండలం రాందాస్‌తాండాకు చెందిన ఇంటీరియర్ డిజైనర్ మెగావత్ నిఖిల్ (25) కలిసి కారులో గురువారం సాయంత్రం కల్వకుర్తికి వచ్చారు. శుక్రవారం ఉదయం తిరిగి హైదరాబాద్ వెళ్తుండగా పికెట్ డిపోకు చెందిన సూపర్ లగ్జరీ ఆర్టీసీ బస్సును ఎదురుగా వెళ్లి ఢీకొట్టారు. రెండు వాహనాలు వేగంగా ఉండటంతో కారు ముందుభాగం నుజ్జునుజ్జవగా.. ఆర్టీసీ బస్సు రోడ్డు కిందకి వెళ్లింది. ఈ ఘటనలో కారులో ప్రయాణిస్తున్న వరప్రసాద్‌గౌడ్, మణిదీప్‌గౌడ్, నిఖిల్ అక్కడికక్కడే మృతిచెందారు. విషయం తెలుసుకున్న ఆమనగల్లు సీఐ ప్రమోద్‌కుమార్, కడ్తాల సీఐ శివప్రసాద్, ఆమనగల్లు ఏఎస్‌ఐ యాదయ్య సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకున్నారు. కారులో ఇరుక్కుపోయిన మృతదేహాలను రెండు జేసీబీల సాయంతో వెలికితీశారు. అనంతరం మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం కల్వకుర్తి ప్రభుత్వాసుపత్రికి పంపించారు. ఈ ప్రమాదానికి అతివేగమే కారణమని పోలీసులు భావిస్తున్నారు. ప్రమాదం కారణంగా రహదారిపై పెద్ద ఎత్తున వాహనాలు నిలిచిపోయాయి. మృతుడు వరప్రసాద్‌గౌడ్‌కు భార్య నిహారిక, కుమారుడు ఉన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ప్రమోద్‌కుమార్ తెలిపారు.

మహిళా ఎంపీలు 9 మందే!

ఢిల్లీ పేలవ రికార్డు


సుచేతా కృపలానీ

మహిళలను లోక్‌సభకు పంపే విషయంలో ఢిల్లీ పేలవమైన రికార్డు మూటగట్టుకుంది. స్వాతంత్ర్యానంతరం ఇప్పటిదాకా నగరం నుంచి ఎంపీలుగా ఎన్నికైన మహిళలు కేవలం తొమ్మిది మంది మాత్రమే! రాజధాని నుంచి లోక్‌సభ ఎన్నికల్లో గెలిచిన తొలి మహిళగా ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధురాలు సుచేతా కృపలానీ నిలిచారు. ఆమె 1952లో తొలి లోక్‌సభకు ఎన్నికయ్యారు. 1957లో కూడా గెలిచారు. 1963లో ఆమె యూపీ సీఎం అయ్యారు. మళ్లీ తొమ్మిదేళ్లకు 1971లో సుభద్రా జోషీ, ముకుల్ బెనర్జీ ఢిల్లీ నుంచి లోక్‌సభకు ఎన్నికయ్యారు. సుభద్ర లోక్‌సభ ఎంపీ అయిన తొలి పంజాబీ మహిళ కూడా. ఆమె 1962లో యూపీలోని బలరాంపూర్‌లో దివంగత ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయిని ఓడించడం విశేషం. తర్వాత 1980లో సుందర్‌వతీ నావల్ ప్రభాకర్ చాందినీ చౌక్ లోక్‌సభ స్థానం నుంచి గెలిచారు. అనంతరం 1996, 1998 ఎన్నికల్లో మీరాకుమార్, సుష్మా స్వరాజ్ ఎంపీలయ్యారు. లోక్‌సభ తొలి మహిళా స్పీకర్‌గా మీరాకుమార్ నిలవగా, ఢిల్లీ నుంచి తొలి కాంగ్రెసేతర మహిళా ఎంపీగా సుష్మా స్వరాజ్ రికార్డులెక్కారు. 1999లో బీజేపీకి చెందిన అనితా ఆర్య కరోల్ బాగ్ నుంచి గెలుపొందారు. 2004, 2009ల్లో కాంగ్రెస్‌కు చెందిన కృష్ణ తీర్థ్ ఢిల్లీ నుంచి ఎంపీ అయ్యారు. 2014, 2019ల్లో మీనాక్షి లేఖి బీజేపీ నుంచి న్యూఢిల్లీ స్థానంలో నెగ్గారు.

బీజేపీ నుంచి బరిలో ఇద్దరు


మీనాక్షి లేఖి

ఢిల్లీ మాజీ సీఎం షీలా దీక్షిత్, కేంద్ర మంత్రి స్మృతి ఇరానీ ఢిల్లీ నుంచి లోక్‌సభ బరిలో దిగినా ఓటమి చవిచూశారు. ఈసారి బీజేపీ సుష్మా స్వరాజ్ కూతురు బాసురి (న్యూఢిల్లీ), కమల్‌జీత్ షెరావత్ (వెస్ట్ ఢిల్లీ) రూపంలో ఇద్దరు మహిళలకు ఢిల్లీలో టికెట్లిచ్చింది. కాంగ్రెస్ మాత్రం ఒక్క మహిళకు కూడా ఢిల్లీలో అవకాశమివ్వలేదు.

– సాక్షి, నేషనల్ డెస్క్

బీజేడీకి సవాల్!

బీజేపీ గట్టి పోటీ

6 స్థానాలకు నేడు పోలింగ్

ఒడిశాలో ఇప్పటిదాకా 9 లోక్‌సభ సీట్లకు, వాటి పరిధిలోని 63 అసెంబ్లీ స్థానాలకు పోలింగ్ పూర్తయింది. ఆరో విడతలో 6 లోక్‌సభ సీట్లకు శనివారం పోలింగ్ జరగనుంది. అధికార బిజూ జనతాదళ్, బీజేపీ హోరాహోరీగా తలపడుతుండగా కాంగ్రెస్ పూర్వ వైభవం కోసం శ్రమిస్తోంది. ఈ నేపథ్యంలో కీలక నియోజకవర్గాలపై ఫోకస్...

– సాక్షి, నేషనల్ డెస్క్

సంబాల్‌పూర్... తొలిసారి కాషాయ జెండా


ధర్మేంద్ర ప్రధాన్

2019లో ఇక్కడ తొలిసారి కాషాయ జెండా ఎగిరింది. బీజేపీ నేత నరేశ్ గంగదేవ్ కేవలం 9,162 ఓట్ల తేడాతో బీజేడీ అభ్యర్థి నళినీకాంత ప్రధాన్‌ను ఓడించారు. ఈసారి కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తొలిసారి ప్రత్యక్ష ఎన్నికల బరిలో దిగారు. కాంగ్రెస్ నుంచి నాగేంద్ర ప్రధాన్, బీజేడీ నుంచి ప్రణబ్ ప్రకాశ్ దాస్ పోటీలో ఉన్నారు. త్రిముఖ పోరు ఉత్కంఠ రేపుతోంది.

పూరి.. నువ్వా నేనా!


అరూప్ పట్నాయక్

సుందరమైన బీచ్‌లు, జగన్నాథుడి సన్నిధితో కళకళలాడే పూరిలో బీజేడీకి 2019లో బీజేపీ జాతీయ ప్రతినిధి సంబిత్ పాత్ర చుక్కలు చూపించారు. చివరిదాకా గట్టి పోటీ ఇచ్చి కేవలం 11,714 ఓట్ల తేడాతో ఓడిపోయారు. ఈసారి మళ్లీ సవాలు విసురుతున్నారు. ఇక బీజేడీ సిట్టింగ్ ఎంపీ పినాకీ మిశ్రాకు బదులు ముంబై మాజీ పోలీస్ కమిషనర్ అరూప్ పట్నాయక్‌ను బరిలోకి దించింది. కాంగ్రెస్ నుంచి జయనారాయణ్ పట్నాయక్ పోటీలో ఉన్నారు. ఆ పార్టీకి ఇక్కడ బలమైన ఓటు బ్యాంకుంది.

భువనేశ్వర్... నవీన్‌కు సవాల్


అపరాజితా సారంగి

ఈ టెంపుల్ సిటీలో గత ఎన్నికల్లో తొలిసారి బీజేపీ గెలిచింది. బీజేడీ అభ్యర్థి, ముంబై మాజీ పోలీస్ కమిషనర్ అరూప్ పట్నాయక్‌ను బీజేపీ తరఫున మాజీ ఐఏఎస్ అపరాజితా సారంగి ఓడించారు. ఈసారీ ఆమే బరిలో ఉన్నారు. బీజేడీ నుంచి మన్మథ రౌత్రే, కాంగ్రెస్ నుంచి యాసిర్ నవాజ్ పోటీలో ఉన్నారు. దాంతో త్రిముఖ పోటీ రసవత్తరంగా మారింది. ఇండియా కూటమి భాగస్వామి సీపీఎం కూడా పోటీలో ఉండటం కొసమెరుపు!

కటక్... బీజేడీ కంచుకోట


భర్తృహరి మహతాబ్

స్వాతంత్ర్య యోధుడు సుభాష్ చంద్ర బోస్ జన్మస్థలమిది. హొయలొలికించే మహానదీ తీరాన 900 ఏళ్ల కళింగ రాజధానిగా వెలిగింది. బీజేడీ దిగ్గజం భర్తృహరి మహతాబ్ 1998 నుంచి వరుసగా ఆరుసార్లు గెలిచారు. ఇటీవలే బీజేపీలో చేరి ఆ పార్టీ టికెట్‌పై బరిలోకి దిగారు. బీజేడీ నుంచి సంతృప్త్ మిశ్రా, కాంగ్రెస్ నుంచి సురేశ్ మహాపాత్ర రేసులో ఉన్నారు. కంచుకోటను కాపాడుకునేందుకు సీఎం నవీన్ పట్నాయక్ గట్టిగా ప్రయత్నిస్తున్నారు. కాంగ్రెస్‌కూ మంచి ఓటు బ్యాంకు ఉండటంతో త్రిముఖ పోరు ఉత్కంఠ రేపుతోంది.

కియోంజర్.. పోటాపోటీ


ధనుర్జయ సిద్దు

ఈ ఎస్టీ రిజర్వ్‌డ్ నియోజకవర్గం 2009 నుంచీ బీజేడీ గుప్పెట్లోనే ఉంది. 2019లో బీజేడీ నుంచి గెలిచిన చంద్రానీ ముర్ము యంగెస్ట్ ఎంపీగా రికార్డు సృష్టించారు. ఈసారి ధనుర్జయ సిద్దుకు బీజేడీ టికెటిచ్చింది. బీజేపీ నుంచి అనంత నాయక్, కాంగ్రెస్ నుంచి బినోద్ బిహారీ నాయక్ రేసులో ఉన్నారు. కియోంజర్ పరిధిలోని 7 అసెంబ్లీ సెగ్మెంట్లలో 6 బీజేడీ చేతిలోనే ఉండటం ఆ పార్టీకి కలిసొచ్చే అంశం.

గురుగ్రాంలో ముక్కోణం

బరిలో మంత్రి ఇందర్‌జీత్, నటుడు రాజ్ బబ్బర్

గట్టి పోటీ ఇస్తున్న గాయకుడు రాహుల్ యాదవ్

గురుగ్రాం. మిలీనియం సిటీ. దేశ రాజధానికి కేవలం 25 కిలోమీటర్ల దూరంలో ఉన్న నగరం. బహుళజాతి కంపెనీలకు నిలయం. శనివారం పోలింగ్ జరగనున్న ఈ లోక్‌సభ స్థానంలో బీజేపీ, కాంగ్రెస్, జేజేపీ మధ్య ముక్కోణపు పోటీ నెలకొంది. బీజేపీ నుంచి సిట్టింగ్ ఎంపీ, కేంద్ర మంత్రి రావు ఇందర్‌జీత్ సింగ్, కాంగ్రెస్ నుంచి నటుడు రాజ్ బబ్బర్, జేజేపీ నుంచి హర్యాన్వీ గాయకుడు రాహుల్ యాదవ్ హోరాహోరీ తలపడుతున్నారు...

– సాక్షి, నేషనల్ డెస్క్

మిలీనియం సిటీగా పేరొందిన గురుగ్రాంలో ఫార్చ్యూన్ 500 జాబితాలోని 250కి పైగా కంపెనీలున్నాయి. పెప్సికో, నెస్లే, ఇంటర్నేషనల్ సోలార్ అలయన్స్ వంటి దిగ్గజ సంస్థల ప్రధాన కార్యాలయాలున్నాయి. ఇంతటి కీలక నగరంలో మౌలిక సదుపాయాల కొరత ప్రధాన సమస్య. వర్షాకాలంలో ఇది కొట్టొచ్చినట్టు కన్పిస్తుంటుంది. నీటి ఎద్దడి, డ్రైనేజీ వ్యవస్థ లోపాలు, ట్రాఫిక్ రద్దీ స్థానికులను ఆందోళనపరిచే అంశాల్లో కొన్ని మాత్రమే. గురుగ్రాం లోక్‌సభ స్థానంలో ఏకంగా 25.3 లక్షల మంది ఓటర్లున్నారు. ఓటర్లపరంగా హరియాణాలో ఇదే అతి పెద్ద లోక్‌సభ స్థానం. ఈసారి ఓటింగ్ శాతాన్ని పెంచడానికి ఇక్కడ ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టారు. ఓటర్ ఇన్ క్యూ యాప్, ఓటర్లకు పోలింగ్ ఆహ్వానాలు, బహుళ అంతస్తుల సొసైటీల్లో పోలింగ్ బూత్‌ల ఏర్పాటు వంటివి చేశారు.


• రావ్ ఇందర్‌జీత్ సింగ్

ముక్కోణపు పోటీ...

కేంద్ర మంత్రి రావ్ ఇందర్‌జీత్ సింగ్ గురుగ్రాం నుంచి ఐదుసార్లు గెలిచారు. ఆయనకు గట్టి పోటీ ఇవ్వడంతో పాటు బీజేపీ పట్టణ ఓటు బ్యాంకును కొల్లగొట్టాలని కాంగ్రెస్ పట్టుదలగా ఉంది. అందుకే అహిర్వాల్‌కు చెందిన సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి కెప్టెన్ అజయ్ సింగ్ యాదవ్‌ను పక్కన పెట్టి రాజ్ బబ్బర్‌కు టికెటిచ్చింది. ఈ స్థానంలో కాంగ్రెస్ యాదవేతర అభ్యర్థిని నిలబెట్టడం ఇదే మొదటిసారి. ఇది హరియాణా కాంగ్రెస్‌లో అసంతృప్తికి కారణమైంది. 2019లో ఓడిన అజయ్ సింగ్ యాదవ్ కూడా బబ్బర్ ఎంపికపై అసంతృప్తితో ఉన్నారు. యాదవ్ ఓట్లను రాబట్టుకునేందుకు జననాయక్ జనతా పార్టీ వ్యూహాత్మకంగా రాపర్ సింగర్ రాహుల్ యాదవ్ అలియాస్ ఫజిల్‌పురియాకు టికెటిచ్చింది.


• రాజ్ బబ్బర్

విమర్శల హోరు...

బబ్బర్ అభ్యర్థిత్వాన్ని కాంగ్రెస్ ప్రకటించగానే ఆయనపై 'ఔట్ సైడర్' ప్రచారాన్ని బీజేపీ ముమ్మరం చేసింది. దీన్ని రాజ్ బబ్బర్ గట్టిగానే తిప్పికొడుతున్నారు. దేశ విభజన తరువాత తన కుటుంబం అంబాలాకు చేరుకుందని, గురుగ్రాం, ఫరీదాబాద్‌ల్లో తమ బంధువులున్నారని చెబుతున్నారు. 'మై బాహారీ నహీ హూ' అని ప్రతి సభలోనూ ప్రత్యేకంగా చెబుతున్నారు. హరియాణాకు భారీగా ఆదాయం సమకూరుస్తున్నా గురుగ్రాంలో మౌలిక సదుపాయాలే లేవంటూ బీజేపీపై దుమ్మెత్తిపోస్తున్నారు. కానీ నగరంలో జరిగిన అభివృద్ధంతా తన హయాంలో జరిగిందేనని ఇందర్‌జీత్ అంటున్నారు. ఆయన తరఫున కూతురు ఆర్తి సింగ్ విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. ఇక రాజకీయాల్లో విప్లవాత్మక మార్పుకోసమే తాను పోటీ చేస్తున్నానని ఫజిల్‌పురియా చెబుతున్నారు. పక్కా లోకల్ పార్టీ అయిన జేజేపీకే ఓటేయాలన్న ఆయన అభ్యర్థనకు మంచి స్పందనే వస్తోంది.

లోక్‌సభ బరిలో ప్యాడ్ ఉమన్

ఝార్‌గ్రామ్ నుంచి పోటీ చేస్తున్న సోనామణి

బెంగాల్–జార్ఖండ్ సరిహద్దుల్లోని గిరిజన గ్రామాలు. అక్షరాస్యత అంతంతే. మహిళల రుతు సమస్యలపై చర్చ కూడా నిషిద్ధమే. దాన్ని బ్రేక్ చేశారామె. సమస్యపై మహిళలకు అవగాహన కల్పించడమే గాక శానిటరీ న్యాప్‌కిన్ల వాడకం నేర్పించారు. జార్ఖండ్–బెంగాల్ సరిహద్దుల్లో ప్యాడ్ ఉమన్‌గా పేరొందారు. పశ్చిమ బెంగాల్లో శనివారం పోలింగ్ జరగనున్న ఝార్‌గ్రామ్ లోక్‌సభ స్థానం నుంచి సీపీఎం అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు. ఆమే జార్ఖండ్ మట్టి బిడ్డ, బెంగాల్ కోడలు సోనామణి ముర్ము...

సోనామణి జార్ఖండ్‌లోని తూర్పు సింగ్‌భూమ్ జిల్లా కొడియాలో జన్మించారు. జంషెడ్‌పూర్‌లో సైకాలజీలో పీజీ చేశారు. నిరక్షరాస్యతకు అమాయకత్వం తోడవటంతో స్థానిక మహిళల్లో అనేక ఆరోగ్య సమస్యలు. టీనేజ్ అమ్మాయిలతో మొదలు పెట్టిన మహిళలందరికీ రుతుక్రమ సమస్యలపై అవగాహన కల్పించారు. పెళ్లికి ముందు స్థానిక పంచాయతీ ఎన్నికల్లో గెలిచి ప్రధాన్‌గా బాధ్యతలు నిర్వహించారు. 2016లో బెంగాల్‌లోని బంద్వాన్ నివాసి మనీష్ తుడును పెళ్లాడారు. పంచాయతీ ఎన్నికల్లో సీపీఎం అభ్యర్థిగా విజయం సాధించారు. ఇప్పుడు ఏకంగా లోక్‌సభ బరిలో నిలిచారు.

దీదీ, మోదీలతో విసిగిపోయారు..

ఝార్‌గ్రామ్ ఒకప్పుడు సీపీఎం కంచుకోట. జంగల్‌మహల్‌లో మావోయిస్టుల హింస తరువాత తృణమూల్ అధికారంలోకి వచ్చింది. ఎర్రకోట పచ్చగా మారింది. సీపీఎం కార్యకర్తలు ఇళ్లు వీడాల్సి వచ్చింది. గత లోక్‌సభలో అక్కడ బీజేపీ గెలిచింది. ఈసారి మాత్రం లాల్ జెండా ఎగరడం ఖాయమంటున్నారు గిరిజన బిడ్డ సోనామణి. ''దీదీ, మోదీ చిత్రహింసలతో జనం విసిగిపోయారు. అందుకే ఎర్రజెండాను కోరుతున్నారు. ఝార్‌గ్రామ్‌లో పేదరికం ఎక్కువ. రెండు పూటలా కడుపునిండా తిండి దొరకని స్థితి. ఉపాధి లేదు. ఉపాధి హామీ పనులూ లేవు. సాగుపైనే ఆధారపడే అటవీ ప్రాంతాల ప్రజలకు ఎరువులు, విత్తనాల ధరలు అందుబాటులో లేవు. పాఠశాలల పరిస్థితి అధ్వానం. చదువుకున్నవారికి ఉద్యోగాలు లేవు. ఈ పరిస్థితిని మారుస్తా'' అంటూ ఇంటింటికీ ప్రచారం చేసి ఆకట్టుకున్నారామె.



– సాక్షి, నేషనల్ డెస్క్

సాక్షి రియల్టీ





ఫ్లాట్లొద్దు.. విల్లానే కావాలి!

- ఓపెన్ ప్లాట్లు, విల్లాల కొనుగోళ్లకే మొగ్గు
- అపార్ట్‌మెంట్లకు తగ్గిన గిరాకీ
- గత 4 నెలల్లో 68,285 విల్లాల అమ్మకాలు
- ఇదే సమయంలో 50,257 అపార్ట్‌మెంట్లు సేల్
- అత్యధికంగా 95,675 ఓపెన్ ప్లాట్ల విక్రయం
- నగరంలో ట్రాఫిక్, కాలుష్యంతో శివార్లకు పరుగులు

సాక్షి, హైదరాబాద్: కరోనా తర్వాత నుంచి స్థిరాస్తి కొనుగోలుదారుల్లో మార్పులు వచ్చాయి. విశాలమైన ఇళ్లు, గ్రీనరీ, పర్యావరణ స్పృహ పెరిగింది. ఆరోగ్యకరమైన ఆహారంతో పాటు నివాసాల్లోనూ హరిత వాతావరణానికి ప్రాధాన్యం ఇస్తున్నారు. ప్రధాన నగరంలో వాహనాల రణగొణ ధ్వనులు, కాలుష్యం కారణంగా సిటీ నుంచి దూరంగా, ఆహ్లాదకరమైన వాతావరణంలో ఇళ్లు కొనుగోలు చేయాలని భావిస్తున్నారు. దీంతో అపార్ట్‌మెంట్ల కంటే ఓపెన్ ప్లాట్లు, విల్లాలకు గిరాకీ పెరిగింది. నగరం నలువైపులా శివారు ప్రాంతాల్లో స్థిరాస్తి రంగం జోరుగా సాగుతోంది.

ఓపెన్ ప్లాట్లు, విల్లాల జోరు..

కరోనా సమయంలో మొదలైన ఈ సంస్కృతి ప్రస్తుతం మరింత వేగం పుంజుకుంది. డిసెంబర్ నుంచి మార్చి మధ్యకాలంలో హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్‌ఎండీఏ) పరిధిలో 68,285 విల్లాలు అమ్ముడుపోయాయి. ఇదే సమయంలో 50,257 అపార్ట్‌మెంట్లు విక్రయమయ్యాయి. అత్యధికంగా 95,675 ఓపెన్ ప్లాట్లు సేలయ్యాయి. ప్రతి నెలా సగటున 16 వేల నుంచి 18 వేల విల్లాలు విక్రయమవుతుండగా.. అపార్ట్‌మెంట్లు కేవలం 13 వేలకు పరిమితమవుతున్నాయని స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.

ఫ్లాట్లలో అన్ని వసతులున్నా..

అపార్ట్‌మెంట్లలో స్విమ్మింగ్‌పూల్, జిమ్ వంటి అన్ని రకాల వసతులు ఉన్నప్పటికీ కొనుగోలుదారులు సొంత జాగాలో ఇల్లు ఉండాలని భావిస్తున్నారు. గచ్చిబౌలి, మాదాపూర్ వంటి పశ్చిమ హైదరాబాద్‌లోని అపార్ట్‌మెంట్లలో 2 వేల చదరపు అడుగుల కంటే ఎక్కువ విస్తీర్ణం ఉండే లగ్జరీ అపార్ట్‌మెంట్ల కొనుగోళ్లకు కస్టమర్లు ఆసక్తి చూపిస్తున్నారు. ఉప్పల్, ఎల్బీనగర్ వంటి ప్రాంతాల్లోని ఫ్లాట్లను మధ్య తరగతి ప్రజలు కొనేందుకు మొగ్గు చూపిస్తున్నారు.

శివార్లలో కొనుగోళ్లకు ఆసక్తి..

నగరం నలువైపులా ఔటర్ రింగ్ రోడ్డుకు చేరువలోని అన్ని ప్రాంతాల్లోని ఓపెన్ ప్లాట్లు, విల్లాలు, వ్యక్తిగత గృహాలకు డిమాండ్ ఉంది. ప్రధాన నగరంతో అనుసంధానమయ్యేలా మెరుగైన రోడ్లు, మంచినీరు, డ్రైనేజీ, విద్యుత్ వంటి కనీస మౌలిక వసతులు ఉన్న ప్రాంతాల్లో నివాసం ఉండేందుకు కొనుగోలుదారులు ఆసక్తి చూపిస్తున్నారు. దీంతో ప్రధాన నగరంలోని కార్యాలయానికి, సెలవు దినాల్లో సొంతూర్లకు వెళ్లేందుకు సౌకర్యవంతంగా ఉంటుందని భావిస్తున్నారు. కోకాపేట, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, పుప్పాలగూడ, శేరిలింగంపల్లి వంటి పశ్చిమ ప్రాంతాల్లోనే కాకుండా తూర్పు, ఉత్తర, ఈశాన్య ప్రాంతాల్లోని ఉప్పల్, ఎల్బీనగర్, ఆదిభట్ల, కొంపల్లి, శామీర్‌పేట, ఇబ్రహీంపట్నం, మహేశ్వరం వంటి నగరం నలువైపులా డిమాండ్ ఏర్పడింది.

హెచ్‌ఎండీఏ పరిధిలో విక్రయాలు

నెల	ఫ్లాట్లు	విల్లాలు	ఓపెన్ ప్లాట్లు	మొత్తం	ఆదాయం
మార్చి	13,199	17,913	23,487	54,599	రూ.890 కోట్లు
ఫిబ్రవరి	13,209	18,111	25,167	56,487	రూ.920 కోట్లు
జనవరి	10,655	15,733	21,583	47,971	రూ.678 కోట్లు
డిసెంబర్–23	13,194	16,528	25,438	55,160	రూ.918 కోట్లు

అద్దెలు పెరిగాయి!



సాక్షి, హైదరాబాద్: నగరంలో గృహాల అద్దెలు పెరిగాయి. ప్రీమియం ఇళ్లకు డిమాండ్, ఆఫీసు కేంద్రాలకు చేరువలో ఉండటం వంటి కారణంగా ప్రధాన నగరాలలో ఇళ్ల అద్దెలు వృద్ధి చెందుతున్నాయి. క్రితం త్రైమాసికంతో పోలిస్తే ఈ ఏడాది 24.2 శాతం మేర పెరిగాయని మ్యాజిక్‌బ్రిక్స్.కామ్ నివేదిక వెల్లడించింది. అత్యధికంగా థానేలో 57.3 శాతం, గుర్గావ్‌లో 41.4 శాతం, గ్రేటర్ నోయిడాలో 28.7 శాతం, నోయిడాలో 25.2 శాతం వృద్ధి చెందాయి. సెమీ ఫర్నిష్ గృహాలను రెంట్‌కు తీసుకునేందుకు నగరవాసులు ఆసక్తి చూపిస్తున్నారు. ఈ తరహా అద్దెలకు 52.7 శాతం డిమాండ్ ఉండగా.. సప్లయి 48.7 శాతం మాత్రమే ఉందని మ్యాజిక్‌బ్రిక్స్ సీఈఓ సుధీర్ పాయ్ తెలిపారు. నెలకురూ.10–30 వేలు మధ్య అద్దె ఉన్న మధ్యస్థాయి గృహాలకు 41 శాతం మంది ఆసక్తి చూపిస్తున్నారని పేర్కొన్నారు. 2024 ఆర్థిక సంవత్సరం తొలి ఆరు నెలల్లో (హెచ్1) దేశంలోని ఏడు ప్రధాన నగరాలలో కార్యాలయాల అద్దెలు 7 శాతం మేర పెరిగాయి.



ఆరోగ్య లాభాల ఖర్జూరాలు

నిగనిగ మెరిసిపోతూ.. ఖర్జూరాలు చూడటానికి ఎంతో ఆకర్షణీయంగా ఉంటాయి. రుచికి కూడా బాగుంటాయి. అందుకే అందరూ వీటిని అందరూ ఇష్టపడతారు. ఖర్జూరంలో పోషకాలు పుష్కలంగా ఉంటాయి. ఆయుర్వేదంలో వీటిని ఔషధాల తయారీలోనూ ఉపయోగిస్తారు. రోజూ కొద్ది మొత్తంలో ఖర్జూరం పండ్లు తింటే.. ఆరోగ్యానికి మేలు జరుగుతుందని నిపుణులు చెబుతున్నారు. ఖర్జూరం తింటే ఎలాంటి ఆరోగ్య ప్రయోజనాలు ఉంటాయో తెలుసుకుందాం..

ఖర్జూరాల వల్ల కలిగే ప్రయోజనాలను పొందాలంటే... కనీసం ఒక వారం లేదా పదిరోజులపాటు క్రమం తప్పకుండా నాలుగయిదు తినాలి. డయాబెటిస్ ఉన్న వారు మాత్రం వైద్యుల సలహా మేరకు మాత్రమే వీటిని తీసుకోవాలి.

గుండెకు బలం... ఖర్జూరాలు గుండె ఆరోగ్యానికి మేలు చేస్తాయి. ఖర్జూరంలో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు ధమని కణాల నుంచి కొలెస్ట్రాల్‌ను తొలగించడంలో సహాయపడతాయి. ఖర్జూరం తినటం వల్ల చెడ్డ కొలెస్ట్రాల్ తగ్గుతుంది. గుండెపోటు, హైపర్‌టెన్షన్, స్ట్రోక్ వంటి సమస్యలు వచ్చే ప్రమాదం తగ్గుతుంది. ఖర్జూలంలో పొటాషియం పుష్కలంగా ఉంటుంది. ఇది హార్ట్ బీట్, బీపీని నార్మల్‌గా ఉంచుతుంది.

కండరాలు బలంగా ఉంటాయి... ఖర్జూరంలో కాల్షియం పుష్కలంగా ఉంటుంది. ఇది ఎముకలు బలంగా ఉండటానికి సహాయపడుతుంది. ఖర్జూరంలో ఉండే. పొటాషియం, ఫాస్ఫరస్, సెలీనియం, కాపర్, మాంగనీస్ వంటివి ఎముకలు గుల్లబారటం, కీళ్ల అరగటం వంటి ఎముకల సమస్యలు రాకుండా రక్షిస్తాయి.

సంతానోత్పత్తి సామర్థ్యం .. మగవారిలో సంతానోత్పత్తి సామర్థ్యం పెంచడానికి ఖర్జూరాలు సహాయపడతాయి. ఖర్జూరం తింటే స్పెర్మ్ నాణ్యత పెరుగుతుంది.



మెరుగైన జ్ఞాపకశక్తి... ఖర్జూరాల్లో ఉండే విటమిన్ 'బి6' వల్ల మెదడు చురుగ్గా పనిచేస్తుంది. మెదడును ఒత్తిడి, వాపు నుంచి రక్షించవచ్చు. ఖర్జూరాలను రోజూ తింటే.. నాడీ వ్యవస్థను ప్రభావితం చేసే.. న్యూరో డీ జెనరేటివ్ వ్యాధి నుంచి దూరంగా ఉండొచ్చు. ఖర్జూరం తింటే జ్ఞాపకశక్తి మెరుగుపడుతుంది. ఖర్జూరంలో ఉండే ఫైబర్ కడుపులో మంచి బ్యాక్టీరియాను ప్రోత్సహించడానికి పని చేస్తుంది. దీనిలోని యాంటీ ఆక్సిడెంట్లు ఫ్రీ రాడికల్స్‌ను అడ్డుకుంటాయి. పెద్దపేగు, ప్రోస్టేట్, రొమ్ము, ఎండోమెట్రియల్, ఊపిరితిత్తులు, క్లోమ క్యాన్సర్ల నుంచి రక్షణ లభిస్తుంది.

జీర్ణ సమస్యలు దూరం... ఖర్జూరంలో ఉండే ఫైబర్ వల్ల జీర్ణకోశ వ్యవస్థ సక్రమంగా పనిచేసి, మలబద్ధకం దరి చేరదు.



ఓ అరగంట నడక చాలు... రోజంతా ఉల్లాసమే!

మనకు తెలిసిన విషయమే కదా అని తేలిగ్గా తీసిపారేయద్దు. అలాగే బద్ధకించవద్దు. క్రమం తప్పకుండా రోజూ ఓ అరగంట పాటు నడవడం వల్ల ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలున్నాయి. స్లిమ్‌గా ఉండవచ్చు. డయాబెటిస్, బీపీ వంటి వాటికి దూరంగా ఉండచ్చు.అన్నింటికీ మించి రోజంతా ఉత్సాహంగా.. ఉల్లాసంగా ఉండచ్చు. అలాగని ఎప్పుడు పడితే అప్పుడు నడవడం కాదు... మన నడక ఎలా ఉండాలి... ఎంత దూరం నడవాలి? ఏ సమయంలో నడవాలి... వంటి ప్రాథమిక విషయాలు తెలుసుకుందాం...

ఖాళీ కడుపుతో 30 నిమిషాల మార్నింగ్ వాక్ అనే నియమాన్ని అలవాటుగా చేసుకోవటం వల్ల రోజంతా శక్తిని పొందుతారు. ఉత్సాహంగా ఉల్లాసంగా ఉంటారు. వార్ధక్య లక్షణాలు తొందరగా దరిచేరకుండా ఉంటాయి. దీనిని తేలిగ్గా తీసేయకుండా దిన చర్యలో చేర్చడం ద్వారా ఎన్నో ప్రయోజనాలను సులభంగా పొందవచ్చు.

క్రమం తప్పకుండా నడవడం శారీరక ఆరోగ్యాన్ని మాత్రమే కాకుండా మానసిక ఆరోగ్యాన్ని మెరుగు పరుస్తుంది. సాధారణంగా, శారీరక వ్యాయామాలు, కార్యకలాపాలు ఆందోళన, నిరాశ, ఒత్తిడి, ఇతర సమస్యలను దూరం చేయడంలో సహాయపడతాయని చెబుతారు. ఉదయాన్నే ఖాళీ కడుపుతో 30 నిమిషాల పాటు చేసే మార్నింగ్ వాక్ అనేక ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తుంది.

వ్యాయామాలన్నింటిలోనూ అతి తేలికపాటి వ్యాయామం ఏదంటే నడకే అని చెప్పచ్చు.

బరువును నియంత్రించడంలో, కేలరీలను కరిగించడంలో వాకింగ్‌ను మించిన మందే లేదు. క్రమబద్ధమైన నడక వార్ధక్య ఛాయలను నివారిస్తుంది. అయితే ఆ నడక ఎలా ఉండాలి... ఎప్పుడు చేయాలో చూద్దాం...

శక్తిని పెంచుతుంది

మార్నింగ్ వాక్ ఎప్పుడూ కూడా ఖాళీ కడుపుతోనే చేయాలి. అలా ఖాళీ కడుపుతో చేసే మార్నింగ్ వాక్ శక్తి స్థాయిని పెంచుతుంది. శరీరం, మనస్సు సాంత్వన పొంది, కణజాలాలు శక్తిని పొందేలా చేస్తుంది. వాకింగ్ వంటి సాధారణ శారీరక శ్రమ శక్తి స్థాయిలను పెంచడానికి గొప్ప మార్గం. ఇది అలసట తగ్గించి,, ఉత్సాహాన్ని పెంచడంలో సహాయపడుతుంది.

గుండెకు బలాన్నిస్తుంది

రోజూ ఉదయాన్నే అరగంటపాడు చురుగ్గా నడవడం వల్ల గుండె ఆరోగ్యం మెరుగు పడుతుంది. ఈ సాధారణ వ్యాయామం గుండె ఆరోగ్యాన్ని, రక్తపోటును తగ్గిస్తుంది. ప్రతి రోజూ ఉదయం వ్యాయామం చేయడం వల్ల గుండె జబ్బుల ముప్పును ముందుగానే తగ్గించుకోవచ్చు.

జీర్ణవ్యవస్థను ఉత్తేజ పరుస్తుంది

జీర్ణక్రియను ఉత్తేజపరిచేందుకు ఖాళీ కడుపుతో ఉదయాన్నే నడవడం మంచిది. ఈ అభ్యాసం మీ ఉదర కండరాల సహజ సంకోచాన్ని ప్రోత్సహిస్తుంది.

మానసిక బలం

రోజూ నడవడం వల్ల మెరుగైన ఆత్మగౌరవం, మెరుగైన మానసిక స్థితి, ఆందోళన సమస్యలతో సహా మీ మానసిక ఆరోగ్యానికి వాకింగ్ గొప్ప ప్రయోజనాలను కలిగిస్తుంది. శారీరక శ్రమ మీ శరీరం మానసిక స్థితి ఆత్మగౌరవాన్ని మెరుగుపరిచే ఎండార్ఫిన్‌లను విడుదల చేయడంలో సహాయపడుతుంది.

చక్కటి నిద్ర: తెల్లవారుజామున వెలువడే సూర్యరశ్మి సహజంగా మీ సిర్కాడియన్ రిథమ్‌ను ఏర్పాటు చేయడంలో సహాయపడుతుంది. ఇది మీ నిద్ర నాణ్యతను మెరుగుపరుస్తుంది. మీ దినచర్యకు 30 నిమిషాల మార్నింగ్ వాక్ అలవాటుతో మీ మెదడు కార్యకలాపాలు పెరుగుతాయి. శారీరక శ్రమ మెదడుకు రక్త సరఫరాను పెంచుతుంది. పనితీరు, జ్ఞాపకశక్తి, ఏకాగ్రత, సమస్య పరిష్కార నైపుణ్యాలను మెరుగుపరచడంలో సహాయపడుతుంది. వాకింగ్ వంటి మితమైన వ్యాయామం, కాలక్రమేణా జ్ఞాపకశక్తిని మెరుగుపరుస్తుంది. అందుకే వాయిదా వేయకుండా నడుద్దాం. నడకను పడక ఎక్కనివ్వకుండా చూద్దాం.



కండరాలు పట్టేస్తున్నాయా..? నివారణ సులువే!

రాత్రిపూట మంచి నిద్రలో ఉన్నప్పుడు హఠాత్తుగా మెలకువ వస్తుంది. ఏ బాత్‌రూమ్‌కో వెళ్లాల్సి వచ్చి కాలు కింద పెడదామని చూస్తే అడుగు ముందుకు పడదు. పిక్కలు, కండరాలు పట్టేసినట్లుంటుంది. చాలామందికి ఇదొక బాధాకరమైన అనుభవం. అంతేనా.. మండుటెండలో చెమట పట్టేలా కష్టపడుతున్నప్పుడు ఉన్నట్లుండి తొడ కండరాలు పట్టేసి విపరీతమైన బాధతో కుంటుతూ నడవాల్సి వస్తుంతది. ఒక్కోసారి మంచి చలికాలంలో వేళ్లు కొంకర్లు పోయినట్లుగా అయిపోయి ఎంత ప్రయత్నించినా అవి అలాగే బిగుసుకుపోయి బాగా నొప్పితో పళ్ల బిగువున బాధను అణిచి పెట్టుకోవాల్సి వస్తుంది. ఇలాంటి అనుభవాల్లో ఏదో ఒకటి ఎప్పుడో ఒకప్పుడు ఎదురయ్యే ఉంటుంది. దీనినే కండరాలు పట్టెయ్యడం లేదా మజిల్ క్రాంప్స్ అంటారు. దీనికి కారణాలు, నివారణోపాయాలను తెలుసుకుందాం.

మనం శారీరక శ్రమ చేసినప్పుడు చెమటతో పాటు ఉప్పు రూపంలో సోడియమ్ ను కూడా చాలా వరకూ కోల్పోతాం. సోడియమ్ తగ్గడం వల్ల శరీరంలోని కండరాలు...ముఖ్యంగా పిక్క, తొడ, భుజం కండరాలు పట్టేసినట్లుగా నొప్పికి గురవుతాయి. అందుకే చాలామందికి ఎండాకాలంలో తరచూ ఈ సమస్య ఎదురవుతుంది. వేసవికాలంలో ఆటగాళ్లు చాలామంది ఈ సమస్యకు గురవుతుంటారు. ఇంకా కొందరిలో విరేచనాలు, వాంతులు ఎక్కువగా అయినప్పుడు కూడా సోడియమ్‌ను కోల్పోతారు. అలాంటివారిలో కూడా ఒళ్లు నొప్పులు రావడం, నీరసపడిపోవడం జరుగుతుంది.

కారణాలు...

మహిళల్లో చాలామంది కుటుంబ సభ్యులకు తినిపించడంలోనే ఎక్కువ శ్రద్ధ తీసుకుంటూ, తాము తినడానికి రెండో ప్రాధాన్యత ఇస్తుండటం వల్ల వారికి తగిన క్యాల్షియం, ఇతర పోషకాలూ సరిగా అందక ఈ పరిస్థితి ఎదురవుతుంది.

ఇంకా...

థైరాయిడ్... మన శరీరంలోని థైరాయిడ్ గ్రంథి పనితీరు తగ్గడం వల్ల వచ్చే వ్యాధిని హైపోథైరాయిడిజమ్ అంటారు. హైపోథైరాయిడ్ ఉన్నవారికి మజిల్ క్రాంప్స్ ఎక్కువగా వస్తుంది. ఇది ఏ వయస్సు వారికైనా రావచ్చు. పిల్లల్లో ఈ సమస్య ఉంటే ఎక్కువ దూరం పరుగెత్తలేరు. మహిళలకైతే రాత్రి సమయంలో పిక్కలు నొప్పిపెడుతుంటాయి. మగవారు కూడా ఎక్కువ దూరం నడవలేరు.

శరీరం ద్రవాలు కోల్పోవడం... సాధారణంగా శరీరంలోని నీటిని కోల్పోవడం వల్ల కండరాలు అకస్మాత్తుగా బిగుసుకుపోతాయి. వాంతులు, విరేచనాల వల్ల కూడా ఇలా జరగవచ్చు. ఎండలో ఎక్కువగా తిరగడం, శారీరక శ్రమ వల్ల కూడా ఇలా కావచ్చు.

ఇంకా మానసిక ఒత్తిడి, ఆందోళన, పని ఒత్తిడి, టైట్ షెడ్యూల్స్, తీవ్రమైన ఒత్తిడికి లోనైనప్పుడు మజిల్ క్రాంప్ సమస్య అధికంగా ఉంటుంది.

నివారణ

- వేసవిలో వచ్చే మజిల్ క్రాంప్స్ నివారణకు ఎండ ఎక్కువగా ఉన్నప్పుడు శరీరం నుండి ద్రవాలను కోల్పోకుండా చూసుకోవాలి. ఒకవేళ ఎక్కువగా ద్రవాలను కోల్పోయే పరిస్థితి ఉంటే నిమ్మకాయ రసంలో ఉప్పు కలుపుకుని తాగడం లేదా కొబ్బరినీళ్ల తాగడం... ఈ రెండూ అందుబాటులో లేకపోతే కనీసం కాసిని మంచి నీరు తాగడం. తాజాపండ్లు తినడం మంచిది.
- క్యాల్షియమ్ లోపం వల్ల మజిల్ క్రాంప్స్ వస్తుంటే క్యాల్షియమ్ సప్లిమెంట్స్‌ను తీసుకోవాలి. దానికి మనం తినే ఆహారంలో పాలు, పాల ఉత్పాదనలు, ఆకుకూరలు వంటివి ఎక్కువగా తీసుకోవాలి
- చలి కారణంగా వచ్చే మజిల్ క్రాంప్స్‌ను నివారించడానికి ఉన్ని దుస్తులు ధరించాలి. చలికి ఎక్కువగా గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి
- పొగ తాగడం, మద్యం అలవాట్లను పూర్తిగా మానేయాలి
- ఒత్తిడి వల్ల కూడా మజిల్ క్రాంప్స్ వస్తాయి. కాబట్టి ఒత్తిడికి గురికాకుండా చూసుకోవాలి
- హైపోథైరాయిడిజమ్ వల్ల వచ్చే మజిల్ క్రాంప్స్‌ను తగ్గించడానికి తగిన చికిత్స తీసుకోవాలి.



● శర్వానంద్

జూన్‌లో థియేటర్స్‌కు వస్తోంది 'మనమే' అని శర్వానంద్ అంటున్నారు. శర్వానంద్, కృతీ శెట్టి హీరో హీరోయిన్లుగా, చైల్డ్ ఆర్టిస్టు విక్రమాదిత్య కీలక పాత్రలో నటించిన చిత్రం 'మనమే'. శ్రీరామ్ ఆదిత్య దర్శకత్వంలో టీజీ విశ్వప్రసాద్ నిర్మించిన చిత్రం ఇది. ఈ సినిమాను జూన్ 7న విడుదల చేయనున్నట్లుగా చిత్ర యూనిట్ శుక్రవారం వెల్లడించి, శర్వానంద్ కొత్త పోస్టర్‌ను విడుదల చేసింది. ''ఈ సినిమాలో శర్వానంద్, కృతి డిఫరెంట్ రోల్స్‌లో కనిపిస్తారు. ప్రేక్షకులకు మంచి వినోదం అందించే చిత్రం ఇది'' అని యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి హేషమ్ అబ్దుల్ వహాబ్ స్వరకర్త.

కెరీర్‌లో కొత్త దశలోకి వెళుతున్నాను

- కాజల్ అగర్వాల్



కాజల్ అగర్వాల్ టైటిల్ రోల్‌లో నటించిన తాజా చిత్రం 'సత్యభామ'. ప్రకాశ్‌రాజ్, నవీన్ చంద్ర కీలక పాత్రల్లో నటించిన ఈ క్రైమ్ థ్రిల్లర్ మూవీకి సుమన్ చిక్కాల దర్శకత్వం వహించారు. దర్శకుడు శశికిరణ్ తిక్క ఈ సినిమాకు స్క్రీన్‌ప్లే అందించడంతో పాటు సమర్పకుడిగా వ్యవహరించారు. బాబీ తిక్క, శ్రీనివాసరావు తక్కలపల్లి నిర్మించిన ఈ చిత్రం జూన్ 7న విడుదల కానుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో జరిగిన ఈ సినిమా ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో కాజల్ అగర్వాల్ మాట్లాడుతూ– ''సత్యభామ' వంటి యాక్షన్ సినిమాతో నా కెరీర్‌లో ఓ కొత్త దశలోకి వెళుతున్నాను. ఈ సినిమాలో నేను చాలా ఫైట్స్ చేశాను. కొత్త ఎమోషన్స్‌ను ఎక్స్‌పీరియన్స్ చేశాను. శశిగారు కథ చెప్పినప్పుడు నచ్చింది. కథపై నమ్మకం కలిగింది. అయితే ఈ సినిమా గ్లింప్స్ విడుదలైన తర్వాత ఆ నమ్మకం రెట్టింపు అయ్యింది. శశిగారు లేకపోతే 'సత్యభామ' లేదు. కీరవాణి, చంద్రబోస్ గార్లకు థ్యాంక్స్. 'వెతుకు వెతుకు..' సాంగ్‌కు మంచి స్పందన వచ్చింది. అమర్ పాత్రలో నవీన్ చంద్ర బాగా యాక్ట్ చేశారు. టీమ్ అందరూ చాలా కష్టపడ్డారు. నన్ను స్టార్ హీరోయిన్‌ని చేసిన తెలుగు ప్రేక్షకుల ప్రేమ 'సత్యభామ' సినిమాపై కూడా ఉండాలని కోరుకుంటున్నాను'' అన్నారు. ''సినిమాల పట్ల కాజల్‌గారికి ఉన్న ప్యాషన్ మమ్మల్ని ఇన్‌స్పైర్ చేసింది. 'సత్యభామ'ను థియేటర్స్‌లో చూసి సక్సెస్ చేయండి'' అన్నారు నిర్మాతలు. ''దర్శకుడిగా నా తొలి చిత్రం ఇది. నా మొదటి హీరో (సినిమాలో కాజల్ లీడ్ రోల్ చేశారు కాబట్టి హీరో అని సంబోధించారు) కాజల్‌గారిని ఎప్పటికీ గుర్తు పెట్టుకుంటాను'' అన్నారు సుమన్ చిక్కాల. ''కాజల్‌గారు కథ విన్న వెంటనే షూటింగ్ ఎప్పట్నుంచి ప్లాన్ చేసుకుంటారనడంతో మేం సర్‌ప్రైజ్ అయ్యాం. ఎమోషనల్ పవర్‌ప్యాక్ట్ ఫిల్మ్ 'సత్యభామ'' అన్నారు శశికిరణ్ తిక్క. ''సత్యభామ' చాలా మంచి సబ్జెక్ట్. నా క్యారెక్టర్ కూడా బాగా నచ్చింది. మా చేతిలో ఓ సక్సెస్‌ఫుల్ సినిమా ఉంది'' అన్నారు నవీన్ చంద్ర. పాటల రచయిత రాంబాబు, ఎడిటర్ పవన్ పాల్గొన్నారు.


● కాజోల్ ● ప్రభుదేవా

కాంబినేషన్ కుదిరింది

'మిన్నార కనవు' ('మెరుపు కలలు' – 1997) చిత్రం తర్వాత కాజోల్, ప్రభుదేవా మళ్లీ స్క్రీన్ షేర్ చేసుకుంటున్నారు. ఇరవయ్యేడేళ్ల తర్వాత వీరిద్దరూ కలిసి నటిస్తున్న ఈ సినిమాతో నిర్మాత చరణ్ తేజ్ ఉప్పలపాటి బాలీవుడ్‌కు దర్శకుడిగా పరిచయమవుతున్నారు. నసీరుద్దీన్ షా, సంయుక్తా మీనన్, జిషు సేన్ గుప్తా, ఆదిత్య సీల్ ఇతర లీడ్ రోల్స్‌లో నటిస్తున్న ఈ యాక్షన్ థ్రిల్లర్ మూవీ చిత్రీకరణ మొదలైంది. ''మా సినిమా తొలి షెడ్యూల్ చిత్రీకరణ మొదలైంది. త్వరలోనే టీజర్‌తో పాటు మరిన్ని వివరాలను వెల్లడిస్తాం'' అని చిత్ర యూనిట్ పేర్కొంది. ఈ సంగతి ఇలా ఉంచితే.. చరణ్ తేజ్‌కి మాత్రమే కాదు.. సంయుక్తాకు కూడా హిందీలో ఇది తొలి చిత్రం కావడం విశేషం.


● ఆషిక

సంక్రాంతికి మరోసారి...

''ఓ అద్భుతమైన సినిమాటిక్ జర్నీకి స్వాగతం'' అంటూ ఆషికా రంగనాథ్‌ను ఆహ్వానించింది 'విశ్వంభర' చిత్ర యూనిట్. చిరంజీవి హీరోగా వశిష్ఠ దర్శకత్వంలో విక్రమ్, వంశీ, ప్రమోద్ నిర్మిస్తున్న చిత్రం 'విశ్వంభర'. ఈ చిత్రంలో త్రిష కథానాయికగా నటిస్తున్నారు. ఓ ముఖ్యమైన పాత్రకు ఆషికా రంగనాథ్‌ని తీసుకున్నారు. ఈ సంక్రాంతికి విడుదలైన 'నా సామి రంగ'లో నాగార్జున సరసన కథానాయికగా నటించారు ఆషిక. ఆ చిత్రంలో మాస్ క్యారెక్టర్‌లో ఆకట్టుకున్నారీ బ్యూటీ. ఆ పాత్రలో కనబర్చిన నటనే 'విశ్వంభర'లో నటించే అవకాశం దక్కేలా చేసిందని టాక్. ఫ్యాంటసీ యాక్షన్ అడ్వెంచరస్ మూవీగా రూపొందుతున్న 'విశ్వంభర' వచ్చే ఏడాది సంక్రాంతి సందర్భంగా జనవరి 10న విడుదల కానుంది. ఇక ఈ సంక్రాంతికి 'నా సామి రంగ'తో వచ్చిన ఆషిక మరోసారి వచ్చే ఏడాది సంక్రాంతికి తెరపై కనిపించనున్నారు.

రాజస్థాన్‌లో ఫైట్

హీరో బెల్లంకొండ సాయి శ్రీనివాస్ రాజస్థాన్‌లో ఫైట్ చేస్తున్నారు. అది కూడా పగటి పూట కాదు.. రాత్రి. పది రాత్రులు ఈ ఫైట్ జరుగుతుంది. బెల్లంకొండ సాయి శ్రీనివాస్ హీరోగా రూపొందుతున్న 'టైసన్ నాయుడు' చిత్రం కోసమే ఈ ఫైట్. సాగర్ కె. చంద్ర దర్శకత్వంలో రామ్ ఆచంట, గోపీ ఆచంట ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ప్రస్తుతం ఈ చిత్రం షూటింగ్ రాజస్థాన్‌లో జరుగుతోంది. దాదాపు పది రాత్రులు హీరో, విలన్లపై స్టంట్ మాస్టర్ స్టన్ శివ పర్యవేక్షణలో యాక్షన్ సీక్వెన్స్ ప్లాన్ చేసినట్లు చిత్రబృందం పేర్కొంది. అలాగే ఓ ఐదు రోజుల పాటు టాకీ షూట్ చేయనున్నారు. పోలీసాఫీసర్‌గా బెల్లంకొండ సాయి శ్రీనివాస్ నటిస్తున్న ఈ యాక్షన్ ఎంటర్‌టైనర్‌కి సంగీతం: భీమ్స్, కెమెరా: ముఖేష్ జ్ఞానేష్.


● బెల్లంకొండ సాయి శ్రీనివాస్

ఏది మంచి?


● 'యేవమ్' పోస్టర్

చాందినీ చౌదరి, వశిష్ఠ సింహా, భరత్ రాజ్, అషూ రెడ్డి లీడ్ రోల్స్‌లో నటించిన సైకలాజికల్ థ్రిల్లర్ మూవీ 'యేవమ్'. ఏది మంచి.. ఏది చెడు..? అనేది క్యాప్షన్. ప్రకాశ్ దంతులూరి దర్శకత్వంలో నవదీప్, పవన్ గోపరాజు ఈ సినిమాను నిర్మించారు. ఈ చిత్రంలో ఎస్‌ఐ సౌమ్య పాత్రలో చాందినీ చౌదరి నటించారు. తాజాగా ఈ సినిమా టీజర్‌ను దర్శకుడు హరీష్ శంకర్ విడుదల చేసి, ఈ సినిమా విజయాన్ని ఆకాంక్షించారు. 'ఐయామ్ యుగంధర్.. హారికను నేనే చంపాను..' అనే డైలాగ్ టీజర్‌లో ఉంది.

అలకాపురి లోకంలో...


● మంచు లక్ష్మి, రాహుల్, వేదిక

వేదిక, మంచు లక్ష్మి, రాహుల్ విజయ్, అజయ్ ప్రధాన పాత్రల్లో నటించిన వెబ్ సిరీస్ 'యక్షిణి'. తేజా మార్ని దర్శకత్వంలో శోభు యార్లగడ్డ, ప్రసాద్ దేవినేని నిర్మిస్తున్న ఈ వెబ్‌సిరీస్ జూన్ 14 నుంచి డిస్నీ ప్లస్ హాట్ స్టార్ ప్లాట్‌ఫామ్‌లో తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో స్ట్రీమింగ్ కానుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో జరిగిన ఈ వెబ్ సిరీస్ ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో వేదిక మాట్లాడుతూ– ''ఇందులోని క్యారెక్టర్స్‌లో డెప్త్, డిఫరెంట్ వేరియేషన్స్ ఉన్నాయి'' అన్నారు. ''నేను 'జ్వాల' పాత్రలో నటించాను'' అన్నారు మంచు లక్ష్మి. ''యక్షిణి' విజయం పట్ల నమ్మకంతో ఉన్నాం'' అన్నారు రాహుల్ విజయ్. ''అలకాపురి అనే లోకం నుంచి ఒక శాపం వల్ల భూమ్మీదకు వచ్చిన యక్షిణి వంద మందిని చంపితేగానీ శాప విముక్తి కాదు. ఆ వంద మందిని ఎలా చంపింది? వందో వ్యక్తి ఎవరు? అనేది ఈ సిరీస్ స్టోరీ'' అన్నారు తేజా మార్ని. ''యక్షిణి' సీజన్ 2 కోసం కూడా ప్లాన్ మొదలుపెట్టాం'' అన్నారు దేవినేని ప్రసాద్.

మరో ముప్పైఏళ్లు ఎదురు చూడక్కర్లేదు!

- దర్శకురాలు పాయల్ కపాడియా

ఫ్రాన్స్‌లో జరుగుతున్న 77వ కాన్స్ చిత్రోత్సవాలు తుది దశకు చేరుకున్నాయి. ఈ వేడుకల్లో ప్రధాన విభాగమైన పామ్ డి ఓర్‌లో భారతీయ ఫిల్మ్‌మేకర్ పాయల్ కపాడియా తెరకెక్కించిన 'ఆల్ ఉయ్ ఇమాజిన్ యాజ్ ఏ లైట్' చిత్రం పోటీలో ఉంది. దాదాపు ముప్పైఏళ్ల తర్వాత ఈ విభాగంలో ఓ భారతీయ చిత్రం పోటీలో నిలిచింది. షాజీ ఎన్. కరుణ్ దర్శకత్వం వహించిన మలయాళ చిత్రం 'స్వాహమ్' 1994 కాన్స్ చిత్రోత్సవాల్లో పోటీలో నిలిచింది. ఇన్నేళ్ల తర్వాత మరో భారతీయ చిత్రం ఎంపిక కావడం విశేషం.


● 'కాన్స్'లో 'ఆల్ ఉయ్ ఇమాజిన్ యాజ్ ఏ లైట్' టీమ్ సందడి

తాజాగా 'ఆల్ ఉయ్ ఇమాజిన్ యాజ్ ఏ లైట్' కాన్స్‌లో ప్రదర్శితం కాగా, ఏడు నిమిషాల స్టాండింగ్ ఒవేషన్ దక్కింది. ఈ టీమ్ కాన్స్‌లో చేసిన సందడి హైలైట్‌గా నిలిచింది. ''ఇండియా నుంచి చాలా మంచి చిత్రాలు వస్తుంటాయి. బాలీవుడ్ మాత్రమే కాదు... దేశంలోని ప్రతి రాష్ట్రంలో అద్భుతమైన ఫిల్మ్‌మేకర్స్ ఉన్నారు. కాన్స్‌లోని ప్రధాన విభాగంలో పోటీ పడటానికి మరో ముప్పైఏళ్లు చూడక్కర్లేదని నాకనిపిస్తోంది'' అంటూ ఓ హాలీవుడ్ మీడియా సంస్థతో మాట్లాడారు పాయల్ కపాడియా. ఇక కని కస్రుతి, దివ్య ప్రభ, ఛాయా కదం లీడ్ రోల్స్‌లో నటించిన 'ఆల్ ఉయ్ ఇమాజిన్ యాజ్ ఏ లైట్'కు పాయల్ కపాడియా దర్శకత్వం వహించగా, థామస్ హకీమ్–జూలియస్ గ్రాఫ్ నిర్మించారు.

సాక్షి బిజినెస్
శనివారం
25-5-2024

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు	సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
	8	11
	75,410	22,957

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

సూచీ	విలువ	మార్పు
నాస్‌డాక్	16,936	△ 200
డోజోన్స్	39,138	△ 73
ఎఫ్‌టీఎస్ఈ 100	8,318	▽ 22
డాక్స్	18,693	△ 2
షాంఘై	3,088	▽ 28
నికాయ్	38,647	▽ 457

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో — ముంబై

	ధర	మార్పు
బంగారం (24 క్యారట్)	70,640	▽ 950
బంగారం (22 క్యారట్)	67,280	▽ 500
వెండి (కిలో)	96,500	▽ 500

ఫారెక్స్ రేట్లు రూ.లలో

	కరెన్సీ		కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	82.91	83.93
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	104.77	107.33
€	యూరో	ఎస్‌బీఐ	89.37	91.74
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	52.80	53.96
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	54.65	56.59
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	59.54	64.19
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.31	22.87
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.79	23.57
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.38	12.45

ఫ్లిప్‌కార్ట్‌లో గూగుల్‌కు మైనారిటీ వాటాలు

రూ. 2,900 కోట్ల పెట్టుబడి

న్యూఢిల్లీ: గూగుల్ తమ సంస్థలో మైనారిటీ వాటాలు కొనుగోలు చేయనున్నట్లు ఈ-కామర్స్ సంస్థ ఫ్లిప్‌కార్ట్ తెలిపింది. డీల్ వివరాలను నిర్దిష్టంగా వెల్లడించనప్పటికీ గూగుల్ 350 మిలియన్ డాలర్లు (సుమారు రూ. 2,900 కోట్లు) ఇన్వెస్ట్ చేయనున్నట్లు సమాచారం. ఫ్లిప్‌కార్ట్ ప్రస్తుతం 1 బిలియన్ డాలర్ల నిధులను సమీకరిస్తోందని, అందులో భాగంగానే గూగుల్ కూడా ఇన్వెస్ట్ చేయనుందని సమాచారం. ఇప్పటికే ఫ్లిప్‌కార్ట్‌కు మాతృ సంస్థ, వాల్‌మార్ట్ నుంచి 600 మిలియన్ డాలర్లు లభించాయని వివరించాయి.

మేడిన్ ఇండియా రేంజ్ రోవర్

- రేంజ్ రోవర్ స్పోర్ట్ సైతం తయారీ
- జాగ్వార్ ల్యాండ్ రోవర్ నిర్ణయం
- ప్రస్తుతం యూకే ప్లాంటులో ఉత్పత్తి



ముంబై: మేడిన్ ఇండియా రేంజ్ రోవర్, రేంజ్ రోవర్ స్పోర్ట్ కార్లు కొద్ది రోజుల్లో భారత రోడ్లపై పరుగు తీయనున్నాయి. దేశీయంగా వీటి తయారీ చేపట్టాలని టాటా మోటార్స్‌కు చెందిన జాగ్వార్ ల్యాండ్ రోవర్ నిర్ణయించింది. 54 ఏళ్ల ఘన చరిత్ర కలిగిన ఈ మోడళ్లు యూకే వెలుపల ఒక దేశంలో తయారు కానుండడం ఇదే తొలిసారి. ప్రస్తుతం యూకేలోని సోలహల్ వద్ద ఉన్న జాగ్వార్ ల్యాండ్ రోవర్ ప్లాంటులో తయారైన రేంజ్ రోవర్, రేంజ్ రోవర్ స్పోర్ట్ కార్లు భారత్‌సహా ప్రపంచవ్యాప్తంగా 121 మార్కెట్లకు ఎగుమతి అవుతున్నాయి. దేశీయంగా తయారైతే ఈ రెండు మోడళ్ల ధర 18–22 శాతం తగ్గనుందని కంపెనీ వెల్లడించింది. రానున్న రోజుల్లో రేంజ్ రోవర్, రేంజ్ రోవర్ స్పోర్ట్ మోడళ్ల అమ్మకాలు పెరుగుతాయని టాటా గ్రూప్ చైర్మన్ ఎస్.చంద్రశేఖరన్ ధీమా వ్యక్తం చేశారు. టాటా మోటార్స్‌కు చెందిన పుణే ప్లాంటులో ఇప్పటికే రేంజ్ రోవర్ వెలార్, రేంజ్ రోవర్ ఇవోక్, జాగ్వార్ ఎఫ్–పేస్, డిస్కవరీ స్పోర్ట్ అసెంబుల్ అవుతున్నాయి. 2023–24లో దేశవ్యాప్తంగా జేఎల్ఆర్ ఇండియా 4,436 యూనిట్లను విక్రయించింది. అంత క్రితం ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే ఇది ఏకంగా 81 శాతం అధికం.

ఎన్‌టీపీసీ లాభం దూకుడు

న్యూఢిల్లీ: విద్యుత్ రంగ ప్రభుత్వ దిగ్గజం ఎన్‌టీపీసీ మార్చి త్రైమాసిక కన్సాలిడేటెడ్ నికర లాభం 33 శాతం జంప్‌చేసి రూ. 6,490 కోట్లను అధిగమించింది. కంపెనీ బోర్డు వాటాదారులకు షేరుకి రూ. 3.25 చొప్పున తుది డివిడెండ్ ప్రకటించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 44,745 కోట్ల నుంచి రూ. 48,817 కోట్లకు బలపడింది. ఇక పూర్తి ఏడాదికి ఎన్‌టీపీసీ నికర లాభం రూ. 17,121 కోట్ల నుంచి రూ. 21,332 కోట్లకు ఎగసింది. మొత్తం ఆదాయం రూ. 1,71,976 కోట్ల నుంచి రూ. 1,81,166 కోట్లకు పుంజుకుంది. న్యూక్లియర్ ఇంధన బిజినెస్ నిర్వహణకు పూర్తి అనుబంధ సంస్థను ఏర్పాటు చేసేందుకు బోర్డు సూత్రప్రాయంగా అనుమతించింది.



బీఎస్ఈలో 0.7% ఎగసి రూ. 375 వద్ద ముగిసింది.

అశోక్ లేలాండ్ స్పీడ్



న్యూఢిల్లీ: అశోక్ లేలాండ్ క్యూ4 కన్సాలిడేటెడ్ నికర లాభం 17 శాతం ఎగసి రూ. 934 కోట్లకు చేరింది. కంపెనీ బోర్డు వాటాదారులకు షేరుకి రూ. 4.95 చొప్పున మధ్యంతర డివిడెండ్ ప్రకటించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 13,203 కోట్ల నుంచి రూ. 13,578 కోట్లకు బలపడింది. ఇక పూర్తి ఏడాదికి అశోక్ లేలాండ్ నికర లాభం రూ. 1,359 కోట్ల నుంచి రూ. 2,696 కోట్లకు జంప్ చేసింది. మొత్తం ఆదాయం రూ. 41,673 కోట్ల నుంచి రూ. 45,791 కోట్లకు పుంజుకుంది.

ఫలితాల నేపథ్యంలో అశోక్ లేలాండ్ షేరు బీఎస్ఈలో 1 శాతం నష్టంతో రూ. 211 వద్ద ముగిసింది.

హిందాల్కో మెరుపులు

న్యూఢిల్లీ: అల్యూమినియం దిగ్గజం హిందాల్కో గత ఆర్థిక సంవత్సరం(2023–24) చివరి త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. జనవరి–మార్చి(క్యూ4)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 32 శాతం జంప్‌చేసి రూ. 3,174 కోట్లను తాకింది. అల్యూమినియం, కాపర్ బిజినెస్ అమ్మకాలు, మెరుగైన మార్జిన్లు ఇందుకు దోహదపడ్డాయి. ఆదిత్య బిర్లా గ్రూప్ దిగ్గజం అంతక్రితం ఏడాది(2022–23) ఇదే కాలంలో రూ. 2,411 కోట్లు మాత్రమే ఆర్జించింది. మొత్తం ఆదాయం రూ. 56,209 కోట్ల నుంచి రూ. 56,356 కోట్లకు స్వల్పంగా బలపడింది. దీనిలో కాపర్ బిజినెస్ 20 శాతం ఎగసి రూ. 13,424 కోట్లకు చేరింది. కాగా.. గతేడాది అన్ని బిజినెస్ విభాగాల్లోనూ పటిష్ఠ ఫలితాలు సాధించినట్లు కంపెనీ ఎండీ సతీష్ పాయ్ పేర్కొన్నారు. విలువ జోడింపు ఉత్పత్తులు, మార్జిన్ల పెంపుపై వ్యూహాత్మక దృష్టికి ఇవి నిదర్శనాలని తెలియజేశారు. రూ. 5,195 కోట్ల రుణాలు తిరిగి చెల్లించిన తదుపరి సైతం పటిష్ఠ బ్యాలెన్స్‌షీట్, లిక్విడిటీని కలిగి ఉన్నట్లు వెల్లడించారు.

ఫలితాల నేపథ్యంలో హిందాల్కో షేరు బీఎస్ఈలో 0.5 శాతం నష్టంతో రూ. 673 వద్ద ముగిసింది.

- వారాంతాన సూచీలకు స్వల్ప నష్టాలు
- ఇంట్రాడేలో కొత్త రికార్డులు నమోదు
- తొలిసారి 23 వేల స్థాయిని తాకిన నిఫ్టీ

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

24-5-2024

విశాఖ	550–00
చిత్తూరు	628–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	540–00
విజయవాడ	540–00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	550–00
వరంగల్	552–00
రిటైల్ ధర	6.10

జీవితకాల గరిష్టాల వద్ద లాభాల స్వీకరణ

ముంబై: జీవితకాల గరిష్ట స్థాయిల వద్ద లాభాల స్వీకరణ చోటు చేసుకోవడంతో స్టాక్ సూచీలు శుక్రవారం స్వల్ప నష్టాలతో ముగిశాయి. తీవ్ర ఒడిదుడుకులతో ఒక దశలో సెన్సెక్స్ 218 పాయింట్లు ర్యాలీ చేసి 75,636 వద్ద, నిఫ్టీ 59 పాయింట్లు బలపడి 23,026 వద్ద కొత్త రికార్డులు నమోదు చేశాయి. సరికొత్త స్థాయిల వద్ద ఎఫ్ఎంసీజీ, ఐటీ, ఫార్మా షేర్లలో షేర్లలో లాభాల స్వీకరణ చోటు చేసుకుంది. చివరికి సెన్సెక్స్ ఎనిమిది పాయింట్లు నష్టపోయి 75,410 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 11 పాయింట్లు కోల్పోయి 22,957 వద్ద నిలిచింది.



- రూపాయి విలువ వరుసగా నాలుగోరోజూ ర్యాలీ చేసింది. డాలర్ మారకంలో 19 పైసలు బలపడి 83.10 వద్ద స్థిరపడింది.

ముఖ్యాంశాలు..

- అదానీ పోర్ట్స్ అండ్ స్పెషల్ ఎకనామిక్ జోన్ షేరు సెన్సెక్స్–30 సూచీలోకి చేరనుంది. విప్రో షేరును ఈ జాబితా నుంచి వైదొలగనుంది.
- అదానీ ఎంటర్‌ప్రైజెస్ హిండెన్‌బర్గ్ నివేదిక వెల్లడి పూర్వపు స్థాయిని అందుకుంది.
- లిస్టింగ్‌లో రూల్కా ఎలక్ట్రానిక్స్ అదరగొట్టింది. ఎన్ఎస్ఈ ఎస్ఎంఈ సూచీలో ఇష్యూ ధర (రూ.235)తో పోలిస్తే 123% ప్రీమియంతో రూ.525 వద్ద లిస్టయ్యింది. చివరికి 118% లాభంతో రూ.499 వద్ద స్థిరపడింది.

కుబేరులపై పన్నులతోనే అసమానతలకు చెక్

అధ్యయన నివేదిక స్పష్టీకరణ



న్యూఢిల్లీ: భారత్‌లో తీవ్ర స్థాయిలో పెరిగిపోతున్న సంపదపరమైన అసమానతలను పరిష్కరించడానికి కుబేరులపై పన్నులు విధించాలని ఒక అధ్యయన నివేదిక సూచించింది. రూ. 10 కోట్లకు పైగా సంపద ఉన్న అత్యంత సంపన్నులపై 2 శాతం ట్యాక్స్, రూ. 10 కోట్లకు పైగా విలువ గల ఎస్టేట్‌లపై 33 శాతం మేర వారసత్వ పన్నులు విధించాలని పేర్కొంది. దీనితో స్థూల దేశీయోత్పత్తిలో (జీడీపీ) 2.73 శాతం విలువ చేసేంత ఆదాయం రాగలదని తెలిపింది. బీద, నిమ్న వర్గాలు, మధ్యతరగతి వర్గాలకు తోడ్పాటు అందించేలా తగిన విధానాలు కూడా ప్రవేశపెట్టాల్సి ఉంటుందని నివేదిక అభిప్రాయపడింది. ప్రముఖ ఆర్థికవేత్తలు థామస్ పికెటీ, నితిన్ కుమార్ భారతి, లూకాస్ చాన్సెల్ ఈ నివేదికను రూపొందించారు.

కొత్త ఔషధాలకు టెక్నాలజీ దన్ను

డాక్టర్ రెడ్డీస్ సీఈవో దీపక్ సాప్రా



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: టెక్నాలజీ తోడ్పాటుతో కొత్త ఔషధాలను వేగవంతంగా అందుబాటులోకి తెచ్చే అవకాశాలు ఉన్నాయని ఫార్మా దిగ్గజం డాక్టర్ రెడ్డీస్ ల్యాబొరేటరీస్ సీఈవో (ఏపీఐ, సర్వీసెస్) దీపక్ సాప్రా తెలిపారు. ప్రస్తుతం ఒక ఔషధం మార్కెట్లోకి రావాలంటే సగటున 12 ఏళ్ల సమయం, దాదాపు 2 బిలియన్ డాలర్ల వ్యయం అవుతోందని ఆయన పేర్కొన్నారు. టెక్నాలజీని వినియోగించుకుంటే కొన్ని సందర్భాల్లో సుమారు 30 శాతం వరకు సమయం ఆదా కావడంతో పాటు తదనుగుణంగా వ్యయాలు కూడా తగ్గగలవని ఇంజనీరింగ్, తయారీ రంగాల్లో డిజిటల్ పరివర్తనపై శుక్రవారమిక్కడ జరిగిన సదస్సులో పాల్గొన్న సందర్భంగా సాప్రా వివరించారు. ఔషధాల ఆవిష్కరణలో టెక్నాలజీ కీలక పాత్రను అంతర్జాతీయంగా నియంత్రణ సంస్థలు గుర్తిస్తున్నాయన్నారు.

కోరమాండల్ ఇంటర్నేషనల్ కొత్త ఉత్పత్తులు

పంటల రక్షణ లక్ష్యం



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: అగ్రి–సొల్యూషన్స్ సంస్థ కోరమాండల్ ఇంటర్నేషనల్ సంస్థ కొత్తగా 10 ఉత్పత్తులను ప్రవేశపెట్టింది. దిగుబడులు పెంచేందుకు, పంటల రక్షణకు ఇవి ఉపయోగపడతాయని సంస్థ తెలిపింది. కాండం తొలిచే పురుగులు మొదలైన వాటి నుంచి వరి పంటను కాపాడేందుకు ఉద్దేశించిన ప్రచండ్ తయారీ కోసం ఐఎస్‌కే జపాన్‌తో జట్టు కట్టినట్లు వివరించింది. దీనితో దిగుబడి నష్టాలు 70 శాతం వరకు తగ్గగలవని పేర్కొంది. ఒకే సంవత్సరంలో 10 ఉత్పత్తులను తాము ప్రవేశపెట్టడం ఇదే ప్రథమమని కంపెనీ ఈడీ రఘురాం దేవరకొండ తెలిపారు.

ఆడియో, విజువల్ ఫార్మాట్లో పబ్లిక్ ఇష్యూ వివరాలు

జూలై 1 నుంచి అమల్లోకి



న్యూఢిల్లీ: పబ్లిక్ ఇష్యూల ఆఫర్ డాక్యుమెంట్లలో వెల్లడించే కీలక వివరాలను (డిస్‌క్లోజర్స్) కంపెనీలు ఇకపై ఆడియో, విజువల్ (ఏవీ) రూపంలో కూడా ఇవ్వాలని మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ నిర్ణయించింది. జూలై 1 తర్వాత సెబీకి ముసాయిదా ప్రాస్పెక్టస్ దాఖలు చేసే సంస్థలకు ఇది స్వచ్ఛందంగా ఉంటుంది. అక్టోబర్ 1 నుంచి ఇది తప్పనిసరవుతుందని ఒక సర్క్యులర్‌లో సెబీ పేర్కొంది. ఆఫర్‌కి సంబంధించిన కీలకాంశాలను ఇన్వెస్టర్లు సులభతరంగా అర్థం చేసుకునేందుకు ఈ విధానం తోడ్పడుతుందని తెలిపింది. ఏవీ ప్రాథమికంగా ఇంగ్లిష్, హిందీ భాషల్లో సుమారు 10 నిమిషాల వ్యవధితో ఉండాలి. ఇందులో రిస్క్‌పరమైన అంశాలు, పెట్టుబడి స్వరూపం, ఇష్యూ లక్ష్యాలు, ఇష్యూయర్ వ్యాపారం, ఆర్థిక సమాచారం, లిటిగేషన్లు మొదలైన వివరాలన్నీ వాస్తవికమైన విధంగా ఉండాలని పేర్కొంది.

సాక్షి స్పోర్ట్స్



టైటిల్‌కు గెలుపు దూరంలో యూకీ బాంబ్రీ జోడీ...

భారత అగ్రశ్రేణి టెన్నిస్ క్రీడాకారుడు యూకీ బాంబ్రీ తన కెరీర్‌లో మూడో ఏటీపీ డబుల్స్ టైటిల్‌కు విజయం దూరంలో ఉన్నాడు. పారిస్‌లో జరుగుతున్న ఓపెన్ పార్క్ ఏటీపీ–250 టోర్నీలో యూకీ బాంబ్రీ (భారత్)–అల్బానో ఒలివెట్టి (ఫ్రాన్స్) జోడీ ఫైనల్లోకి దూసుకెళ్లింది. శుక్రవారం జరిగిన పురుషుల డబుల్స్ సెమీఫైనల్లో యూకీ–ఒలివెట్టి ద్వయం 6–3, 6–7 (5/7), 10–7తో 'సూపర్ టైబ్రేక్'లో టాప్ సీడ్ సాంటియాగో గొంజాలెజ్ (మెక్సికో)–రోజర్ వాసెలిన్ (ఫ్రాన్స్) జంటను బోల్తా కొట్టించింది. ఒక గంటా 42 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో యూకీ ద్వయం ఏడు ఏస్‌లు సంధించి, ఏడు డబుల్ ఫాల్ట్‌లు చేసింది. నేడు జరిగే ఫైనల్లో హెలియోవారా (ఫిన్‌లాండ్)–హెన్రీ ప్యాటెన్ (బ్రిటన్)లతో యూకీ–ఒలివెట్టి పోటీపడతారు. యూకీ ఈ ఏడాది ఒలివెట్టితో కలిసి మ్యూనిక్ ఓపెన్‌లో, గత ఏడాది లాయిడ్ హారిస్ (దక్షిణాఫ్రికా)తో కలిసి మలోర్కా ఓపెన్‌లో డబుల్స్ టైటిల్స్ గెలిచాడు.

సూపర్ సన్‌రైజర్స్

ఐపీఎల్ ఫైనల్లో హైదరాబాద్

- రెండో క్వాలిఫయర్‌లో ఘన విజయం
- 36 పరుగులతో రాజస్తాన్ చిత్తు
- క్లాసెన్ అర్ధ సెంచరీ, రాణించిన బౌలర్లు
- రేపు తుదిపోరులో కోల్‌కతాతో 'ఢీ'

సన్‌రైజర్స్ హైదరాబాద్ తమ అసలు సత్తాను మరోసారి ప్రదర్శించింది. తొలి క్వాలిఫయర్‌లో పేలవ ఆటతో ఓటమి పాలైన జట్టు రెండో క్వాలిఫయర్‌కు వచ్చేసరికి అన్ని అస్త్రాలతో చెలరేగింది. ఫలితంగా ఆరేళ్ల తర్వాత ఐపీఎల్ ఫైనల్లోకి అడుగు పెట్టింది. బ్యాటింగ్‌లో హెడ్, అభిషేక్, మార్క్‌రమ్ విఫలమైనా... క్లాసెన్, త్రిపాఠి ఆదుకోవడంతో హైదరాబాద్ మెరుగైన స్కోరు సాధించగలిగింది. ఆ తర్వాత బౌలర్లు చెలరేగి ప్రత్యర్థి బ్యాటర్లను పూర్తిగా కట్టిపడేశారు. బెంగళూరుతో ఎలిమినేటర్‌లో కూడా దాదాపు ఇదే స్కోరును తడబడుతూనే ఛేదించిన రాజస్తాన్ ఈసారి మాత్రం కుప్పకూలింది. చెపాక్ మైదానంలో ఇద్దరు లెఫ్టార్మ్ స్పిన్నర్లు షహబాజ్, అభిషేక్ శర్మ కలిసి 47 పరుగులు మాత్రమే ఇచ్చి 5 వికెట్లు పడగొట్టి రాయల్స్ కథను ముగించడంలో కీలక పాత్ర పోషించారు. ఇక తొలి క్వాలిఫయర్‌లో ఓటమికి ప్రతీకారం తీర్చుకునే సమయమూ వచ్చింది. రెండో టైటిల్ వేటలో ఆదివారం కోల్‌కతాతో సమరానికి సన్‌రైజర్స్ సిద్ధంగా ఉంది.



'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' షహబాజ్ అహ్మద్

చెన్నై: ఐపీఎల్–17 ఫైనల్ సమరం కోల్‌కతా నైట్ రైడర్స్, సన్‌రైజర్స్ హైదరాబాద్ మధ్య జరగనుంది. శుక్రవారం జరిగిన రెండో క్వాలిఫయర్‌లో సన్‌రైజర్స్ 36 పరుగుల తేడాతో రాజస్తాన్ రాయల్స్‌పై ఘన విజయం సాధించింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన సన్‌రైజర్స్ 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 175 పరుగులు చేసింది. హెన్రిచ్ క్లాసెన్ (34 బంతుల్లో 50; 4 సిక్స్‌లు) అర్ధ సెంచరీ సాధించగా... రాహుల్ త్రిపాఠి (15 బంతుల్లో 37; 5 ఫోర్లు, 2 సిక్స్‌లు), ట్రవిస్ హెడ్ (28 బంతుల్లో 34; 3 ఫోర్లు, 1 సిక్స్) కీలక ఇన్నింగ్స్ ఆడారు. అనంతరం రాజస్తాన్ 20 ఓవర్లలో 7 వికెట్లకు 139 పరుగులే చేయగలిగింది. ధ్రువ్ జురేల్ (35 బంతుల్లో 56 నాటౌట్; 7 ఫోర్లు, 2 సిక్స్‌లు), మినహా అంతా విఫలమయ్యారు.

రాణించిన త్రిపాఠి...

ఓపెనర్ అభిషేక్ (12) తొలి ఓవర్లోనే వెనుదిరగ్గా... హెడ్ తన శైలికి భిన్నంగా నెమ్మదిగా ఆడాడు. అయితే త్రిపాఠి దూకుడైన ఇన్నింగ్స్‌తో స్కోరును పరుగెత్తించాడు. అశ్విన్ ఓవర్లో వరుసగా 4, 4, 6 బాదిన అతను, బౌల్ట్ ఓవర్లోనూ వరుసగా సిక్స్, ఫోర్ కొట్టి అదే జోరులో తర్వాతి బంతికి అవుటయ్యాడు. అదే ఓవర్లో మార్క్‌రమ్ (1) కూడా పెవిలియన్ చేరాడు. ఈ దశలో రాయల్స్ కట్టుదిట్టమైన బౌలింగ్‌తో హెడ్, క్లాసెన్ కూడా భారీ షాట్లు ఆడటంలో విఫలమయ్యారు. ఫలితంగా వరుసగా 29 బంతుల పాటు బౌండరీనే రాకపోగా, హెడ్ కూడా అవుటయ్యాడు. చహల్ వరుస బంతుల్లో నితీశ్ రెడ్డి (5), సమద్ (0)లను అవుట్ చేసి మరింత దెబ్బ తీశాడు. మరోవైపు 33 బంతుల్లో క్లాసెన్ అర్ధసెంచరీ పూర్తయింది. 18 ఓవర్లు ముగిశాక స్కోరు 163/6 కాగా క్లాసెన్ ఉండటంతో రైజర్స్ మరిన్ని పరుగులు ఆశించింది. అయితే 19వ ఓవర్ తొలి బంతికి క్లాసెన్ బౌల్డ్ కావడంతో ఆఖరి 11 బంతుల్లో 12 పరుగులే వచ్చాయి.



అభిషేక్ శర్మ సంబరం

టపటపా...

ఛేదనలో రాయల్స్‌కు సరైన ఆరంభం లభించలేదు. టామ్ కోలర్ (10) ప్రభావం చూపలేకపోగా, 5 ఓవర్లలో 32 పరుగులే వచ్చాయి. అయితే భువనేశ్వర్ వేసిన ఆరో ఓవర్లో యశస్వి జైస్వాల్ సిక్స్, 3 ఫోర్లతో చెలరేగడంతో రాజస్తాన్ దారిలో పడినట్లు అనిపించింది. కానీ ఆ తర్వాత పరిస్థితి అంతా ఒక్కసారిగా మారిపోయింది. 13 పరుగుల వ్యవధిలో జట్టు 3 ప్రధాన వికెట్లు కోల్పోయింది. ముందుకొచ్చి షాట్లు ఆడే క్రమంలో యశస్వి, సామ్సన్ (10), పరాగ్ (6) వెనుదిరిగారు. అశ్విన్ (0) డకౌట్ కాగా, ఆశలు పెట్టుకున్న హెట్‌మైర్ (4) కూడా చేతులెత్తేశాడు. 39 బంతుల్లో 84 పరుగులు చేయాల్సిన స్థితిలో విండీస్ బ్యాటర్ల నుంచి రాజస్తాన్ అద్భుతం ఆశించింది. కానీ హెట్‌మైర్ (4), పావెల్ (6) విఫలం కావడంతో జట్టు గెలుపు ఆశలు కోల్పోయింది. మరోవైపు జురేల్ పోరాడినా అది ఏమాత్రం సరిపోలేదు.



క్లాసెన్

2 డెక్కన్ చార్జర్స్ జట్టు తర్వాత ఐపీఎల్ టోర్నీలో గత సీజన్‌లో పాయింట్ల పట్టికలో అట్టడున నిలిచి తర్వాతి సీజన్‌లో ఫైనల్‌కు చేరిన రెండో జట్టుగా సన్‌రైజర్స్ హైదరాబాద్ నిలిచింది. 2023లో సన్‌రైజర్స్ చివరి స్థానంలో నిలిచింది. 2008 తొలి సీజన్‌లో డెక్కన్ చార్జర్స్ పాయింట్ల పట్టికలో ఆఖరి స్థానంలో నిలిచి 2009లో అగ్రస్థానంలో నిలవడంతోపాటు విజేతగా కూడా అవతరించింది.

3 ఐపీఎల్ టోర్నీలో సన్‌రైజర్స్ ఫైనల్‌కు చేరడం ఇది మూడోసారి. 2016లో తొలిసారి విజేత అయింది. 2018లో రన్నరప్‌గా నిలిచింది.

స్కోరు వివరాలు

సన్‌రైజర్స్ హైదరాబాద్ ఇన్నింగ్స్: హెడ్ (సి) అశ్విన్ (బి) సందీప్ శర్మ 34; అభిషేక్ శర్మ (సి) కోలర్ (బి) బౌల్ట్ 12; త్రిపాఠి (సి) చహల్ (బి) బౌల్ట్ 37; మార్క్‌రమ్ (సి) చహల్ (బి) బౌల్ట్ 1; క్లాసెన్ (బి) సందీప్ 50; నితీశ్ రెడ్డి (సి) చహల్ (బి) అవేశ్ 5; సమద్ (బి) అవేశ్ 0; షహబాజ్ (సి) జురేల్ (బి) అవేశ్ 18; కమిన్స్ (నాటౌట్) 5; ఉనాద్కట్ (రనౌట్) 5; ఎక్స్‌ట్రాలు 8; మొత్తం (20 ఓవర్లలో 9 వికెట్లకు) 175. వికెట్ల పతనం: 1–13, 2–55, 3–57, 4–99, 5–120, 6–120, 7–163, 8–170, 9–175. బౌలింగ్: బౌల్ట్ 4–0–45–3, అశ్విన్ 4–0–43–0, సందీప్ 4–0–25–2, అవేశ్ 4–0–27–3, చహల్ 4–0–34–0.

రాజస్తాన్ రాయల్స్ ఇన్నింగ్స్: జైస్వాల్ (సి) సమద్ (బి) షహబాజ్ 42; టామ్ కోలర్ (సి) త్రిపాఠి (బి) కమిన్స్ 10; సామ్సన్ (సి) మార్క్‌రమ్ (బి) అభిషేక్ 10; పరాగ్ (సి) అభిషేక్ (బి) షహబాజ్ 6; జురేల్ (నాటౌట్) 56; అశ్విన్ (సి) క్లాసెన్ (బి) షహబాజ్ 0; హెట్‌మైర్ (బి) అభిషేక్ 4; పావెల్ (సి) అభిషేక్ (బి) నటరాజన్ 6; బౌల్ట్ (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 5; మొత్తం (20 ఓవర్లలో 7 వికెట్లకు) 139. వికెట్ల పతనం: 1–24, 2–65, 3–67, 4–79, 5–79, 6–92, 7–124. బౌలింగ్: భువనేశ్వర్ 3–0–33–0, కమిన్స్ 4–0–30–1, నటరాజన్ 3–0–13–1, ఉనాద్కట్ 1–0–5–0, షహబాజ్ 4–0–23–3, అభిషేక్ 4–0–24–2, మార్క్‌రమ్ 1–0–10–0.

మిక్స్‌డ్ టీమ్ ఫైనల్లో జ్యోతి సురేఖ జోడీ



యెచోన్ (దక్షిణ కొరియా): ప్రపంచకప్ ఆర్చరీ స్టేజ్–2 టోర్నీలో భారత స్టార్, ఆంధ్రప్రదేశ్ క్రీడాకారిణి వెన్నం జ్యోతి సురేఖ రెండో స్వర్ణంపై గురి పెట్టింది. ఇప్పటికే మహిళల కాంపౌండ్ టీమ్ విభాగంలో ఫైనల్ చేరిన జ్యోతి సురేఖ... మిక్స్‌డ్ టీమ్ కేటగిరీలో ప్రియాంశ్‌తో కలిసి ఫైనల్లోకి దూసుకెళ్లింది. ఈ రెండు ఫైనల్స్ నేడు జరుగుతాయి. శుక్రవారం జరిగిన మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్ సెమీఫైనల్లో జ్యోతి సురేఖ–ప్రియాంశ్ (భారత్) ద్వయం 158–157తో హాన్ సెంగ్యోన్–యాంగ్ జేవన్ (దక్షిణ కొరియా) జంటను ఓడించింది. నేడు జరిగే ఫైనల్లో ఒలివియా డీన్–సాయెర్ (అమెరికా)లతో జ్యోతి సురేఖ–ప్రియాంశ్ తలపడతారు. మహిళల రికర్వ్ వ్యక్తిగత విభాగంలో ప్రపంచ మాజీ నంబర్‌వన్, భారత స్టార్ దీపిక కుమారి సెమీఫైనల్లోకి ప్రవేశించింది. క్వార్టర్ ఫైనల్లో దీపిక 6–4తో ఎలిఫ్ బెరా గొకిర్ (టర్కీ)పై గెలిచింది.

టాప్ సీడ్‌ను ఓడించి సెమీస్‌లో సింధు



కౌలాలంపూర్: ఆరు నెలల తర్వాత భారత బ్యాడ్మింటన్ స్టార్ పీవీ సింధు ఓ అంతర్జాతీయ టోర్నీలో సెమీఫైనల్‌కు చేరింది. మలేసియా మాస్టర్స్ వరల్డ్ టూర్ సూపర్–500 టోర్నీలో టైటిల్ దిశగా సింధు మరో అడుగు వేసింది. శుక్రవారం జరిగిన మహిళల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్లో ప్రపంచ 15వ ర్యాంకర్ సింధు 55 నిమిషాల్లో 21–13, 14–21, 21–12తో ప్రపంచ ఆరో ర్యాంకర్, టాప్ సీడ్ హాన్ యువె (చైనా)ను కంగుతినిపించింది. నేడు జరిగే సెమీఫైనల్లో థాయ్‌లాండ్‌కు చెందిన బుసానన్‌తో సింధు తలపడుతుంది. ముఖాముఖి రికార్డులో సింధు 17–1తో బుసానన్‌పై ఆధిక్యంలో ఉంది. భారత రైజింగ్ స్టార్ అష్మిత పోరాటం క్వార్టర్స్‌లో ముగిసింది. అష్మిత 10–21, 15–21తో ఆరో సీడ్ జాంగ్ యి మన్ (చైనా) చేతిలో ఓడిపోయింది.



భారత అగ్రశ్రేణి బాక్సర్, వరల్డ్ చాంపియన్ నిఖత్ జరీన్ శుక్రవారం క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్‌ను కలిసింది. ఇటీవల ఎలోర్డా కప్‌లో స్వర్ణం సాధించిన నిఖత్‌ను అభినందించిన సచిన్... ఆమె పారిస్ ఒలింపిక్స్‌లో పతకం గెలవాలని ఆకాంక్షించారు. ఐపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ సభ్యుడు చాముండేశ్వరనాథ్ కూడా చిత్రంలో ఉన్నారు.

సచిన్ శుభారంభం



బ్యాంకాక్: ఒలింపిక్ వరల్డ్ క్వాలిఫయింగ్ బాక్సింగ్ టోర్నీలో భారత బాక్సర్ సచిన్ సివాచ్ శుభారంభం చేశాడు. శుక్రవారం జరిగిన 57 కేజీల విభాగం తొలి రౌండ్ బౌట్‌లో సచిన్ 5–0తో అలెక్స్ ముకుకా (న్యూజిలాండ్)పై గెలుపొందాడు. పారిస్ ఒలింపిక్స్‌కు ఇదే చివరి అర్హత టోర్నమెంట్. ఈ టోర్నీలో సెమీఫైనల్ చేరుకున్న బాక్సర్లు పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత సాధిస్తారు. భారత్ నుంచి పురుషుల విభాగంలో ఏడుగురు, మహిళల విభాగంలో ముగ్గురు బాక్సర్లు ఈ టోర్నీలో పాల్గొంటున్నారు.

భారత్ పరాజయం

అంట్‌వెర్ప్ (బెల్జియం): అంతర్జాతీయ హాకీ సమాఖ్య ప్రో లీగ్‌లో భారత పురుషుల జట్టుకు 1–4తో ప్రపంచ మూడో ర్యాంకర్ బెల్జియం చేతిలో పరాజయం ఎదురైంది. ఈ మ్యాచ్‌లో రక్షణ పంక్తి వైఫల్యాలతో భారత్ మూల్యం చెల్లించుకుంది. అందివచ్చిన పెనాల్టీ కార్నర్లను గోల్స్‌గా మలచడంలోనూ విఫలమైంది. భారత్ తరఫున నమోదైన ఏకైక గోల్‌ను అభిషేక్ (55వ ని.లో) ఆఖరి క్వార్టర్‌లో నమోదు చేశాడు. బెల్జియం బృందంలో హెండ్రిక్స్ అలెగ్జాండర్ (34వ, 60వ నిమిషాల్లో) రెండు గోల్స్ సాధించగా, ఫెలిక్స్ (22వ ని.), చార్లియెర్ సెడ్రిక్ (49వ ని.) చెరో గోల్ చేశారు. నేడు భారత్ మళ్లీ బెల్జియంతోనే తలపడుతుంది.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.